ట్రెయిన్ టు పాకిస్తాన్

ఆంగ్లమూలం: కుష్వంత్ సింగ్

తెలుగు: ఆకుండి నారాయణమూర్తి

ట్రెయిన్ టు పాకిస్తాన్

రచయిత :

ఆంగ్లమూలం : శ్రీ కుష్వంత్‌సింగ్

తెనుగుసేత : శ్రీ ఆకుండి నారాయణమూర్తి

ప్రచురణ :

బృందావన్ పబ్లిషింగ్ హౌస్

మారిస్‌పేట — తెనాలి - 2

ప్రచురణ నెం. 26
ప్రథమ ముద్రణ
మార్చి '76
వెల ; రు. 12-00

ముద్రణ :
శ్రీ శారదా ప్రెస్,
స్టేషన్‌రోడ్- తెనాలి - 2

బృందావన ప్రచురణ

సంపాదకులు:

ఎమ్. రాధాకృష్ణ

BVSR
28/10/87

నివేదన

"ది ఇలస్ట్రేటెడ్ వీక్లీ ఆఫ్ ఇండియా" సంపాదకులూ, ప్రసిద్ధ నవలా రచయిత అయిన శ్రీ కుష్వంత్‌సింగ్ వ్రాసిన ప్రసిద్ధ ఆంగ్లనవల "ట్రెయిన్ టు పాకిస్తాన్"కు అనువాదమే ఈ నవల।

ప్రఖ్యాత రచయిత శ్రీ ఆకుంది నారాయణమూర్తిగారు, ఆంగ్ల మూలానికి వన్నెతెచ్చే విధంగా చక్కని శైలిలో అనువదించారు ఈ నవల।

దేశ స్వాతంత్ర్యం లభించిన 1947 ఆగష్టులో, భారత పాకిస్తాన్ విభజనా సమయంలో, సరిహద్దు ప్రాంతాలలో జరిగిన మతకల్లోలాల మానవ మారణహోమాన్ని గాంచి- స్పందించిన హృదయంతో, కొన్ని వాస్తవిక సంఘటనలను రసాత్మకమైన రీతిలో చక్కని శిల్పంగా మలచారీ నవలను శ్రీ కుష్వంత్‌సింగ్ ।

శ్రీ కుష్వంత్‌సింగ్‌చే కల్పించబడ్డ ఈ రసాత్మక పవిత్ర ప్రేమ గాథ పాఠకుల హృదయాలను రసప్లావితంగావించి ద్రవింప జేస్తుందనడంలో సందేహంలేదు ।

"ట్రెయిన్ టు పాకిస్తాన్" ఆంగ్ల నవలకు గ్రోవ్‌ప్రెస్ అవార్డు వచ్చింది. 1970 నాటికే పదిలక్షల కాపీలకు పైబడి అమ్ముడు పోయాయి. తెలుగు పాఠకలోకం మా కృషికి తగిన ప్రోత్సాహం యిస్తుందని ఆశిస్తున్నాం.

— ప్రకాశకులు

కృతజ్ఞత

ఈ నవలను తెలుగులో అనువదించుటకు అనుమతించిన
శ్రీ కుష్వంత్‌సింగ్‌గారికి, ఈ నవలను సీరియల్‌గా
ప్రచురించి నన్ను ప్రోత్సహించిన
"కృష్ణా పత్రిక" సంపాదకులకు

ఆకుండి నారాయణమూర్తి

ట్రెయిన్ టు పాకిస్తాన్

అది 1947 వ సంవత్సరం, వేసవి కాలం. భారతదేశంలో అంతకుముందు గడచిన వేసవి కాలాల వంటిది కాదది! ఆ సంవత్సరం ఎండల తీవ్రత భరించలేనంతగా ఉంది. వడగాడ్పులు నిప్పులు చెరుగుతున్నాయి. ఒక పెద్ద వర్షం కురుస్తే ఎంతో బాగుండు ననిపించింది. కాని కురవలేదు: తొలకరి తన చల్లనిముఖాన్ని ఆ ప్రాంతపు ప్రజలకు చూపించడానికి అంతకు ముందెన్నడూ అంత ఆలస్యం చేయలేదు!

"దేశంలో పాపాత్ముల సంఖ్య అంతకంతకు పెరిగిపోతోంది. అందుకనే భగవంతుడీవిధంగా మాడ్చేస్తున్నాడు" అని సమాధాన పడ్డారు దేవుడి లీలలపై నమ్మకం గలవాళ్ళు.

తామేదో మహాపాపం చేసుండబట్టే శమనీలా భగవంతుడు శిక్షిస్తున్నాడని విశ్వసించేవాళ్ళ జనాభా, కర్మభూమిగా ప్రసిద్ధికెక్కిన ఈ భారతదేశంలో పుష్కలంగా వున్నది.

ఆ సంవత్సరపు వేసవికాలానికి ముందే ప్రకటింపబడింది. భారతదేశం హిందూ ఇండియాగాను, ముస్లిం పాకిస్తాన్‌గాను విభజింపబడుతోందని ....! వేరుపాటు మనస్తత్వంలోంచి జనించిన మతకలహాల మారణహోమానికి మరింత ఆజ్యం చిలకరింప బడేటందుకీ ప్రకటన మరింత దోహదం చేసింది.

హత్యలు - దోపిడీలు - మానభంగాలు - గృహదహనాలు- ఘోరకలి ప్రారంభమయింది.

ఈ దారుణమైన హత్యాకాండను నిర్ణీతమయిన పథకం ప్రకారం మొదట హిందువులే ప్రారంభించినారని ముస్లిముల ఆరోపణ.

ముస్లిములే మొదట ప్రారంభించినారని హిందువుల ఆరోపణ.

ఇంతకీ ఎవరుముందు ప్రారంభించినా లక్షలాది అమాయిక ప్రజలు, పైశాచిక ప్రవృత్తితోనిండిన భయంకర మతకలహాల మారణహోమంలో మలమల మాడిపోసాగేరు.

ఈ హోమజ్వాలలు కలకత్తా నుండి అనతికాలంలోనే నల్దిశలా వ్యాపించాయి. నవఖాలీలో ముస్లిములు హిందువులను ఊచకోతకోస్తే; అందుకు ప్రతిగా బీహారులో హిందువులు, ముస్లిములను ఊచకోత కోసారు.

మనుష్యుల పుర్రెల్ని పెట్టెల్లో పెట్టి, పంజాబుకి, సరిహద్దు రాష్ట్రానికి తీసుకుపోయి - బీహారులో హిందువులచే ఎంతో దారుణంగా హత్యగావింపబడ్డ సోదరముస్లిముల పుర్రెలివని అభివర్ణించేరు ముల్లాలు. దాంతో అచ్చటి ముస్లిములంతా ఉద్రిక్తులయారు.

అనేక శతాబ్దాలనుంచీ వాయవ్య సరిహద్దు రాష్ట్రంలో జీవిస్తున్న లక్షలాది హిందువులు, సిక్కులు తమ సర్వస్వాన్ని వదిలిపెట్టి ప్రాణభీతితో పారిపోసాగారు. రైలు పెట్టెలలోపల జాగా దొరక్కపోతే, పెట్టె కప్పుల మీది కెక్కి ప్రయాణంచేయ సాహసించిన వారి హృదయాలలోగల ప్రాణభీతి గమనించదగ్గది ... ఇకపోతే బస్సులమీదా, లారీలమీదా, బళ్ళమీదా, సైకిళ్ళమీదా, ఏ ప్రయాణ సాధనం దొరక్కపోతే నడిచి - పారిపోసాగేరు.

భారతదేశానికి వచ్చేస్తున్న హిందువులకు, సిక్కులకు - పాకిస్తానుకు పారిపోతున్న ముస్లిములు ఎదురుపడిన సందర్భాలలో: పరస్పరం వారివారి హృదయాలలో ఒకరిపై ఒకరికి ఎటువంటిభావం జనించుంటుందో ఎవరిమటుక్కి వారూహించుకోవల్సినదే.

"పాకిస్తాన్" అనే పేరుతో ఓ క్రొత్తదేశం ఈ ప్రపంచంలో ఏర్పడబోతోందని ప్రకటించబడిన సమయంలో, సుమారు కోటిమంది హిందువులు ముస్లిములు, సిక్కులు తమ సర్వస్వాన్ని వదిలిపెట్టి ప్రాణభీతితో సురక్షిత ప్రాంతాలను వెతుక్కుంటూ పారిపోతున్నారు.

తొలకరి వర్షాలు ప్రారంభమయే సమయానికి సుమారు పది లక్షల మంది తమ ప్రాణాలను కోల్పోయుంటారు.

ఉత్తర హిందూదేశంలోని ప్రజలంతా ఏ క్షణానికి ఏం జరుగుతుందో ననే బెంగతో, భయంతో, ఆందోళనతో క్షణమొక యుగంలాగ గడపసాగారు.

విశేషం ఏమిటీ అంటే; సరిహద్దు రాష్ట్రాన్ని అనుకొనివున్న కొద్ది గ్రామాలలో యింకా ప్రశాంతత నెలకొని వుండడం.

అట్లాంటి గ్రామాలలో "మానోమజ్రా" ఒకటి.

మానోమజ్రా ఓ కుగ్రామం. ఆ గ్రామంలో యిటుకలతో నిర్మింపబడ్డ యిళ్ళు మూడంటే మూడేవున్నాయి. వాటిలో ఒకటి "రామ్‌లాల్" అనే వడ్డీ వ్యాపారస్తుడిఇల్లు, రెండోది సిక్కుల దేవాలయం, మూడోది ముస్లిముల మసీదు - ఈ మూడూ బొమ్మబొక్కిళ్ళలావుండి ఓ త్రిభుజాకృతి ప్రదేశాన్ని గ్రామం మధ్య రూపొందించాయి. ఆ స్థలం మధ్య ఓ పెద్ద రావి చెట్టుంది. ఇకపోతే ఆ గ్రామంలో మిగిలిన యిళ్ళన్నీ మిద్దెటిళ్ళూ, చిన్న చిన్న గుడిసెలూను: ఆ గ్రామంలో విశాలమయిన వీధులూ, రోడ్లూలేవు. అన్నీ సన్నని సందుగొందులు.

ఆ గ్రామానికి పడమటవేపు తుమ్మ చెట్లమధ్య ఒక బందవుంది.

మానోమజ్రాలో డెభ్భై కుటుంబాలకుపైగా వున్నాయి. ఒక్క లాలారామ్‌లాల్ కుటుంబమే హిందూకుటుంబం .... మిగిలిన కుటుంబాలు సిక్కులవి, ముస్లిములవి .... వారిసంఖ్య ఆ గ్రామంలో యించుమించు సరి సమానంగానే ఉందని చెప్పొచ్చు. ఆ గ్రామం చుట్టుప్రక్కలగల భూమియావత్తూ సిక్కులది. ఆ గ్రామంలోగల ముస్లిములంతా వాళ్ళ రైతులు. ఆ గ్రామంలో కొంతమంది పాకీవారు ఉన్నారు. వాళ్ళేమతస్థులో ఖచ్చితంగా ఎవరూ చెప్పలేరు. వాళ్ళంతా తమ మతస్తులేనని ఆ గ్రామం లోని ముస్లిము అంటూంటారు. కాని తమాషా ఏమిటీ అంటే ఎప్పు డయినా ఆ గ్రామానికి అమెరికన్ మిషనరీలు వస్తే హార్మోనియం వాయిస్తూ క్రైస్తవమత గీతాలను ఆలపిస్తూంటారు ఆ పాకీవారు. అప్పు డప్పుడు వీరు సిక్కుల దేవాలయానికి వెళుతూండడం కూడా కద్దు ....! నిజం చెప్పాలంటే వాళ్ళకి ఒక ఖచ్చితమయిన మతమంటూ ఏదీలేదు. ఎవ రాదరిస్తే వారిప్రక్క చేరుతుంటారు, అదే వారి మతం —

ఇంతకీ ఎవరు ఏ మతస్థులయినప్పటికీ ఆ గ్రామంలోని ప్రజ లంచరూ - లాలారామ్‌లాల్‌తో సహా ఆరాధించే దేవత బందవడ్డున ఒక తుమ్మచెట్టు క్రింద వుంది .... సుమారు మూడడుగులు గల ఇసుకరాతి పలకమది. అది ఆ గ్రామదేవత ! ఏ మతమూ సాధించలేని సమైక్యత నా గ్రామదేవత ఆ గ్రామంలో తరతరాలనుండి సాధిస్తూండడం ఓ గొప్ప విషయంకాదని ఎలా అనగలం ?....హిందువులు, సిక్కులు, ముస్లిములు, మతం పుచ్చుకున్న క్రిస్టియన్లు వీరూ వారూ అనే తేడాలేకుండా అన్ని మతాలవారూ ఆ గ్రామదేవత విషయంలో అనుచితమైన పనులేవీ చెయ్య కుండా, ఆ దేవత యొక్క అమోఘాశీర్వచనాల కోసం రహస్యంగా ప్రార్థిస్తూ - ఆ దేవతామూర్తిని కాపాడుతుంటూండడం గమనించాల్సిన విషయం.

మానోమజ్రా సట్లెజ్‌నదికి సుమారు అరమైలు దూరంలోవుంది. ఆ నదికక్కడ ఓ బ్రహ్మాండమయిన రైలురోడ్డు బ్రిడ్జివుంది. రైల్వే స్టేషనువల్లే మానోమజ్రాకు గొప్ప ప్రాముఖ్యత ఉన్నది. అక్కడ ఆగే రైళ్లు చాలాతక్కువ అయినప్పటికి ఆ స్టేషనుకు గొప్ప ప్రాముఖ్యత చేకూరింది. ఎంచేతంటే, అక్కడ సట్లెజ్‌నదికి గల బ్రహ్మాండమైన బ్రిడ్జినిదాటి వెళ్లే రైళ్లు కాస్త నెమ్మదిగా వెళ్ళాల్సుంటుంది. లైన్ క్లియరెన్సు, శీఘ్రంగా పోవలసే రైళ్ళకు లభ్యమైనంత వేగంగా నెమ్మదిగా పోయే బళ్లు, గూడ్సుబళ్లు యిట్లాంటి వాటికి లభ్యమవదు. అంచేత లైన్ క్లియర్ లభ్యమయేటంత వఱకూ అవి మానోమజ్రా స్టేషనులో నిరీక్షించాల్సుంటుంది. అందుకనే మా నో మ జ్రా స్టేషన్‌యార్డులో సైడింగ్సు ఎక్కువగా వున్నాయి.

రైల్వేస్టేషన్ అనగానే కాఫీ హోటల్సు, కిళ్లీబడ్డీలు, చిన్న కిరాణా దుకాణాలు యిట్లాంటివి తయారవడం సహజం! మానోమజ్రా స్టేషన్ సమీపంలో కూడా యిట్లాంటివన్నీలేచి అక్కడో చిన్న కాలనీ తయారయింది. ఆ కాలనీ ఆ స్టేషనుకొక జీవకళను ప్రసాదిస్తోందనడంలో అతిశయోక్తి లేదు. టీ, పాన్, బీడీ యిత్యాదివి అమ్మే వాళ్ళసందడే అక్కడలేకపోతే - ఆ స్టేషన్‌మాష్టరు, అతగాడి అసిస్టెంట్సు జుగుప్సాకరమైన ఒంటరితనానికి లోనై వుండేవారు.

మానోమజ్రా స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ బళ్ళు ఏవీ ఆగవు. ఇకపోతే స్లోపాసింజర్ ట్రైనులుకూడా రెండేరెండు అక్కడ అగుతాయి. ఢిల్లీనుండి లాహోర్‌కి ఉదయంవేళ వెళ్లేదొకటి, లాహోర్ నుండి ఢిల్లీకి సాయంత్రం వెళ్ళేదొకటి. అవయినా కొద్ది నిముషాలసేపు మాత్రమే అక్కడాగుతాయి. ఇకపోతే మిగిలిన ట్రైన్సు తప్పనిసరి పరిస్థితులలో మాత్రమే అక్కడ అప్పుడప్పుడు ఆగుతూంటాయి. కాని గూడ్సు బళ్ళు మాత్రం అక్కడ నిత్యం ఆగుతూంటాయి. ఖాళీపెట్టెలను వదిలిపెట్టి, సరకునిండిన పెట్టెలను

తగిలించుకొనే పనిలో అవి ఎప్పుడూ అలికిడిని సృష్టిస్తూనే ఉంటాయి. రాత్రివేళ మానోమజ్రా గ్రామమంతా నిశ్శబ్దంలో మునిగిపోయినా, రైల్వేస్టేషన్ ప్రాంతమంతా షంటింగులవల్ల జనించే శబ్దాలతో సాధారణంగా సందడిగా ఉంటూంటుంది.

ప్రతిరోజూ వేకువ ఝామున లాహోర్‌కి పోయే మెయిల్‌ట్రైన్ సట్లెజ్ నదిపై గల వంతెనను దాటబోయేముందు - సుదీర్ఘంగా రెండు మూడుసార్లు బిగ్గరగా ఈల వేస్తూంటుంది! .... దాంతో మానోమజ్రా మేలుకుంటుంది. పక్షుల కిలకిలా రావాలు మిన్ను ముట్టుతాయి. తమ తమ స్వస్థలాలకై రావిచెట్టుపై ఋషిపక్షుల పరస్పర సంఘర్షణ ప్రారంభమవుతుంది. "అల్లాహో అగ్బర్!" అని ముల్లా ప్రాతఃకాల ప్రార్థన, సిక్కుదేవాలయ పూజారి గురునామ సంకీర్తన, యివన్నీ యథావిధిగా ప్రారంభమవుతాయి.

ఉదయం పదిన్నరకు ఢిల్లీనుంచి పాసింజర్ బండి వచ్చే వేళకు మానోమజ్రా గ్రామస్తులంతా ఈసురోమంటూ తమ తమ నిత్య కార్యకలాపాలలో నిమగ్నులై ఉంటారు. పురుషులు పొలాలలోను, స్త్రీలు యిళ్ళలోను క్షణం తీరికలేకుండా పనిచేస్తుంటారు. ఇకపోతే కుర్రాళ్లు పశువుల్ని మేపడానికి నది ఒడ్డునగల పచ్చికబీళ్ళకేసి పోతారు. గుంటనక్కలు బొరియల్ని వెతుక్కుంటూ పోతాయి. పిచ్చికలు గడ్డికరచుకొని ఇళ్ళపై ఎగురుతుంటాయి. ఋషిపక్షులు తల్లకిందులుగా తపస్సు చేస్తుంటాయి. ఇంతకీ చెప్పొచ్చేదేమిటీ అంటే; దివాంధాలు తప్ప తక్కిన జీవులన్నీ తమతమ పనితొందరలో మునిగివుండే సమయమదని!

మధ్యాహ్నం ఎక్స్‌ప్రెస్ వెళ్ళిపోయేక పనులు వదిలిపెట్టి గృహోన్ముఖులవుతారంతా! సొమ్ములకాపు కుర్రాళ్లు, తమ తమ పోతుల్ని, గేదెల్ని బందలకు తోలుకుపోయి బాగా కడుగుతారు.

ఆడపిల్లలు చెట్లనీడలో ఆడుకుంటారు. చెమటోడ్చి పొలాలలో పని చేసిన వారంతా, యింటికొచ్చి శుభ్రంగా స్నానంచేసి భోంచేస్తారు. ఆ తరువాత రావిచెట్టు నీడలోగల కర్రదూలాలపై కూర్చొని ఓపికున్నంత సేపు ఏవో కుచ్చుటప్పాలు కొట్టి కునికిపాట్లు పడుతుంటారు. స్త్రీలు పరస్పరం ఒకరితల కొకరు నూనెరాసుకొని దువ్వుకుంటారు. ఆ తరువాత పిల్లల తలలలోని పేలు తీస్తారు. ఇంకా తీరుబడివుంటే పుట్టుకలు, పెళ్ళిళ్ళు, ఆఖరికి చావుల గురించి కూడా ముచ్చటించు కుంటారు.

లాహోర్‌నుంచి సాయంత్రం పాసింజర్ వచ్చిన తరువాత ప్రతీ ఒక్కరూ మళ్ళీ తమతమ పనులలో నిమగ్నులవుతారు. పశువులన్నింటినీ ఒక దగ్గరకుచేర్చి యిళ్ళకు తోలుకుపోయి కుడితిపెట్టి వాటి వాటి సాలల్లో కట్టి పాలుపితుకుతారు. స్త్రీలు రాత్రి వంట ప్రారంభిస్తారు. వంట పూర్తయేక అంతా భోంచేసి కాస్త మీగడపాలుత్రాగి - నిద్ర వచ్చేటంత వరకూ ఏవేవో కబుర్లు చెప్పుకుంటూ కాలక్షేపం చేస్తారు.

నిద్రపోయే ముందు మళ్ళీ "అల్లాహో అగ్బర్" అంటూ ముల్లా ప్రార్థన. సిక్కు దేవాలయ పూజారి గురునామ సంస్మరణ, గబ్బిలాల సంచారం. గూడ్సుబళ్ళ షంటింగ్ రణగొణ ధ్వనులు. ఎవ్వరూ చెప్పకపోయినా గ్రామరక్షణ తమ విద్యుక్తధర్మ మన్నట్లుగా కుక్కల మొరుగులు. నిద్ర ....

ఇదీ 1947 వ సంవత్సరం వేసవికాలం వరకూ మానోమజ్రాలో మామూలుగా ఆచరణలో ఉన్న కార్యక్రమం.

2

ఆ సంవత్సరం ఆగష్టు నెలలో ఒకనాటి రాత్రి మానోమజ్రాకు సమీపానగల తుమ్మతోపులోంచి అయిదుగురు వ్యక్తులు వెలికివచ్చి సట్లెజ్ నదికేసి నిశ్శబ్దంగా పోసాగేరు. వాళ్ళంతా దోపిడీ దొంగలు! వాళ్ళల్లో ఒకడు తప్ప మిగిలిన వాళ్ళంతా ఆయుధాలు చేబూని వున్నారు. ఇద్దరు

బల్లేలు, యిద్దరు తుపాకులు పట్టుకొనివున్నారు. అయిదోవాడు టార్చిలైటు పట్టుకొని వున్నాడు. గట్టుదగ్గర కొచ్చేసరికి వాడు టార్చిలైటు చటుక్కున వెలిగించి, మళ్ళీ వెంటనే ఆర్పేసి "మనం యిక్కడ కొంచెం సేపు నిరీక్షిద్దాం" అనంటూ యిసుకలో చతికిలపడ్డాడు. మిగిలిన నలుగురూ తమచేతుల్లో వున్న ఆయుధాల్ని ఊతగాగొని అతని ప్రక్కనిలబడ్డారు.

బల్లెం పట్టుకున్న ఓ వ్యక్తి నుద్దేశించి టార్చిలైటు వ్యక్తి, "జుగ్గడి కివ్వడానికి గాజులొట్టుకున్నావా ?" అనడిగేడు.

"ఊఁ ! .... ఎర్రటివి, నీలిటివి మొత్తం ఓ డజనుగాజు లొట్టుకున్నాను. ఎవ్వర్తికయినా సరే యివి నచ్చుతాయి !" అని సమాధానమిచ్చేడు వాడు.

"కాని జుగ్గడికివి నచ్చకపోవొచ్చు!" అని తుపాకీలు పట్టుకున్న వాళ్ళలో ఒకడన్నాడు.

వాడలా అనేసరికా ముఠానాయకుడు ఫకాలున నవ్వి ఓసారి హుషారుగా టార్చిలైటుని మీదికి విసరి, క్రిందపడకుండా జాగ్రత్తగా పట్టుకొని - ఆ తరువాత దానిని తన నోటికానించి వెలిగించేడు - గులాబి వర్ణం దాల్చేయి అతని బుగ్గలు. బహుశా జుగ్గడీ గాజుల్ని ఆ సాలోడి కూతురికివ్వొచ్చు ! .... ఆ సన్నని నడుం, ఆ నల్లటి అందమైన కళ్లు, సిన్న మామిడి పిందెల్లాటి ఆ సల్లు మాగుమ్గుంటాదా పిల్ల. అన్నట్టు దాని పేరేటి ?" మరో బల్లెం శాస్త్రీ.

టార్చిలైటుని నోటిదగ్గరనుంచి తీసి, "నీకు తెల్దా ? దాని పేరు నూరాన్ !" అని చెప్పేడా ముఠానాయకుడు.

"క్రిందటేడాది వానంతకాలపు సంతలో ఆ అమ్మాయిని నువ్వు సూడనేదా ? .... ఆ బిగువైన సిల్కుగౌను లోంచగుపించే .... మా బలేగుంటాదిలే !"

"సూడకేం ? సూసినాను ! .... పిట పిటలాడే ఆ అందంసూత్తే ఎవుడయినాసరే పిత్తయిపోవాల...." గాజులుపట్టుకున్న బల్లెంగాడి వొళ్ళు పులకరించింది.

"అది జగ్గడి ముచ్చట మా బాగా తీర్చుతున్నాదిలే — పగవేళ సూత్తే ఏటీతెలీని వొట్టి అమాయకురాలిల్లా గగుపిత్తాది. తన పాల పళ్ళను బయటకగుపడనీయకుండా మూతిముడుచుకొని పల్లకవూరుకుంటాది. రేత్రయేసరికి ఎక్కడలేని చలాకీతనం వొచ్చేత్తాది. అందులోకీ జగ్గాగాడిని సూసేసరికి ఆ కాటుక కళ్ళకి మరింత కాంతొచ్చేస్తాది" అని అన్నాడు అంతవరకూ మౌనంగావున్న రెండో తుపాకీవ్యక్తి.

"కళ్ళకి కాటుక అందాన్నేగాక సల్లదనాన్నికూడా యిత్తాది !" అన్నాడు మరొకడు.

"ఎవరికళ్ళకయినాసరే కాటుక బాగుంటాదిలే" తుపాకీ మనిషి.

"ఊఁ.... బాగుంటాది. కళ్ళకు కాటుక ఎందుకు బాగుండదూ....? బలే బాగుంటాది. కవ్వించే కళ్ళకు మరీ బాగుంటాది. ఇంతకీ జగ్గా ఛాన్సు కొట్టేసినాడు" అన్నాడు బల్లెంగాళ్ళలో ఒకడు.

ఆ ముఠా నాయకుడు పళ్ళు పటపట కొరుకుతూ, "ఒరేయ్ జగ్గా ! ఇహ సూద్రా నీపని....?" అని కసిగా అన్నాడు.

మిగిలిన నలుగురూ వికటాట్టహాసం చేశారు. అంతట్లో అకస్మాత్తుగా వాళ్ళల్లో ఒకడు "వినండ్రా అటేనుండి గూడ్సుబండి సప్పుడు" అని అన్నాడు.

వాళ్ళంతా గూడ్సుబండి వస్తూన్న చప్పుడు విన్నారు, అది స్టేషనులో ఆగింది. ఆ సందర్భంలో ఒకపెట్టెకింకోపెట్టె గ్రుద్దుకొని పెద్ద శబ్దమయింది. ఆ తరువాత యింజను క్రిందకూ మీదకూ పోతూ వేగన్సుని

వేసుచేస్తూ సైడింగ్సులోవున్న వేగన్సుని గ్రుద్దుతూన్న శబ్దాలు బిగ్గరగా వినిపించాయి. మరి కొంతసేపయాక ఇంజను మళ్ళీ ట్రైయినుకి తగులుకున్న శబ్దం వినిపించింది.

"రామ్‌లాల్‌ని పిలవడానికిదే మంచి సమయం" అంటూ ఆ ముఠానాయకుడు లేచి నిలబడ్డాడు.

ఆ తరువాత వాళ్ళంతా ప్రార్థన కుపక్రమించారు. ఆ ముఠానాయకుడు ఒక్కడుగు ముందుకువేసి మోకాళ్ళపై కూర్చొని మెల్లిగా ప్రార్థించసాగాడు. మిగిలిన నలుగురూ తమ ముడుకులపైనుంచి వంగి- నేలపై తమ ముఖాన్ని వుంచి యిష్టదేవతకు మనస్ఫూర్తిగా నమస్కరించారు.

ఆ తరువాత వాళ్ళంతా లేచి నిలబడి తమ తలపాగల అంచుల్ని కళ్ళను తప్పించి ముఖాలపై కప్పుకున్నారు. ఇంజను బిగ్గరగా రెండుసార్లు కూసి భారంగా కదిలింది.

"ఇహ పదండి....!" అంటూ ఆ ముఠానాయకుడు ముందుకు దారితీసేడు. మిగిలినవాళ్ళు అతన్ని అనుసరించారు. గూడ్సు ట్రైయిను బ్రిడ్జిని సమీపించేవేళకి వాళ్ళు మానోమజ్రా వూళ్ళోకిపోయే ఓనాటుదారి దగ్గర కొచ్చారు. గూడ్సు ట్రైయిను బ్రిడ్జిదాటి వెళ్ళిపోయింది.

వాళ్ళు రామ్‌లాల్ యింటిదగ్గరకొచ్చారు. ఆ ముఠానాయకుడు ఓ తుపాకీ మనిషికి సైగచేశాడు. ఆ తుపాకీమనిషి రామ్‌లాల్ యింటి తలుపుపై తుపాకీ మడమతో బాదుతూ, "ఒరేయ్ లాలా" అని బిగ్గరగా అరచాడు.

లోపలనుంచి ఏ సమాధానమూ రాలేదు. ఊరకుక్కలు వాళ్ళని సమీపిస్తూ బిగ్గరగా మొరగసాగాయి. వాళ్ళల్లో ఒకడు తన బల్లెంతో ఓ కుక్కను ఒక్కపోటు పొడిచాడు. మరొకడు గాలిలోకి తుపాకీ పేల్చాడు.

దాంతో ఆకుక్కలు దూరంగా పారిపోయి మరింత బిగ్గరగా మొరగడం మొదలెట్టాయి.

ఆ దోపిడీ దొంగలు తమ తమ ఆయుధాలతో బలంగా ఆ తలుపుపై మోదసాగారు. ఓ బల్లెంగాడు తన బల్లెంతో ఆ తలుపుపై ఒక్కపోటు పొడిచాడు. అది అవతలి ప్రక్కకు చొచ్చుకుపోయింది.

"ఒరేయ్ ఎధవనాయాలా!.... తలుపు తెరువురా ! నేదా నిన్నేగాక నీ వాళ్ళందర్నీ సంపుతాం" అని వికృతంగా అరచాడా ముఠానాయకుడు.

అందుకు సమాధానంగా లోపలినుంచొక స్త్రీ కంఠం "ఎవరది....? ఇలాంటి వేళగాని వేళప్పుడెందుకొచ్చారు....? లాలాజీ ఇంట్లో లేరు. నగరానికెళ్ళారు" అని సమాధానమిచ్చింది.

"ముందు తలుపుదెరువు అప్పుడు సెబుతాము; మామెవురమో, ఎందుకొచ్చినామో....! మరేవగా తలుపు తెరవకపోతే తలుపిరగ్గొడతాం" అని అరచాడు ముఠానాయకుడు.

"నేను నిజం చెపుతున్నాను. నామాట నమ్మండి. లాలాజీ ఇంట్లో లేరు. అతను తాళాలుపట్టుకొని వెళ్ళిపోయారు. ఇప్పుడీఇంట్లో ఏవీలేదు!" అందామె కంపితస్వరంతో.

వాళ్ళకొళ్ళుమండింది! వాళ్ళంతా కలిసి పందెపు పొట్టేళ్ళలా తమ భుజాలతో ఆ తలుపుని గ్రుద్దేసరికి మడియ విరిగిపోయి తలుపు తెరవబడింది. ఒక తుపాకీమనిషా తలుపుదగ్గర కాచాడు. మిగిలిన నల్గురూ ముందు గదిలోకెళ్ళేరు. ఆగదిలో ఓమూల ఇద్దరు స్త్రీలు భయంతో గజగజ వణికిపోతూ ఒకర్నొకరు ఆనుకొని కూర్చొనున్నారు. విశాలమైన నల్లటి కళ్ళుగల ఓ పదేళ్ళ కుర్రాడు మునలావిడవాళ్ళో బిత్తరచూపులుచూస్తూ కూచున్నాడు.

"భగవంతుడి పేరుమీదుగా మా ఈసర్వస్వాన్నీ తీసుకోండి" అని ముసలావిడ రుద్ధకంఠంతో అంటూ, దోసిలితో బంగారు, వెండి గొలుసుల్ని, గాజుల్నీ, లోలకుల్ని అందించింది. వాళ్ళలో ఒకడా ఆభరణాలను ఆమె దోసిలిలోంచి మొరటుగా లాక్కొని "లాలా ఎక్కడ?" అని కఠోరమైన కంఠస్వరంతో అడిగాడు.

"భగవత్సాక్షిగా చెబుతున్నాను. లాలాజీ ఇంట్లో లేరు! మా సర్వస్వాన్నీ మీరు తీసుకున్నారు.... ఇంకా మీకివ్వడానికి లాలాజీదగ్గర మరేం మిగలలేదు" అందామె.

నడివాకిట్లో నాలుగు మంచాలు వరుసగా వాల్చబడుండడం వాళ్ళు చూసారు. ఓ తుపాకీమనిషి ఆ ముసలామె దగ్గరున్న కుర్రాడిని మొరటుగా బయటకు లాగి వాడి కణతకు తుపాకీని బారుచేశాడు. ఆస్త్రీ ఎంతో భయాందోళనలతో ఆ తుపాకీగాడికాళ్ళపై పడి, "నువ్వు నా సోదరుని లాంటివాడివి. ఈ పసివాణ్ణి చంపకు. నీకెంతైనా పుణ్యముంటుంది. చంపకు, దయదలచి చంపకు. నీకెంతయినా పుణ్యముంటుంది." అని దీనంగా విలపించసాగింది.

అతి క్రూరంగా ఆమెనొక్క తాపు తన్ని "మీ అయ్య ఏడనున్నాడురా?" అనడిగాడు తుపాకీమనిషి.

ఆబాలుడు గజగజ వణికిపోతూ "మేడమీదున్నారు!" అని గొణిగేడు.

ఆ తుపాకీమనిషి ఓసారి భయంకరంగా వికటాట్టహాసం చేసి- ఆ కుర్రాడిని ఆముసలామె వళ్లో పడేటట్లు వెనక్కి ఒక త్రోపుత్రోసాడు.

ఆ తరువాత వాళ్ళంతా గబగబా మేడమీదకెక్కేరు. ఆ మేడపై ఒకేఒకగదుంది. ఇక ఏమాత్రం ఆలస్యం చెయ్యకుండా తమ భుజాలతో గ్రుద్ది ఆగది తలుపుల్ని పడదోసి ఆగదిలోకి ప్రవేశించేరు. ఆ గదిలో

చాలా ట్రంకుపెట్టెలు ఒకదానిపై ఒకటి దొంతర్లుగా పేర్చబడున్నాయి. రెండు మంచాలున్నాయి. వాటిపై కొన్ని పరుపుచుట్టలున్నాయి. ముఠా నాయకుడు టార్చిలైటు వెలిగించేడు. ఆ టార్చిలైటు యొక్క ప్రకాశవంతమయిన కాంతి పుంజం, ఓ మంచంక్రింద దాక్కొని గజగజవణుకుతున్న రామ్‌లాల్‌ని ఆ దోపిడి దొంగలకు పట్టియిచ్చింది.

"భగవత్సాక్షిగా చెప్తున్నాను. లాలాజీ ఇంట్లో లేరు!" అని ఆ ముసలమ్మ గొంతుకను అనుకరిస్తూ, రామ్‌లాల్ కాళ్ళు పట్టుకొని బరబరమని ఆ మంచం క్రిందనుంచి బయటకు లాక్కొచ్చేడు ముఠా నాయకుడు.

రామ్‌లాల్ డొక్కలో మోకాళ్ళతో గట్టిగా పొడుస్తూ, "అరే రామ్‌లాల్....! ఇదేనటయ్యా మర్యాదా....? మాలాంటి అతిథులు ఇంటికొస్తే నువ్వు మంచంక్రింద దాగుంటావా? ఇదేం మర్యాదా? అతిథుల్ని గౌరవించాల్సిన పద్ధతిదేనట్రా?" అనడిగేడు.

రామ్‌లాల్ తన ముఖానికడ్డంగా చేతులు పెట్టుకొని మొర్రోమని ఏడవడం మొదలెట్టాడు.

వడ్డిపై ఒక తాపుతన్ని, "ఇనప్పిరువా తాళాలేడనున్నాయి?" అనడిగేడు ముఠానాయకుడు.

రామ్‌లాల్ అతని పాదాలు పట్టుకొని, "ఆభరణాలు డబ్బూ అంతా తీసుకోండి. కాని ఇంట్లో ఎవ్వరినీ చంపొద్దు!" అని దీనంగా ప్రార్థించేడు.

"అరే....! ఇనప్పిరువా తాళాలెక్కడని అడుగుతూంటే దానికి సమాధానం చెప్పవేం?" అంటూ పొట్టపై గట్టిగా ఓతాపుతన్నేడు వెల్లకిలా పడేటట్లు.

రామ్‌లాల్ శక్తినంతా కూడగట్టుకొని ఎలాగో అతికష్టంమీద లేచి కూర్చొని, భీతితో గజగజ వణికిపోతూ, జేబులోంచి ఒక నోట్లకట్టను

బయటకు తీసి, "తీసుకోండీ డబ్బు!" అంటూ ఆకట్టను వాళ్ళముందుపడేసి "నాఇంట్లో వున్నదంతా యిదే!.... ఇంతకుమించి ఇంకేమీలేదు. నన్ను నమ్మండి" అని అన్నాడు.

"ఒరేయ్!.... మమ్మల్ని నువ్వు మోసం సెయ్యలేవు.... ముందు ఇనబ్బీరువా తాళాలిలాగివ్వు అందులో ఎంతుందో సూడాల!" ఉరిమి నట్లుంది నాయకుడి కంఠం.

"ఏకౌంటుబుక్కుతప్ప ఇనుపబీరువాలో యింకేవీలేవు. నాకున్న దంతా మీకిచ్చేశాను. భగవత్సాక్షిగా చెపుతున్నాను: నాదగ్గిరింకేవీలేదు. నన్ను నమ్మండి." అంటూ ఆ నాయకుడి కాళ్ళు పట్టుకొని దీనంగా విల పించసాగాడు.

వాళ్ళలో ఒకడు రామ్‌లాల్ జుత్తుపట్టుకొని వెనక్కి ఈడ్చి తుపాకీ మడమతో అతని వక్షస్థలంపైన రెండుపోట్లు పొడిచేడు.

'అమ్మా' అని బాధతో బిగ్గిరగా అరచి రక్తాన్ని కక్కసాగేడు రామ్‌లాల్.

వాకిట్లోవున్న స్త్రీలాహృదయ విదారకమయిన కేకవిని 'బాబూ! రక్షించండి! రక్షించండి!' అని ఆర్తనాదాలు చెయ్యసాగేరు. కుక్కలు బిగ్గరగా మొరుగుతున్నాయి. కాని ఆ గ్రామంలో ఏవ్యక్తీ తన యింటి గడపదాటి బయటకు రాలేదు.

ఇనబ్బీరువా తాళాలకోసం వాళ్ళు రామ్‌లాల్‌ని చాలా దారుణంగా హింసింపసాగేరు. తుపాకీమడమలతోను, బల్లెలపిడులతోను అతన్ని మోద సాగేరు. రామ్‌లాల్ బాధతో ఎలుగెత్తిఏడుస్తూ మధ్యమధ్య రక్తం కక్కు కుంటున్నాడు. ముందు వరసలోగల రెండు పళ్ళు వూడిపోయాయి....! ఆ బాధనంతటిని భరిస్తున్నాడేగాని తాళాలెక్కడున్నదీ వాళ్ళకు చెప్ప లేదు రామ్‌లాల్. విసిగిపోయేరు వాళ్ళు!

వాళ్ళలో ఒకడు మహాకోపంతో బల్లేన్ని మీదకెత్తి కసక్కున రామ్‌లాల్ రొమ్ములోకి పొడిచేడు.

రామ్‌లాల్ బిగ్గరగా ఓసారి ఆర్తనాదంచేసి, రక్తపు మడుగులో కొంచెంసేపు విలవిలా తన్నుకొని తనువు చాలించేడు. ఆ దోపిడీదొంగలు వికటాట్టహాసం చేస్తూ గదిబయట కొచ్చేరు. వాళ్ళలో ఒకడు గాలిలోకి రెండుసార్లు తుపాకీని పేల్చాడు. స్త్రీల ఆర్తనాదాలు బందయిపోయాయి. కుక్కలు మొరగడం మానేశాయి. గ్రామమంతటా భయంకరమైన నిశ్శబ్దం అలముకుంది.

డాబాపైనుంచి ప్రక్కనున్న సందులోకి దుమికేరా దోపిడీదొంగలు. వాళ్ళు నదికేసి సాగిపోతూ, "రండర్రారండి....! దమ్ముంటే ఇళ్ళల్లోంచి బయటకు రండి. మీ తల్లులు, మీ అక్కచెల్లెళ్ళు, మీ పెళ్ళాలు మీ కళ్ల ఎదుట చెరపడుతున్నప్పుడు ఎలాగుంటుందో చూడాలనే సరదా మీ కున్నట్లయితే ఇళ్ళల్లోంచి బయటకురండి...." అని రాక్షసుల్లా అరచేరు. ఎవ్వరూ వాళ్ళకు సమాధానమివ్వలేదు....! మానోమన్త్రాలో చిటుక్కు మనే శబ్దంకూడా వినిపించలేదు. బిగ్గరగా అరుస్తూ - వికటాట్టహాసాలు చేస్తూ - వాళ్ళు సందు గొందులన్నీ దాటి ఊరి చివరనున్న ఓ చిన్న గుడిసెదగ్గరకొచ్చి అక్కడ ఆగేరు.

ఆ ముఠానాయకుడు గాజుల పేకట్టు పట్టుకున్న బల్లెంగాడివేపు తిరిగి- "ఇదేరా మన మహావీర జగ్గా గాడిల్లు. మనంతెచ్చిన మచ్చలైన బహుమతిని అదికివ్వకుండా ఎలాగెళ్ళిపోగలం....? ఇచ్చే ఎళ్ళిపో దాం....! ఏవిరా గాజులు-?" అంటూ వాడిముఖంలోకి చూసేడు.

"ఇవుగో!" అంటూ ఆ పేకట్టుని జేబులోంచి బయటకుతీసి- గోడ పైనుంచి జగ్గా యింటి వాకిట్లోకి గిరవాటేసి 'ఒరేయి జగ్గా....? ఈ గాజులు తొడుక్కొని కాళ్ళకు పారానెట్టుకో!" అని హేళనగా అన్నాడు.

"లేదా ఆ సాలోడి కూతురికివ్వు" అని తుపాకీవ్యక్తి చేసిన హేళన ఇది.

"హాహా....అహాహా......" అని వికటాట్టహాసాలు చేస్తూ హుషారుగా ఈలలువేస్తూ నదికేసి వాళ్ళు వెళ్ళిపోయేరు.

ఆ సమయంలో జుగ్గా యింటిదగ్గరలేడు!

3

సురక్షితంగా బయటకెళ్ళి తిరిగి రావడానికి అదే మంచి సమయమని గూడ్సురైలురాక జుగుత్‌సింగ్‌కి తెలియజేసింది. ఆ గూడ్సురైలు రాక ఆనాటి రాత్రి ఆ దోపిడీదొంగలకు ఓ సిగ్నల్‌లాగ ఎలా తోడ్పడిందో అలాగే జుగుత్‌సింగ్‌కుకూడా ఇల్లువదలి అవతల కెళ్ళడానికిదో సిగ్నల్‌లాగ తోడ్పడింది!

ఆ గూడ్సురైలుబండియొక్క మొట్టమొదటి కూతను విన్న వెంటనే చప్పుడు చెయ్యకుండా మంచంమీదనుంచి లేచి- పాగాతీసి తలకు చుట్టుకొని- పిల్లిలాగ మెల్లగా పెరటి వాకిట్లోగల గడ్డికుప్ప దగ్గరకెళ్ళి- అక్కడున్న బల్లెం పట్టుకొని తిరిగి తన మంచం దగ్గరకొచ్చి- జోళ్ళు పట్టుకొని నిశ్శబ్దంగా వీధి తలుపు దగ్గరకు జుగుత్‌సింగ్ వెడుతూండగా——

"ఎడకెడుతున్నావురా?" అనడిగింది తల్లి.

జుగుత్‌సింగ్ చటుక్కున ఆగి, వెనుదిరిగి తల్లికేసిచూస్తూ, "పొలానికి. నిన్నరేత్రి అడివిపందులు పేలను పాడుసేసినాయి." అని సమాధానమిచ్చేడు.

"ఏటీ....? అడవిపందులా....? ఒరేయి జుగ్గా....! నన్ను నువ్వు మోసం చెయ్యనేవు. నాకుదెల్సు నీ యవ్వారమంతా....! అది సరేగానీ సీకటిపడ్డాక యిల్లొదిలెట్టి ఎటూ యెల్లకూడదనే నిషేధం నీపట్లుందనే

సంగతి మరసిపోనావా యేటి? పైగా బల్లెమట్టుకొని బయలుదేరినావు....! నువ్వంటే కిట్టనోళ్ళెవురయినా సూత్తే యింకేవయినా వుందా....? నీమీద పోలీసోళ్ళకు ఫిర్యాదు సేత్తారు. మళ్ళీ నువ్వు జైలుకి పోతావు!" అని కొంచెంసేపాగి, రుద్ధమవుతూన్న గొంతుకను సవరించుకొని, "నువ్వు జైలుకుపోతే మన పంటసేలను, పసువులను ఎవరుసూత్తార్రా?" అనడిగిందామె.

"మరేం పరవానేదులే....! ఊళ్ళోళ్ళంతా నిద్దరోతున్నారు. అయినా నాను సాలా వేగంగా తిరిగొచ్చాత్తానులే!" అన్నాడు జుగుత్‌సింగ్.

"వొద్దు నువ్వెల్లొద్దు!" అని బిగ్గరగా అరచిందతనితల్లి.

"ఛుప్....! నువ్వు నోరుమూసుకో....! ఇలాగరిస్తే యిరుగుపొరుగోళ్ళు మేలుకోవడానికి నువ్వే కారకురాలివవుతావు! అంచేత మరి అరవకుండా వల్లగ నోరుమూసుకో. మరేప్రమాదం నేదులే....! నే నేగంగా తిరిగొచ్చేత్తాను."

"పోరాపో.... నీయిట్ట మెచ్చినకాడికి పో....! నూతిలోకి దూకి సావాలనుంటే ఎల్లి చావు....! మీ అయ్యలాగే ఉరికంబమెక్కాలని నీకుంటే ఎల్లి ఎక్కు....! నా ఏడుపీకొంపలో ఎవురింటారు గనక.... ఇంతకీ ఆ బెమ్మరాతని ఎవురూ తప్పించుకోనేరు. ఎలా రానుంటే అలాగే జరుగుద్ది" అందామె అరచేత్తో నెత్తిమీద బాదుకుంటూ.

జుగుత్‌సింగ్ తలుపుతెరచి ఇరుప్రక్కలా ఓసారి పరిశీలనగా చూశాడు. ఆసందులో అతనికళ్ళకెవరూ అగుపించలేదు.

ఆసందు చివర్నగల బందవరకూ జుగుత్‌సింగ్ నిశ్శబ్దంగా నడచి వెళ్ళాడు. అక్కడ ఓ కొంగలజంట చేపలకోసం ఇటూ అటూ తచ్చాడుతూండడం గమనించాడు. అడుగుల చప్పుడు విని అవి ఎగిరిపోయాయి.

జుగుత్‌సింగ్ అక్కడ కొంచెంసేపాగి ఆ తరువాత నదీతీరంవేపు పోయే ఓ కాలిబాట వెంబడి బయలుదేరాడు.

నదీతీరాన్ని చేరుకున్నాడు. తడి యిసుకలోకి దిగబడేట్లు బల్లెన్ని నిటారుగా గ్రుచ్చి, ఆ ప్రక్కనే కూర్చున్నాడు జుగుత్‌సింగ్; పాలపుంతలో మిలమిల మెరసిపోతున్న నక్షత్రాలకేసి చూస్తూ—

అంతట్లో అకస్మాత్తుగా ఓ సుకుమారి తన మృదువైన హస్తాలతో జుగుత్‌సింగ్ కళ్ళుమూసి, "ఎవరో పోల్చుకో" అనంది.

జుగుత్‌సింగ్ తన చేతుల్ని వెనక్కుచాచి, ఆమె చేతుల్ని క్రింద నుంచి భుజాలవరకు తడివాడు. ఆ తరువాత ఆమె బుగ్గల్ని, ముక్కుని, కళ్ళను, ఆమె ముఖమంతటినీ తడివాడు.

అది అతనికి బాగా పరిచితమైన స్త్రీ శరీరం! ఆమె తన చేతి వ్రేళ్ళను ముద్దు పెట్టుకొనేటట్లు ప్రేరేపించాలనే సంకల్పంతో ఆమె లేత పెదవుల్ని మృదువుగా తనచేతి వ్రేళ్ళతో తడవసాగాడు.

ఆ పెంకిపిల్ల ముద్దు పెట్టుకోడానికి మారుగా నోరుతెరచి కటుక్కున అతని వ్రేలు కొరికింది. జుగుత్‌సింగ్ తటాలున తన చేతిని ప్రక్కకు లాక్కొని రెండుచేతులతోను ఆమె తలపట్టుకొని తన ముఖం మీదికివంచి- ఓసారి తేరిపారచూసి ఆమెను గట్టిగా కౌగలించుకున్నాడు.

ఆమెకు కోపం వచ్చింది. ఫడేల్‌మని జుగుత్‌సింగ్ చెంపపై ఓ లెంపకాయ కొట్టి, "ఇలా పరాయి స్త్రీ శరీరాన్ని తాకడానికి నీకు సిగ్గు లేదూ? నీకు తల్లీ, అక్కచెల్లెళ్ళూ ఎవ్వరూ లేరా? దీన్నిబట్టిచూస్తే పోలీసువాళ్ళు వాళ్ళ చట్టాలలో నిన్నొక దుష్ప్రవర్తన గలవాడిగా పేర్కొనడంలో తప్పేమీ లేదనిపిస్తోంది.... నువ్వో బద్మాష్‌వని యినస్పెక్టరు గారితో నేను తప్పకుండా చెపుతాను జాగ్రత్త!" అని హెచ్చరించింది.

"చూడునూరాన్....! ఇప్పుడీబద్మాష్‌గాడితో నీకూ సంబధంముంది. అంచేత మనిద్దరం ఒకే జైలుగదిలో బంధింపబడతాం....! అప్పుడు మరీ బాగుంటాది!"

"నువ్వతిగా వాగడం నేర్చుకున్నావు.... నేనిక మరెవడినైనా మంచివాడిని చూసుకుంటాను." అని ఆమె అనేసరికి జుగుత్‌సింగ్ తన రెండు చేతులతోనూ ఆమెను చుట్టి ఆమెకు ఊపిరికూడా సలపనంత గాఢంగా కౌగలించుకున్నాడు. ఆమె మాట్లాడడానికి ప్రయత్నించి నప్పు డల్లా ఆమె నోటలోనిమాట నోటిలోనే ఆగిపోయేటంత గట్టిగా తనహృద యానికి హత్తుకోసాగేడు.

ఆమె బాగా అలసిపోయి ప్రక్కకువాలిపోయింది. ఆమె తలక్రింద తన ఎడమచేతినుంచి కుడిచేత్తో ఆమె ముఖాన్ని ముంగురులను నిమర సాగాడు జుగుత్‌సింగ్.

.....

గూడ్సు రైలుబండి యింజను రెండుసార్లు బిగ్గరగా కూసి- గుఫ్ గుఫ్‌మని పొగ వదలుతూ— గోండ్రిస్తూ బ్రిడ్జికేసి పోసాగింది. కొంగలు "క్రాక్ క్రాక్" మని బిగ్గరగా అరుస్తూ బందదగ్గరనుంచి నదికేసి ఎగురు కుంటూ వస్తున్నాయి. బ్రిడ్జినిదాటి వెళ్ళిపోయిన గూడ్సు రైలుబండి యొక్క "పఫ్ పఫ్"మనే శబ్దం క్రమక్రమంగా అంతరించి నిశ్శబ్దత ఏర్పడినాక, మళ్ళీ ఆ కొంగలు బందకేసి బయలుదేరాయి.

జుగుత్‌సింగ్‌లో కామాగ్ని ప్రజ్వరిల్లింది. అతనిచేతులు ఆమెను నలిపివేస్తున్నాయి. ఆమె శక్తినంతా కూడగట్టుకొని అతనిచేతిని ప్రక్కకు నెట్టివేసింది. జుగుత్‌సింగ్ మరి నిగ్రహించుకోలేకపోయేడు. ఆమె తల క్రిందనున్న తన ఎడమచేతిని బయటకు లాక్కొని తన స్వేచ్ఛకు అడు తగులుతున్న ఆమె చేతిని గట్టిగా అణచిపెట్టాడు; ఆమె రెండోమోచేయి అంతకుముందే అతని శరీరంక్రింద వుంది. ఆమె నిస్సహాయురాలైంది.

"వొద్దొద్దు....! నీకు దండంపెడతాను. నన్నొదిలిపెట్టు. నాచెయ్యి నొప్పెడుతోంది. నన్నొదిలిపెట్టు! వదలకపోతే ఇహ నీతో నేనెప్పుడూ మాట్లాడను." అంటూ ఆమె ఆ కామాంధుడి ముద్దులవర్షంలోతడవకుండా తప్పించుకొనేటందుకుగాను శివమెత్తిన దానిలా తల ఇటూఅటూ ఆడించ సాగింది. జుగుత్‌సింగ్‌లో కామాగ్ని మరింత ప్రజ్వరిల్లింది.

ఆమె ఆ బంధంలోంచి తప్పించుకునేందుకు పెనుగులాడుతూ, "బాబ్బాబు....! నీకు దండం పెడతాను, నన్నొదిలిపెట్టు. ఇప్పుడు నువ్వు నన్నొదలకపోతే, ఇహ నిన్ను నేనెప్పుడు కలియను. నీ మొఖంచూడను. నువ్విలా చేస్తే అల్లా నిన్ను శపిస్తాడు.... అబ్బా.... నాచెయ్యి నొప్పెడు తోంది. నన్నొదిలిపెట్టు. నీకు పుణ్యముంటుంది" అని ప్రాధేయపడింది.

"................................"

"బాబోయ్.... వొద్దొద్దు" అని ఆమె ఆందోళనతో బిగ్గరగా అర చింది. అంతట్లో "ధన్" మనే పెద్ద శబ్దం వినిపించింది వాళ్ళకి.

బండదగ్గరున్న కొంగలు భీతితో అరుస్తూ నదికేసి ఎగిరిపోయాయి. తుమ్మచెట్టుపైనున్న కాకులు కావు కావు మని కొంతసేపు అరచాయి. జుగుత్‌సింగ్ తల పైకెత్తి గ్రామంకేసి చూశాడు. అదేసమయంలో నూరాన్ అతని కౌగిలిలోంచి తప్పించుకొని చెదరిన దుస్తుల్ని సరిచేసు కుంది.

కాకులు మళ్ళీ చెట్లపై స్థిరపడ్డాయి. కొంగలు మళ్ళీ బండకేసి బయలు దేరాయి. కాని ఇంకా కుక్కలు మొరుగుతూనే ఉన్నాయి.

ఆ మొరటుసరసంలోంచి అతని బుద్ధిని మళ్ళించాలనే ఉద్దేశ్యంతో "విన్నావా ఆ తుపాకీశబ్దం....?" ఎవరో మనూళ్ళోనే పేల్చినట్టున్నారు.

ఎవరు పేల్చారో ఎందుకు పేల్చారో నీకేమయినా తెల్సా?" అనడిగింది నూరాన్ నీరసంగా.

"ఆసంగతి నాకేటి తెల్సు....! అయినా నానిక్కడుంటే నాకేటి తెలుస్తాదాసంగతి? నన్ను మాటల్లోకిదింపి తప్పించుకోవడానికి పెయత్నించకు. మరేం పరవానేదులే.... ఇప్పుడంతా నిశ్శబ్దంగావుంది....రా...." అంటూ ఆమెను బలవంతంగా తన ప్రక్కలోకి లాక్కున్నాడు.

"జుగ్గా ఇది సరసానికి తగిన సమయంకాదు. ఊళ్ళో ఏదో ఖూనీ జరిగుంటుంది. బహుశా మానాన్న మేలుకొని వుంటాడు. నేను ఇంట్లో లేకపోవడం గమనించి, నేనెక్కడకు వెళ్ళిందీ గ్రామస్తులనడిగి ఆరా తియ్యడంకోసం యీపాటికి బయలుదేరుంటాడు. నేనిప్పుడు వెంటనే మరి ఏమాత్రం ఆలస్యం చెయ్యకుండా ఇంటికెళ్ళిపోక తప్పదు. నన్నొదిలిపెట్టు నే వెళ్ళిపోతాను!"

"ఊహూ.... నిన్ను నేనొదిలెట్టను. మీ నేస్తురాలింటి కెళ్ళినట్లు మీ అయ్యతో సెప్పు."

"ఓ మూర్ఖుడిలా మాటాడకు. అర్ధరాత్రివేళ...." అని నూరాన్ ఇంకా ఏదో అనబోతుండగా జుగుత్‌సింగ్ ఆమె నోటిని తన నోటితో మూసివేశాడు. ఇహ చేసేదేమీలేక జుగుత్‌సింగ్‌యొక్క పశుత్వపుటుద్రేకానికి ఆమె లొంగిపోయింది.

గుండెల చప్పుడు- ఉచ్ఛ్వాస నిశ్వాసములధ్వని తప్ప ఇంకేమీ ఆమెకు వినిపించలేదు. మట్టిగొట్టుకుపోయిన ఆమె మురికి శరీరం ఆమెకు తెలియకుండానే వేడెక్కిపోయింది. జుగుత్‌సింగ్ పెదవులు ఆమె బుగ్గల మీదా పెదవులమీదా ముద్దులవర్షాన్ని కురిపిస్తున్నాయి.

కాసేపటికి జుగుత్‌సింగ్ కామాగ్ని చల్లారింది- పైన ఓ శవం వున్నట్లుగా ఆమె అనుభూతి నొందింది. ప్రక్కకో నెట్టు నెట్టింది. జుగుత్ సింగ్ ప్రక్కకొరిగి పోయాడు.

"నీ కోరిక తీరిందికదూ? నీక్కావలసినదేదో అది నువ్వుపొందేవు. అంతా నరకానికిపోతున్నా నువ్వనుకున్న పనిమాత్రం నువ్వుచేసి తీరుతావు. ఊళ్ళో కూనీలు జరుగుతున్నా నీపని నీదే!" కాస్త కోపంగా అంది నూరాన్.

"ఆఁ.... పోదూ నువ్వు మరీను! అసలెవ్వరూ తుపాకులు పేల్చనే లేదు." ఆమె వేపసలు చూడకుండా జుగుత్‌సింగ్ నిబ్బరంగా అన్నాడు.

అదే సమయంలో ఆ గ్రామం వేపునుంచి అస్పష్టంగా ఏవో ఆర్తనాదాలు, ఏడుపులు వినిపించాయి. గబుక్కున ఆ ఇద్దరూ లేచి కూర్చున్నారు. తుపాకీ రెండుసార్లు "ధన్ ధన్"మని ప్రేలింది.

నూరాన్ ఏడుస్తూ, "గ్రామంలో ఏదో దారుణం జరిగినట్లుంది....! మా నాన్న మేలుకొంటూడు. నేనింట్లో లేకపోవడం గమనిస్తాడు. మా నాన్న కంతా తెల్సిపోతుంది. ఇక నాకేందారి....? నన్ను చంపేస్తాడు." అనంది.

తనేం చెయ్యడమా అనే ఆలోచనలో పడ్డ జుగుత్‌సింగ్‌కి ఆమె మాటలు వినిపించలేదు. ఆరాత్రి తను గ్రామంలోలేడన్న సంగతి బయట పడితే పోలీసువారు తనని బంధించి శిక్షిస్తారు. ఏం చెయ్యడం! ఏం చెయ్యడానికి ఏఁవీ తోచలేదు జుగుత్‌సింగ్‌కి.

సరే....! ఎలా జరగాల్సినది అలాగే జరుగుతుందని తనకు తాను ధైర్యం చెప్పుకున్నాడు. తన బాధేదో తాను పడొచ్చనుకున్నాడు. కాని నూరాన్‌ని ఎలా రక్షించడం? ఆమె తండ్రికీవిషయం తెలుస్తే యింకేమయినా ఉందా? ఆమె మళ్ళీ తన కళ్ళకగుపిస్తుందా?

"నిన్ను చూడ్డానికి మరి నేనెప్పుడూరాను. ఈ సారికి అల్లా నన్ను క్షమించినట్లయితే మరెప్పుడూ యిట్లాంటి నీచమైన పనికి నే నొడిగట్టను." అంది నూరాన్ బరువుగా నిట్టూరుస్తూ.

"నువ్వు నోర్మూసుకుంటావా లేక నన్ను మొయ్యమంటావా?" జుగుత్‌సింగ్ కంఠం చాలా కఠోరంగా ధ్వనించింది.

అతనలా అనేసరికి నూరాన్ వెక్కి వెక్కి ఏడ్వసాగింది....! కొద్ది క్షణాలక్రితం తననంత గాఢంగా కామించినవ్యక్తే అలా మాట్లాడుతున్నాడంటే నమ్మలేకపోయింది!

"ఉష్....! ఏడవకు. ఎవరో వస్తున్నట్టున్నారు!" అని తన మొరటు చేతితో ఆమె నోటిని మూసి మెల్లగా గొణిగేడు.

కిక్కురుమనకుండా ఆ ఉభయులూ ఆ చీకట్లోకి నిశితంగా చూడసాగేరు....! తుపాకులు, బల్లాలు ధరించిన అయిదుగురు వ్యక్తులు వెళ్ళిపోతుండడం వాళ్ళు గమనించేరు!

వాళ్ళు వెళ్ళిపోయిన తర్వాత, "మాఁవా! వాళ్ళెవరో నీకు తెల్సా?" అనడిగింది నూరాన్.

"తెల్సు....! ఆ టార్చిలైటు పట్టుకున్నోడి పేరు మల్లి!" అని పళ్ళు పటపట కొరుకుతూ, "ఆ నంజకొడుక్కి వావివోరసలులేవు. సెల్లెలుతోనే రంకుబోయే నంజికొడుకాడు....! ఆ యెదవన్నరయెదవకి లచ్చసార్లు సెప్పినాను: దోపిడి సెయ్యడానికిది అనువైన కాలం కాదురా అని.... నా మాట పెడసెవినబెట్టి అడి గేంగ్‌తోసహావచ్చి యియ్యాల మనూరిమీదే పడ్డాడు! ఇహ సూస్కోనా తడాఖా. అడంతు తేలుస్తాను!" అన్నాడు.

దోపిడీదొంగలు నదీతీరం వెంబడి దక్షిణదిక్కుగా వెళ్ళిపోయేరు. తీతువ పిట్టలజంటలు ఆ నిశ్శబ్ద వాతావరణాన్ని భగ్నపరుస్తూ భీతిగొల్పే విధంగా అరవసాగేయి.

"వాళ్ళపై పోలీసులకు నువ్వు ఫిర్యాదుచేస్తావా?" అనడిగింది నూరాన్.

"ముందూళ్లోకి పద. ఆళ్ళంతు ఆ తరువాత తేలుస్తాను." అంటూ జుగుత్‌సింగ్ మానోమజ్రావేపు బయలుదేరేడావేశంతో. అతని వెనకాలే నూరాన్ బయలుదేరింది.

వాళ్ళకి ఊళ్ళోంచి అస్పష్టంగా ఆడవాళ్ళ ఏడుపులు, కేకలు-కుక్కల మొరుగులు వినిపిస్తున్నాయి. గ్రామస్తులంతా మేలుకున్నట్లు సూచనగా ఏదో గోల వినిపిస్తోంది.

బందవగ్గర జుగుత్‌సింగ్ ఆగి, "నూరూ....! మళ్ళీ రేపొస్తావు కదూ?" అని ఆమె ముఖంలోకి బ్రతిమాలే ధోరణిలో చూస్తూ అడిగేడు.

"నువ్వు రేపటి గురించి ఆలోచిస్తున్నావు. కాని యివాళ నా బ్రతుకేమవుతుందా అనే బెంగతో నేను చస్తున్నాను. నేనొకవేళ కూనీచెయ్యబడ్డా నీకేం పోయింది! నువ్వు మాత్రం హాయిగానే వుంటావు."

"నాను బతికుండగా నీ వొంటిమీదెవుడూ సెయ్యి ఎయ్యనేడు.... నీవేపు కన్నెత్తి సూసి నోడెవడూ ఈ జుగ్గడి బారినుండి తప్పించుకొని పారిపోలేడు. ఒత్తికొత్తినే నీ యీ జుగ్గడు ఎవర్నీ ఏటీ అనడన్నసంగతి నీకు తెలుసుగాని....! ఒకేళ ఎవురైనా నిన్నేదయినా అంటే ఆ సంగతి నాకుజెప్పు. ఆళ్ళని పాతేస్తాను."

"నేననేదదికాదు. నేననేదేవిటంటే- ఈ గోలకు మానాన్న మేలుకుంటాడని....! ఎక్కడకెళ్ళేవే అని మానాన్న అడిగితే నేనేమని చెప్పడం?"

"యిరోచనాలవుతున్నాయి అలా బయటకెల్లినానని సెప్పు! తుపాకీ కాల్పులు విని- భయపడి దొంగ లెళ్ళిపోయేటంతవరకూ తుప్పవోర దాంగాని వచ్చినానని సెప్పు- లేదా ఇంకేదయినా అబద్ధమాడు....! అది సరే గానీ.... పోనీ ఎల్లుండయినా వొత్తావా?" అనడిగేడు.

"రాను!" అని మెల్లిగా గొణిగి తన తండ్రికేమని సమాధానం చెప్పడమా అని ఆలోచించసాగిందామె. తన తండ్రికి దృష్టి సరిగ్గా ఆనదు....! తన నలిగిన సిల్కు అంగీని కానీ, చెరగిన కాటుకనుగాని చూడలేదు. ఇక ముందెన్నడూ ఇలా రాకూడదనే అభిప్రాయంతో ఆ చీకట్లో అదృశ్యమయిందామె....!

జుగుత్‌సింగ్ తన ఇంటిని సమీపించేడు. తలుపు తెరచేవుంది. చాలామంది గ్రామస్తులు తన ఇంటి వాకిట్లో నిలబడి తన తల్లితో ఏదో మాట్లాడుతూండడం గమనించేడు జుగుత్‌సింగ్. గిరుక్కున వెనక్కు తిరిగి నదీతీరంవేపు గబగబా వెళ్ళిపోయేడు.

4

రైల్వేబ్రిడ్జికి ఉత్తరాన ఆఫీసర్ల రెష్టుహౌస్ వుంది. అది మానో మజ్రా గ్రామానికి కొంత ప్రాముఖ్యతను చేకూర్చింది. ఆ రెష్టుహౌస్ ఇటుకలతో నిర్మింపబడ్డ ఒక డాబాఇల్లు, దాని వరండా నదికి అభిముఖంగా వుంది. దానిచుట్టూ నలుచదరంగా ఓ చిన్న ప్రహరీగోడవుంది.

అదసలు మొదట్లో వంతెన నిర్మించుటకుగాను నియమింపబడిన ఇంజనీరుకోసం నిర్మింపబడింది. వంతెన నిర్మాణానంతరం అక్కడొక ఇంజనీరుండాల్సిన అవసరం లేకపోయింది. ఆ తరువాతది సీనియర్ ఆఫీసర్ల యొక్క ఉమ్మడిసొత్తుగా రూపొందింది. అది నదికి చాలాదగ్గరగా వుండడం వల్లేకాక ఏకాంతత్వాన్ని ప్రసాదించేదిగా వుండడంవల్లకూడా దానికి మంచి విలువ చేకూరింది....!

అప్పటి ప్రకృతి సౌందర్యం ఎంతో మనోహరంగా వుంటుంది. అందుకనే వేసవికాలంలో ఏకాంత నివాసాన్ని వాంఛించే ఆఫీసర్లు మానో మజ్రా రెష్టుహౌస్‌కి వస్తూంటారు.

ఆరాత్రి మానోమజ్రాలో దోపిడీ జరుగుతుందనగా, ఆనాడుదయం ఆ రెస్టుహౌస్ ఒక ముఖ్యమైన అతిథికోసం పరిశుభ్రపరచబడింది. ఉదయం పదకొండు గంటలకి ఒక పోలీసు సబ్ఇనస్పెక్టరు ఇద్దరు కానిస్టేబుల్సు ఆ రెస్టుహౌస్‌కి సైకిల్సు మీదొచ్చేరు— ఏర్పాటన్నీ సవ్యంగా జరిగేయో లేదో తణికీ చెయ్యడానికి!

ఆ తరువాత మరి కొంతసేపయేక, పంజాబు ప్రభుత్వ చిహ్నముతో కూడిన యూనిఫారమ్ము ధరించిన ఇద్దరు ఆర్డర్లీలు వచ్చేరు. వాళ్ళతోపాటు కొంతమంది గ్రామస్తులు పెట్టెలు, రికార్డులు మొదలగు సామానులు మోసుకొచ్చేరు.

మరో గంటసేపయేక ఒక పెద్ద తెల్లటి అమెరికన్ కారు రెస్టుహౌస్ ముందాగింది. ఒక ఆర్డర్లీ తలుపుతీసి ముందుసీటులోంచి క్రిందకు దిగి, వెనుకసీటు తలుపు తెరచేడు తన యజమాని దిగడంకోసం. సబ్ఇనస్పెక్టరు, కానిస్టేబుల్సు అటెన్షన్‌లో వుండి శాల్యూట్ చేసేరు. గ్రామస్తులు కాస్తా దూరంగా తొలగిపోయేరు.

అతను ఆ జిల్లామెజిస్ట్రేటే కాక డిప్యూటీ కమీషనర్ కూడాను! పేరు హుకుమ్‌చాంద్....! అతను నెమ్మదిగా కార్లోంచి క్రిందకు దిగేడు. ఆవాళ్టి ఉదయంనుంచీ ప్రయాణం చేస్తున్నందువల్ల కాబోలు అతను బాగా అలసిపోయినవాడిలా అగుపిస్తున్నాడు! అతని కుడిచేతిలో సిగరెట్‌టిన్ను అగ్గిపెట్టె- పెదవులమధ్య సిగరెట్- ముఖానికడ్డుగా పొగ....!

అంతా అటెన్షన్‌లో వున్నారు. కూర్చోవడానికి చక్కగా సోఫాలు అమర్చబడున్న పెద్దగది దగ్గరకు బేరర్ గబగబావెళ్ళి వైర్‌గాజ్ తలుపు తెరచేడు. స్నేహపూర్వకమయిన వాత్సల్యంతో ఆ సబ్ఇనస్పెక్టర్ వీపు పైతట్టి, "రావయ్యా యినస్పెక్టరూ.... లోపలకురా!" అంటూ అతని కుడిచెయ్యి పట్టుకొని లోనికి లాక్కుపోయేడు హుకుమ్‌చాంద్.

జిల్లా మెజిస్ట్రేటు మరియు డిప్యూటీ కమీషనరు అయిన హుకుమ్ చాంద్ యొక్క అంతరంగిక సేవకుడు, బేరరు వారిని అనుసరించేరు. ఒక కానిస్టేబుల్ డ్రైవరికి కారులోంచి సామాన్లు బయటకు దింపడానికి తోడ్పడ్డాడు. హుకుమ్‌చాంద్ బాత్‌రూంలోకెళ్ళి శుభ్రంగా ముఖం కడుక్కొని తువ్వాలుతో తుడుచుకుంటూ గదిలోకొచ్చేడు.

"కూర్చోవయ్యా కూర్చో!" అని ఆజ్ఞాపించి, తువ్వాలుని పరుపు మీద విసిరేసి- ఓ వాలుకుర్చీలో నడుం వాల్చేడు హుకుమ్‌చాంద్.

పంకా "కిర్ కిర్" మనే శబ్దంతో ఇటూ అటూ వూగసాగింది. అతని సేవకులలో ఒకడు అతని బూట్లు విప్పి సాక్సు తీసివేసి, కాళ్ళు పట్టడం మొదలెట్టేడు. హుకుమ్‌చాంద్ సిగరెట్ టిన్ను తెరచి ఒకటి తీసి పెదవులమధ్య పెట్టుకొని— ఆ సిగరెట్ టిన్నును సబ్ఇనస్పెక్టరు ముందుంచేడు; ఒకటి తీసుకోమన్నట్లు....! తీసుకోడానికి సంశయించేడా సబ్ఇనస్పెక్టర్....!

"ఫరవాలేదు కాల్చవయ్యా!" అన్నాడు మందస్మిత వదనంతో. జంకుతూ ఒకటి తీసుకున్నాడు. ఆ తరువాత అగ్గిపుల్లగీసి ఆ డిప్యూటీ కమీషనర్ ముందుంచేడు. అతను ముట్టించేక తనూ ముట్టించేడు.

"ప్చ్! ప్చ్!" అని చుట్ట కాల్చినట్టుగా ఆ సిగరెట్ కాల్చడం ఆ వైఖరి చూసిన వాళ్ళెవరైనా చెప్పునపోల్చుకోగలరు. అతనొక సామాన్య మధ్యతరగతి కుటుంబాని కొకప్పుడు చెందినవాడని....! ఆ దొంగ, ఎక్కడపడితే అక్కడ సిగరెట్టు బూడిద దులపడం - బొత్తిగా అనాగరికంగా వుండతను సిగరెట్టు కాల్చడం....! అతనికంటే ఆ సబ్ఇనస్పెక్టరు చిన్నవాడు, అయితేనేం? సిగరెట్టు కాల్చడంలో ఆ దర్జా....ఆ హుందాతనం.... ఓహ్....! నాగరికత ఉట్టిపడుతోంది....!

"ఏఁవయ్యా ఇనస్పెక్టరూ! ఇక్కడ పరిస్థితులన్నీ సవ్యంగా ఉన్నట్లేనా?" సంభాషణ కుపక్రమించేడు హుకుమ్‌చాంద్.

"భగవత్ కృపవల్ల ఇప్పటికంతా సవ్యంగా ఉన్నట్లే! ఇంతకీ తమ దయ మాపై వుంటే మాకేలోటూ వుండదు. మేము వాంఛించేది తమ దయాదాక్షిణ్యాలను మాత్రమే!" ఎంతో వినయ పూర్వకంగా సమాధాన మిచ్చేడు సబ్ ఇనస్పెక్టరు.

"మత విద్వేషాలీ ప్రాంతంలో లేనట్లేనా?"

"తమ దయవల్ల ఇంతవరకూ లేవు. పాకిస్తాన్ నుంచి సిక్కు, హిందూ శరణార్థులను భారత దేశానికి- భారతదేశం నుంచి ముస్లిమ్ శరణార్థులను పాకిస్థానుకు తీసుకుపోయే "కన్‌వోయ్"లు ఈ ప్రాంతం మీదుగా పోతున్నాయి. అయినా ఇంతవరకూ అవాంఛనీయమయిన సంఘటన లేవీ జరగలేదు!"

"సరిహద్దు ప్రాంతాలనుంచి సిక్కుల మృత కళేబరాలను మోసుకుపోయే వాహనాలేవీ ఇంతవరకూ ఇటుప్రక్క రాలేదనుకుంటాను. అలాంటివి అమృతసర్ మీదుగా వస్తున్నాయి. ఏ ఒక్కడూ ప్రాణాలతో రాలేదు! ఎంతో దారుణంగా చంపివేసి కళేబరాలను పంపివేస్తున్నారు." హుకుమ్‌చాంద్ బద్ధకంగా ఆవులించి చేతులు మీదికెత్తి ఓసారి వొళ్ళు విరుచుకొని తొడలపై చేతుల్ని బద్ధకంగా పడేశాడు. చేతిలోని సిగరెట్టు పీకనుండి నిప్పురవ్వలు త్రుళ్ళిపడి అతని ట్రౌజరుమీద పడ్డాయి. సబ్ ఇనస్పెక్టర్ విపరీతమైన ఆందోళనతో గబుక్కుని ఆ నిప్పురవ్వల్ని తనచేత్తో దులిపేశాడు.

"ఇది నీకు తెలుసా?" చెప్పడం మొదలెట్టేడు హుకుమ్‌చాంద్.

"సిక్కులు ఇందుకు ప్రతీకారంగా ఒక ముస్లిమ్ శరణార్థుల రైలుబండీని ఎదుర్కొని, అందులోగల అందరినీ, వెయ్యిమందికి పైగా

వుంటారు: చంపివేసి, ఆరైలుబండిపై "పాకిస్థానుకి కానుక!" అని వ్రాసి పంపేశారు....! ఈ విషయం మీకింకా తెలియదనుకుంటాను."

ఆ సబ్‌ఇన్‌స్పెక్టరు క్రిందకు సాలోచనగాచూస్తూ, "అవతలప్రక్క జరుగుతున్న దారుణమైన హత్యాకాండ నరికట్టడానికి ఇదొక్కటే మార్గమని వాళ్ళంటున్నారు. పురుషుడికి - పురుషుడు, స్త్రీకి- స్త్రీ, శిశువునకు శిశువు, ఇలాగే బదులుచెప్పాలని వాళ్ళ ఉద్దేశ్యం...! కాని మన హిందువులలాంటి వాళ్ళుకారు. ఇంతటి నైచ్యాన్ని మనం చెయ్యలేము. ఒకవేళ ఎవరితోనైనా యుద్ధమొస్తే అప్పుడు బహిరంగంగా చూపిస్తాం మనసత్తా. అంతేగాని దొంగచాటుగా నిరాయుధుల్ని, నిస్సహాయుల్ని చంపే సంప్రదాయంకాదు మనది. ఇకపోతే సిక్కులు వాళ్ళవంతు పనిని వాళ్ళు సవ్యంగా నిర్వహించలేదని నాఉద్దేశ్యం.... వాళ్ళు మానవత్వాన్ని పోగొట్టుకున్నారు. పెద్దగా కబుర్లు చెప్పడం నేర్చుకున్నారు — ఇక్కడ ఈ సరిహద్దులలో ముస్లింలతోసహా సిక్కుగ్రామాలలో మనం నివసిస్తున్నాము. ఇంతవరకూ ఇక్కడ అవాంఛనీయమైన సంఘటనలేవీ జరగలేదు. ప్రతిరోజూ ఉదయం సాయంత్రం ముస్లిముల మతగురువు, గ్రామ మధ్యస్థంలోవున్న మసీదులోంచి ప్రార్థనకు రమ్మనమని అందరినీ పిలుస్తుంటారు. ఇందుకు మీ రెందుకు సమ్మతించేరని ఆ సిక్కులను అడిగినట్లయితే ఆ ముస్లిములంతా తమ సోదరులని వాళ్ళు సమాధానం చెప్తుంటారు.... ఆ ముస్లిముల నుండి సిక్కులు అన్నివిధాల లాభం పొందుతున్నారని నేను నిశ్చయంగా చెప్పగలను" అని అన్నాడు.

హుకుమ్‌చాంద్ తన చేతివ్రేళ్ళను నుదుటిపైనుంచి జుత్తులోనికి పోనిస్తూ "ఈప్రాంతంలో మోతుబరులైన ముస్లిము లెవరైనా ఉన్నారా?" అనడిగేడు.

"అట్టేమంది లేరుసార్....! ఎక్కువగా సాలివాళ్ళు, కుమ్మరి వాళ్ళూను."

"చందున్నగ్గర్ పోలీసు స్టేషను చాలా మంచిదని అంటూంటారు. ఈ ప్రాంతంలో చట్టవిరుద్ధమైన కార్యకలాపాలు, ఖూనీలు తరచుగా జరుగుతుంటాయి.... పైగా మంచి మోతుబరులైన సిక్కు రైతులున్నారు....! నీకు ముందు ఈపోలీసు స్టేషనులో పనిచేసినవాళ్ళు నగరంలో పెద్ద ఇళ్ళుకట్టేరటగా."

"తాము నన్ను పరిహాసం చేస్తున్నట్లున్నారు."

"నువ్వేం తీసుకున్నా నాకేం అభ్యంతరం లేదు. ప్రతివాడూ చేస్తున్న పనే ఇది....! కాని దేనికయినా సబబూ సందర్భమూ అంటూ ఓటుండాలికదా....! ఆ తీసుకొనేదేదో కాస్త జాగ్రత్తగా రెండో కంటివాడికి తెలీకుండా తీసుకోవాలి....! ఈ క్రొత్త ప్రభుత్వం ఈ వ్యవహారాన్ని అంతమొందిస్తానని చాలా గట్టిగా అంటోంది. ప్చ్....! ఏమిటో కొద్ది మాసాలు గడచేసరికి వారి ఉత్సాహమంతా నీరు కారిపోయి మళ్ళీ మామూలు పరిస్థితి యథాప్రకారంగా కొనసాగుతుందని నా అభిప్రాయం. పరిస్థితుల్ని రాత్రికి రాత్రి మార్చేయడానికి ఎంత ప్రయత్నించినా ప్రయోజన మేమీ వుండదు."

"వాళ్ళంతగా చెప్పుకోదగ్గ వాళ్ళుకారు.... ఢిల్లీనుంచొచ్చే వాళ్ళెవరినైనా తామడిగినట్లయితే- గాంధీజీ అనుచరులుగా చెలామణీ అవుతున్న వాళ్ళంతా బాగా సొమ్ము చేసుకుంటున్నారని వాళ్ళు చెపుతారు కొంగలు ఎటువంటి తపశ్శాలులో వాళ్ళూ అటువంటి తపశ్శాలులే....! పవిత్రమైన యోగీశ్వరునిలాగ ఒంటికాలిమీదనిలబడి కళ్ళు మూసుకొని దొంగజపంచేస్తూ ఎరదగ్గర కొచ్చేసరికి టపీమనిపట్టుకొని మ్రింగేసే కొంగ లాంటి వాళ్ళు వారు!"

తన పాదాలను పడుతున్న సేవకుడికి, "కాస్త బీరు తీసుకురా!" అని ఆజ్ఞాపించేడు హుకుమ్‌చాంద్.

వాడెళ్ళిపోయిన తరువాత స్నేహపూర్వకంగా తన చేత్తో సబ్ ఇనస్పెక్టర్ వీపుపై తట్టి, "నువ్వు వొత్తిగా జ్ఞానంలేని చంటి పిల్లాడిలా మాట్లాడుతున్నావు. ఇందువల్ల ఎప్పుడో ఒకనాడు నువ్వు కష్టాలలో ఇరుక్కుంటావు....! ప్రతిదీ కనిపెట్టి చూడడమేగాని నోరెత్తి పల్లెత్తు మాటనకూడదు. మనం.... ఎవ్వరితోను, ఎవ్వరి అభిప్రాయాలతోను ఏకీభవించ లేనంత శీఘ్రంగా ఈ ప్రపంచం మారిపోతోంది. నీకే విషయమయినా నచ్చక పోయినట్లయితే అది నీ మనస్సులోనే అట్టిపెట్టుకో" అని అన్నాడు.

ఆ సబ్ ఇనస్పెక్టర్ యొక్క హృదయంకృతజ్ఞతతో నిండిపోయింది. ఆత్మీయతతో నిండిన ఒక మంచిసలహా తనకు లభ్యమయిందనుకున్నాడు. ఆ ఇచ్చిన సలహాబట్టి, తన పై అధికారి భావాలు తన భావాలకు చాలా సన్నిహితంగా ఉండచ్చనుకున్నాడు!

"సార్! కొన్ని కొన్ని సందర్భాలలో కొంతమంది తను ఆవేశాలను అణచుకోలేరు. పంజాబు గురించి ఢిల్లీలోవున్న గాంధీటోపీ గాళ్ళకేం తెల్సు....? అవతల పాకిస్తాన్‌లో జరుగుతున్న దానిగురించి వాళ్ళేం అంతగా పట్టించుకోలేదు. అవును మరి? వాళ్ళకేం పోయింది? వాళ్ళ ఇళ్ళూ వాకిళ్లూ, ఆస్తిపాస్తులూ ఏంపోలేదుగా. వాళ్ళ తల్లులు, పెళ్ళాలూ, అక్కచెల్లెళ్లూ, కూతుళ్లూ ఎవ్వరూ ఘోరంగా చెరచబడి నడివీధుల్లో ముక్క ముక్కలుగా నరికి వేయబడలేదుగా.... సార్! తాము వినే వుంటారు: షేక్‌పూరా, గుజ్రాన్‌వాలా బజార్లలో ముస్లిం గూండాలు హిందూ, సిక్ శరణార్థుల నేంచేసినదీ- పాకిస్తాన్ పోలీసులకు సైనికులకు కూడా ఈ దారుణ హత్యాకాండలో ప్రమేయముంది. ఒక్కరు కూడా బ్రతికి బయటపడలేదు. శీలం కాపాడుకోడానికి మరో మార్గంలేక ఎంతోమంది స్త్రీలు కన్నబిడ్డల పీకలు నులిమి చంపి- ఆ తరువాత తాము నూతులలోకి దుమికి ఆ నూతుల్ని తమ శవాలతో పూడ్చిపెట్టారు."

"హరేరామ్! హరేరామ్....! నాకంతా తెల్సొయ్యా తెల్సు! శీలం కాపాడుకొనేటందుకు ప్రాణాలను త్యజించే స్వభావం మన హిందూస్త్రీలది. శీలం పోగొట్టుకొని నికృష్టంగా బ్రతికేకంటే ఆత్మహత్య చేసుకోవడమే ఉత్తమమని భావించే స్వభావం మనవాళ్ళది.... పరాయిస్త్రీల వొంటిపై చెయ్యి వెయ్యడానికి సాధారణంగా హిందువులెవ్వరూ ఇష్టపడరు. కాని అబలలపై ఈ పాకిస్తానీయులకు రవ్వంతైనా గౌరవమున్నట్లులేదు. ఇందుకిప్పుడు మనమేం చెయ్యగలం....? అది సరేగాని ఈ ప్రాంతంలో యీ ప్రశాంతత ఇలాగే కొనసాగుతుందంటావా?"

"ఏమో చెప్పలేను! ఇప్పటివరకు మానోమజ్రా రైల్వేస్టేషనుకు సిక్, హిందూ శవాలతో నిండిన రైళ్ళు ఏవీ రాలేదు. ఒకవేళ అటువంటి రైలుబండిగాని వచ్చినట్లయితే, ప్రతీకార వాంఛను నివారించడం అసాధ్యం. ఈ చుట్టుప్రక్కల వందలాది ముస్లిమ్ గ్రామాలున్నాయి. ఇకపోతే ప్రతి సిక్కుల గ్రామంలోనూ ఎన్నో ముస్లిం కుటుంబాలున్నాయి, మానోమజ్రాలో వున్నట్లుగానే" అని కాస్తా యుక్తిగా అన్నాడా సబ్ఇనస్పెక్టర్.

హుకుమ్‌చాంద్ ఓసారి సిగరెట్టుని గట్టిగా పీల్చి, వ్రేలుతో రొయ్యినిదులిపి, "ఏమయినా సరే మనం శాంతిభద్రతలనుకాపాడితీరాలి" అని కొంచెంసేపు మౌనంగావూరుకొని, "సాధ్యమయినంతవరకు ముస్లిములను శాంతియుతంగా వెళ్ళనివ్వాలి. రక్తపాతంవల్ల ఎవ్వరికీ ప్రయోజనముండదు. ఇలాంటి సందర్భాలలో దోచుకొనే డబ్బుతో దుర్మార్గులు మరింత బలపడతారు! ఈ హత్యాకాండకు ప్రభుత్వం మనల్ని నిందిస్తుంది. అంచేత వ్యక్తిగతంగా మన అభిప్రాయాలేవయి నప్పటికీ - ఉద్యోగరీత్యా శాంతిభద్రతల్ని సాధ్యమయినంతవరకూ కాపాడకతప్పదు... నేనొక ప్రభుత్వోద్యోగిని కాకపోయినట్లయితే ఈపాకిస్తానీయులనేంచేసుండేవాడినో ఆ భగవంతుడికి మాత్రమే తెల్సు.... అదిసరే ఇక్కడ మనం

మూక ఉమ్మడి హత్యలకు, ఆస్తుల విధ్వంసనానికి, దోపిడీలకు, గృహ దహనాలకు ఏమాత్రమూ తావివ్వకూడదు. వాళ్ళని వెళ్ళిపోనీ! కాని వాళ్ళు తమతో ఆట్టే ఆస్తిపాస్తుల్ని తీసికెళ్ళిపోకుండా వుండేటట్లు చూడు. అక్కడ పాకిస్తాన్‌లో హిందువుల సర్వస్వాన్నీ దోచుకున్న తరువాతే వాళ్ళని ఇండియాకు వెళ్ళనిచ్చారు. ఒకేఒక అర్ధరాత్రిలో పాకిస్తాన్‌లోని చాలామంది మెజిస్ట్రేట్సు మిలియనీర్సు అయిపోయారు. మన భారత దేశంలోవున్న వాళ్ళెవరూ మరీఅంత నీచంగా ఈనాటివరకూ ప్రవర్తించ లేదు. మన దేశంలో ఎక్కడైతే హెచ్చుగా కూనీలు, గృహ దహనాలు జరిగినాయో అక్కడమాత్రం అక్కడున్న విదేశీయ మనస్తత్వంగల అధికార్లను సస్పెండ్ చెయ్యడంగాని, బదిలీ చెయ్యడంగాని మనప్రభుత్వం చేసింది. దాంతో హత్యాకాండ బందయిపోయింది. శాంతి యుతంగా ముస్లిములను, అదీ వెళ్ళదల్చుకున్న వారిని పాకిస్తాన్ పంపించడం మాత్రమే ఇప్పుడు జరుగుతోంది."

బేరర్ ఒక సీసాతో బీరుతెచ్చి, ఒక గ్లాసుని హుకుమ్‌చాంద్ ముందు, ఇంకో గ్లాసుని సబ్ ఇనస్పెక్టర్ ముందు పెట్టాడు.

సబ్ ఇనస్పెక్టర్ తన గ్లాసుని చేత్తో మూస్తూ "వద్దు సార్! తమ సమక్షంలో త్రాగి అనుచితంగా నేను ప్రవర్తించలేను." అని తన అభ్యంతరాన్ని ఎంతో మర్యాదగా తెలియజేశాడు.

మరి తర్కించడానికేమీ అవకాశమివ్వకుండా "నాతోపాటు నువ్వు త్రాగాలి. ఇది నా ఆజ్ఞ" అని అతని అభ్యంతరాన్ని త్రోసిపుచ్చి "ఏయ్ బేరర్! ఇనస్పెక్టర్ సాబ్ గ్లాసుకూడా నింపు. ఇతనిక్కూడా ఇక్కడే లంచ్ ఏర్పాటు చెయ్యి" అని ఆదేశించాడు.

బీర్ కోసం గ్లాసుని బేరర్ ఎదుటపెట్టి "తమరలా ఆజ్ఞాపిస్తే నేనిక చేసేదేమీలేదు: తమ ఆజ్ఞను శిరసావహించడం తప్ప!" అన

న్నాడు, సబ్ ఇనస్పెక్టర్ తన తలపాగా తీసి టేబులుపై పెడుతూ. అది సిక్కుల తలపాగా వంటిదికాదు: బయటకు తీసినప్పుడల్లా మళ్ళీ చుట్టడానికి.... సుమారు మూడుగజాల కాకీవోణీ తలపాగాలాగా చుట్టబడి పైన ఒక నీలిరంగు సిల్కు్కేపు అమర్చబడుంటుంది. దానిని ఒక హేట్‌లా ఎప్పుడు కావాలంటే అప్పుడు పెట్టుకొని అవసరం లేనప్పుడు తీసెయ్యొచ్చు.

"ఇంతకీ మానోమజ్రాలోని పరిస్థితి ఎలాగుంది" అనడిగాడు హుకుమ్‌చాంద్.

"ఇంతవరకూ అంతా బాగానే వుంది. రోజూ గ్రామాధికారియొక్క రిపోర్టు లొస్తున్నాయి. ఇంతవరకూ ఈ గ్రామానికి కాందిశీకులెవ్వరూ రాలేదు. బ్రిటీషువారు మనదేశాన్ని వదిలిపెట్టి వెళ్ళిపోయారని, ఈదేశ హిందూస్తాన్‌గాను, పాకిస్తాన్‌గాను విభజింపబడిందని ఈ గ్రామంలో ఇంతవరకూ ఏ ఒక్కరికీ తెలీదని నేను నిశ్చయంగా చెప్పగలను. అయితే కొంతమంది మాత్రం గాంధీజీ గురించి వింటే వినుండొచ్చు. కాని జిన్నాగురించి వినుండరేమోనని నా అనుమానం."

"అదిసరేగాని....మానోమజ్రామీద మాత్రం ఓ కన్నేసుంచు ....; ఇటుప్రక్కనున్న సరిహద్దులో ఇదొక ముఖ్యమైన గ్రామం-ఇది వంతెనకు చాలా దగ్గరగావుంది. మనం చాలాజాగ్రత్తగా వుండాలి. ఈగ్రామంలో దోషులుగా పోలీసువారి చిట్టాలోకెక్కిన వాళ్ళెవరైనా ఉన్నారా?"

"ఒకే ఒకడున్నాడుసార్ ! వాడిపేరు జుగుత్‌సింగ్ ! అనుమతి లేనిదే గ్రామం వదలి వెళ్ళడానికి వీల్లేదని వాడిని శాసించడం జరిగింది. ప్రతిరోజూ గ్రామాధికారి దగ్గర హాజరవుతూ- వారానికో సారి పోలీసు స్టేషను కొస్తున్నాడు."

"జుగుత్‌సింగా....?....ఎవడయ్యా వాడు?"

"రెండేళ్ళక్రితం ఉరి తీయబడ్డ ఆలమ్‌సింగ్ కొడుకు సార్. ఈ ప్రాంతమంతటికీ మిక్కిలి పొడవైనవాడు. దుక్కనక్కలాగుంది సుమారు ఆరడుగుల నాలుగంగుళాల పొడవుంటాడు....నిజానికి ఓ పెద్ద ఆబోతులా గుంటాడు. బహుశా తమకు జ్ఞాపకముండే వుంటాడు."

"ఆ ! జానాను !....ఇప్పుడు జ్ఞాపకమొచ్చింది. నియదు ప్రతినెలా ఏదో ఓ నేరానికి వాడు నా దగ్గరకు తీసుకు రాబడుతూండేవాడు....కాని యీమధ్య వాడు కాస్తా బుద్ధిమంతుడయినట్లున్నాడు ! కారణం ఏమిటో?"

ఆ సబ్ యినస్పెక్టర్ ఫకాలున నవ్వి, "సార్....పంజాబుపోలీసులు చెయ్యలేని పనిని, ఒక పదహారేళ్ళ పడుచుపిల్ల తన మంత్రముగ్ధమైన కళ్ళతో చెయ్యగల్గింది" అని అన్నాడు.

హుకుమ్‌చాంద్ ఎంతో కుతూహలంతో "వాడికామెతో అనుచితమైన సంబంధమేదయినా వుందా?" అనడిగాడు.

"ఆఁ!....ఉంది .... ఆమె ఒక ముస్లింసాలివాడి కూతురు. నల్లగా వుంటుంది. ఆమెకళ్ళు మరీ నల్లగా వుంటాయి. ఆమె జుగ్గాని కట్టిపడేసింది.... జుగ్గా ఏం చేస్తాడోననే భయంవల్ల ఈ గ్రామంలో ఎవ్వరూ ముస్లిములకు వ్యతిరేకంగా పల్లెత్తుమాటయినా అనడానికి సాహసించలేదు. ఆమె తండ్రి ఈ గ్రామంలో మసీదుయొక్క ముల్లా. అతనికి దృష్టి సరిగా ఆనదు. ఇంతకీ చెప్పొచ్చేదేమిటీ అంటే ఆ అమ్మాయి జుగ్గాని బాగా కంట్రోలు చేస్తోందని" అనిచెప్పాడు సబ్ యినస్పెక్టర్.

ఆ తరువాత ఆ ఇద్దరూ బీరుత్రాగి - బేరర్ భోజనం వడ్డించేటంత వరకూ సిగరెట్లు కాలుస్తూ కూర్చున్నారు. భోంచేస్తూ ఆ జిల్లాలోని పరిస్థితుల గురించి వాళ్ళు చాలా సేపు ముచ్చటించుకున్నారు. తిన్న ఖరీదయిన ఆ భోజనం, త్రాగిన బీరు హుకుమ్‌చాంద్‌ని కునికిపాట్లకు గురిచేసినయ్. వరండాపై మీదకు చుట్టబడున్న వట్టి వ్రేళ్ళచాపలు

ఎండవేడిమిని లోనికి రాకుండా అరికట్టేందుకుగాను క్రిందకు దించబడ్డాయి. పంకా ఓ నిర్ణీతమైన క్రమంలో లాగబడుతోంది.

బద్ధకంగా ఆవులించసాగాడు హుకుమ్‌చాంద్....నిద్రమత్తు వదల గొట్టుకోవాలనే వుద్దేశ్యంతో పళ్ళు కుట్టుకొనే వెండిపుల్లను తీసి - పళ్ళి కుట్టుకొని దాన్ని టేబుల్ క్లాత్‌కి తుడిచేసాడు. ఓసారి బద్ధకంగా వళు విరుచుకున్నాడు. అయినా ఇంకా నిద్రమత్తు వదలలేదు. కళ్ళు మూతలు పడుతున్నాయి.

మెజిస్ట్రేటు కునికిపాట్లు పడుతూండడం గమనించి- సెలవు తీసుకొని వెళ్ళిపోవాలనే ఉద్దేశ్యంతో లేచి నిలబడి "సార్ ! దయుంచి వెళ్ళిపోవడానికి నా కనుమతి నివ్వండి" అని మనవిచేసాడు సబ్‌యిన్‌స్పెక్టర్.

"విశ్రాంతి తీసుకోవాలని నీకుంటే ఇక్కడింకేదయినా మంచం మీద పడుకో."

"తాము దయార్ద్రహృదయులు. కాని స్టేషనులో నేను చెయ్యాల్సిన కొన్ని ముఖ్యమయిన పనులున్నాయి. అంచేత వెళ్ళడానికి నన్ననుమతించమని ప్రార్థన. ఇక్కడ ఇద్దరు కానిస్టేబుల్సుని ఉంచుతాను. తమకు నా అవసరమేమయినావుంటే క్షణాలమీద వారొచ్చి నాకు తెలియజేస్తారు."

"ఊఁ....సరే ! మరి సాయంత్రం ప్రోగ్రామ్ మాటేమిటి ?.... ఏదయినా ఏర్పాటు చేసావా ?"

"నావశమా ఆవిషయమై ఉపేక్షించడానికి? ఆ అమ్మాయి తమను సంతృప్తి పరచకపోతే నన్ని ఉద్యోగంలోంచి డిస్మిస్ చేయించండి !.... ఆ పార్టీని ఎక్కడనుంచి తీసుకురావాలో డ్రైవరికి చెపుతాను!" అని శాల్యూట్‌చేసి వెళ్ళిపోయాడు.

ఆ తరువాత ఆ జిల్లామెజిస్ట్రేటు, డిప్యూటీ కమిషనరూ అయిన హుకుమ్‌చాంద్ మంచంమీద కాళ్ళనిగడదన్ని పడుకున్నాడు. బాగా నిద్ర పట్టిందతనికి.

ఆ సాయంత్రం రెస్టుహౌస్‌ని విడిచిపోతున్న కారుశబ్దం హుకుమ్‌చాంద్‌ని మేల్కొలిపింది. వరండాపై వ్రేలాడదీయబడ్డ వట్టి వ్రేళ్ళవాపల్ని చుట్టలుగాచుట్టి మధ్యని ముడివేస్తున్నా డొక సేవకుడు. స్వచ్ఛమైన తెల్లని వరండా, సాయంత్రపు నీరెండ కాంతిలో మనోహరంగా మెరసిపోతోంది. స్వీపర్ కొడుకు పంకాత్రాడుని చేతికి చుట్టుకొని కాళ్ళు ముడుచుకొని పడుకుని వున్నాడు. రెస్టుహౌస్ చుట్టూ స్వీపర్ కళ్ళాపి జల్లుతున్నాడు. నేలనుండి శేమవాసన మల్లెపువ్వుల పరిమళంతో కలిసిపోయి వైరుగాజు తలుపులోంచి గదిలోకి ప్రవేశిస్తోంది.

ఆ రెస్టుహౌస్‌కి ముందొక పెద్ద పీచుచాప పరచి, దానిపై ఒక చక్కని తివాసీ పరచారు సేవకులు. ఆ తివాసీకి ఒక చివర్ని ఒకపెద్ద బెత్తు కుర్చీ, దానిముందొక టేబులు వున్నాయి. ఆ టేబులుపై ఒక విస్కీ-సీసా, ఒకజల పానపాత్రలు, మంచి తినుబండారాలతో నిండిన పళ్ళేలు వున్నాయి. టేబులుక్రిందొక సోడాబుడ్ల కేసుంది.

గడ్డం గీసుకొనేటందుకు వేడినీళ్ళు తెమ్మనమని తన ఆర్డర్లీ నుద్దేశించి కేకేసి, సిగరెట్టు ముట్టించి ఇంటి పైకప్పువేపు చూస్తూ పడుకున్నాడు హుకుమ్‌చాంద్.

పైకప్పుమీద సరిగ్గా అతని నెత్తిపై రెండు తొండలు కలహానికి సంసిద్ధమైవున్నాయి. అకురాయితో పామినప్పుడు వచ్చే శబ్దాలవంటి శబ్దాలనుచేస్తూ అవి ఒకదాని కొకటి ఎదురుగా పాకుకుంటూ వచ్చి, సరిగ్గా వాటిమధ్య ఒక అంగుళం ఖాళీవున్నదనగా అవి అగి వాటి తోకల్ని ఆడిస్తూ - ఒకదాన్నొకటి బెదరించుకుంటూ గబుక్కున తలలతో గ్రుద్దుకున్నాయి.

హుకుమ్‌చాంద్ గబుక్కునలేచి ఇలా మంచంమీద కూర్చొనేసరికి అవి టపీమని అతని తలగడా ప్రక్కనేపడ్డాయి. అతని శరీరం

గగుర్పొడిచింది. మంచంమీదనుంచి గభీమని దుమికి వాటికేసి రెప్ప వెయ్యకుండా చూడసాగాడు. ఆ తొండ లతనివేపొకసారి తేరిపారచూసి- ఒక దాన్నొకటి కౌగలించుకున్నట్లు అవి పరస్పరం కరచుకున్నాయి.... బేరర్ అడుగుల చప్పుడువిని ఆ తొండలు గబుక్కున మంచందిగి గోడపై నుంచి ఇంటి కప్పుపైకి ఎగబ్రాకి పారిపోయాయి.

ఆ తొండలు తన చేతికి తగిలినాయేమోననే అనుమానంతో హుకుమ్‌చాంద్ తన చేతుల్ని చొక్కాకు తుడుచుకున్నాడు. నిజానికి తుడిచినా కడిగినా వదలిపోయే మురికి వంటిది కాదది. బేరర్ ఒక గిన్నెలో వేడి నీటిని, గడ్డం గీసుకోడానికి కావలసిన పరికారాల్ని డ్రస్సింగ్ టేబులుపై పెట్టాడు. ఒక కుర్చీమీద ఒక చక్కని పల్చని కల్లీలాల్చీని, మంచి సిల్కుషరాయిని పెట్టాడు. ఆ తరువాత అతని ఆకుజోళ్ళను బాగా బ్రష్‌చేసి కుర్చీ ప్రక్కనుంచాడు.

గడ్డం గీసుకున్నాక హుకుమ్‌చాంద్ శుభ్రంగా స్నానంచేసాడు- ఆ తరువాత బ్రిలియంటైను తలకు బాగా మర్దించుకున్నాడు- ముఖానికి స్నో రాసుకున్నాడు. అది కాస్త ఆరాక, మంచి సువాసనగల టాల్కుమ్ పౌడర్ని శరీరంపై జల్లుకున్నాడు. ఆ పౌడరు వంటికి బాగా పట్టేటట్లు చేతులతో పాముకున్నాడు. మీసాలకు సంపెంగనూని రాసుకొని అవి మీదికి మెలిదిరిగేటట్లు చేత్తో మెలివేసాడు.

ఆతరువాత షరాయి, చొక్కా తొడుక్కొని గులాబీసెంటు బాగా పులుముకున్నాడు. ముస్తాబవడం పూర్తయేక....ఓసారి తలెత్తి పైకప్పు వేపు చూసాడు. నల్లని కాంతివంతమైన చిన్నకళ్ళతో తనకేసే తొండలు తేరిపార చూస్తూండడం గమనించాడు హుకుమ్‌చాంద్.

కారువస్తోందన్న చప్పుడు వినిపించిందతనికి. పీనరు పైలేసుకుంటూ వైరుగాజు తలుపుదగ్గర కెళ్ళేడు. కారుదిగి ఇద్దరు పురుషులు,

ఇద్దరు స్త్రీలు లోనికొచ్చారు. ఒకడిచేతిలో హార్మోనియం, మరొకడి చేతిలో తబలావున్నాయి. ఆ ఆడవాళ్ళలో ఒకామె తలనెరసిన ముసల్ది- ఇకపోతే ఆ రెండో ఆమె లేత యౌవనంలోయున్న యువతి. వాళ్ళంతా నెమ్మదిగావెళ్ళి తివాసీపై మఠం వేసుకొని కూర్చున్నారు.

హుకుమ్‌చాంద్ నిలువుటద్దం ఎదుట నిలబడి మరోసారి తన ముఖాన్ని చూసుకున్నాడు. తలవెంట్రుకల మొదళ్ళు నెరసివుండడం గమనించాడు. అవి అగుపడకుండా వుండేటట్లుగా జుత్తు దువ్వుకున్నాడు. ఆ తరువాత ఓ సిగరెట్ వెలిగించి అలవాటు ప్రకారం సిగరెట్ టిన్ను పై అగ్గిపెట్టెవుంచి పట్టుకున్నాడు. వైరుగాజు తలుపును సగంతెరచి, విస్కీ- పట్రమ్మని బేరర్ని ఉద్దేశించి కేకేశాడు- టేబులుపై విస్కీ-బాటి లున్నదన్న సంగతి అతనికి తెల్సు- అయినా తనొస్తున్నట్లు అవతల కూర్చొన్నవాళ్ళకు కాస్త ముందుగా తెలియజెయ్యాలనే ఉద్దేశంతో అలా కేకేశాడు.... ఆతరవాత ఆగదిలోంచి బయటకొచ్చి, ధడాలున వెనక్కా తలుపు త్రోసేశాడు. అతని చెప్పులు అతని నడకలోని హుందాతనానికి లయవేస్తూవుంటే నెమ్మదిగా బెర్తు కుర్చీ దగ్గరకొచ్చి అందులో ఆసీను డయాడు.

హుకుమ్‌చాంద్‌కి నమస్కరించడానికి ఆ మేళంలోని వాళ్ళంతా లేచి నిలబడ్డారు. ప్రక్క వాద్యగాళ్ళిద్దరూ గౌరవపురస్సరంగా వంగి సలామ్ చేశారు. ఆ దోసినోటి ముసల్ది, "తమ కీర్తిప్రతిష్ఠలు దిగ్ది గంతాలకూ వ్యాపించుగాక....! తమ చేతిమీదుగా వేలూ, లక్షలూ చలామణీ యగుగాక!" అని కాస్తా రాగయుక్తంగా స్తుతించింది. ఆ యువతి తన విశాలమయిన కాటుకకళ్ళతో అతన్ని ఒకసారి క్రీగంట చూసింది.

చేత్తో సంజ్ఞచేస్తూ, వాళ్ళందర్నీ కూర్చోమన్నాడు హుకుమ్‌చాంద్. కూర్చున్నారు వాళ్ళు- బేరర్ ఓగ్లాసులో విస్కీ-పోసి; అందులో కొంచెం

సోడా కలిపేడు. ఆ గ్లాసందుకొని ఓ గుక్కెడుత్రాగి, మీసాలను ముంతతో తుడుచుకున్నాడు. ఆ తరువాత మీసాలను ఠీవిగా మెలేస్తూ ఆ అమ్మాయి కేసి చూశాడు.

ఆ అమ్మాయి కాళ్ళకు మువ్వలు కట్టుకుంటోంది. తబలిష్టు సుత్తితో కొడుతూ శృతి సరిజేస్తున్నాడు. హార్మోనిస్టు శృతివేస్తున్నాడు— ఓ రెండు మూడు నిముషాలలో ప్రక్క వాద్యాలు సిద్ధమయేయి. ఆయువతి కాస్త ప్రక్కకెళ్ళి నోట్లోవున్న కిళ్లీని వుమ్మివేసి, ఆ తరువాత గట్టిగా రెండు మూడుసార్లు దగ్గి కఫాన్ని వుమ్మివేసింది.

"బీదలపాలిటి కల్పవృక్షమయిన తమకేది ఇష్టం....? శాస్త్రీయ సంగీతమా, లలిత సంగీతమా లేక ప్రేమగీతాలా?" అని ఆ ముసల్ది వినయంగా అడిగింది.

"శాస్త్రీయ సంగీతం మాత్రం వద్దు.... ఏవైనా సినిమాపాటలు- పంజాబీ సినిమాలోని పాటలైతే మరీ మంచిది" అన్నాడు హుకుమ్ చాంద్.

"చిత్తం! తమ అభీష్టానుసారం తమ కిష్టమయిన సినిమాపాటలే పాడతాను" అని వంగి సలామ్ చేసిందాయువతి. ఏపాట ముందు పాడదమా అని కొంచెంసేపు తన వాళ్ళతో ఆలోచించి ఓనిశ్చయానికొచ్చిందా అమ్మాయి.

"తధిగిణతోమ్" అని తబలా మ్రోగింది. హార్మోనిస్టు హార్మనీ వాయించడం మొదలెట్టాడు. తనకేమీ పట్టనట్లుగా ఆ అమ్మాయి నిశ్శబ్దంగా కూర్చుంది.

మొదటి ఎత్తుబడి వాద్యం వాయించడం వాళ్ళు పూర్తిచేసేక ఆ అమ్మాయి ఓసారి ముక్కెగబీల్చి మరోసారి గొంతుక సవరించుకుంది. ఆ తరువాత తన ఎడమచేతిని చెవి దగ్గర పెట్టుకొని రెండోచేతిని ముం

దుకు చాచి ఓ సినిమాపాట పాడింది. ఎడబాటువల్ల జనించిన విరహాగ్నికి లోనయిన హీరోయిన్ పాడిన ప్రేమగీతమది. ఆ అమ్మాయి పాడడం ఆపుచేసిన వెంటనే ఒక అయిదురూపాయలనోటును తివాసీమీదికి విసిరేడు హుకుమ్‌చాంద్.

ఆ అమ్మాయి భక్తిపురస్సరంగా వంగి సలామ్ చేసిందతనికి. ఆ ముసలమ్మ ఆ నోటును తీసి కొంగులో ముడివేస్తూ, "తమరు చిరకాలం వర్ధిల్లాలి. అభినవ దానకర్ణుడిలా అపరిమిత కీర్తి ప్రతిష్టల్ని పొందాలి!" అని స్తుతించింది.

మళ్ళీ మరో సినిమాపాట.... హుకుమ్‌చాంద్ మరింత విస్కీని గ్లాసులో పోసుకొని ఒకేఒక గుక్కలో తాగేసి మండతో మూతి మీసం తుడుచుకున్నాడు. ఆఅమ్మాయి అతనికిబాగా తెలిసిన సినిమాపాటే అప్పుడు పాడుతోంది. అయినా అతనికింకా హుషారెక్కువకాలేదు.విస్కీ దోసింకా చాలలేదు.అదీగాక పాడుతున్న ఆ అమ్మాయిని చూస్తుంటే అతనికి అతని కుమార్తె స్మృతిపథంలో మెదలింది. బ్రతికి బావున్నట్లయితే తన కుమార్తెకు సరిగ్గా ఇంతే వయసు వుండివుండేది.

అనిర్వచనీయము, అవ్యక్తము, అవాంఛనీయము అయిన పరిస్థితికి లోనయేడతను....! ఆ అమ్మాయి తన కుమార్తె వయస్సులో ఉన్నదనే భావాన్నిపోగొట్టుకోవాలనే ఉద్దేశ్యంతో మరో గ్లాసువిస్కీ తాగాడు.కాస్త మైకంలోపడి తన చేతి వ్రేళ్ళతో తొడపై లయవేస్తూ ఊగిపోతున్నాడు.

సంధ్యాసమయం గడిచింది. చీకటి పడింది- కప్పలు బెకబెకలాడుతున్నాయి. కీచురాళ్ళు గోల చేస్తున్నాయి. బేరర్ ఒక దీపాన్ని అక్కడకు తీసుకొచ్చాడు. ఆ దీపపు ప్రేము నీడ హుకుమ్‌చాంద్ మీద పడుతోంది. ఆ దీపకాంతిలో ఆ యువతిని ఓసారి నిశితంగా పరిశీలించి చూశాడు హుకుమ్‌చాంద్. ఆ అమ్మాయి మరీ అంత చెప్పుకోదగ్గ అంద

మయినది కాదు. మంచి యౌవనంలో వుంది. అంతవరకు ఎక్కడా వ్యభిచరించినట్లగుపించలేదు. ఆమె వక్షోజాలు బాడీ అంతటికీ నిండుగా వున్నాయి. పురుష స్పర్శ వాటికింకా తగిలుండకపోవచ్చు.... బహుశా తనే తన చేతులతో ప్రారంభోత్సవం.... ఛఛ....! ఏంబుద్ధి! ఇదేం పాడు బుద్ధి! ఆ అమ్మాయి తన కుమార్తెకన్నా బహుశా చిన్నదయుండొచ్చు! అలాంటామెతో తను.... తప్పు? ఆఁ.... గాడిదగుడ్డు.... తప్పేఁవిటి? ఏవేవో ఆదర్శాలకు, ఆశయాలకు, సిద్ధాంతాలకు కట్టుబడి జీవితసౌఖ్యాలకు దూరమవడం శుద్ధ తెలివితక్కువతనం.... ఆ అమ్మాయికి తన డబ్బు కావాలి! తనకు ఆమె కావాలి! ఆమెనొక వ్యభిచారిణిగా భావించి చూడ్డం వినా మరోరకంగా ఆమెను తను చూడకూడదనుకున్నాడు.

ఆమె తన కుమార్తెకంటే చిన్నదయుంటుందేమోననే భావం మరీ కలక్కుండా వుండేటందుకుగాను మరో గ్లాసుడు విస్కీ పుచ్చుకున్నాడు. ఆ అమ్మాయి ఇంకా అలా పాడుతూనేవుంది. వాద్యగాళ్ళు ప్రక్కవాద్యాలు వాయిస్తూనే వున్నారు. హుకుమ్‌చాంద్ వుండీ లేని తెలివితో వ్రేళ్ళతో తన తొడలపై లయ వేస్తున్నాడు. ఆమె చాలా పాటలు పాడింది. ఇంకా పాడనా అన్నట్లు హుకుమ్‌చాంద్ కేసి చూసింది.

"ఇంకా.... మరేవయినా క్రొత్త సినిమాలలోని పాటలు — ఉత్సాహాన్నిచ్చేవి.... రెచ్చగొట్టేవి పాడు" అని తొట్రుపడుతున్న ఉచ్ఛారణతో ఆజ్ఞాపించాడు హుకుమ్‌చాంద్.

ఆ యువతి ఇంగ్లీషుపదాలు అధికంగా దొర్లే పాటొకటి పాడుతూంటే హుకుమ్‌చాంద్ తాదాత్మ్యంచెంది, "వారేవ్వా! వారేవ్వా" అని సంతోషాతిరేకంతో ప్రశంసించసాగాడు. పాట పూర్తయిన తరువాత ఈ పర్యాయం హుకుమ్‌చాంద్ అయిదు రూపాయల నోటుని తీసి తివాసీ మీదకు విసరకుండా, దగ్గరకొచ్చి తన చేతిలోది తీసుకోమన్నాడు.

"వెళ్ళే....వెళ్ళు! ప్రభువుల దగ్గరకెళ్ళి తీసుకో" అంటూ ఆ అమ్మాయిని ముందుకు నెట్టింది ముసలమ్మ. ఆఅమ్మాయి కాస్తా జంకుతూ టేబులు దగ్గరకెళ్ళి ముందుకు చెయ్యి జాపింది నోటుకోసం.

హుకుమ్‌చాంద్ ఆ నోటుని తన హృదయానికి హత్తుకొని చిలిపిగా నవ్వసాగాడు. ఆ అమ్మాయి నిస్సహాయంగా తనవాళ్ళకేసిచూసింది. హుకుమ్‌చాంద్ నవ్వుతూ ఆ నోటుని టేబులుపై వుంచాడు. తీసుకోవడానికామె ప్రయత్నించేసరికి, మళ్ళీ నోటుని తీసుకొని తన వక్షస్థలంపై వుంచుకున్నాడు. ఇహ మరి లాభంలేదనుకొని తన వాళ్ళ దగ్గరకెళ్ళిపోయేటందుకై ఆమె వెనుదిరిగింది.

హుకుమ్‌చాంద్ తన చేతిని ముందుకుచాచి, "రా.... వచ్చి తీసుకో!" అని అన్నాడు.

అతని దగ్గరకువెళ్ళి తీసుకోడానికా అమ్మాయి సంశయిస్తూంటే, "వెళ్ళే వెళ్ళు....! సిగ్గెందుకూ? ప్రభువుల దగ్గరకెళ్ళి తీసుకో!" అని ఆదేశించింది ముసిల్ది.

ఆమె కాస్త జంకుతూ అతని దగ్గర కెళ్ళింది! హుకుమ్‌చాంద్ తనచేత్తో ఆమె నడుముని చుట్టి దగ్గరకు లాక్కుంటూ, "నువ్వు చాలా బాగా పాడేవు" అని అన్నాడు.

ఆ అమ్మాయి తన విశాలమైన నేత్రాలతో తన వాళ్ళవేపు అదోలా చూసింది.

"ప్రభువులు నీతో ముచ్చటగా మాట్లాడుతూంటే అలా మూగదానిలా మాట్లాడకుండా వూరుకున్నావేమే మొద్దుముండా?...." అని ఆ అమ్మాయిని కసిరి, హుకుమ్‌చాంద్‌వేపు తిరిగి "ప్రభూ!.... ఇదింకా చిన్నపిల్ల పాపం సిగ్గుపడుతోంది. త్వరలోనే అంతా తెల్సుకుంటుంది లెండి!" అని మనవి చేసింది.

విస్కీగ్లాసును హుకుమ్‌చాంద్ ఆ అమ్మాయి పెదవుల దగ్గరుంచి, "ఊఁ!....కొంచెం....తాగు....నా కోసం ఒక్కచుక్క....గుటకేయి!" అని లాలనగా బ్రతిమాలేడు. ఆ అమ్మాయి నోరు తెరవకుండా అయిష్టంగా నిలబడింది.

మళ్ళీ ఆ ముసలమ్మ కలుగజేసుకొని, "ప్రభూ! ఇదెప్పుడూ త్రాగ లేదు. దీనికీమధ్యనే పదహారేళ్ళు నిండేయి, వట్టి అమాయకురాలు. ఏం తెలీదు!....ఇంతకు ముందెన్నడూ ఏ పురుషుని ఎదుట ఇది ఇలా నిలబడ లేదు! కాని తమను ఆనందింప జెయ్యటంకోసం దీన్నిలా ప్రేరేపించి తీసుకొచ్చేను" అని చెప్పింది.

ఇహ ఆ ముసలిదాని మాటల్ని లక్ష్యపెట్టకూడదనుకొని, "త్రాగ డాని కభ్యంతరమైతే ఏదైనా తినడాని కభ్యంతరం వుండకపోవచ్చుగా!" అనంటూ ఓ మాంసఖండాన్ని ప్లేట్లోంచి తీసాడు. అతని చేతిలోంచా మాంసఖండాన్ని తీసుకొని తినేసిందా అమ్మాయి.

ఆ తరువాత హుకుమ్‌చాంద్ ఆఅమ్మాయిని తన వొళ్లోకి లాక్కొని ఆమె ముంగురులను నిమరసాగేడు. ఆమె జుత్తు బాగా జిడ్డోడుతూ సెల్యులాయిడ్ తలపిన్నులచే కృత్రిమంగా వంకీలు తిరిగుంది!

ముసలమ్మ, వాద్యగాళ్ళు లేచి నిలబడి, "ఇక మాకు సెలవా?" అనడిగారు.

"ఊఁ!....వెళ్ళండి!....డ్రైవరు మిమ్మల్ని మీ ఇళ్ళకు కారులో దిగబెడతాడు!" అని అన్నాడు హుకుమ్‌చాంద్.

ఆ ముసల్ది మళ్ళీ మరొకసారి "తమ కీర్తి ప్రతిష్ఠలు దిగ్దిగంతాలకు వ్యాపించుగాక, తమ చేతిమీదుగా వందలు వేలు....కాదు కాదు....వేలకొద్దీ లక్షల వరహాలు కురియుగాక!" అని స్తుతించింది. హుకుమ్‌చాంద్

ఇచ్చిన ఒక నోట్లకట్టను తీసుకొని చీరెకొంగులో ముడేసుకుంది:.... ఆ అమ్మాయిని ఆ మెజిస్ట్రేటు వాళ్లో వదలిపెట్టి మిగతా ముగ్గురూ వెళ్ళిపోయారు.

యజమాని ఆజ్ఞకోసం నిరీక్షిస్తున్న బేరర్, "భోజనం వడ్డించమంటారా బాబూ?" అనడిగేడు.

"అక్కర్లేదు. వంటకాలన్నీ టేబులుపై పెట్టేసి నువ్వెళ్ళిపో మేమేవడ్డించుకుంటాం!" అన్నాడు. వంటకాలన్నింటినీ టేబులుపై సర్దేసి బేరర్ తన క్వార్టర్సుకి వెళ్ళిపోయేడు.

భోజనానంతరం హుకుమ్‌చాంద్ లైటు ఆర్పేశాడు. బెడ్‌రూమ్‌లో పసుపుపచ్చని కాంతితో మినుకుమినుకు మని వెల్గుతోంది బెడ్‌లైటు! హుకుమ్‌చాంద్ ఆ అరుబయటే కాలక్షేపం చెయ్యడానికి నిశ్చయించుకున్నాడు....

గూడ్సు రైలుబండి మానోమజ్రాలో వదలిపెట్టవలసిన వేగన్నుని వదలిపెట్టి "పఫ్ పఫ్"మనే శబ్దంతో బయలుదేరింది. ఇంజనుయొక్క పొగగొట్టంలోంచి వెలువడుతున్న నిప్పురవ్వలు అంతకంతకు అధికమవుతూన్న ఆ ఇంజను వేగాన్ని తెలియజేస్తున్నాయి. ఆ గూడ్సు రైలుబండి బ్రిడ్జిని దాటింది. క్రమక్రమంగా దానిశబ్దం తగ్గిపోయింది! అంతా నిశ్శబ్దంగా వుంది. హుకుమ్‌చాంద్ మరో విస్కీగ్లాసు ఖాళీచేసేశాడు. ఆ అమ్మాయి అతని ఒళ్లో బిగ్రబిగుసుకుపోయి కూర్చుంది!

"నా మీద నీకు కోపంగావుందా? నాతో మాటాడవేం?" అని ఆమెను హృదయానికి హత్తుకొని లాలనగా అడిగేడు.

ఆ అమ్మాయి అతనికి సమాధానం చెప్పలేదు సరికదా, అతనివేపు చూడలేదు కూడాను. ఇంతకీ ప్రత్యేకించి ఆమె ఇష్టాఇష్టాలతో తనకేవీ సంబంధంలేదు. తనామెకు సొమ్ము చెల్లించేడు. అంచేత తనిష్టమొచ్చి

నట్లుగా ఆమెను తను అనుభవించొచ్చు. ఆమె ముఖాన్ని తనముఖం దగ్గరకు తీసుకొని ఆమె బుగ్గలపై ముద్దులవర్షం కురిపించసాగేడు. వెచ్చని ఊపిరి శబ్దం తప్ప, ఇంకేశబ్దాలు అతనికి వినిపించలేదు. హుకుమ్‌చాంద్ ఆ అమ్మాయి బాడీముడి విప్పేడు! అంతల్లో ఆ నిశ్శబ్ద నీరవ నిశీథాన్ని ఓ తుపాకి ప్రేలినశబ్దం భగ్నపరిచింది. ఆ అమ్మాయి తుళ్ళిపడి లేచి నిలబడింది.

"ఆ తుపాకిశబ్దం నువ్వు విన్నావా?" అని హుకుమ్‌చాంద్ అడిగేడా అమ్మాయిని.

ఆమె విన్నట్లుగా తల ఊపుతూ "ఎవడో వేటగాడ యుంటాడు" అని సమాధానమిచ్చి తనబాడీ మళ్ళీ ముడేసుకుంది. ఆ అమ్మాయి అతనితో మాట్లాడడం అదే మొదటిసారి!

ఆ ఉభయులూ కొంతసేపలా ఆ నిశ్శబ్ద వాతావరణంలో మౌనంగా కూర్చున్నారు. విస్కీవాసన, పొగాకు వాసన, పయోరియావాసన కొడుతున్న ఆ కాముకుడి ముద్దులబారినుండి ఆమెకు కొంచెంసేపు విముక్తి లభించింది. వాతావరణమంతా నిశ్శబ్దంగా వుండడంవల్ల అంతా సవ్యంగానే వున్నట్లు భావించాడు హుకుమ్‌చాంద్. మరో విస్కీగ్లాసు ఖాళీచేసి, బాగా ఉద్రిక్తుడయేడు. ఇహమరి తప్పించుకొనే అవకాశం లేదని ఆ అమ్మాయి గ్రహించింది. హుకుమ్‌చాంద్ తన చేతులతో ఆ అమ్మాయిని చుట్టి, బుగ్గలపై తనివితీరా ముద్దాడి "మనం పెళ్ళి చేసుకుందామా?" అని ఆ అమ్మాయి ముఖంలోకి ఆదోలా చూసేడు. ఆమె ఏఁవీ సమాధానమివ్వలేదు. అంతల్లో మానోమజ్రా గ్రామం వేపునుంచి మనుష్యుల ఆర్తనాదాలు, అరుపులు, కేకలు వాళ్ళకు వినిపించేయి! కుక్కలు మొరుగుతున్నాయి. ఏదో గోల వినిపిస్తోంది. హుకుమ్‌చాంద్ తలెత్తి పైదికి చూసేడు. తుపాకీ రెండుసార్లు ప్రేలింది.

కుక్కల మొరుగులు మరి వినిపించలేదు. ఆర్తనాదాలు మరి వినిపించలేదు.

నిశ్శబ్దం!

భారంగా ఊపిరితీస్తూ హుకుమ్‌చాంద్ ఆ అమ్మాయి నొదిలిపెట్టి లేచి నిలబడ్డాడు. ఆ అమ్మాయి చీరె సరిగ్గా కట్టుకొని దుమ్ముదులుపుకుంది.

సేవకుల క్వార్టర్సులోంచి బేరరు దీపం పట్టుకొని గాభరాగా బయటకొచ్చేడు! డ్రైవర్ అదే సమయంలో కారు తీసుకొని వచ్చేడు. ఆ కారు యొక్క హెడ్‌లైట్ల కాంతిలో ఆ రెస్టుహౌస్ ముందుభాగమంతా ప్రకాశవంతమయింది.

5

ఆ గ్రామంలో దోపిడీ జరిగిన మర్నాడుదయం ఆ గ్రామ రైల్వే స్టేషను మామూలు రోజులలోకన్నా రద్దీగావుంది.

కొంతమంది మానోమజ్రా గ్రామస్తులకో అలవాటుంది. ఉదయం పదిన్నరగంటలకు ఢిల్లీనుంచి లాహోరుపోయే స్లో పాసింజర్ రైలుబండి వచ్చేవేళకు స్టేషను దగ్గరకెళ్ళి ఎక్కేవాళ్ళను దిగేవాళ్ళను చూస్తూండడం వాళ్ళకలవాటు-! అంతేకాక ఆపాళ రైలుబండి ఎంత ఆలస్యంగా వచ్చింది- అసలెప్పుడైనా వేళకొచ్చిందా లేదా ఇలాంటి విషయాలగురించి చర్చించు కోడం వాళ్ళకోరకమయిన కాలక్షేపం....దేశం విభజింపబడిన దగ్గరనుంచి వాళ్ళలో ఈ ఆసక్తి మరీ అధికమయింది. కొంత కాలం నుంచి రైలు బండి తరచుగా నాలుగైదు గంటలు, ఒక్కొక్కప్పుడు ఇరవై గంటలు లేటుగా వస్తూండడం కద్దు! అవి ఏవేళకొచ్చినా- పాకిస్తాన్‌నుంచి వచ్చే వయితే హిందూ, సిక్ శరణార్థులతోను- పాకిస్తాన్‌కి వెళ్ళేవయితే ముస్లిమ్ శరణార్థులతోను నిండివుంటున్నాయి.

ఫుట్‌బోర్డుమీద, పైకప్పులమీద, బోగీకి బోగీకి మధ్యగల బఫర్ల మీద ఎక్కడ పడితే అక్కడే ప్రయాణీకులు! ముఖ్యంగా పైకప్పులమీదా, బఫర్లమీదా ప్రయాణంచేసే ప్రయాణీకుల సాహసం గమనించ దగ్గది....! ప్రాణభీతిచే ప్రేరేపింపబడే సాహసమది!

ఆవాళ రైలుబండి ఓగంట లేటుగా వచ్చింది. రైలుబండి ఎక్కేదిగే ప్రయాణీకుల- తినుబండారాలు, పాన్ బీడి చుట్టా సిగరెట్లు - టీ మొద లగునవి అమ్మేవాళ్ళ గోల కొంతసేపటికి తగ్గింది. ఇంజను వెనకాలగల కంపార్టుమెంటులోంచి పన్నెండుమంది సాయుధ రక్షకభటులు, ఒక సబ్ఇనస్పెక్టరు దిగేరు.

ఆఖరి కంపార్టుమెంటులోంచి, అంటే గార్డు పెట్టెకి ముందుగల కంపార్టుమెంటులోంచి, తెల్లచొక్కా, మామూలు సాదానూలు వేస్టుకోటు, బాగా వదులుగావుండే షరాయి తొడుక్కున్న యువకుడొకడు హోల్డాల్ చేత్తోపట్టుకొని నెమ్మదిగా దిగేడు. చెదరిన జుత్తుని చేత్తో సరిచేసుకుంటూ ఓ సారి చుట్టూ కలయజూసేడు....!అతను కాస్త బక్కపల్చగా వున్నాడు. బయటకు చూడ్డానికి పిరికివాడిలా అగుపిస్తున్నాడు!

పోలీసువాళ్ళ దృష్టి అతనిమీద పడింది! తన ఎడమభుజం మీదికి హోల్డాల్‌ని ఎత్తుకొని నాజూగ్గా నడుస్తూ గేటువైపు బయలుదేరేడా యువ కుడు. పోలీసువాళ్ళుకూడా గేటువేపు బయలుదేరేరు. రైలుబండి వెళ్ళి పోయింది.

ఆ రైల్వేస్టేషనులో స్టేషనుమాష్టరే గేటుదగ్గర నిలబడి సాధార ణంగా టిక్కెట్లు వసూలుచేస్తూంటాడు. ప్రత్యేకంగా టిక్కెట్లు వసూలు చెయ్యడానికి టిక్కెట్ కలక్టరు వుండడు! ఆ యువకుడు పోలీసువాళ్ళ కన్నా కాస్త ముందుగా ఆ గేటుదగ్గరకుపోయి స్టేషనుమాష్టరికి పోలీసు లకు మధ్య నిలబడ్డాడు.

స్టేషన్ మాస్టర్ అతని దగ్గరనుంచి వేగంగా టిక్కెట్ తీసుకొని "ఇహ నువ్వు బయటకు పో!" అన్నట్లతనివేపు చూసేడు, కాని ఆ యువకుడు అక్కడలాగే నిలబడి "అయ్యా స్టేషనుమాస్టరుగారూ! ఈ గ్రామంలో వుండడానికి నాకేదయినా బస దొరుకుతుందా?" అనడిగేడు.

వెనకాల పోలీసుపార్టీవుంది. వాళ్ళకి దారివ్వకుండా మధ్యని అడ్డుగా వీడొకడు! స్టేషనుమాస్టరికి వొళ్ళుమండింది! కాని ఆ యువకుడి వేష భాషల్నిబట్టి అతనొక చదువుకున్న పట్నవాసపునాగరికు డయుంటాడనే అనుమానం ఆ స్టేషను మాస్టరికి కల్గడంచేత, కోపాన్ని అణచుకొని "ఈ మానోమజ్రాలో హోటేళ్ళుగాని, సత్రవులుగాని లేవు, కాని గ్రామం మధ్య ఒక సిక్కు దేవాలయం వుంది." అని సమాధాన మిచ్చేడు.

"థ్యాంక్యూ సార్!" అని ఆ యువకుడు వెళ్ళిపోయేడు. సబ్ ఇనస్పెక్టరికి గౌరవపురస్సరంగా నమస్కరించి గేటు బార్లా తెరచేడు స్టేషనుమాస్టరు, ఆ పోలీసు పార్టీఅంతా అవతలకెళ్ళడానికి వీలుగా!

ఆయువకుడి వేపు పోలీసువాళ్ళు స్టేషనుమాష్టరు సంశయాస్పదంగా చూసేరు!.... ఈ "థ్యాంక్యూ" గాళ్ళలో అధిక సంఖ్యాకులు విజాతీయ విద్యచే ప్రభావితులైన స్వధర్మ భ్రష్టులని వాళ్ళ అభిప్రాయం. విదేశాలలో చదువులు వెలగబెట్టి వచ్చిన ఐశ్వర్యవంతుల బిడ్డలు— గ్రామాభ్యుదయానికి కృషిచేస్తామనంటూ, గ్రామాలకు వస్తూండడం కద్దు! వాళ్ళలో కొంతమంది కమ్యూనిష్టుపార్టీ ఏజెంట్లుగా గుర్తింపబడుతూంటారు. తమాషా ఏ౦విటీఅంటే వాళ్ళల్లో కొంతమంది గొప్ప లక్షాధికార్ల, గవర్నమెంటు ఉన్నత అధికార్ల కొడుకులై వుండడం! అరాచకాన్ని, అలజడిని సృష్టించడానికి ఇలాంటి వాళ్ళంతా ఎంతో సమర్థులు!....ఇలాంటి వాళ్ళతో చాలా జాగ్రత్తగా వ్యవహరించాల్సొంటుందని ఆ పోలీసువాళ్ళనుకున్నారు.

ఆ పోలీసువాళ్ళకు కొద్ది గజాల ముందునుంచా యువకుడు నడుస్తూ పోతున్నాడు. వాళ్ళ దృక్పథంలోంచి తప్పించుకోడం అతని కసాధ్య

మయింది. వాళ్ళు తనను గమనిస్తూ తనగురించే మాట్లాడుకుంటున్నట్లు అర్థం చేసుకున్నాడతను. అయినాసరే అక్కడ నిలబడ్డంగాని వెనక్కి తిరిగి చూడ్డంకాని చెయ్యలేదతను.

వాళ్ళంతా మానోమజ్రా గ్రామంలోకి ప్రవేశించేరు. రావిచెట్టుక్రింద గల కర్రదూలాలపై ఓ అరడజనుమంది కూర్చొని బాతాఖానీ చేస్తున్నారు. పోలీసువాళ్ళను చూసీచూడ్డంతోనే వాళ్ళంతా గబుక్కున లేచి నిలబడి వాళ్ళతోపాటు రామ్‌లాల్ ఇంటికెళ్ళేరు. ఆ సందట్లో వాళ్ళెవరూ ఆ క్రొత్తయువకుడిని గమనించలేదు. ఆ యువకుడు సిక్కు దేవాలయపు ప్రాంగణంలో అడుగుపెట్టేడు. అక్కడొక నుయ్యి వుంది .... ఎవరో బట్టలుతుకుతున్న చప్పుడతనికి వినిపించింది. నూతిగోడ అడ్డుగా వుండడంవల్ల ఎవరు వుతుకుతున్నదీ అతనికి కనిపించలేదు. కాస్త జంకుతూ నూతి రెండో ప్రక్కకు వెళ్ళేడా యువకుడు.

సిక్కుమతానికి చెందిన ఓ వృద్ధు డాయువకుణ్ణి చూసి.... "సత్ శ్రీ అకల్!" అని అన్నాడు.

ఆ యువకుడు కూడా "సత్ శ్రీ అకల్!" అని అన్నాడు. కొంచెం సేపు మౌనంగా వూరుకొని "రెండు మూడు రోజులపాటు నే నిక్కడుండడానికి తాము సమ్మతిస్తారా?" అనడిగేడు.

"పవిత్రమైన గురుద్వారా ఇది! గురూ ఇల్లు ఇది. ఎవరైనా సరే ఇక్కడ వుండొచ్చు! కాని తాము తలకు తలపాగా చుట్టుకోవాల్సి వుంటుంది. ఇకపోతే చుట్టలు, బీడీలు, సిగరెట్లు ఇట్లాంటివేవీ లోపలకు తేకూడదు. కాల్చకూడదు."

"అలాగే! కాల్చను!" అనంటూ హోల్డాల్ క్రిందపెట్టి జుత్తగుపడనీయకుండా తన తలకు పాకెట్ రుమాలుని ఆ యువకుడు చుట్టుకుంటూంటే—

"ఇప్పుడవసరం లేదు బాబుగారూ ....! పవిత్ర గ్రంథమయిన "గ్రంథసాహెబ్"ని సన్నిహితంగా దర్శించడానికి వెళ్ళేటప్పుడు మాత్రమే తాము జాగ్రత్తపడనీయకుండా తలపాగా చుట్టుకోవాల్సుంటుంది. అదిసరే గాని ముందు తమ సామాన్లను ఆ గదిలో పెట్టుకోండి. ఆ....అన్నట్లు తమభోజనంఅదీ?"

"నేను తెచ్చుకున్నాను. తమ ఆదరాభిమానాలకు కృతజ్ఞుడను!" అని అన్నాడాయువకుడు.

ఆ వృద్ధుడా యువకుడికి నుయ్యి వెనకాలనున్న ఓ ఖాళీగదిని చూపించేడు. ఆ యువకు డాగదిలోకెళ్ళేడు. ఆ గదిమధ్య ఓ మంచం వుంది. గోడపై గురునానక్ ఫొటోగల కేలండరు వ్రేలాడుతోంది. ఆ కేలండరుప్రక్క బట్టలు తగిలించుకోడానికి మేకులున్నాయి. అతను మొదట డ్రస్సు మార్చుకున్నాడు. ఆ తరువాత హోల్డాలులోంచి వెన్న డబ్బా, నెయ్యిడబ్బా బిస్కట్ల డబ్బా బయటకు తీసేడు. వాటర్ బాటిల్ గిలకరించిచూసేడు. అది ఖాళీ....

వ్రేళ్ళతో గెడ్డాన్ని దువ్వుకుంటూ ఆ వృద్ధు డక్కడకు వచ్చి గడపమీద కూర్చొని "తమపేరేమిటి బాబూ" అని అడిగేడు.

"ఇక్బల్....! మరి మీ పేరు."

"ఓ ఇక్బల్ సింగా....? నేను ఈ దేవాలయ పూజారిని....నాపేరు భాయిమీట్‌సింగ్! అయితే ఇక్బల్‌సింగ్‌జీ ! ఏంపనిమీద తమరు మావూరు వచ్చేరు?"

అతని రెండోప్రశ్న. మొదటిప్రశ్నకు సమాధాన మివ్వాల్సిన అవసరం ఇక్బల్‌కి లేకపోయింది! తను ఏ ఇక్బలో చెప్పాల్సిన అవసరం మరి లేకపోయినందుకు అతను లోలోన కాస్తా సంతోషించేడు.

ముస్లిమ్ అయితే ఇక్బల్ మొహమ్మద్! హిందూ అయితే ఇక్బల్ చాంద్: సిక్కు అయితే ఇక్బల్‌సింగ్! "ఇక్బల్" అనేది పై మూడు మతాలవారూ సామాన్యంగా పెట్టుకునే బహుకొద్ది పేర్లలోనూ ఒకటి. సిక్కు గ్రామాలలో ఇక్బల్‌సింగ్ నామధేయుడు గెడ్డం, తలపాగా ఇవేవీ లేకపోయినా, ఇక్బల్ మొహమ్మద్ ఇక్బల్ చాంద్‌లకంటే అధికంగా ఆదరింపబడతాడు.

"భాయీజీ! నే నొక సాంఘిక కార్యకర్తను. మన గ్రామాలు చాలా వెనుక బడున్నాయి. చెయ్యవలసిన సాంఘిక సంస్కరణలెన్నో వున్నాయి. ఇప్పుడు దేశవిభజన కారణంగా మతకలహాల మారణ హోమం జరుగుతోంది. ఎవరో ఒకరు ఇందుకు పూనుకొని ఈ దారుణ మారణహోమాన్ని ఆపుచెయ్యాల్సిన అవసరం ఇప్పుడెంతయినా వుంది. కాందిశీకుల కార్యకలాపాలకు సరిహద్దుల్లో జీవనాడిలావున్న ఈ గ్రామానికి మా పార్టీవారు నన్ను పంపేరు: ఇక్కడ దురదృష్టకరమైన సంఘటనలేవయినా జరుగుతాయేమోననే అనుమానంతో!"

ఇక్బల్ చెప్పుకున్న యీ వృత్తి భాయిమీట్‌సింగ్‌కి ఏమంత నచ్చినట్లు లేదు; అందుకనే ఆ రకమైన సంభాషణలోంచి మళ్ళింపజెయ్యాలనే ఉద్దేశంతో, "ఇక్బల్‌సింగ్‌జీ! తామెక్కడ నుంచొస్తున్నారు?" అని అడిగేడు.

ఆ ప్రశ్న తన పూర్వీకులను దృష్టిలో పెట్టుకొని అత నడిగుంటాడనే వుద్దేశంతో, "ఇప్పుడు పాకిస్తానులోవున్న జీలమ్‌జిల్లాకు చెందిన వాడిని నేను....! కాని నేను చాలాకాలం విదేశాలలో వున్నాను. ప్రపంచాన్నంతా చూసిన తరువాత మనం ఎంత వెనుకబడున్నదీ తెల్సుకున్నాను. అందుకనే మన యీ దేశంలో సాంఘికసేవ చెయ్యడానికి నేను నిశ్చయించుకున్నాను" అని అన్నాడు ఇక్బల్.

"ఇందుకని వాళ్ళు తమకెంతిస్తారు?"

"అబ్బే....!చాలా తక్కువ....! ఏదో నా ఖర్చులకు సరిపడ్డంత ఇస్తారు."

"మీ భారా! పిల్లల్ని పోషించడానికి చాలినంత ఇవ్వరా?"

"ఇవ్వరు భాయీజీ ఇవ్వరు! అసలింతకీ నేనింకా అవివాహితుణ్ణి..! నిజానికి నేను...."

"ఇంతకీ తమ వయస్సెంత?"

"ఇరవై యేడు....! అదిసరేగాని ఇంతకుముందింకెవరైనా సోషల్ వర్కర్సు ఈ గ్రామం వచ్చేరా!"

"అమెరికన్ పాదరీలు అప్పుడప్పుడొస్తూంటారు!"

"మీ యీ గ్రామంలో వాళ్ళు చేసే క్రైస్తవమత ప్రచారం మీకు నచ్చుతుందా?"

"ఎవరి మతాన్ని వారు నిరభ్యంతరంగా మా యీ గ్రామంలో ప్రచారం చేసుకోవచ్చు....! ఈ ప్రక్కనే ముస్లిముల మసీదుంది! నేనిక్కడనుంచి భగవంతుని ప్రార్థిస్తూంటే- అక్కడ మసీదులో ఇమామ్ బక్షమాఁవ అల్లాని ప్రార్థిస్తూవుంటాడు. అయితే మరి నాకు తెలీకడుగు తాను; యూరప్ దేశంలో ఎన్ని మతాలున్నాయి?"

"ఏవో కొన్ని శాఖాభేధాలున్నా మొత్తంమీద వాళ్ళంతా క్రిష్టియన్లే....! మన వాళ్ళలాగ వాళ్ళు మతం గురించి మతకలహాలాడుకోరు! నిజానికి మతం గురించి వాళ్ళంత పెద్దగా పట్టించుకోరు."

"నేనలాగే విన్నాను! అంచేత వాళ్ళకు నీతినియమాలు లేవు. అక్కడ ఆలుమగలు తరచు విడాకులిచ్చుకుంటూంటారని- ఒకరి భార్య నొకరు లేవదీసుకుపోతుంటారని విన్నాను! ఇది మంచిదనేనంటారా? నీతి నిజాయితీలతో కూడినదనేనంటారా?"

"కాని వాళ్ళు సాధారణంగా అబద్ధాలాడరు. మనవాళ్ళలో చాలా మంది లాగ లంచగొండులు, వంచకులుకారు!" అనంటూ టిన్ఓపెనర్‌తో చేపలడబ్బా మూత తీసేడు. కొన్ని చేపల్ని బిస్కట్లపై వేసి- వాటిని బిస్కట్లతో నంజుకొని తింటూ, "మీత్‌సింగ్‌జీ....! ఈ నీతనేదుంది చూసేరూ ఇది కేవలం డబ్బుకి సంబంధించినట్టిది! దరిద్రులు నీతిని పోషించలేరు. అందుకనే వాళ్ళపై మతమనే మత్తుమందు జల్లబడింది. అసలు మన మొట్టమొదటి సమస్య ఏవిటి అంటే దారిద్ర్యాన్ని నిర్మూలించడం....! అంటే అందరికీ కడుపునిండా తిండి, వంటినిండా కప్పుకోవడానికి బట్ట, ఉండదానికి ఇల్లు ఇవ్వగలగాలి....! ఇది ధనవంతుల్ని, భూస్వాముల్ని అంతమొందించడంవల్ల సాధ్యమవుతుంది....! వాళ్ళని అంతమొందించడానికి విప్లవం అవసరం!" అని అన్నాడు ఇక్బాల్.

మీత్‌సింగ్ ఒక రకమయిన చీదరింపుతో కూడిన విభ్రాంతితో అతను చేపల్ని తల, తోకలతో పూర్తిగా తింటూండడం గమనిస్తున్నాడు. బిస్కట్లు తెగతింటూ అతను గ్రామాల దివాళాకోరు పరిస్థితి గురించి, సగటు జాతీయ ఆదాయంగురించి, ధనవంతుల దౌర్జన్యపూరితమైన దోపిడీ గురించి ఇస్తున్న ఉపన్యాసాన్ని మీత్‌సింగ్ ఏమంత ఆసక్తితో వినలేదు.

మీత్‌సింగ్ నీళ్ళు తేవడానికి అక్కడినుంచి లేచి వెళ్ళిపోయేటంతవరకూ ఇక్బాల్ అలా ఏదో వాగుతూనేవున్నాడు. మీత్‌సింగ్ ఓ చెంబుతో కుండలోని చల్లని నీళ్ళు పట్టుకొచ్చాడు.

ఇక్బాల్ తన జేబులోంచి ఓ సెలిఫోన్ పేపరు పేకట్టుని బయటకు తీసి, అది విప్పి అందులోంచి ఓ చిన్న తెల్లని మాత్రను బయటకుతీసి నీళ్ళగిన్నెలో వేశాడు. నల్లగా మురికిగావున్న మీత్‌సింగ్ యొక్క బొటనవ్రేలి గోరు నీళ్ళు తెస్తున్నప్పుడు ఆ నీళ్ళలో మునిగివుండడం ఇక్బాల్ చూశాడు. ఏది ఏమయినా అది అపరిశుద్ధమైన నీరని అతని అభిప్రాయం.

ఆమాత్ర నీళ్లో కరిగేటంతవరకూ అతను నిరీక్షించడం చూసి "మీకు వంట్లో బాగాలేదా?" అనడిగాడు మీట్‌సింగ్.

"ఉహూ! తిన్న ఆహారం బాగా జీర్ణమవడానికిది తోడ్పడుతుంది. భోజనానంతరం సాధారణంగా నాబోటి పట్నవాసపువాళ్ళకిది అవసరం." అని కొంచెంసేపాగి మళ్ళీ ఇక్బల్ ప్రారంభించాడు. "వీటన్నిటికీతోడు మన పోలీసు సిస్టమ్ ఏమీ బాగులేదు.... ప్రజలకు రక్షణ కల్పించడానికి మారుగా వాళ్ళని పీడిస్తూ, లంచగొండులుగా జీవిస్తున్నవాళ్ళ సంఖ్యే అధికం. నాకు తెల్సు: మీకీ విషయాలన్నీ బాగా తెల్సునని" అనిఅన్నాడు.

అంగీకరించినట్లుగా అతను తలూపాడు. అతనింకా ఆవిషయంపై ఏమీ వ్యాఖ్యానించకముందే "నాతోపాటు ఇదే రైలుబండిలో కొంతమంది పోలీసులు, ఒక సబ్ఇనస్పెక్టరు వచ్చారు. ఇహ ఈ పుళ్ళోగల కోడిపెట్ట లన్నింటినీ వాళ్ళు తినేస్తారనడానికి ఏమీ సంశయించనక్కర్లేదు. ఈ పుళ్ళో కొద్దో గొప్పో సంపాదించుకొని ఆ తరవాత ప్రక్కవూరిమీద పడ తారు. వాళ్ళు ప్రజల కొరగబెట్టేదేమీలేదని, నిలువునా ప్రజల్ని దోచుకు తినడానికలవాటు పడ్డారనీ ప్రతిఒక్కరికీ తెలుసు."

ఏదోపరాగ్గా వింటున్నమీట్‌సింగ్ శ్రవణేంద్రియాలలో "పోలీసులు" అనే శబ్దం పడేసరికి జాగ్రదావస్థలోకొచ్చి "అయితే యీ గ్రామానికి పోలీసువారొచ్చారన్నమాట. నేనెళ్ళి వాళ్ళేం చేస్తున్నదీ చూసొస్తాను. బహుశ వాళ్ళు రామ్‌లాల్ ఇంటిదగ్గర వుండుంటారు. క్రిందటి రాత్రి అతన్ని ఎవరో హత్యచేసి ఇంట్లోగలడబ్బు ఆభరణాలు దోచుకుపోయారు. ఈ గురుద్వారాకు ఎదురుగా అగుపిస్తున్నదే అతని ఇల్లు. ఆ దోపిడీ దొంగలు చాలా డబ్బు దోచుకున్నారు. సుమారు అయిదువేలరూపాయల విలువచేసే వెండి, బంగారు ఆభరణాలను దోచుకున్నట్లు ఆ ఇంట్లోని ఆడవాళ్ళు చెపుతున్నారు" అంటూ లేచి నిలబడి, "నేనక్కడకు వెళ

తాను. బహుశా మా గ్రామస్తులంతా యీపరికి అక్కడే వుండుంటారు. వైద్యపరీక్షకై బహుశా శవాన్ని వాళ్ళు తీసుకెళతారు. ఎవడయినా ఖూనీ చెయ్యబడితే వాడు చచ్చాడని డాక్టరు సర్టిఫికేటు ఇచ్చేటంతవరకూ వాడిని దహనపరచకూడదట" అని మందస్మిత వదనంతో అన్నాడు.

"హత్యా? ఏం? అతనెందుకు హత్య గావించబడ్డాడు?" ఏదో దెబ్బ తిన్న వాడిలా నిర్ఘాంతపోయి అడిగాడు ఇక్బాల్. ఇంతవరకూ మీట్‌సింగ్ తమ గ్రామస్తుడొకడు హత్య గావించబడ్డాడనే విషయం ప్రస్తావించక పోయినందుకు చాలా ఆశ్చర్యపడ్డాడు. "ఇది మత విద్వేషాలకు సంబంధించిన హత్యా....? అయితే ఇక్కడ నేను చేసేపని ఏమీ వుండక పోవచ్చు" అని అన్నాడు.

భాయి మీట్‌సింగ్ నవ్వుతూ— "అదేమిటలా అంటున్నారు బాబుగారూ...? ఈ ప్రాంతంలో హత్యాకాండను ఆపుజెయ్యడానికేగా తామిక్కడకు వచ్చారు.... మరటువంటప్పుడు ఊళ్ళో ఓ హత్య జరిగినంత మాత్రంతో తామిలా నిరుత్సాహపడితే ఎలా?" అనడిగి కొంచెంసేపు వూరుకొని "బాబుగారూ! తామీ మానోమజ్రా గ్రామంలో ఇక సురక్షితంగా వుండగలరు. ఎంచేతంటే దోపిడీదొంగలు ఏ గ్రామానికయినా సంవత్సరంలో ఒక్కసారి మాత్రమే వస్తారు. అంతకంటే ఎక్కువసార్లు రారు. మరి కొన్ని రోజులు పోయేక మరోగ్రామంలో దోపిడీజరగవచ్చు.. అప్పుడు యీ దోపిడీసంగతి ప్రజలు మరచిపోతారు.... సాయంకాలం ప్రార్థనానంతరం ఏదో ఒకరోజు రాత్రి ఓ సమావేశాన్ని ఏర్పాటుచేస్తాము. తాము చెప్పదల్చుకున్న విషయాలేవయినావుంటే ఆ సమావేశంలో చెప్పండి. ఇప్పుడు మీరు విశ్రాంతి తీసుకోండి. నేనక్కడకువెళ్ళి ఏం జరిగిందీ తెల్సుకొని మళ్ళీ వచ్చి మీకంతా చెపుతాను" అనంటూ భాయి మీట్‌సింగ్‌వెళ్ళిపోయాడు. కాశీదబ్బాను, దబ్బామూతను, కత్తిని, ఫోర్కును పట్టుకొని కడగడానికి నూతిదగ్గరకెళ్ళాడు ఇక్బాల్.

ఆ మధ్యాహ్నం నిద్రపోవాలనే సంకల్పంతో ఇక్బాల్ ఆగదిలో గల మంచంమీద నడుం వాల్చాడు. ఆ క్రితంరాత్రి అతనికి నిద్రలేదు.... ఆ రాత్రంతా అతను ప్రయాణీకులతో బాగా కిక్కిరిసివున్న థర్డుక్లాసు కంపార్టుమెంటులో తన బెడ్డింగ్‌పై కూర్చొని గడిపాడు. కాస్త ఇలా కునుకుపట్టేవేళకి ఏదో ఓ స్టేషనులో ప్యాసింజరు ఆగేది. ఎక్కేవాళ్ళ, దిగేవాళ్ళ గోలతో మెలకువ వచ్చేసేది.... ఏభై మంది ప్రయాణీకుల కోసమని నిర్మింపబడ్డ కంపార్టుమెంటులోకి రెండువందల మందికి పైగా ఎక్కితే ఇహ ఎవరికి మాత్రం ఏం నిద్రపడుతుంది?

గోల.... ఒకటేగోల! తల్లి వొడిలో నిద్రపోతున్న పిల్ల అకస్మాత్తుగా మేలుకొని ఆ తల్లి స్తన్యం ఇచ్చేటంతవరకూ ఒకటేగోల....! మరుగుదొడ్డికెళుతూ ఎవడో కాలు మట్టేశాడని గోల....

జట్టీ....! దెబ్బలాట....! ఉద్రిక్తత....! ఆ ఉద్రిక్తతను ఉపశమింప జెయ్యడం కోసం ప్రయత్నించేవారి గోల మరికొంత! ఇహ ఆ గోలలో నిద్రపట్టే అవకాశం మరి లేదనే అభిప్రాయంతో పుస్తకం చదవడానికి ప్రయత్నిస్తే దానికీ ఆటంకమే....

తన ప్రక్కని కూర్చున్నవాడు, "ఓ! మీరు చదువుతున్నారా?" అని అడిగాడు.

"ఊఁ.... చదువుతున్నాను" తన సమాధానం.

"ఏమిటి చదువుతున్నారు?"

"పుస్తకం." ఈ సమాధానం అతనికి నచ్చలేదు. ఆ పుస్తకాన్ని తన చేతుల్లోంచి లాక్కొని పట్టినే పేజీలు తిరగవేస్తూ "ఇంగ్లీషా?" అని అడిగాడు.

"ఔను.... ఇంగ్లీషే"

"మీరు విద్యావంతులయుంటారు!"

దీనిపై తన వ్యాఖ్యానం అనవసరం! ఆ పుస్తకం అలా చాలా మంది చేతుల్లోకి వెళ్ళింది. తను మహా గొప్పవాడేమో అన్నట్లు వాళ్ళంతా తనవేపు అదోలా చూశారు.

"బాబూ! తమ పేరేమిటి" ఎంతో గౌరవపురస్సరంగా అడిగాడొకడు.

"ఇక్బల్!"

"మీ ఇక్బల్ (కీర్తి) అభివృద్ధి చెందుగాక" అని ఆశీర్వదించాడొకడు. వాళ్ళకి తనొక ముస్లిమ్‌లాగ అగుపించాడు.... అదేవిధంగా ఆ కంపార్టుమెంటులో వున్నవాళ్ళంతా పాకిస్తాన్‌కు పోతున్న ముస్లిములలాగే తన కళ్ళకగుపించారు.

"బాబుగారూ తమ ఆస్తిపాస్తులన్నీ ఎక్కడున్నాయి?"

"జీలమ్‌జిల్లాలో." ఈ సమాధానంతో తను ముస్లిమే అయుంటాడనే వాళ్ళ అభిప్రాయం ధృవపడింది. జీలమ్ పాకిస్తానులోవుంది.

ఆ తరువాత మిగతా ప్రయాణీకులుకూడా తనను 'క్రాస్ ఎగ్జామిన్' చేశారు. తనంతవరకూ ఏం చేసినది- ఏం చేస్తున్నది- ఆదాయం వచ్చేమార్గం- తనకుగల విలువ- తనెక్కడ చదివినది- తనెందుకు పెళ్లి చేసుకోలేదో ఇలాంటి వివరాలన్నీ వాళ్ళకి చెప్పాల్సిన దౌర్భాగ్యస్థితి తనకు పట్టింది.

వాళ్ళలో కొంతమంది వాళ్ళ స్వంత గృహఛిద్రాలగురించి, సంకటాల గురించి తెలియజేసి తన సలహా కోరారు. వేకువఝాము వరకూ వాళ్ళలా ఆ సంభాషణను కొనసాగించారు. నిద్రపోవడానికి గాని, చదువుకోవడానికి గాని మరి తను ఆ రైలుబండిలో ప్రయత్నించలేదు.

మానోమత్రాలో దిగిన తరువాత ఓసారి భారంగా నిట్టూర్చి "హమ్మయ్య" అని అనుకున్నాడు. ఇంతకీ చెప్పొచ్చేదేమిటీ అంటే- అతనికి తొలినాటి రాత్రంతా నిద్రలేదని!

అయినాసరే ఆవాళమధ్యాహ్నం ఇక్బాల్‌కి నిద్రపట్టలేదు. ఆగదిలో వాయు ప్రసారపుటేర్పాట్లులేవు. నేల అదొకరకమయిన కంపుకొడుతోంది. నిలవపెన్న అంటుకొనివున్న చింకి గుడ్డలపై ఈగలు "ఝుమ్" అని ముసురుతున్నాయి. అయినా సరే ఎలాగోవోలా ఓ కునుకుతీద్దామని ఇక్బాల్ ప్రయత్నిస్తూండగా భాయి మీట్‌సింగ్ ఓ వేదాంతిలా, "ఎంత ఘోరం! ఎంత ఘోరం! తన స్వంత వూరువాడినే దోపిడీ చెయ్యడం, కన్నతల్లిని దోపిడీ చెయ్యడంతో సమానమయినట్టిది.... ఇక్బాల్ సింగ్‌జీ! ఇది కలియుగం! మీ రెప్పుడైనా విన్నారా స్వంతవూరివాళ్ళను దోచుకునే దోపిడీ దొంగలగురించి? ఇప్పుడీ ప్రపంచంలో ఎక్కడా నీతనేది లేదు!" అక్కడికొచ్చి వాపోయేడు.

ముఖంపై కప్పుకొనివున్న చేతి రుమాలును ప్రక్కకు తొలగించి "ఏం జరిగింది?" అడిగేడు ఇక్బాల్.

మీట్‌సింగ్ ఆశ్చర్యాన్ని ప్రకటిస్తూ, "ఏం జరిగిందని అడుగుతున్నారా....? తామడగవలసిన ప్రశ్న అదికాదు! ఏం జరగలేదని అడగండి-! జుగ్గా కోసం పోలీసులు వెళ్ళేరు. జుగ్గా పదోనెంబరు బద్మాష్! (పోలీసువారు పదోనెంబరు రిజిష్టరులో దుష్ప్రవర్తనగల వారి పేర్లు నమోదు చేస్తారు.) కాని జుగ్గా ఎక్కడికో పారిపోయేడు. ఆ దోచుకున్న వాటిలో ఒకటైన గాజుల పేకట్టు వాడింటి వాకిట్లో కనుగొనబడింది. దీనినిబట్టి యీ నీచానికెవడు ఒడిగట్టేదో పోల్చుకోవచ్చు....! అసలు వాడి రక్తంలోనే వుందాగుణం! వాడి తండ్రీ, తాతాకూడా దోపిడీదొంగలే! వాళ్ళు హంతకులని ఋజువవడంవల్ల ఉరితీయబడ్డారు. కాని వాళ్ళెన్నడూ వాళ్ళ స్వగ్రామీయుల ఆస్తిపాస్తుల్ని దోచుకోలేదు. వాళ్ళు ఊళ్ళో ఉన్న

సమయంలో ఏ దోపిడీ దొంగలూ మా మానోమజ్రాలో ప్రవేశించేవారు కారు: కాని ఈ జుగుత్‌సింగ్ తన కుటుంబ సంప్రదాయాన్ని ఈనాడు యీ విధంగా మంటగలిపేశాడు" అని అన్నాడు.

ఇక్బల్ లేచి కూర్చున్నాడు: మీట్‌సింగ్ లాంటి వాళ్ళు చెప్పే నీతులన్నీ అతన్ని ఎప్పుడూ కలవరపెట్టేవిగానే వుంటున్నాయి. ఇకపోతే పంజాబీలయొక్క నీతి నియమాలు అతన్ని మరింత కలవరపెడ్తూంటాయి. వాళ్ళమటుక్కి సాంఘిక, ఆర్థిక, రాజకీయ, న్యాయాలన్నీ సవ్యంగా ఉన్నట్లే: ఈరకం మనుషులంతా సాంఘిక ఆర్థిక రాజకీయ విలువల్ని బాగా తక్కువజేసి, మనిషికీ మనిషికీ గల సరిఅయిన సంబంధమేమిటో అదెలాగుండాలో తెలియని అయోమయ స్థితిలో వున్నారనుకున్నాడు ఇక్బల్....: చట్ట విరుద్ధమయిన కార్యకలాపాలలో పాల్గొని నేరస్తులుగా పట్టుబడ్డ స్నేహితుల్ని కాపాడడం కోసం, ఎన్నో అబద్ధాలతో నిండిన తప్పుడు సాక్ష్యాలను చెప్పినా- అది అన్యాయమని వారినెవ్వరూ నిందించరు పైగా అదే ఉత్తమ స్నేహధర్మమని కీర్తిస్తారు. దాంతో అతనొక పెద్ద మనిషై కూర్చుంటాడు.... మత సంప్రదాయానుగుణంగా న్యాయపీఠం ఎదుట ప్రమాణంచేసి వంచనతో నిండిన అబద్ధపు సాక్ష్యాలను చెప్పిన వాళ్ళను యీ న్యాయస్థానాలు, యీ మతం ఏమీ చెయ్యలేక పోతు న్నాయి.... గ్రామీణుల యొక్క మనస్తత్వం ఈ తీరులో వుంటోంది. గ్రామంలోవున్న ప్రతి ఒక్కరినీ తన ఆత్మీయునిగా భావించడం, గ్రామ గౌరవాన్ని కాపాడ్డం, ఇదే వీళ్ళకొక మహత్తరమయిన పరీక్ష.... తన తోటి గ్రామస్తుడియొక్క రక్తంతో జుగుత్‌సింగ్ చేతులు తడియడమనేది ఈ వృద్ధ సిక్కు మత పూజారికి ఇంతలా ఎందుకు బాధకల్గిస్తోందో ఇక్బల్‌కి అర్థం కాలేదు. ఒకవేళ జుగ్గా ఇదేపనిని పొరుగూరులో చేసినట్ల యితే, యీ వృద్ధ సిక్కుమత పూజారి పరమానందంతో పవిత్ర గ్రంథ సాహెబా పట్టుకొని- ఆ హత్య జరిగిన సమయంలో జుగుత్‌సింగ్ గురు

ద్వారాలో ప్రార్థన చేస్తూ వున్నాడని- అతనిని రక్షించడం కోసం ప్రమాణంచేసి సాక్ష్యం చెప్పడానికి సంకోచించకపోవచ్చు ననుకున్నాడు. అసలు మీట్‌సింగ్ లాంటి వాళ్ళతో మాట్లాడ్డమంటే ఇక్బాల్‌కి తలనొప్పి.... ఎంచేతంటే తను చెప్పేది వాళ్ళు అర్థం చేసుకోరు, కనీసం అర్థం చేసుకోవడానికి ప్రయత్నమయినా చెయ్యరు. అందుకనే అలాంటి వాళ్ళతో మాట్లాడడమంటే ఇక్బాల్‌కి చిరాకు....! మీట్‌సింగ్ చెప్పిన విషయం తనకు సంబంధించిన విషయం కాదన్నట్లుగా దానిపై ఏమీ వ్యాఖ్యానించకుండా మౌనంగా వూరుకున్నాడు ఇక్బాల్.

దానిపైన ఏమీ వ్యాఖ్యానించకపోవడంవల్ల మీట్‌సింగ్ చాలా నిరుత్సాహపడ్డాడు. "తామీ ప్రపంచంలో చాలా దేశాలు చూసేరు. చాలా పుస్తకాలు చదివేరు....! తమకు తెలియదని కాదు గాని నేనో విషయం చెప్తాను వినండి. పాము తన కుబుసాన్ని విడిచిపెడుతుందేగాని, విషాన్నిమాత్రం విడిచిపెట్టదు. ఇది లక్షలు విలువచేసేమాట-" అన్నాడు మీట్‌సింగ్.

మీట్‌సింగ్ దృష్టిలో లక్షలు విలువచేసే యీ మాటను ఇక్బాల్ ఏమీ ప్రశంసించ లేదు.

"ఇంతవరకూ జుగ్గా సక్రమంగానే ప్రవర్తించేడు. ఏదో ఉన్న కాడికి తన భూమిని దున్నుకుంటూ పశువుల్ని కాచుకుంటూ కాలక్షేపం చేసేడు. ప్రతిరోజూ గ్రామ హెడ్మన్ దగ్గర హాజరవుతూండేవాడు. రాత్రుళ్ళు ఎప్పుడూ గ్రామాన్ని వదిలిపెట్టి వెళ్ళేవాడుకాడు. కాని పాము ఎంతకాలం విషాన్ని వెళ్ళగ్రక్కకుండా వుండగలదు....? అసలు దాని శరీరంలోనే దోషం వుంది. అది ఎప్పుడో ఓనాడు విషం వెళ్ళగ్రక్క తీరుతుంది" అన్నాడు మీట్‌సింగ్.

"ఇతరులతో వుండే మంచితనానికి మించిపోయేటంత దోషం అసలు ఎవరి రక్తంలోనూ వుండదు" ఇక్బాల్ యొక్క ముఖ్యమై

సిద్ధాంతాలలో ఇదొకటి.... "అసలు ప్రజలు ఎందుకు దోపిడీలు, దొంగతనాలు, హత్యలు చేస్తారో అధికారంలోవున్న వాళ్ళెవరైనా ఆలోచించేరా అని? లేదు! వాళ్ళను జైళ్ళలో పెట్టడంగాని, ఉరి తియ్యడంగాని చేస్తున్నారు. జైలు శిక్షలకు మరణ శిక్షలకు భయపడి కూనీలు, దోపిడీలు చెయ్యడం మానేస్తున్నారా అంటే, అదీ లేదు. మన యీ రాష్ట్రంలో రోజుకొక మనిషిని ఉరితీస్తున్నారు. కనీసం రోజుకో పదిమంది కూనీ చెయ్యబడుతూనే వున్నారు భాయీజీ! ఈ లోకంలో పుట్టుకతోనే ఎవ్వరూ నేరస్తులుకారు. దారిద్ర్యం! ఆర్థిక సాంఘిక అసమానత్వాలు వాళ్ళను నేరస్తులుగా రూపొందిస్తున్నాయి" అన్నాడు ఇక్బాల్. తీరా అలా అన్న తరువాత తను అటువంటి చాదస్తపు మనిషితో అలా మాట్లాడడం తెలివి తక్కువ తనమనుకున్నాడు. సంభాషణను ఒక ధర్మోపదేశం క్రిందకు మార్చే తన అలవాటుని ఇటుపైని సరిదిద్దుకోవాలనుకున్నాడు. మీట్ సింగ్ వేపు తిరిగి "జగ్గాని పోలీసువాళ్ళు సులభంగానే పట్టుకోగలరనుకుంటాను" అని అన్నాడు.

"జగ్గా ఇంకా అట్టే దూరం పారిపోయుండడు! వాడిని ఎంత దూరంనుంచైనా గుర్తించొచ్చు. అందరికంటే వాడు ఓమూర ఎత్తు వుంటాడు. ఆజానుబాహుడు. అప్పుడే డిప్యూటీ కమీషనరుగారు అన్ని పోలీసుస్టేషన్లకి ఆజ్ఞలు జారీ చేసేసేరట జగ్గణ్ణి వెతికి పట్టుకోమని!"

"ఎవరా డిప్యూటీ కమీషనరు!"

"తమకు డిప్యూటీ కమీషనరుగారెవరో తెలీదా....? హుకుమ్‌చాంద్ గారు! ఇప్పుడు ఆ డిప్యూటీ కమీషనరుగారు వంతెనకు ఉత్తరంగావున్న డాక్ బంగళాలో వుంటున్నారు. ఒక మామూలు చిన్న కానిస్టేబులుగా ప్రవేశించి ఇప్పుడెంత ఉన్నతోద్యోగంలో ఉన్నారో చూడండి. ఆయనెప్పుడూ పై అధికార్లను సంతృప్తి పరుస్తూండేవారు. అంచేత వాళ్ళ

అతన్ని అలా అలా క్రమక్రమంగా మీదికెత్తేశారు. ఆఖరిఅధికారి అతన్ని తన స్థానానికి లేవనెత్తి డిప్యూటీ కమీషనర్ చేసేశాడు.... హుకుమ్‌చాంద్ చాలా గొప్పవారు. గొప్ప తెలివైనవారు కూడాను. అతను తన మిత్రుల ట్ల ఎంతో నిజాయితీగా వ్యవహరిస్తుంటారు. వాళ్ళకి కావలసిన పనులు చేసి పెడుతుంటారు. ఎంతోమంది అతని బంధువులకు మంచి మంచి ఉద్యోగాలిప్పించేరు. మాటకొకడుంటాడలాంటి వ్యక్తి. నిజం చెప్పా లంటే హుకుమ్‌చాంద్‌గారితో సరిపోల్చదగ్గ వ్యక్తి ఇంకొక డెవడూ లేడీ ప్రాంతాలలో".

"అతను మీ స్నేహితుడా?"

"అబ్బే....? కాదు.... అతనో గొప్ప చక్రవర్తిలాంటివారు! మరి నేనో! ఈ గురుద్వారాకు వినమ్రుడనైన ఒక సామాన్య భాయీని! అతను ప్రభువు. మనం ప్రజలం. వారు మానోమజ్రా ఊళ్లోకిగానివస్తే మీరతన్ని చూడొచ్చు!" అని అన్నాడు మీట్ సింగ్.

ఇక్బల్ లేచి నిలబడ్డాడు. జోళ్ళు తొడుక్కుంటూ, "నేనలా ఓసారి తిరిగొస్తాను. ఎటువేపు వెళ్ళమంటారు? చెప్పండి!" అని అడిగేడు.

"మీ ఇష్టమొచ్చిన వేపు వెళ్ళండి. ఎటువేపు వెళ్ళినా ఒకటే. పోనీ నదివేపు వెళ్ళండి. అక్కడికెళ్ళినట్లయితే వచ్చేపోయే రైలు బళ్ళను చూడొచ్చు. తాము రైలు రోడ్డుని దాటి వెళ్ళినట్లయితే తమకు డాక్ బంగళా కనిపిస్తుంది. అట్టే ఆలస్యం చెయ్యకుండా వెళ్ళండి. రోజులేం బాగులేవు. చీకటి పడకముందే ఇంటికి వచ్చేయండి. అదీగాక నేను గ్రామ హెడ్మన్‌కి, ఇమామ్ బక్ష్‌కి చెప్పేను తామిక్కడ బసచేసినట్లు. తమతో మాట్లాడడానికి బహుశా వాళ్ళు రావచ్చు."

"అబ్బే! నేనేం ఆలస్యం చెయ్యను వేగంగానే వచ్చేస్తాను." అని ఇక్బల్ గురుద్వారానుంచి బయటపడ్డాడు.

ఆ వేళప్పుడు ఆ గ్రామంలో చెప్పుకోదగ్గ సంచలనమేదీ ఉన్నట్లు ఇక్బల్‌కి అగుపించలేదు. రావిచెట్టుక్రిందమంచాలమీద ఓ అరడజనుమంది కానిస్టేబుల్సు కాళ్ళు నిగడదన్ని పడుకొని వున్నారు. వాళ్ళు తమ దర్యాప్తుని అప్పుడే పూర్తిచేసినట్లున్నారు. రామ్‌లాల్ ఇంటి తలుపు తెరవబడుంది. కొంతమంది గ్రామీణులు వాకిట్లో నేలపై కూర్చొనివున్నారు. ఒకామె పాటపాడుతున్నట్లుగా రాగవరుసలో బిగ్గరగా ఏడుస్తోంది. ఆమె ఆ ఏడుపు ఆమెకు తెలివి తప్పడంతో అంతమవుతోంది. అప్పుడు మరి కొంతమంది స్త్రీల ఏడుపు....

వాతావరణం బాగా వేడిగావుంది. సూర్యరశ్మి ఇంకా తీక్షణంగానేవుంది.

ఇక్బల్ గురుద్వారా ప్రహారీగోడ నీడలోంచి నడుస్తూపోతున్నాడు. ఆ నీడలో పిల్లలు ఆడుకుంటూ వుంటే. పురుషులాస్థలాన్ని మూత్రవిసర్జన కోసం వాడుతున్నారు. ఓ గజ్జికుక్క ఎనిమిది పిల్లలూ ఒకదాన్ని ఒకటి త్రోసుకుంటూ తల్లి పొదుగులోని నరాలను పీకుతున్నాయి.

ఆ సందు ఆ గ్రామ చెరువు ముందున్న బురదగుమ్మి దగ్గరకొచ్చే సరికి అంతమయింది. ఆ బురదగుమ్మిలో గేదెలు తమ తలలు పైకెత్తి పడుకున్నాయి. ఒక కాలిబాట ఆ బురదగుమ్మి ప్రక్కనుంచి గోధుమ పొలాలగుండా నదివరకూ వుంది. ఇక్బల్ ఆ బాటవెంబడి కొంతసేపు అలా నడచి నదిదగ్గరకు చేరుకున్నాడు. అతను నదిదగ్గరకు చేరుకొనే వేళకు లాహోర్‌నుంచి ఢిల్లీ వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ బ్రిడ్జీమీదనుంచి పోతోంది. అన్ని రైలుబళ్ళలాగే అదికూడా కిక్కిరిసి వుంది. లోపలా పైనా ఎక్కడ ఖాళీవుంటే అక్కడ ప్రయాణీకులు! బ్రిడ్జీ దాటిన వెంటనే రైలుబండి మళ్ళీ వేగాన్ని పుంజుకుంది. బోగీకి బోగీకి మధ్యకల బఫర్సు ఒకదాన్నొకటి గ్రుద్దుకున్నాయి. పెద్ద శబ్దంతో వాటిపై కూడ నిలబడి ప్రయాణం చేస్తున్న ప్రయాణీకుల సాహసం నిజంగా మెచ్చుకోదగ్గదే: తమ ప్రాణాలను కాపాడుకోవాలనే తాపత్రయంలోంచి జనించిన ప్రాణా

పాయ కరమయిన సాహసమది. మానోమజ్రా స్టేషను దాటేంతవరకూ ఇంజన్ డ్రయివర్ బిగ్గరగా ఈల వేస్తూనే ఉన్నాడు. "హమ్మయ్య! ఏలాఅయితేనేం పాకిస్తాన్‌లోంచి బయటపడి ఇండియాలో ప్రవేశించ గలిగేము" అనే సంతోషకరమయిన ప్రకటన ఆ సుదీర్ఘమయిన ఈలలోంచి ధ్వనిస్తోంది.

బ్రిడ్జి దగ్గరున్న నది ఒడ్డుకి ఇక్బాల్ వెళ్ళాడు. అక్కడనుంచి డాక్ బంగళాకేసి వెళ్ళాలని అతని ఉద్దేశ్యం. కాని బ్రిడ్జి చివరగల సెంట్రీబాక్సులోంచి ఓ సిక్కు సోల్జర్ తనను కనిపెట్టి చూస్తున్నాడని ఇక్బాల్ గమనించాడు. ఇక్బాల్ తన మనస్సును మార్చుకొని రైలురోడ్డు గట్టుమీద కెక్కి అక్కడనుంచి మానోమజ్రాకేసి బయలు దేరాడు. సెంట్రీ అనుమానాన్ని ఇక్బాల్ యొక్క ఈ నడవడి నివృత్తి చేసింది.

ఇక్బాల్ సుమారు వందగజాల దూరం అలా నడచుకొని వెళ్ళి రైల్వే లైనుపైన కూర్చున్నాడు. పొద్దు పోతోందనే విషయం మానోమజ్రా గ్రామస్తులకు పెద్ద రొదచేస్తూ వెళ్ళిపోతున్న ఆ ఎక్స్‌ప్రెస్ తెలియజేసింది. పని పాట్లను కట్టిబెట్టి మానోమజ్రా గ్రామస్తులు గృహోన్ముఖులయారు.

రామ్‌లాల్ మృతశరీరం ఓ ఎడ్లబండిలో శవపరీక్షనిమిత్తం గొంపోబడుతోంది. ఆ బండికి ముందూ వెనకా పోలీసులున్నారు. చాలామంది గ్రామస్తులు ఆ బండి వెనకాల కొంతదూరం వెళ్ళి మళ్ళీ వెనుదిరిగి వెళ్ళిపోయారు. ఇక్బాల్ నిలబడి చుట్టూ ఓసారి కలయజూసేడు. అంతా అలికిడిగా వుంది. మనుష్యులు, పశువులు, పక్షులు ఆ అలికిడికి కారకులు.

జీవచైతన్యం లేని స్థలం ఇండియాలో ఎక్కడ వెదికినా దొరకదనుకున్నాడు ఇక్బాల్. తను మొట్టమొదటసారి బొంబాయి దర్శించినప్పుడు కల్గిన అనుభూతి అతని స్మృతి పథంలో కొచ్చింది. రోడ్లపైన, రైల్వే

ప్లాట్‌ఫారమ్ము పైన, పేవ్‌మెంట్సు పైనా ఇక్కడా అక్కడా అనిలేదు. ఎక్కడపడితే అక్కడ లక్షలాది దరిద్రగొట్టు ప్రజలు భారతదేశ సౌభాగ్యానికి చిహ్నంగా కనిపించారు. జనాభా సంవత్సరానికి సుమారు ఓకోటి చొప్పున పెరిగిపోతూంటే ఈదేశం గతేంకాను? వ్యవసాయోత్పత్తులు, పరిశ్రమలు అభివృద్ధి చేసేటందుకు వినియోగించే ధనాన్ని పూర్తిగా జనాభాను పరిమితం చేసేటందుకు వినియోగిస్తే ఎంతో బాగుండిపోయేది.... కాని ఈ దేశంలో తరతరాలనుంచీ జీర్ణించుకుపోయున్న మత విశ్వాసాలు ఇందుకు ప్రతిబంధక మవుతున్నాయి. కుటుంబ నియంత్రణ అనేది ఓ పాపకార్యంగా భావించే వాళ్ళ జనాభా ఇంకా ఈ దేశంలో ఎక్కువగానే వున్నది.... సిగ్నల్ తీగెల గలగల ధ్వనుల కారణంగా ఇక్బల్ తన ఆలోచనలోంచి బయటపడ్డాడు. సెంట్రీబాక్సు పైనవున్న సిగ్నల్ రెక్క క్రిందకు వాలింది. ఇక్బల్ లేచి నిలబడి బట్టలు దులుపుకున్నాడు.

సూర్యాస్తమానం అయింది. ఇక్బల్ చాలా వేగంగానే ఇల్లు చేరుకున్నాడు. రామ్‌లాల్ ఇంట్లోంచి ఇంకా ఏడుపులు వినిపిస్తున్నాయి. మసీదులో ఓ డజను మంది రెండు వరసలలో నిశ్శబ్దంగా నిలబడి వాళ్ళ మత సంప్రదాయాన్ని అనుసరించి ప్రార్థన చేస్తున్నారు. గురుద్వారాలో మీట్‌సింగ్ గ్రంథసాహెబాని పఠిస్తున్నాడు. కొంతమంది పురుషులు, స్త్రీలు అర్ధవృత్తాకృతిలో ఓ హరికెన్ లాంతరుచుట్టూ కూర్చొని అతను చదువుతున్నది వింటున్నారు.

ఇక్బల్ తనగదిలోకి తిన్నగావెళ్ళి తనమంచంమీద నడుంవాల్చాడు. అవతల భక్తులు గానం చేస్తూంటే ఇక్బల్ కళ్ళుమూసుకొనిపడుకున్నాడు. ఆ ప్రార్థనా కార్యక్రమం డ్రమ్ముల మోతతోను, "సత్ శ్రీ అకల్" అనే పరస్పరాభివందనలతోను అంతమొందింది.

అంతా బయటకొచ్చారు. వాళ్ళు తమ తమ జోళ్ళను వెతుక్కొనేటందుకు తోడ్పడేందుకుగాను మీట్‌సింగ్ లాంతరు పట్టుకొని బయట

కొచ్చాడు. కొంతసేపయాక మీట్‌సింగ్ లాంతరు పట్టుకొని గదపలో కొచ్చి, "ఇక్బల్ సింగ్‌జీ.... తాము భోంచెయ్యకుండానే పడుకున్నారా? తమకు పులుసంటే ఇష్టమేనా....? పెరుగు, మజ్జిగా కూడా నా దగ్గరున్నాయి" అని అన్నాడు.

"మీ ఆదరణకు కృతజ్ఞతాభివందనాలు....! ఇప్పుడేమీ అవసరం లేదు. నాక్కావలసిన భోజనం నాదగ్గరున్నది."

"మా దౌర్భాగ్యపు తిండి...." మీట్‌సింగ్ ఇంకా ఏదో చెపుతూండగానే—

ఇక్బల్ లేచి కూర్చుంటూ "అబ్బేబ్బే! అదేంకాదు. నాక్కావలసిన భోజనపదార్థాలను నేను తెచ్చుకున్నాను. అవి ఉపయోగించకపోతే పాడయిపోతాయి. అందుకని వద్దంటున్నాను" అని అన్నాడు.

"అయితే కొంచెం పాలు తీసుకోండి. గ్రామ హెడ్మన్ బంటా సింగ్ గారు తమకు పాలు తీసుకొస్తామని అన్నారు. తాము త్వరగా నిద్ర పోవాలనుకుంటే వేగంగా పాలు తీసుకురమ్మనమని అతనికి కబురు చేస్తాను.... ఇక్కడీగదిలో చాలా ఉక్కగా ఉన్నట్లుంది.... డాబాపై మరో మంచముంది. తాము అక్కడ పడుకోవచ్చు" అని చెప్పి అదృశ్యమయి పోయాడు.

ఇక్బల్ తలగడా క్రిందనుంచి సిల్వర్ హిప్‌ఫ్లాస్కు తీసి ఓ పెద్ద గుక్కెడు విస్కీ తీసుకున్నాడు. ఆ తరువాత కొన్ని డ్రైబిస్కట్లు తిన్నాడు. మరి కొంచెంసేపుపోయేక తలగడా జంబుఖానా పట్టుకొని డాబా మీది కెళ్ళాడు. అక్కడున్న మంచంమీద పరచుకొని— ఆకాశంలోని నక్షత్రాలకేసిచూస్తూ పడుకున్నాడు. మరి కాస్సేపటికి కొంతమంది గొంతుకలు వినిపించాయి. వాళ్ళు డాబామీదికే వస్తున్నట్లు గ్రహించాడు ఇక్బల్.

వాళ్ళు డాబామీదికొచ్చారు. ఇక్బాల్ లేచి నిలబడి గౌరవపురస్సరంగా, "సత్ శ్రీ అకల్" అని వాళ్ళకు స్వాగతంచెప్పాడు.

వాళ్ళ నతనికి పరిచయం చేసే విషయమై మీత్ సింగ్ ఏమీపట్టించుకోలేదు. ఆ మంచంపై ఆ అతిథులందరినీ కూర్చోబెట్టాడు. తను నేలపై చాప పరచుకొని కూర్చొని, "వేగంగా రాలేకపోయినందుకు చాలా సిగ్గుపడుతున్నాను. నన్ను క్షమించండి! వీరు తమకోసం పాలు తీసుకొచ్చారు". అని అన్నాడు.

"అవును బాబూ! మామటుక్కి మేము చాలా సిగ్గుపడుతున్నాము-తాము మా అతిథి.... అయినా తమ కింతవరకూ మే మేవిధమైన సేవా చెయ్యలేకపోయాము. చల్లారిపోకముందే ఈ పాలు త్రాగండి బాబూ" అని ప్రాధేయ పూర్వకంగా మనవిచేశాడు గ్రామ పెద్ద.

"మీ ఆదరణకు కృతజ్ఞుణ్ణి....! పాపం! ఇవాళ తామంతా పోలీసు వాళ్ళతో సతమతమయినట్లున్నారు...! పాలు త్రాగే అలవాటు నాకు లేదు. నా మాట నమ్మండి! నాబోటి నగర వాసులకు......."

మంచి సంస్కార వంతు లలాగే మొహమాట పడుతుంటారనే ఉద్దేశంతో ఆ గ్రామ హెడ్మన్ ఇక్బాల్ యొక్క అభ్యంతరాన్ని పట్టించుకోకుండా- ఆ పాల చెంబుపై కప్పబడున్న మురికి చేతి రుమాలును తొలగించి- తన చూపుడు వ్రేలితో ఆ పాలు కలుపుతూ, "ఇవి తాజా పాలు..! ఓ గంటక్రితం నేనే స్వయంగా పితికిన గేదె పాలివి....! నా భార్య స్వయంగా మరిగించింది. తమవంటి చదువుకున్న వాళ్ళు మరిగించిన పాలను మాత్రమే త్రాగుతారని నాకు తెల్సు! ఇందులో చాలా పంచదార వేసేము. అది అడుగున కరక్కుండా వుండిపోయినట్లుంది!" అంటూ మరోసారి వ్రేలుతో బాగా కలియబెట్టేడు. అవి ఎంత మంచిపాలో వ్యక్తపరచేటందుకు కాస్తా మీగడను వ్రేలితో తీసి చూపించి, మళ్ళీ ఆ పాలలో ఊరిపేసాడు. "చల్లారిపోకముందే త్రాగండి బాబూజీ!" అని ప్రార్థించేడు.

"వొద్దొద్దు. నా కలవాటులేదు. మీకో నమస్కారం!" వాళ్ళకు తనపై అసహ్యంకలక్కుండా వుండేటట్లు ఆ అవస్థలోంచి తనెలాబయట పడడమో అవగత మవలేదు ఇక్బల్‌కి. "నేనింతకు ముందెన్నడూ పాలు త్రాగలేదు. మీరంతగా బలవంతపెడితే ఆ తరవాత త్రాగుతాను. చల్లారితే ఎలాగోవోలా త్రాగెయ్యగలను" అని అన్నాడు.

బంటాసింగ్ తన మురికి చేతి రుమాలుతో ఆ పాలచెంబును కప్పి ఇక్బల్ మంచం క్రింద పెట్టేడు. ఆ తరువాత కొంతసేపు ఎవ్వరూ ఏఁవీ మాట్లాడలేదు; ఆ పాలను మీగడతోసహా కాలువలో పారబోసే మనోహర దృశ్యాన్ని ఊహిస్తున్నాడు ఇక్బల్!

"బాబూజీ! ఏఁవీ చెప్పకుండా తమరలా ఊరుకున్నారేం....? మా కేఁవైనా చెప్పండి. ఇప్పుడు ప్రపంచంలో ఏం జరుగుతోంది? ఇంతకీ ఈ పాకిస్తాన్, హిందూస్తానుల గురించి తమ కేవయినా తెల్సునా?" అని అడిగేడు వాళ్ళతోపాటొచ్చిన ఓ ముసల్మాన్.

"మేమి కుగ్రామంలో నివసిస్తున్నాం. మాకేమీ తెలియటంలేదు. ఇంగ్లీషువాళ్ళు మన దేశాన్ని వదిలిపెట్టి ఎందుకెళ్ళిపోయేరు? చెప్పండి బాబూజీ?" అనడిగేడు హెడ్మన్.

ఇలాంటి ప్రశ్నలకు తనేమని సమాధానమీయడం? అసలు వాళ్ళకు "స్వాతంత్ర్యం" అంటే ఏమిటో తెలీదు.... అలాంటి వాళ్ళకిప్పుడు తను సమాధానమియ్యాలి? తమకు కావలసిన పనులు చేసుకోవడానికి రాజకీయ స్వాతంత్ర్యం అవసరమన్న సంగతి వాళ్ళకు తెలీదు. రాజకీయ స్వాతంత్ర్యమంటూ ఒకటుండే అప్పుడు ఆర్థిక స్వాతంత్ర్యాన్ని కూడా సాధింప వచ్చునని వాళ్ళకెలా బోధపర్చడం? కొంచెంసేపాలోచించి, "మనదేశాని వదిలిపెట్టి వెళ్ళిపోవలసిన పరిస్థితి ఏర్పడింది కాబట్టి ఆంగ్లేయులు మన దేశాన్ని వదిలిపెట్టి పోయేరు. వందలకొద్దీ వేలకొద్దీ యువకులకు

స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనేటందుకు తర్ఫీదు ఇవ్వబడింది. మీరు సిపాయిల పితూరి గురించి విన్నారా? అదే భారతదేశ ప్రధమ స్వాతంత్ర్య పోరాటం! ఆ పోరాటం బ్రిటీషువారి గుండెల్ని జలదరింపజేసింది. ఆ తరువాత జపాను వాళ్ళచే ఏర్పరచబడ్డ భారత జాతీయ సైన్యంలోని వాళ్ళలో ఒక్కనినైనా బ్రిటీషువారు వధించలేక పోయేరు! ఎంచేతంటే: వాళ్ళలో ఏ ఒక్కడిని వధించినా భారతీయులంతా ఒక్కుమ్మడిగా ఏకమై బ్రిటీషు ప్రభుత్వంపై తిరగబడతారనే భయం వాళ్ళ గుండెలకు బాగా పట్టి వుండడం వల్ల!" అని అన్నాడు ఇక్బాల్.

ఆ గ్రామ హెడ్మన్ కాస్త సంశయిస్తూ, "బాబూజీ! తాము చెప్పినది యధార్ధమైతే కావొచ్చు! నేను గత ప్రపంచ యుద్ధంలో మెసపొటోమియా లోను, గల్లీపోలీలోను వుండి యుద్ధం చేసేను. ఆంగ్లేయాధికారుల దగ్గర పని చెయ్యడమంటే మా కెంతో ఇష్టంగా వుండేది. భారతీయ అధికారులకంటే వాళ్ళెంతో మంచివారు!" అని అన్నాడు.

"మన బంటాసింగ్ చెప్పినదంతా యదార్ధమే....? హవల్దారుగా పనిచేసిన నాసోదరుడొకడు అంటూవుండేవాడు: 'భారతీయ అధికారులవద్ద పనిచేసేసిపాయిలకంటే, ఆంగ్లేయాధికారులవద్ద పనిచేసేసిపాయిలు ఎంతో సుఖంగా వుండేవారని....!' నా సోదరుడు పనిచేసిన పటాలం కమేండరు భార్య ఇప్పటికీ నా సోదరుని కుమార్తెకు బహుమతులు పంపిస్తూనే వుంది....! అయ్యా! బంటాసింగ్‌గారూ! మీకు తెల్సునుకుంటాను నా సోదరుడి కూతురు పెళ్ళికి ఆమె డబ్బుకూడా పంపిందని....! మన భారతీయ అధికారులు, వారి భార్యలు క్రింద ఉద్యోగస్తులపట్ల ఇంతటి ఆదరాభిమానాల్ని ఎప్పుడైనా చూపించేరా?" అని మీట్‌సింగ్ ఆహెడ్మన్ అనిన సమర్ధించేడు.

"అయితే మీకు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలక్కరలేదా....? జీవితాంతం వరకూ మీరు బానిసలుగానే ఉండదల్చుకున్నారా?" అని ఇక్బల్ వారి ముఖాలలోకి సూటిగా చూస్తూ అడిగేడు.

కొంతసేపు అంతా మౌనంగా వూరుకున్నారు. ఆతరువాత ఆగ్రామ హెడ్మన్ "నిజమే....? దేశానికి స్వాతంత్ర్యంరావడం మంచిదే? అయితే ఇందువల్ల మాలాంటివాళ్ళు పొందే ప్రయోజనం ఏవిటి? ఇదివరకు ఆంగ్లేయులు ఏఏ ఉద్యోగాలు చేసేవారో ఆయా ఉద్యోగాలు తమలాంటి చదువుకున్నవాళ్ళు చెయ్యడానికవకాశమొస్తుంది; కొంతమంది భారతీయులకు. ఆదీ బాగా డబ్బూ పలుకుబడీ వున్నవాళ్ళకు గొప్పగొప్ప పదవులొస్తాయి: కాని మాలాంటివాళ్ళకేంవొస్తాయి? ఎక్కువ భూములు, ఎక్కువ పశువులు లభిస్తాయంటారా?" అని అడిగేడు.

వాళ్ళతో వచ్చిన ముసల్మాన్ బంటాసింగ్‌తో, "అబ్బే....! మన బోటి వాళ్ళకు ఈ స్వాతంత్ర్యంవల్ల లాభం ఏమీ వుండదు: స్వాతంత్ర్యం కోసం పోరాడిన విద్యాధికులే యీ స్వాతంత్ర్యంవల్ల ప్రయోజనాన్ని పొందగలరు. మనం ఇంతవరకూ ఇంగ్లీషువారి బానిసలం; ఇప్పుడు అధికారంలోవున్న భారతీయుల లేక పాకిస్థానీయులబానిసలం!" అనిఅన్నాడు:

ఈ వివరణ విని ఇక్బల్ ఉలిక్కిపడ్డాడు. ఆ ముసల్మాన్ ముఖంలోకి చూస్తూ "మీరన్నది నూటికి నూరుపాళ్ళు నిజం!" అని కొంచెంసేపు మౌనంగా వూరుకొని "ఈ స్వాతంత్ర్యంవల్ల చేకూరే ఫలితాలను శ్రమజీవులయిన మీ కర్షకులు కార్మికులు పొందాలీ అంటే మీరంతా ఏకమై మన యీ పెట్టుబడిదారీ ప్రభుత్వంతో పోరాడాల్సొంటుంది.... ఈ పెట్టుబడి దారీ కాంగ్రెస్‌ను అంతమొందించాల్సొంటుంది. ఈ రాజులను, వారి ప్రత్యేక హక్కులను, భూస్వాములను, వారి దౌర్జన్యాలను, పారిశ్రామిక వేత్తలను వారి దురాగతాలను, అంతా ఏకమై అంతమొందించండి.

అప్పుడు మీరనుకుంటూన్న స్వాతంత్ర్యం మీకు లభిస్తుంది. అప్పుడు పాడిపంటలతో మీరు తులతూగుతారు" అని అన్నాడు ఇక్బాల్.

"ఆఁ....! ఇలాగే అతనుకూడా అన్నాడు! అయ్యో! బంటాసింగ్ గారు.... ఆమధ్య మనూరొకతను వచ్చాడు కదండీ? మీకు గుర్తుందా అతని పేరు.... "కామ్రేడ్" అని జ్ఞాపకం బాబుగారూ! మీరుకూడా కామ్రేడా!" అని అడిగాడు మీట్‌సింగ్.

"కాను"

"చాలా సంతోషం.... వాడికి అంటే ఆకామ్రేడ్‌గాడికి దేవుడంటే నమ్మకంలేదు. వాడేమన్నాడో తెల్సా? వాళ్ళ పార్టీగాని ఒకవేళ అధికారంలోకి వస్తే "టురన్ టారన్" లోగల మన పవిత్రదేవాలయం చుట్టూగల చెరువు కప్పించేసి అక్కడ వరి పండిస్తారట....! ఇంతకన్నా అది ఎక్కువ ఉపయోగకరమట!"

"అది చాలా తెలివితక్కువ ప్రేలాపన" అన్నాడు ఇక్బాల్. ఆ కామ్రేడ్ పేరు తెల్సుకొని హెడ్ క్వార్టర్సుకి రిపోర్టు చెయ్యాలనుకున్నాడు; అలా తెలివితక్కువగా ఇక ముందెప్పుడూ ఎక్కడా మాట్లాడొద్దని హెచ్చరించమని!

ఆ ముసల్మాన్ గొంతుక సవరించుకొని, "దేవుడిపై మనకు నమ్మకం పోయిననాడు మనం పశువులమవుతాం! మతావలంబకుణ్ణి యీ ప్రపంచం గౌరవిస్తుంది. గాంధీ గారిని చూడండి! వారు వేదాలు, ఉపనిషత్తులు మొదలగు హిందూ మత గ్రంథాలతోపాటు, ఖురాన్, బైబిలు మొదలగు ఇతర మత గ్రంథాలనుకూడా చదువుతూంటారు. ఈ ప్రపంచంలోగల అన్ని దేశాల ప్రజలు వారిని ఘనంగా స్తుతిస్తున్నారు. గాంధీజీ ప్రార్థనా సమావేశపు ఫొటోను ఆమధ్య ఏదో వార్తాపత్రికలో నేను చూసేను. అందులో ఎంతో మంది తెల్లదొరలు దొరసానులు మఠం వేసు

కొని కూర్చొని వున్నారు. ఒక దొరల అమ్మాయి కళ్ళు మూసుకొనిఉంది. ఆమె ఓ గొప్ప ఇంగ్లీషు దొరగారి కుమార్తె అని చెప్పేరు.... ఇంతకీ చెప్పొచ్చేదేమిటి అంటే స్వమతావలంబియగు మానవుణ్ణి ఇంగ్లీషువాళ్ళు కూడా గౌరవిస్తారని" అని అన్నాడు.

మీట్ సింగ్ తన పొట్టను చేత్తో పాపుకుంటూ "నిజమే! నువ్వు ఏం చెప్పినా అది నూటికి నూరుపాళ్ళు నిజమయుంటుంది" అని అన్నాడు ఆ ముసల్మాన్‌తో.

ఇక్బల్ సహనాన్ని కోల్పోయేడు. కాస్త ఉద్రేకంగా "వాళ్ళు వట్టి వంచకులు, మోసగాళ్ళు....! వాళ్ళని మీరెంతమాత్రం విశ్వశించవద్దు" అని అన్నాడు. తీరా అలా అన్నతరవాత ఆ చాదస్తపు మనుషులతో తనలా అనడం అవివేకమనుకున్నాడు.... హిందూ యోగినిలా కళ్ళు మూసుకొని అంచక్కా మఠంవేసుకొని ఆ దొరసానమ్మ ఎందుకు కూర్చుంది....? ప్రెస్ ఫొటోగ్రాఫర్లు ఫొటో తీస్తారని.... ఇక పోతే ఆ ఫొటోలోవున్న దొరలంతా హిందూదేశాన్ని హిందూమతాన్ని ప్రేమిస్తున్న వాళ్ళేనని ఎవరయినా అంటే తనెంతమాత్రం అంగీకరించలేదు. అదంతా ఒట్టి నటనని ఇక్బల్ అభిప్రాయం.

ఇక్బల్ ఓసారి గొంతుక సవరించుకొని "నేను చాలాకాలం వాళ్ళ దేశంలో వున్నాను.... మానవులుగా వాళ్ళు చక్కనివాళ్ళే! కాని రాజకీయంగా యీ ప్రపంచంలో వాళ్ళను మించిన వంచకులు లేరు! వాళ్ళు నిజాయితీ పరులే అయినట్లయితే యీ ప్రపంచంలో రవి అస్తమించని సామ్రాజ్యాన్ని నెలకొల్ప గలిగుండేవారే కాదు.... అయినా ఇప్పుడా విషయం అప్రస్తుతం. ఇప్పటి దేశంలో ఏం జరుగుతున్నదీ అంతా తెల్సుకోవడం ఎంతయినా అవసరం" అని అన్నాడు.

బంటాసింగ్ కాస్త ఉద్రేకంతో "ఇప్పుడీ దేశంలో ఏం జరుగుతున్నదీ మాకు తెల్సు.... వినాశకరమయిన గాలులీదేశం పైనుండి వీస్తున్నాయి. "చంపు, నరుకు" అనే కేకలు మిన్ను ముడుతున్నాయి. దోపిడీ దొంగలు, హంతకులు, తడి గుడ్డలతో గొంతుకలు కోసేవాళ్ళు ఈ స్వాతంత్ర్య ఫలితాన్ని ఎంతో ఆనందంగా అనుభవిస్తున్నారు. నిజంచెప్పాలంటే బ్రిటీషువారి పరిపాలనలోనే మేము సుఖంగా వున్నాం. వారి పరిపాలనా కాలంలో మా ధన మాన ప్రాణాలకు తగు భద్రత వుండేది" అని అన్నాడు.

ఇక్బాల్ మరింకేమీ అనలేదు.

రైల్వేస్టేషను యార్డులో గూడ్సు రైలుబండి షంటింగ్ చేస్తున్న ధ్వని వినిపిస్తోంది. "గూడ్సు రైలుబండి ఇవాళ కాస్త ఆలస్యంగా వచ్చినట్లుంది బాబూః తాము బాగా అలసిపోయినట్లున్నారు. విశ్రాంతి తీసుకోండి. మా అవసరం తమకున్నట్లయితే వెంటనే కబురు చెయ్యండి: తమ సేవ చెయ్యడానికి వస్తాము" అని అంటూ ఆ ముసల్మాన్ లేచి నిలబడ్డాడు.

తన కోపాన్ని బయట కగుపడనీయకుండా లోలోన అణచుకొని వాళ్ళతో కరచాలనం చేసాడు ఇక్బాల్. వాళ్ళు వెళ్ళిపోయారు.

ఆకాశంలో మిలమిలమెరుస్తున్న నక్షత్రాలకేసిచూస్తూ మంచంమీద పడుకున్నాడు ఇక్బాల్. అంతా నిశ్శబ్దంగా వుంది. ఆ నిశ్శబ్దవాతావరణం అతని ఒంటరితనాన్ని మరింతగా గుర్తుచేస్తోంది. ఏవేవో ఆలోచనలు అతని మస్తిష్కంలో....

కోట్లాది ప్రజలమధ్య తనొక సామాన్య మానవుడు. తనొక్కడూ ఏం చెయ్యగలడుః ఈ దారుణ హత్యాకాండను తను ఆపగలడాః పట్టి మాటః అది తన ఒక్కడివల్లా అయే పనికాదుః హిందువులకు, ముస్లిము

లకు, సిక్కులకు, కాంగ్రెసు వారికి, ముస్లిమ్‌లీగు వారికి, అకాలీలకూ, కమ్యూనిష్టులకూ అందరికీ ఇంతో అంతో దీనితో ప్రమేయంవుంది.... బూర్జువా విప్లవమే సామాన్య ప్రజావిప్లవంగా మారగలదనుకోవడం అవివేకం! ఇతర మతాలకు చెందిన భూకామందులను చంపి వారి భూము లను ఆస్తిపాస్తులను వశపరచుకోవాలనే దృక్పథం తప్పితే దేశ సరి హద్దులలో వున్న సామాన్య ప్రజలలో రాజకీయ స్వాతంత్ర్యంపట్ల ఇంకే దృక్పథమూ లేదు. ఈ రాజకీయ స్వాతంత్ర్యంపట్ల నిజానికి సామాన్య ప్రజలంతా ఉదాసీనులై వున్నారనే చెప్పొచ్చు. "చంపి తీసుకో" అనే ప్రవృత్తిని కులమత విద్వేషాల్లోంచి పెంపొందింపజేసి- ధనవంతులమీదికి ఉసిగొల్పేటందుకు దానిని ఉపయోగించుకోవచ్చు! సామాన్య ప్రజా విప్ల వాన్ని ప్రజ్వలింపజేసేటందుకిదొక సులభమైన మార్గమే కాని తమ పార్టీ నాయకులీ విషయాన్ని సరిగ్గా అవగాహన చేసుకున్నట్లు లేదనుకున్నాడు ఇక్బాల్.

ఆ గ్రామీణుల మెదళ్ళలో అల్లుకొనివున్న సాలిగూళ్ళను తొలగించి తమ పార్టీ ఉద్దేశాలను బాగా నూరి పొయ్యాలనుకున్నాడు ఇక్బాల్....కా తనొక నాయకుడు కాడు. అందు కవసరమయిన యోగ్యతార్హతలు తన కింకా చేకూరలేదు. తనెప్పుడూ నిరహారదీక్ష వహించలేదు. ఎన్నడూ జైలు శిక్ష ననుభవించలేదు. దేశంకోసం ఇంతవరకూ ఏ త్యాగమూ చెయ్యలేదు. అంచేత తన మాటెవరూ వినరు! ఇది సహజమే....! కోర్టు వారిచే గుర్తింపబడిన ఓ రాజకీయ నేరస్తుడిగా తను రాజకీయజీవితాన్ని ప్రారంభించాలి. కాని ఇప్పుడు కాదు. అందుకిది సమయంకాదు. తను తిరిగి ఢిల్లీ చేరుకున్నాక చెయ్యాల్సిన పనది.... అప్పటికీ హత్యాకాండ బహుశా పూర్తవొచ్చు! అలాంటప్పుడు తనొక రాజకీయ నేరస్తుడిగా గుర్తింపబడకం అన్నివిధాలా శ్రేయస్కరమనుకున్నాడు ఇక్బాల్.

గూడ్సు రైలుబండి స్టేషను వదిలిపెట్టి పెద్ద శబ్దంతో వంతెనమీద నుంచి వెళ్ళిపోయింది. అంతా నిశ్శబ్దంగా వుంది. జైలులోని ప్రశాంత జీవితం గురించి ఇక్బల్ ఆ రాత్రి ఓ కలగన్నాడు.

6

తెల్లారింది!

మీట్‌సింగ్ తన ఇత్తడిచెంబుతో నీళ్ళు పట్టుకొని అలా పొలాల కేసి వెళ్ళేడు. ఇంకా ఇక్బల్ నిద్రపోతున్నాడు. వచ్చి పోయే రైలుబండి రొద, ముల్లా ప్రార్థన, గ్రామీణుల గోల ఇవేవి అతనికి నిద్రాభంగ మొనర్చలేదు.

ఇద్దరు కానిస్టేబుల్సు గురుద్వారాలోనికి ప్రవేశించి, ఇక్బల్ యొక్క గదంతా పరిశోధించేరు. అతని సెల్యులాయిడ్ కప్పులు సాసర్లు- మెరుస్తూ వున్న అల్యూమినియం చెంచాలు, ఫోర్కులు కత్తులు- థర్మోస్ ఫ్లాస్కు ఇవన్నీ పరిశీలించేరు. ఆ తరువాత డాబామీదికెళ్ళి ఇక్బల్‌ని చాలా మొర టుగా కుదిపి లేపేరు!

ఇక్బల్ కళ్ళువిప్పి ఎదురుగావున్న కానిస్టేబుల్సుని చూసి దిగ్భ్రాంతి చెందేడు. అతనింకా పరిస్థితిని అవగాహన చేసుకోకముందే ఆ పోలీసు కానిస్టేబుల్సు అతనిని కొన్ని ప్రశ్నలడిగేరు....? అతని ఊరేదో, పనే మిటో ఆ వివరాలన్నీను!

ఇక్బల్ సమాధానాలుచెపుతూన్నప్పుడు, ఆ కానిస్టేబుల్సులో ఒకడు ఒక పసుపు పచ్చని అచ్చు కాగితంపై గలకాళీస్థలాలను ఆవివరాలతోనింపి- ఆ కాగితాన్ని ఇక్బల్ యొక్క నిద్రమత్తు కళ్ళఎదుటపుంచి, "మిమ్మల్ని అరెష్టుచేయడాని కిదుగో వారంట్....! లేవండి!" అనిఅన్నాడు.

రెండో కానిస్టేబుల్ బేడీలకు చివరనున్న రింగ్‌ని తప్పించి- వాటిని తెరచి ఇక్బల్ చేతికి తగిలించబోయేడు!

తన చేతికి తగిలించబోతున్న బేడీలకేసి చూసేసరికి ఇక్బాల్‌కి బాగా మత్తు వదిలింది. మంచం మీదనుంచి గబుక్కున లేచి ఆ పోలీసు కానిస్టేబుల్సుకేసి తీక్షణంగా చూస్తూ "ఈ విధంగా నన్ను అరెస్టు చేసే హక్కు మీకు లేదు....! నా ఎదుట మీరు వారంటు తయారుచేసేరు. మీ ఆటలిలా కొనసాగవు. పోలీసుజులుం చెలాయించే రోజులు గతించేయి!

అసలు నన్ను తాకగలిగే గుండెధైర్యం మీకుందా అని....? ఉన్నట్లయితే తాకండి. అప్పుడు మీ పోలీసు జులుం ఏతీరులో వున్నదీ ఈ ప్రపంచంలో అందరూ తెల్సుకుంటారు....! అంతేకాదు! మీరెంత చట్ట విరుద్ధంగా మీ విధుల్ని నిర్వహిస్తున్నదీ న్యూస్ పేపర్లన్నింటిలోను ప్రచురింపబడేటట్లు చూస్తాను!" అని తీవ్రంగా హెచ్చరించేడు. దాంతో ఆ కానిస్టేబుల్సు కొస్త వెనక్కు తగ్గేరు.

అతని వేషభాషలు- మాట్లాడే ధోరణిలోని ఆ తీవ్రత- ఆ కానిస్టేబుల్సుని ఇరుకులో పెట్టినాయి. తాము పొరబడలేదుకదా అనే అనుమానం కల్గింది వాళ్ళకి.

"బాబుగారూ.... మా విధిని మేము నిర్వహిస్తున్నాము. మేజిస్ట్రేటుగారితో తామీవిషయం పరిష్కరించుకోవచ్చు!" అని ఆ కానిస్టేబుల్సులో ఒకడు ఎంతో మర్యాదగా అన్నాడు.

ఆ రెండో కానిస్టేబులు బేడీలు తగిలించడమా మానడమా అనే సందిగ్ధావస్థలో పడ్డాడు.

"నిద్రపోతున్న నాకు నిద్రాభంగమొనర్చి, అసందర్భంగా ప్రవర్తించి నందుకుగాను మీ అందరి అంతూ తేలుస్తాను. మీరు, మీ మేజిస్ట్రేటు చేసిన ఈ తప్పుపనికి తప్పక విచారిస్తారు!" ఆ కానిస్టేబుల్సు ఇంకేమయినా అసందర్భంగా పేలతారేమోనని కొంచెంసేపు మౌనంగా వూరు

కున్నాడు. వాళ్ళేమయినా పరుషంగా మాట్లాడితే చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తున్నందుకుగాను వాళ్ళని మరికొంతసేపు నిందించొచ్చనుకున్నాడు. కాని వాళ్ళు నోరెత్తలేదు.

"నేను నా కాలకృత్యాలను నెరవేర్చుకొని- నా సామాగ్రినంతటినీ ఎవరికయినా అప్పజెప్పి వచ్చేటంత వరకూ మీరు నిరీక్షించండి!" ఆజ్ఞాపించి నట్లుగా అన్నాడు ఇక్బల్. ఈ సారయినా వాళ్ళు తనకు వ్యతిరిక్తంగా ఏమయినా పరుషంగా అంటారేమోనని చూసేడు.

"అలాగే బాబూ! తమకు ఎంత వ్యవధి అవసరమయితే అంతా తీసుకోండి" అన్నాడో కానిస్టేబుల్.

ఆ కానిస్టేబుల్సు ప్రదర్శించిన మర్యాదకరమైన వైఖరి ఇక్బల్ యొక్క కోపాన్ని ఉపశమింప జేసింది....! అతను తలగడా జంబుఖానా పట్టుకొని క్రిందనున్న తన గదిలోకి వెళ్ళేడు. ఏవీ తొందర పడకుండా ఇక్బల్ నెమ్మదిగా తన కాలకృత్యాలు నెరవేర్చుకోసాగేడు.

అంతల్లో మీట్ సింగ్ తుమ్మపుల్లతో పళ్ళుతోముకుంటూ గురుద్వారాలోని కొచ్చాడు. గురుద్వారాలో పోలీసువాళ్ళుండటం అతనికేమంత ఆశ్చర్యాన్ని కల్గించలేదు. వాళ్ళెప్పుడైనా గ్రామానికి వచ్చినప్పుడు గ్రామాధికారి ఇంటిదగ్గర బసచెయ్యడానికి స్థలం దొరక్కపోతే గురుద్వారాకు వచ్చేస్తుంటారు. వాళ్ళేలాగా వస్తారని మీట్ సింగ్ అనుకుంటూనే వున్నాడు. వడ్డీ వ్యాపారస్తుడు హత్య చెయ్యబడ్డాడు కదామరి!

తుమ్మపుల్లను పారేస్తూ, "సత్ శ్రీ అకల్" అని వాళ్ళకేసిచూసి అన్నాడు మీట్ సింగ్.

"సత్ శ్రీ అకల్!" అని మీట్ సింగ్‌కేసి చూసి అన్నారు పోలీసు కానిస్టేబుల్సు.

"మీరు టీగాని, మజ్జిగగాని ఏమైనా పుచ్చుకుంటారా?" అని వాళ్ళ నడిగేడు మీట్‌సింగ్.

"బాబుగారిగురించి మేము నిరీక్షిస్తున్నాము" అన్నాడో కానిస్టేబుల్.

"మీరు మాకేదయినా ఇవ్వదలిస్తే అతను సిద్ధమయి వచ్చేలోగా ఇవ్వండి" అన్నాడు రెండో కానిస్టేబులు.

ఇక్బాల్‌తో వాళ్ళకేంపనో ఆ వివరాలన్నీ తెల్సుకోవడం తన కనవసర మనుకున్నాడు మీట్‌సింగ్. బహూశా ఇక్బాల్ కామ్రేడ్ అయుంటాడు! అతని మాటల ధోరణిబట్టి చూస్తే కామ్రేడ్‌లాగేవున్నాడు! ఇంతకీ తనకా విషయాలు అనవసరమనుకున్నాడు మీట్‌సింగ్.

"నేను అతనికోసంకూడా టీ చేస్తాను!" అని వాళ్ళతో అని, ఇక్బాల్‌కేసిచూస్తూ, "చెయ్యమంటారా? లేక మీ ఫ్లాస్కులో మీరు తెచ్చుకున్న టీ ఇంకా వుందా?" అనడిగేడు.

టూత్‌పేస్టు తాలూకు వుమ్మి నోట్లో వుండడంచేత, "మీ ఆదరాభిమానాలకు కృతజ్ఞుణ్ణి!" అని అస్పష్టంగా అని నోట్లోని వుమ్మిని బయటకు వుమ్మేసి, "ఈ పరికి నా ఫ్లాస్కులోవున్న టీ చల్లారిపోయుంటుంది. ఓకప్పుడు వేడి టీ ఇస్తే సంతోషిస్తాను. నేను తిరిగొచ్చేటంతవరకూ నా సామానులను భద్రపరచడానికి మీ కేమయినా అభ్యంతరముంటుందా? నన్నెందుకో వీళ్లు అరెస్టుచేస్తున్నారు. ఎందుకు అరస్టు చేస్తున్నదీ వీళ్ళకు తెలీదు!" అని అన్నాడు. ఆవిషయం తనకు వినబడనట్లు మీట్‌సింగ్ నటించేడు.

ఆ పోలీసు కానిస్టేబుల్సు కాస్త సిగ్గుపడ్డట్టుగుపడ్డారు. వాళ్ళలో ఒకడు, "బాబుగారూ! ఇది మా తప్పుకాదు. తాము తమ కోపాన్ని మామీద చూపెడితే ఏం ప్రయోజనం? అదేదో ఆ మెజిస్ట్రేటుగారిమీదే చూపెట్టండి!" అని అన్నాడు.

అతనిమాటల్ని ఏమీ పట్టించుకోకుండా మరింత వేగంగా బ్రష్‌తో పళ్ళు తోముకొని ముఖం కడుక్కున్నాడు. తువ్వాలుతో ముఖం తుడుచుకుంటూ తన గదిలోకి వెళ్ళేడు. పరుపు, తలగడాలోని గాలిని బయటకు వదిలిపెట్టి చుట్ట చుట్టేడు. ఆ తరువాత హోల్డాల్‌లోవున్న పుస్తకాలను బట్టలను, టార్చిలైటును తదితర సామాన్లను బయటకు తీసి. ఓ లిస్టు వ్రాసి మళ్ళీ వాటి నన్నింటినీ ఆ హోల్డాల్‌లో సర్దేశాడు.

మీట్‌సింగ్ అతనికి టీతెచ్చి ఇచ్చినప్పుడు ఇక్బల్ ఆహోల్డాల్‌ను అతనికి అప్పజెప్పి "భాయీజీ....! నా వస్తువులన్నీ ఈ హోల్డాల్‌లో వున్నాయి. నా యీ వస్తువుల్ని మళ్ళీ నేను వచ్చేటంతవరకూ భద్రపరచడం మీకేమంత శ్రమతోకూడినపని కాదనుకుంటాను. మన ఈ స్వాతంత్ర్య భారతదేశంలో నాకు పోలీసువారి పైకంటే మీవంటి వారి పైననే నమ్మకం ఎక్కువ!" అని అన్నాడు. ఇక్బల్ వేపు కొరకొర చూసేరా పోలీసు కానిస్టేబుల్సు.

మీట్‌సింగ్ ఇరకాటపరిస్థితిలోపడ్డాడు. అయినా కొంత అనుభవజ్ఞుడు గనక "అలాగే బాబూ తప్పకుండా చూస్తాను. పోలీసువారికి నేనెలాంటి సేవకుడినో తమకుకూడా నేనలాంటి సేవకుడినే! ఈ పవిత్రమైన గురుద్వారాలో వాళ్ళు వీళ్ళు అనే భేదం లేకుండా ప్రతి ఒక్కరికి స్వాగతమివ్వ బడుతుంది బాబూ! తాము యీ ఇత్తడి గ్లాసుతోనే టీ త్రాగేస్తారా లేక తమ స్వంత కప్పులో పొయ్యమంటారా?" అని ఎంతో వినయంగా ఎవ్వరూ తనపై ఆగ్రహం చెందకుండా వుండేటట్లు అన్నాడుమీట్‌సింగ్.

ఇక్బల్ తన సెల్యులాయిడ్ కప్పును, చెంచాను బయటకు తీసేడు. మీట్‌సింగ్ ఆ కప్పులో వేడి టీ పోసేడు. ఆ తరువాత ఇత్తడి గ్లాసులతో మీట్‌సింగ్ పోలీసు కానిస్టేబుల్సుకి టీ ఇచ్చేడు.

ఇక్బాల్ ఆ గదిలో మంచంమీద దర్జాగా కూర్చొని టీ సేవిస్తూంటే అతన్ని అరస్టు చెయ్యడానికొచ్చిన కానిస్టేబుల్సు కిక్కురుమనకుండా గడపలో కూర్చొని టీ త్రాగుతున్నారు. మీట్ సింగ్ అవతల వాకిట్లో నిలబడ్డాడు.

ఇక్బాల్‌ని ఏమనడానికి ఆ కానిస్టేబుల్సుకి గుండె ధైర్యం చాలింది కాదు. ఏమంటే ఏం ప్రమాదమోనని వాళ్ళ భయం! బేడీలు పట్టుకున్న కానిస్టేబులు ఆ బేడీలను గుప్‌చిప్‌గా జేబులో పెట్టేసుకున్నాడు.

ఇక్బాల్ ఆ కానిస్టేబుల్సు వేపు, శూన్యాకాశం వేపు సాలోచనగా చూస్తూ- కొంచెం కొంచెంగా టీ చప్పరిస్తూ మొత్తంమీద ఎలాఅయితేనేం టీ త్రాగడం పూర్తిచేసేడు. ఆ తరవాత టపీమని నిలబడి, "నేను సిద్ధంగా వున్నాను. బేడీలు తగిలించండి!" అంటూ ఓ నాటకంలోని నటుడిలా చేతులు ముందుకు చాచేడు.

"తమకు బేడీలు తగిలించాల్సిన అవసరం లేదు బాబుగారూ! కాని తాము గ్రామంలో అందరిచేత గుర్తింపబడకుండా వుండేటందుకు గాను ముఖంపై ఏదేనా ముసుగేసుకోండి?" అని ఆ కానిస్టేబుల్సులో ఒకడన్నాడు.

వాళ్ళనొక దులుపు దులపడానికి మంచి అవకాశమొచ్చిందనే ఉద్దేశంతో, "మీరు మీ విధిని నిర్వహించ వలసిన పద్ధతి ఇదేనా? నాచేతులకు బేడీలు తగిలించి తీసుకురమ్మని మీపై అధికారులు ఆజ్ఞాపించినట్లయితే అలాగే తీసుకెళ్ళండి. ఇకపోతే నా ముఖాన్ని ఎవ్వరికీ కనిపించ నీయకుండా ముసుగు వేసుకోవల్సిన అవసరం నాకేమీ లేదు! నేనేం దోపిడీ దొంగను కాని, హంతకుణ్ణి కాని కాను. నేనొక పొలిటికల్ వర్కర్ని! ఊళ్ళో అందరికీ నా ముఖం బాగా కనపడేటట్లు నేను దర్జాగా నడుస్తూ మీవెంట వస్తాను. ప్రజలకు ఏది ఇష్టంలేనిపనో, ఆ పనిని మీ పోలీసు

వాళ్ళు చేస్తున్నట్లు ప్రజలు తెల్సుకోవాల్సిన అవసరం ఇప్పుడెంతయినా వుంది....!" అని అన్నాడు.

ఆ పోలీసు కానిస్టేబుల్స్‌లో ఒకడు ఈ ధోరణిని మరీ సహించ లేక, "బాబుగారూ! మేము తమపట్ల చాలా మర్యాదగా ప్రవర్తిస్తున్నాము. తమను 'బాబూ.... బాబూ' అంటూ మన్నిస్తున్నాము. కాని తాము మాత్రం మా నెత్తిపైకెక్కి కూర్చోవాలనుకుంటున్నారు! మీకు మేము చాలాసార్లు చెప్పేము; మీపై మాకు ప్రత్యేకమైన ద్వేషమేదీ లేదని, కేవలం మేము మా విధిని నిర్వహిస్తున్నామని!" అని ఇక్బల్‌తో అని-తనతోటి కానిస్టేబుల్‌కేసి తిరిగి, "బేడీలు తగిలించవయ్యా ఇతనిచేతులకు! తన ముఖాన్ని వూళ్ళో నలుగురి ఎదుటా చూపించి పీదు చెయ్యగలిగే దేంవుందో అది చెయ్యనీ! ముసుగేసుకోడానికి తిరస్కరించాడని మనం మెజిస్ట్రేటుగారితో చెపుదాం!" అని చాలా కోపంగా అన్నాడు.

ఆ ఎత్తిపొడుపుకు వెంటనే ఇక్బల్ ఏమీ సమాధాన మివ్వలేక పోయేడు. ఇక్బల్ చేతులకు బేడీలు తగిలించేడా కానిస్టేబులు!

"సత్ శ్రీ అకల్ భాయీజీ! నేను త్వరలోనే వస్తాను" అని అన్నాడు ఇక్బల్.

"సత్ శ్రీ అకల్ ఇక్బల్ సింగ్‌జీ! భగవంతుడు తమను కాపాడ తాడు." అని ఇక్బల్‌తో అని, "సత్ శ్రీ అకల్ సెంట్రీజీ!" అని కాని స్టేబుల్స్‌తో అన్నాడుమీట్‌సింగ్.

"సత్ శ్రీ అకల్!" అని కానిస్టేబుల్స్ మీట్‌సింగ్‌కేసి చూస్తూ అన్నారు. ఆ తరువాత వాళ్ళంతా టీ కెటిల్ పట్టుకొనివున్న మీట్‌సింగ్‌ని ఒంటరిగా వదిలిపెట్టి బయలుదేరేరు.

ఇక్కడ గురుద్వారాలో ఇక్బల్‌ని అరెష్టు చెయ్యడానికి ఇద్దరు కాని స్టేబుల్స్ వచ్చినప్పుడే అక్కడ జుగుత్‌సింగ్ ఇంటిదగ్గర జుగుత్‌సింగ్‌ని

అరెష్టు చెయ్యడానికి పదిమంది కానిస్టేబుల్సు తుపాకీలు పట్టుకొనివెళ్ళేరు. వాళ్ళంతా జుగుత్‌సింగ్ ఇంటిని చుట్టుముట్టేరు.

ఆ సమయంలో జుగుత్‌సింగ్ పూర్తిగా ముసుగుతన్ని గుఱ్ఱు పెడుతూ నిద్రపోతున్నాడు. రెండు రాత్రిళ్ళు, ఒక పగలు అడవిలో తిండీ తిప్పలూ లేకుండా గడిపేడు. ఆవాళ తెల్లవారుఝామునే జుగుత్‌సింగ్ ఇంటికొచ్చేడు; గ్రామంలో ఇంకా అందరూ నిద్రపోతూనే ఉంటారనే నమ్మకంతో! కాని ఆ సమయంలో పొరుగువాళ్ళు మెలకువగా ఉండడం వల్ల వాళ్ళకళ్ళ బడ్డాడు జుగుత్‌సింగ్. వాళ్ళు పోలీసువాళ్ళకి యీభోగట్టాను వెంటనే తెలియజేసేరు.

జుగుత్‌సింగ్ పీక మొయ్యాతిని ఆదమరచి నిద్రపోయేటంతవరకూ పోలీసువాళ్ళు నిరీక్షించేరు. బయట గొళ్ళెంపెట్టి అతనితల్లి ఊళ్ళోకి ఏవో పనిమీద వెళ్ళిపోయింది. అదే మంచి సమయమనే ఉద్దేశ్యంతో ఆ పోలీసు కానిస్టేబుల్సు జుగుత్‌సింగ్ ఇంట్లోకి ప్రవేశించి, వాడు ఒళ్ళు మరచి నిద్రపోతున్న సమయంలో వాడి కాళ్ళకు సంకెళ్ళు- కుడిచేతికి బేడీలు వేశారు.

ఆ తరవాత ఆ పోలీసు కానిస్టేబుల్సు తమ తుపాకీల మడమలతో జుగుత్‌సింగ్‌ని పొడుస్తూ, "ఒరేయి జుగ్గా! లేరాలే! పొద్దుపోతోంది!" అని అన్నారు.

"ఈ ప్రపంచాన్ని మరచి పందిలాగా ఎలా నిద్రపోతున్నాడో చూడండి!" అన్నాడో కానిస్టేబుల్.

జుగుత్‌సింగ్ బద్ధకంగా లేచి నిద్రమత్తులో చేతికి తగిలించబడ్డ బేడీలకేసి, కాళ్ళకు వేసిన సంకెళ్ళకేసి ఓ వేదాంతిలా చూసి, ఓ సారి కాళ్ళూ చేతులూ బద్ధకంగా సాగదీసి 'ఊ!' అని మూల్గి కునికిపాట్లు పడసాగేడు. అతనికింకా పూర్తిగా తెలివి రాలేదు.

అదేసమయంలో అతనితల్లి ఇంటికొచ్చింది. సాయుధ పోలీసులతో తన ఇంటి వాకిలిఅంతా నిండిపోయుండడం చూసేసరికి ఆమె గుండె ఝల్లుమంది. బేడీలు తగిలించబడ్డ చేతిపై తలవాల్చి కునికిపాట్లుపడుతున్న తన కొడుకు వేపు చూసిందామె. ఆమె గబగబా కొడుకు దగ్గరకెళ్ళి గట్టిగా తట్టిలేపి- అతని వాళ్ళోపడి బిగ్గరగా రోదించసాగింది.

జుగుత్‌సింగ్‌కి నిద్రమత్తు వదిలింది. మొరటుగా తల్లిని వెనకాలకు త్రోసేసి, "ఎందుకేడుస్తున్నావు? నాకీ దోపిడీతో ఏటీ సంబంధం నేదన్న సంగతి నీకు తెల్సినదేగా?" అని అన్నాడు.

ఆమె పోలీసువారికేసి తిరిగి, "బాబూ! నా కొడుక్కీ దోపిడీతో గాని, కూనీతోగాని ఏటీ సంబంధం నేదు, నా జగ్గా యీపని సెయ్యనేదు. వీడికేటీతెల్దు! భగవంతుడిపై ప్రమానంసేసి సెప్తున్నాను! నాకొడుక్కేటీ తెల్దు!" అని ఏడుస్తూ మనవి చేసింది.

"అయితే మరి హత్యజరిగిన నాటి రాత్రి నీకొడుకెక్కడున్నాడు?" అనడిగేడు హెడ్ కానిస్టేబుల్.

"పొలంలో వున్నాడు. అంతేగాని దోపిడీ దొంగల్లోనేడు! నాను ప్రమానంసేసి సెప్తున్నాను. నామాట నమ్మండి. నా కొడుక్కీ యీ కూనీ గురించి ఏటీ తెల్దు- ఈడికీ కూనీతో ఏటీ సంబంధం నేదు."

"నీ కొడుకొక బద్మాష్! అక్టుప్రకారం నీ కొడుకు సూర్యాస్తమానం అయేక ఇల్లొదిలిపెట్టి ఎటూ వెళ్ళకూడదు. నీ కొడుక్కీ కూనీతో సంబంధం వున్నా లేక పోయినా రాత్రివేళ ఇల్లువదలిపెట్టి వెళ్ళినందుకు గాను అరస్టు చెయ్యక తప్పదు!" అని ఆమెతో అని- కానిస్టేబుల్సు కేసి చూస్తూ "ఇల్లంతా గాలించండి" అని వాళ్ళ నాజ్ఞాపించేడు.

నలుగురు కానిస్టేబుల్సు ఇల్లంతా గాలించడంలో నిమగ్నులయేరు. స్టీలు ట్రంకుపెట్టెలు- డబ్బాలు అన్నీ గాలించి చూసేరు. పెరట్లోగల గడ్డి

కుప్పలోని గడ్డిని ఊడపీకుతూంటే అందులో వాళ్ళకొక బల్లెందొరికింది.

"బహుశా దీన్ని నీ మొగుడ్ని ఎవడో గడ్డికుప్పలో దాచుంటాడు!" అని జుగుత్‌సింగ్ తల్లికేసి చూస్తూ హేళనగా అని, "ఆ బల్లెం చివరను గుడ్డతో జాగ్రత్తగా చుట్టండి. బహుశా రక్తపు మరకలుండొచ్చు!" అని కానిస్టేబుల్సుతో అన్నాడా హెడ్ కానిస్టేబుల్.

జుగుత్‌సింగ్ తల్లి లబోదిబోమని ఏడుస్తూ "దానిమీద ఏటీనేదు. నామాట నమ్మండి. వంటల్ని పాడుసేసే అడవి పందుల్ని చంపడానికి దాన్ని నా కొడుకక్కడ వుంచేడు. నా మాట నమ్మండి. భగవంతుడిపై ప్రమానంచేసి సెప్తున్నాను. నా కొడుకొట్టి అమాయకుడు!" అనంది.

"నీ కొడుకెంతటి అమాయకుడో మాకు తెలీదా ఏంటి? నీ కొడుకు వట్టి అమాయకుడని మెజిస్ట్రేటుగారి దగ్గర రుజువు చేసుకో! అప్పుడు నీ కొడుకుని వదిలేయడానికి మాకేంటీ అభ్యంతరముండదు."

ఆ ముసల్ది ఏడుపుమాని, "నా కొడుకు నిర్దోసి అని రుజువు సేసుకోడానికి నా దగ్గర సాచ్చికముంది. ఇప్పుడే తెత్తానుండండి! అని లోన కెళ్ళి. తన రేకుపెట్టి అట్టడుగునవున్న గాజుల పొట్లాం తీసుకొచ్చింది.

అప్పుడు తన కొడుకు చేతికి బేడీలు, కాళ్ళకు సంకెళ్ళు వుండడం వల్ల తను ఆ గాజుల పేకట్టు ఉదంతాన్ని బహిర్గతం చేసినా ఫరవాలేదనుకుందామె! తనాసంగతి బయట పెట్టేటప్పుడు వాడి చేతికి బేడీలు, కాళ్ళకు సంకెళ్ళు లేకపోతే అవమానంతో వెర్రెత్తిపోయి ఎంతమందినయినా హతమార్చేస్తాడు! అందుకనే ఆ పేకట్టుని జుగ్గాకి అగుపడనీయకుండా తన పెట్టి అడుగున దాచేసిందామె. అవి తన కొడుకు ప్రాణాలను కాపాడే టందుకు ఉపయోగపడతాయని అప్పుడనుకోలేదామె!

ఆ గోధుమ రంగు కాగితపు పొట్లాన్ని విప్పిందామె. బద్దలయిపోయిన గాజు లందులో వున్నాయి. హెడ్ కానిస్టేబుల్ వాటిని అందు

కాని "నీ కొడుకు నేరస్తుడు కాదనడానికి ఇవెలా తోడ్పడతాయి?" అని అడిగేడు.

ఆ దోపిడీ హంతకులు ఖూనీచేసిన తరువాత మా ఇంటి వాకిట్లోనికి పీటిని విసిరేసి ఎల్లిపోనారు. అళ్ళతో మావోడు కలవనేదనే కోపంతో మావోణ్ణి అవమానపర్చాలనే వుద్దేశ్యంతో యీ గాజుల పొట్లాన్ని బహూకరించినారు! పోనీ ఇవినావేటో అని అనుకోవడానికికూడా అవకాశంనేదు. ఇవి చాలా చిన్నవి. నా సేతులకెక్కవు. అదీగాక గాజులేసుకొనేవయస్సు కాదు నాది. నాను బాగా ముసిల్దానిని!" అనందామె.

"అయితే ఆ దోపిడీ దొంగలెవరో జుగ్గాకు తెలిసేవుంటుందన్న మాట! ఇవి మీ వాకిట్లో పడేసేటప్పుడు వాళ్ళేమన్నారు?" అనడిగేడు హెడ్‌కానిస్టేబులు.

"ఏటో అన్నారు. నాను సరిగ్గా యినలేదు. మా జుగ్గాను తిట్టినట్టున్నారు" అని ఆమె ఇంకా ఏకో చెప్పబోతుండగా "అమ్మా నువ్వు నోరు మూసుకుంటావా నేదా" అని తల్లి కేసి చాలా కోపంగా చూస్తూ అని కాని స్టేబుల్సు కేసి చూస్తూ, "అయ్యా! ఆ దోపిడీ దొంగలెవరో నాకు తెల్దు" అని అన్నాడు.

"అయితే ఈ గాజుల్ని నీకెవడు బహూకరించాడు?" ఆ గాజుల పేకట్టుని జుగుత్‌సింగ్ ఎదుటపెట్టి హేళనగా అడిగాడు హెడ్‌కానిస్టేబులు.

జుగుత్‌సింగ్ తన కోపాన్ని అదుపులో పెట్టుకోలేకపోయాడు. తన కుడిచేతిని బేడీలతోసహా మీదికెత్తి పిడికిలి బిగించి- హెడ్‌కానిస్టేబుల్ దోసిలిలోగల గాజుల పొట్లాంపై దభీమని ఓ బాదు బాది- "ఏ నంజకొడుకిలా విసిరినాడో నాకేటితెల్సు?" అని అన్నాడు మహా కోపంతో.

దాంతో ఒక్కసారిగా కానిస్టేబుల్సంతా జుగుల్‌సింగ్‌ని చుట్టుముట్టి బూట్లతో ఇష్టమొచ్చినట్లు తన్నడం మొదలెట్టారు. జుగుత్‌సింగ్ బాధతో

మూల్గుతూ కూలబడ్డాడు. అతనితల్లి ఘోరున ఏడుస్తూ పోలీసు కానిస్టేబుల్ని తప్పించుకొని- కొడుకుదగ్గరకెళ్ళి- వాడిని పట్టుకొని "బాబూ! మీకు దండమెడతాను. నా కొడుకుని కొట్టకండి. వీడు నిర్దోషి. నిర్దోషులను కొడితే భగవంతుడు మిమ్మల్ని క్షమించడు....! అసలు తప్పంతానాది... ! మావాడికేటీ తెల్దు.... కొట్టకండి" అని ప్రతిమాలింది. వాళ్ళు కొట్టడం ఆపుచేశారు.

హెడ్ కానిస్టేబులు తన చేతులలో గుచ్చుకున్న గాజుముక్కలను ఊడపీకి రక్తాన్ని చేతి రుమాలుతో తుడుచుకొని, "ఒక రంకుముండా కొడుకుచే నిజం ఎలా చెప్పించడమో మాకు తెల్సు! గట్టిగా నాలుగు తాపులు పిర్రలపై తంతే అప్పుడు వాడే నిజం చెప్తాడు.... ఇహ వీణ్ణి అవతలకు తీసుకెళ్ళండి'' అని అన్నాడు. జుగుత్‌సింగ్‌ని వాళ్ళు అవతలకు తీసుకుపోసాగారు.

వక్షస్థలంపైనా, నెత్తిపైనా బాదుకుంటూ ఎంతో హృదయ విదారకంగా విలపిస్తున్న తల్లి గురించి ఏమీ పట్టించుకోకుండా ముందుకు కాళ్ళీడ్చుకుంటూ నడవసాగాడు జుగుత్‌సింగ్.

గుమ్మం దాటబోయేముందు, "నాను త్వరలోనే ఇంటికితిరిగొస్తాను. ఒక రాత్రి ఇల్లొదిలెట్టి ఎల్లినందుకు, ఇంట్లో బల్లెమున్నందుకు మహా అయితే ఒకటి రెండు నెలలు శిచ్చిత్తారు" అని అన్నాడు జుగుత్‌సింగ్.

జుగ్గా ఎంత శీఘ్రంగా ఉద్రిక్తుడయ్యాడో అంత శీఘ్రంగా మళ్ళీ శాంతించాడు. గాజుల పేకట్టుని విసరి తనను దోపిడీ దొంగలు అవమానపరచిన సంఘటనను, పోలీసు కానిస్టేబుల్సు తనను కొట్టిన సంఘటనను గడప దాటేసరికి మరచిపోయాడు. పోలీసువారిపై అతనికి ప్రత్యేకమయిన కసిగాని, కోపంగాని లేదు. ఎంచేతంటే వాళ్ళు అందరి మానవులవంటి వాళ్ళు కారని అతని అభిప్రాయం. వాళ్ళకు ప్రత్యేకించి ఎవరిపైనా అభి

మోసం గాని, వాత్సల్యంగాని, మమతగాని, శత్రుత్వంగాని వుండవని ప్రత్యేక యూనీఫారమ్సులో వున్న విలక్షణమైన మనుష్యులు వాళ్ళని అతని అభిప్రాయం.

ముఖంపై ముసుగేసుకోవలసిన అవసరం జుగుత్‌సింగ్‌కు ఏమీ లేదు. ఎంచేతంటే ఆ గ్రామస్తులందరికీ అతనొక బద్మాష్ అని బాగా తెలుసు. చక్కగా నవ్వుతూ శృంఖలాబద్ధమైయున్న చేత్తో వీడ్కోలు చెపుతూ నడవసాగాడు. అతని కాళ్ళకుగల సంకెళ్ళు అతనిచే నెమ్మదిగా నడిపింప జేస్తున్నాయి. ఒక రాక్షసుడిలా అడుగులు భారంగావేస్తూ ముందుకు పోతున్నాడు. తన మీసాన్ని మెలివేస్తూ పోలీసువారితో పరాచకా లాడుతూ నడుస్తున్నాడు జుగుత్‌సింగ్.

నది సమీపంలో ఇక్బల్‌ని తీసుకువస్తూన్న కానిస్టేబుల్సు వాళ్ళని కలిసేరు.

వాళ్ళంతా బ్రిడ్జికేసి బయలుదేరేరు. ఆ ఖైదీలకు ముందు హెడ్ కానిస్టేబులు, కుడిప్రక్కా, ఎడమప్రక్కా వెనకాలా సాయుధ కానిస్టేబుల్సు నడవసాగారు. ఆ పోలీసు కానిస్టేబుల్సు మధ్యనున్న ఇక్బల్ బయటనుంచి చూసేవాళ్ళకు సరిగ్గా కనిపించలేదు. కాని ఆజానుబాహుడైన జుగుత్‌సింగ్‌యొక్క భుజాలు, తల పోలీసువాళ్ళ టోపీలపైనుంచి స్పష్టంగా కనిపిస్తున్నాయి. మధ్యనొక ఏనుగు, చుట్టూ గుర్రాలు వుండి ముందుకు సాగిపోతున్న వినూత్నమైన ఓ ఊరేగింపులాగుందది. ఆ సంకెళ్ళచప్పుడు, మేళతాళాలు మ్రోగుతున్నట్లుగా లయబద్ధంగా వినిపిస్తోంది. ఎవరూ మాట్లాడే స్థితిలోలేరు. అంతా మౌనంగానడుస్తున్నారు. పోలీసు కానిస్టేబుల్స్ ఏమంత ఉత్సాహంగాలేరు. కాస్త చిరాగ్గావున్నారు.

ఒక సాంఘిక కార్యకర్తను అరెస్టు చెయ్యడమనేది కొరివితో తల గోక్కున్నట్లేనని ఆ కానిస్టేబుల్సుకీ తెలుసు. అదీకాక అతని వాగ్ధోరణిని

బట్టి అతనికి రామ్‌లాల్ హత్యలో ఏమీ సంబంధం లేదని గ్రహించేరు వాళ్ళు. అతనిమీద ఇంకేవో నేరమారోపించి ఛార్జిషీటు దాఖలు చెయ్యాలి: చదువుకున్నవాళ్ళపై సాధారణంగా వంచనా శిల్పంతో నిండిన నేరారోపణ చెయ్యాల్సుంటుందనుకున్నారు వాళ్ళు.

ఇకపోతే జుగుత్‌సింగ్‌ని నేరస్తుడని ఋజువు చెయ్యడానికి పెద్దగా శ్రమపడనక్కరలేదు. రాత్రివేళ ఇల్లు వదిలిపెట్టి బయటకువెళ్ళడమనే నేరం జుగుత్‌సింగ్ చేసేడు. అయితే ఆనాటిరాత్రి ఆ గ్రామంలోజరిగిన దోపిడీలో జుగుత్‌సింగ్ పాల్గొన్నాడా అని? ఒకవేళ పాల్గొనివుంటే ఏనుగు లాంటి ఆ మనిషిని ఆ గ్రామంలో ఎవరైనాసరే చప్పున గుర్తుపట్టేసుండే వారు. బహుశా జుగుత్‌సింగ్‌కు ఆ దోపిడీలో ఏమీ సంబంధం వుండివుండక పోవచ్చునని ఆ పోలీసు కానిస్టేబుల్సు అభిప్రాయం. అయినా పదవనెంబరు రిజిష్టరులో అతని పేరు నమోదయుంది గనక- రాత్రివేళ ఇల్లు వదిలిపెట్టి వెళ్ళిపోవడమనేది చట్టవిరుద్ధమైన చర్యే. ఇకపోతే జుగుత్‌సింగ్ ఇక్బల్‌ని చూడ్డం ఇదే మొదటిసారని స్పష్టమయింది. అటువంటప్పుడు యీ ఉభయుల్నీ రామ్‌లాల్ హత్యానేరాన్ని దర్యాప్తుచేసే సందర్భంలో అరష్టు చెయ్యడం ఎంతవరకు సమర్ధనీయమా అని ఆలోచిస్తూ నడవసాగేరా కానిస్టేబుల్సు.

జుగుత్‌సింగ్‌ని అరెష్టుచేసి తీసుకొస్తున్న పోలీసు కానిస్టేబుల్సు పార్టీని కలిపేటంతవరకూ తనపై కేవలం రాజకీయంగానే నేరంమోపి అరష్టు చేసుంటారని ఇక్బల్ అనుకున్నాడు. అందుకనే పోలీసు కానిస్టేబుల్సుని ఒత్తిడిచేసి మరీ చేతికి బేడీలు తగిలించుకొని- ముఖంపై గుడ్డ కప్పుకోకుండా బోరవిరుచుకొని ఆ గ్రామంలో నడిచేడు. ప్రజాసేవ చేసేటందుకై వచ్చిన తనను పెట్టుబడిదారీ ప్రభుత్వ పోలీసులు ఎలా అగౌరవపరుస్తున్నదీ ఆ గ్రామస్తులంతా గ్రహించి ఉద్రిక్తులవుతారని ఆశించేడు.

సామాన్య పౌరుల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ఎలా హరింపబడుతున్నాయో ఆ గ్రామస్తులంతా తన అరెస్టువల్ల గ్రహించగలరని ఆశించేడు. కాని తనను ఆ గ్రామంలో జరిగిన రామ్‌లాల్ కూనీ కేసు సందర్భంలో అరెస్టు చేసినారనే విషయం తెలిసేక హతాశుడయేడు ఇక్బల్. ఇది చాలా అన్యాయమనుకున్నాడు. పోలీసువారి మూర్ఖత్వానికి వొళ్ళుమండిందతనికి. మానోమజ్రాలోవున్న ప్రతి ఒక్కరికీ తెలుసు; రామ్‌లాల్ హత్యానంతరం తనా గ్రామం వచ్చినట్లు. అదీకాక పోలీసువాళ్ళు ఏ ట్రైనులో దిగేరో- తనూ అదే ట్రైనులో దిగేడు. నిజానికి ఆ హత్యానేరంతో ఏవీ సంబంధం లేదనడానికి ఆ పోలీసువాళ్ళే సాక్ష్యం! ఇది ఎంతో హస్యాస్పద మైన పరిస్థితి. కాని యీ పోలీసువాళ్ళు తాము తప్పుచేసినట్లు ఏ పరిస్థితి లోనూ ఒప్పుకోరు. ఏదో ఒక నేరాన్ని తనపై మోపి ఛార్జిషీటు తయారు చేస్తారు. అనుమానాస్పదమైన దేశదిమ్మరనో- విదేశీయ ఏజెంటనో-అధి కారుల విధి నిర్వహణకు అడ్డు తగులుతున్నాడనో- యిలాంటి నేరాలలో ఏవో ఒకటి తనపై మోపవచ్చు.

ఎంతఘోరం! ఎంతఅన్యాయం! న్యాయంకోసం- ధర్మం కోసం తుదివరకూ తను వాళ్ళతోపోరాడాల్సుంటుందనుకున్నాడు ఇక్బల్.

జుగుత్‌సింగ్ మాత్రం ఇదేమంత తీవ్రమైన విషయంగా భావించ లేదు. అంతకు ముందతను అనేకసార్లు జైలుకెళ్ళేడు. జైలుకెళ్ళడమనేది అతనికేం క్రొత్తకాదు. వంశపారంపర్యమైన దుష్టప్రవర్తన గల వారిగా పోలీసువారి పదోనెంబరు రిజిష్టరులో కెక్కిన వాళ్ళలో జుగుత్‌సింగ్ తండ్రి అలమ్‌సింగ్ ఒకడు. అలమ్‌సింగ్ హత్యాపూరితమైన ఓ దోపిడీ కేసులో యిరికింపబడ్డాడు. భర్తను విడిపించడంకోసం జుగుత్‌సింగ్ తల్లి ఉన్న కాస్త భూమిని తణకాపెట్టి ఆ సొమ్మును లాయరికి ఫీజుక్రింద తది తర ఖర్చులక్రింద వినియోగించింది. సొమ్ము ఖర్చుపెట్టినా ఏమీ ప్రయోజ నం లేకపోయింది. నేరం ఋజువయింది. అలమ్‌సింగ్‌ని ఉరితీశారు.

విశేషం ఏమిటీ అంటే ఒక సంవత్సరం తిరక్కుముందే ఎలాగో డబ్బు సంపాదించి తణకాలోవున్న భూమిని విడిపించేశాడు జుగుత్‌సింగ్. అంత డబ్బు నతను ఎలా సంపాదించినదీ ఆవూళ్ళో ఎవ్వరికీ తెలీదు. కాని ఆ సంవత్సరాంతంలో పోలీసువారు అతన్ని అరెష్టుచేసి తీసుకు పోయేరు. అతని పేరును పదోనెంబరు రిజిష్టరులో నమోదుచేశారు. అతని పూర్వీకులంతా నెంబరు టెన్నులే గనక జుగుత్‌సింగ్ పేరుకూడా పదో నెంబరు రిజిష్టరులో నమోదవడంలో ఏమీ ఆశ్చర్యంలేదు.

తనతోటి ఖైదీకేసి జుగుత్‌సింగ్ చాలాసార్లు పరిశీలనగాచూసేడు' అతనితో మాట్లాడాలని జుగుత్‌సింగ్‌కు చాలా కుతూహలంగా వుంది. సినిమా నటుడు కెమేరాలెన్సుకేసి తన దృష్టిని కేంద్రీకరించినట్లుగా- ఇక్బల్ తన దృష్టిని ముందుకు కేంద్రీకరించి మౌనంగా నడుస్తున్నాడు.

జుగుత్‌సింగ్ ఆ మౌనాన్ని మరీ సహించలేకపోయేడు. ఇక్బల్ నుద్దేశించి, "ఏ గ్రామమయ్యా మీది?" అని అడిగేడు.

"నేను గ్రామస్తుణ్ణి కాను. ఢిల్లీనుంచొచ్చేను! ఇక్కడ పెజెంట్సు అండ్ వర్కర్సు పార్టీ ఆర్గనైజు చెయ్యమని మా నాయకులు పంపేరు. కాని మన ప్రభుత్వంవారికి శ్రమజీవుల్ని చైతన్యవంతుల్ని చేసేవారంటే బొత్తిగా గిట్టదు." అని జుగుత్‌సింగ్‌కేసి అదోలాచూస్తూ సమాధాన మిచ్చాడు ఇక్బల్.

ఇక్బల్ సామాన్యమైన వ్యక్తి కాదని తెలుసుకున్నాక అతనిపై జుగుత్‌సింగ్‌నకు ఎంతో గౌరవ భావం కల్గింది.

"బాబూ! ఇప్పుడు మనోళ్ళే మనల్ని పరిపాలిస్తున్నట్లిన్నాను. ప్రెస్తుతం ఢిల్లీలో గాంధీగారి ప్రెభుత్వం వున్నట్లు మావూళ్లో వోళ్ళనుకుం టూంటే విన్నాను. నిజమేనా?" అనిఅడిగాడు జుగుత్‌సింగ్ ఎంతో వినయ విధేయతలతో.

"బాను ఇంగ్లీషువారు మన దేశాన్ని వదిలిపెట్టి పోయారు. కాని ఆ స్థానాన్ని భారతదేశంలోగల పెట్టుబడిదారులు, వారి అభిమానులు ఆక్రమించారు. నీకుగాని, నీతోటి శ్రమ జీవులకుగాని యీ స్వాతంత్ర్యంవల్ల ఏమైనా ప్రయోజనం చేకూరిందంటావా? కడుపునిండా తినడానికి తిండి, కట్టుకోడానికి బట్టా, తలదాచుకోడానికి యిల్లు ఎంతమందికి లభ్యమయేయి? బ్రిటీషువారి పరిపాలనలో నీ చేతులకు ఏ బేడీలు వేయబడ్డాయో, నీకాళ్ళకు ఏ సంకెళ్ళు తగిలించబడ్డాయో ఇప్పుడూ అవే వున్నాయి. మనమంతా ఏకమై విప్లవజ్వాలలను రేకెత్తించాలి. ఈ బేడీలను తప్పితే మనం యింకేమీ పోగొట్టుకోనవసరంలేదు." ఇక్బాల్ ఈ ఆఖరివాక్యాన్ని గట్టిగా ఒత్తిపలుకుతూ శృంఖలాబద్ధమైన తన చేతుల్ని మీదికెత్తి త్రెంపేస్తాడేమో నన్నంత గట్టిగా విదిలించాడు. పోలీసువారు ఒకరి ముఖాల్ని ఒకరు చూచుకున్నారు.

జుగుత్‌సింగ్ తన కాళ్ళకు వేయబడ్డ సంకెళ్ళను- చేతికి వేయబడ్డ బేడీలను ఓసారి చూచుకొని "నానొక బద్మాష్‌ని- అంచేత ఏ పెబుత్వ మొచ్చినా నాకు శిచ్చ తప్పదు" అని అన్నాడు.

"నువ్వొక బద్మాష్‌గా రూపొందడానికి ఎవరు కారకులో తెలుసా? ఈ ప్రభుత్వం తన కనుకూలమయిన చట్టాలను రూపొందించి, వాటిని ఖచ్చితంగా అమలు జరిపేటందుకుగాను పోలీసుబలగాన్ని, రిజిష్టర్లను అన్నింటినీ ఆధీనంలో వుంచుకుంది. తన కెవరయినా నచ్చకపోయినట్లయితే అతన్ని ఒక దుష్ప్రవర్తన గలవాడిగా తీర్మానించి ఓ నేరస్తుడుగా సమాజం ఎదుట నిలబెట్టి శిక్షిస్తుంది. ఇప్పుడు ఉదాహరణకు నా విషయమే........"

జుగుత్‌సింగ్ మధ్యలోనే అడ్డుతగిలి, "బాబూ! నానోమాట సెపతా నింటారా? ఇదంతా మన కర్మ! మన నుదుటిపైన ఆబెమ్మ యిలారాసేడు.

బొమ్మ రాతనెవరూ తప్పించుకోలేరు. ఏ పనీపాటూ నేకుండా నా నూరికినే సోమరిపోతులాగ కూకోలేను. యవసాయపు పనులున్న రోజుల్లో నేనా పనుల్లో మునిగిపోతాను. ఇకపోతే ఏ పనిపాటూ లేనప్పుడు నా సేతులు గొప్పగా సలుపెడతాయి. ఆ సలుపు తగ్గడంకోసం నేనేదో ఓపని సేత్తా వుంటాను. అదెప్పుడూ ఏదో వో దొంగ యెధవపనే అవుతూంటుంది" అన్నాడు జుగత్‌సింగ్ కొ స్త హాస్యధోరణిలో.

జుగత్‌సింగ్‌వంటి మూఢ గ్రామీణ బద్మాష్‌తో వాదించడంకోసం తన శక్తిని వృధాచేసుకోవడం అవివేకమనుకున్నాడు ఇక్బల్. ఆ మెజిస్ట్రేటుకు తగిన విధంగా సమాధానమివ్వడంకోసం తన శక్తిని దాచుకోవాలనుకున్నాడు.

మరి కాస్సేపటికి వాళ్ళంతా రెస్టుహౌసు చేరుకున్నారు. ఆ ఖైదీలను సేవకుల క్వార్టర్సు వద్దకు తీసుకుపొమ్మని సబ్ ఇనస్పెక్టరు ఆ పోలీసు కానిస్టేబుల్ను ఆజ్ఞాపించేడు.

ఆ సమయంలో మెజిస్ట్రేటు తన గదిలో ముస్తాబవుతున్నాడు. హెడ్ కానిస్టేబులు ఆ ఖైదీలను సర్వెంట్సు క్వార్టర్సువద్దవుంచి- అక్కడ కానిస్టేబుల్నని కాపలాగావుంచి తాను రెస్టుహౌస్‌కి తిరిగి వచ్చాడు.

"నువ్వు తీసుకొచ్చిన ఆ యువకుడెవరు?" అని కొస్త వ్యాకులపాటుతో హెడ్‌కానిస్టేబుల్ని అడిగాడు సబ్ ఇనస్పెక్టర్.

"తమ ఆజ్ఞానుసారమే నేనతన్ని అరెస్టుచేశాను. సిక్కు దేవాలయంలో బసచేసిన ఓ పరాయి ప్రాంతంవాడతను" అని సమాధానమిచ్చాడు హెడ్‌కానిస్టేబులు.

ఈ సమాధానం ఆ సబ్ ఇనస్పెక్టర్ని కోపోద్రిక్తుణ్ణి చేసింది. "కొస్త స్వంతంగా ఆలోచించేశక్తి నీకు రవ్వంతయినా లేనట్లుంది. నేను నీకో చిన్నపని చెప్పేను. నువ్వేమో కొందరికి తెద్దునా అందరికీ తెద్దునా

అన్నంత వెధవపని చేసుకొచ్చేవు. నిన్న మనతోపాటు ట్రైను దిగిన వ్యక్తేగా ఆ యువకుడు? కళ్ళుమూసుకుని మరీ అరెస్టుచేశావా ఆ యువకుణ్ణి?" అని అడిగాడు.

"సార్....! నాకు తెలియదు సార్! నిన్న నేనతన్ని ట్రైనులో చూడలేదుసార్! అనుమానాస్పదమైన పరిస్థితిలో మానోమజ్రా గ్రామానికి వచ్చిన ఈ క్రొత్తవ్యక్తిని తమ ఆజ్ఞానుసారమే ఏమీ ఆలస్యం చెయ్యకుండా అరెస్టు చేశాను సార్? ఇందులో నా తప్పేమీ లేదు సార్!" అని ఎంతో వినయంగా మనవి చేశాడా హెడ్‌కానిస్టేబులు.

పళ్ళు పటపట కొరుకుతూ "నువ్వొట్టి గాడిదవు! నీకు బుద్ధీ జ్ఞానం రవ్వంతైనా లేదు!" అన్నాడు కోపంతో మండిపడుతూ.

"సార్! నన్ను క్షమించండి సార్! ఇంతకీ నా తప్పు...."

"షటప్!" అని ఉరిమి చూసేడు.

ఆ హెడ్ కానిస్టేబులు నోరు మూతపడింది. తల దించుకున్నాడు. అతని దృష్టి అతని పాదాలమీద కేంద్రీకరింపబడింది.

సబ్ ఇనస్పెక్టర్ కొంత చల్లబడ్డాడు! ఇహ తను హుకుమ్‌చాంద్ ఎదుట పడాల్సింది! అతను తననెంతో గాఢంగావిశ్వసిస్తున్నాడు. కొంచెం సేపు ఆలోచించి తలుపు సందులోంచి లోనకు తొంగిచూసి, "సార్! నేను లోపలకు రావొచ్చా?" అని విధేయత ఉట్టిపడే గొంతుకతో నెమ్మదిగా అడిగేడు సబ్ ఇనస్పెక్టర్.

"రావయ్యారా! నా విషయంలో మాత్రం నువ్వే సాంప్రదాయాల్ని పాటించాల్సిన అవసరం లేదు. లోపలకు రా!" అని అన్నాడు హుకుమ్‌చాంద్.

ఆ సబ్ ఇనస్పెక్టర్ గదిలోకెళ్ళి హుకుమ్‌చాంద్‌కి శాల్యూట్ చేసేడు.

అప్పుడే గీసుకున్న నున్నని గెడ్డంపై క్రీమ్ రాసుకుంటూ "ఊః! ఇంతవరకూ నువ్వేంచేశావు?" అని అడిగేడు.

సబ్ ఇనస్పెక్టర్ గొంతుక సవరించుకొని, "సార్! ఇవాళుదయం మేము ఇద్దర్ని అరెస్టుచేశాము! ఆ ఇద్దరిలోనూ ఒకడు బద్మాష్‌గా యీ ప్రాంతంలో పేరుబడ్డ జుగుత్‌సింగ్. మానోమజ్రాలో దోపిడీ జరిగిననాటి రాత్రి జుగుత్‌సింగ్ ఇంటివగ్గర లేడు. వాడి ద్వారా కొంత భోగట్టా రాబట్టగలమనే నమ్మకం నాకుంది! ఇకపోతే ఆరెండోవాడు యీప్రాంతం వాడు కాడని గ్రామ హెడ్మన్‌చే తెలియజేయబడింది. అతనిని అరెస్టు చెయ్యమని తమరాజ్ఞాపించేరు!"

క్రీమ్‌తో గెడ్డం రుద్దడాన్ని హుకుమ్‌చాంద్ ఆపుచేసేడు! ఇదేంవిటిది? ఆ యువకుణ్ణి తను అరష్టు చెయ్యమన్నాడా? ఇంతకీ ఎవడు చెప్మా వాడు?

సబ్ ఇనస్పెక్టరు ముఖంలోకి నిశితంగా చూస్తూ, "ఎవడతను?" అని అడిగేడు హుకుమ్‌చాంద్.

అవతల నిలబడున్న హెడ్ కానిస్టేబుల్ని లోనికి రమ్మనమని కేకేశాడు సబ్ ఇనస్పెక్టరు.

అతను ఆదరాబాదరాగా లోనికొచ్చి శాల్యూట్ చేసి అంటెన్షన్‌లో నిలబడ్డాడు.

"సిక్కు దేవాలయంలో నువ్వు అరెస్టు చేసిన ఆ యువకుడి పేరేంవిటి?" అనడిగేడు సబ్ ఇనస్పెక్టరు.

"ఇక్బల్!"

"ఏ ఇక్బల్?" హుకుమ్‌చాంద్ గట్టిగా గద్దించి అడిగేడు.

"ఇప్పుడే కనుక్కొని వస్తాను సార్!" అనంటూ సర్వెంట్సు క్వార్టర్సుకేసి అడ్డుగా పరుగెట్టుకొని వెళ్ళేడు హెడ్‌కానిస్టేబులు. అది పరుగుకాదు! ఎగరడం!

హుకుమ్‌చాంద్‌కి అంతకంతకు కోపం ఎక్కువవుతోంది! గ్లాసులో ఫ్రూట్‌సాలిడ్ కలుపుకొని కొంచెం త్రాగేడు! ముళ్ళ మీదున్నట్లుందా సబ్ ఇనస్పెక్టరికి!

కొద్ది నిముషాల తరువాత పరుగెత్తుకొని వచ్చాడు హెడ్‌కానిస్టేబులు. "సార్!" ఆయాసంవల్ల దగ్గు ముంచుకొచ్చింది. దగ్గడం పూర్తయేక, "సార్! అతనికి చదవడం వ్రాయడం వొచ్చు. బాగా చదువుకున్నాడు!" అని అన్నాడు.

ఆ డిప్యూటీ కమీషనర్ అతనికేసి కోపంగా చూస్తూ, "అది సరేనయ్యా! అతనికి తల్లీ తండ్రి, ఊరు పేరు, దిక్కూ మొక్కూ, దాతా దైవం ఎవరేనా వున్నారా లేరా?" అనడిగాడు.

ఆ హెడ్ కానిస్టేబులు తడబడుతూ, "సార్! అతను తన తండ్రి పేరు.... తండ్రి పేరు చెప్పనన్నాడు సార్: అతనికి మతమేదీలేదట సార్! అతను తమతోనే మాట్లాడతానన్నాడు సార్!" అని సమాధానమిచ్చాడు.

"గొప్ప పొగరుబోతులాగున్నాడే! అడిగిన ప్రశ్నలన్నింటికీ సరిగ్గా సమాధానాలు చెప్పేటంతవరకూ వాడివొళ్ళు హూనంచెయ్యి! ఊం! త్వరగా వెళ్ళు!" అని సింహంలా గర్జించి- "నువ్వుండు! ఈ వ్యవహారం ఈ సబ్ ఇనస్పెక్టరు స్వయంగా చూస్తాడు!" అని ఆ హెడ్ కానిస్టేబులుతో అని- సబ్ ఇనస్పెక్టరు కేసి తిరిగి, "ఏఁవయ్యా సబినస్పెక్టరూ! నువ్వూ నీ పోలీసు కానిస్టేబుల్సు మహా గొప్ప తెలివైనవాళ్ళలాగున్నారు! వ్యక్తుల పేర్లుగాని, వాళ్ళ పుట్టుపూర్వోత్తరాల గురించిగాని, మతంగురించిగాని, కులం గురించిగాని, వాళ్ళ మంచి చెడ్డల గురించిగాని ఏఁవీ తెల్సుకోకుండా అరస్టు చేస్తూంటారన్నమాట! బ్లాంక్ వారంట్సు నా దగ్గరనుంచి పట్టుకెళ్ళి అరష్టుచేసి- ఆ పాపాన్ని నాకు చుట్టబెడుతున్నారు. ఏదో ఒక

రోజున గవర్నరుగారినికూడా అరెస్టుచేసేసి- హుకుమ్‌చాంద్ ఆజ్ఞానుసారం అరెష్టు చేసినట్లు చెపుతారు! నన్నీ ఉద్యోగంలో మీరుండనిచ్చేటట్లులేరు!" అని అన్నాడు.

"క్షమించండి సార్! నేను స్వయంగా ఈవిషయమై దర్యాప్తు చేస్తాను. ఆ యువకుడు మానోమజ్రా నిన్ననే వచ్చాడు. వాడెవడో ఎందు కొచ్చాడో ఆ వివరాలన్నీ నేను స్వయంగా కనుక్కొని వస్తాను".

"సరే! వెళ్ళండి. త్వరగా వెళ్ళి వాడి సంగతి కనుక్కొని రండి. అలా దిగభ్రమసిపోయి నాకేసిచూస్తూ యిక్కడ ఇహ నిలబడకండి. వెళ్ళండి!" అని అరచాడు హుకుమ్‌చాంద్. శాల్యూట్‌చేసి ఆ ఇద్దరూ ఆ గదిలోంచి బయటకొచ్చారు:

మహా కోపోద్రిక్తుడై యున్న ఆ మెజిస్ట్రేటు యొక్క సంకల్పమేం విటో ఆ సబ్ ఇనస్పెక్టరు అవగాహన చేసుకున్నాడు! ఆ తెలివితక్కువ చాదస్తపువని విషయమై ఇహ ఏదో ఒక గట్టిచర్య తీసుకోక తప్పదను కున్నాడు.

సర్వెంట్సు క్వార్టర్సుకి వెళ్ళేడు. ఇక్బల్‌ని పట్టుకొచ్చిన కానిస్టే బుల్సు- జుగుత్‌సింగ్ పార్టీకి కాస్త దూరంగా నిలబడున్నారు. దెబ్బతిన్న హుందాతనంతో నిండివుందా యువకుడిచూపు- ఆసమయంలో అతనితో మాట్లాడడం అంత మంచి పని కాదనుకున్నాడా సబ్ ఇనస్పెక్టరు.

"ఏదో ఓ గదిలోకి ఇతనినితీసుకెళ్ళి ఇతని దుస్తుల్ని తొలగిం చండి.... నేను స్వయంగావచ్చి పరిశీలిస్తాను" అని కానిస్టేబుల్సుని ఆజ్ఞా పించాడు. ఇక్బల్ ఆ మెజిస్ట్రేటుతో ఏమని మాట్లాడదామనుకున్నాడో అదంతా అతని గొంతుకలోనే వుండిపోయింది. ఒక కానిస్టేబులు బేడీలు పట్టుకొని ఇక్బలుని ఓ గదిలోకి ఈడ్చుకు పోయాడు.

ఇక్బల్ నిర్వీర్యుడయిపోయేడు. ఇహ చేసేదేమీలేక తన చొక్కా విప్పి ఆ కానిస్టేబులు చేతికిచ్చేడు. సబ్ ఇనస్పెక్టరు లోపలికొచ్చేడు. ఆ చొక్కాను పరిశీలించడంకోసం అతను కాలం వృధాచేయలేదు.

"షరాయి విప్పు" అని ఆజ్ఞాపించాడు.

ఇక్బల్ అవమానభారంతో కృంగిపోయాడు. ఆ పోలీసువాళ్ళతో వివాదపడడంవల్ల ఇహ ఏేమీ ప్రయోజనముండదనుకున్నాడు. "నేనేమీ లోనదాచుకోలేదు. అసలు నా యీషరాయికి జేబులూ లేవు'' అనిఅన్నాడు.

"ఇక నాతో వాదించక ముందు షరాయి విప్పు" అని లాటీతో తన కాకీ ఫేంటుపై తట్టాడు: తన ఆజ్ఞలో గల కరుకుదనాన్ని వ్యక్త పరచేటందుకు.

ఇక్బల్ తన షరాయి నాడా ముడిని విప్పాడు, అది జారి క్రిందకు పడింది. ఇహ బాగా పరిశీలించి చూసుకోండన్నట్లు ఇక్బల్ నగ్నంగా నిలబడ్డాడు.

"ఊఁ.... మరవసరంలేదులే.... నువ్వు నీ బట్టలిక తొడుక్కో వచ్చు" అని కొంచెంసేపు వూరుకొని, ''నువ్వొక సాంఘిక కార్యకర్తవని తెలిసింది. అయితే మరి మానోమజ్రాలో నీ పనేమిటి?'' అని అడిగాడు.

షరాయి తొడుక్కొని- నాడా ముడివేస్తూ "మాపార్టీవారిచే నేనిక్కడకు పంపబడ్డాను." అని సమాధానమిచ్చాడు.

"ఏ పార్టీ?"

"పీపుల్సు పార్టీ ఆఫ్ ఇండియా"

ఇక్బల్ ముఖంలోకి ఓసారి నిశితంగాచూసి- అదోలానవ్వి "పీపుల్సు పార్టీ ఆఫ్ ఇండియానా" అని ప్రతిపదమూ ఒత్తిపలికి ''అది ముస్లిమ్ లీగుకు సంబంధించినది కాదని నిశ్చయంగా చెప్పగలవా" అనడిగాడు.

ఆ ప్రశ్నలోగల అంతరార్థం ఇక్బల్‌నకు అవగతమవలేదు. "కాదు. అయినా నేను ముస్లిమ్‌లీగు మెంబర్ని ఎందుకవాలి? ఇంతకీ నేను..." ఇక్బల్ ఇంకా వాక్యం పూర్తి చెయ్యకముందే ఆ గదిలోంచి అవతల కెళ్ళిపోయి ఆ ఖైదీలను పోలీసు స్టేషనుకు తీసుకురమ్మనమని కానిస్టేబుల్ని ఆజ్ఞాపించాడు. ఆ తరవాత మళ్ళీ రెస్టుహౌస్‌కి వెళ్ళాడు; తను చేసిన పరిశోధన గురించి మెజిస్ట్రేటుకు తెలియజెయ్యడానికి.

అతి వినయ విధేయతలతో నిండిన చిరునవ్వొలకబోస్తూ "సార్ అంతా తెల్సుకున్నాను. పీపుల్సు పార్టీ వారిచేత తను పంపబడినట్లు అతను చెప్పాడు. కాని వాడు ముస్లిమ్ లీగ్‌నకు చెందిన వాడయుంటాడని నా ఉద్దేశ్యం. వాళ్ళు ఇంచుమించు ఇలాగే వుంటారు. సరిహద్దులలో అలజడి రేకెత్తించడానికి పూనుకున్నాడని వాడిపై మనం నేరారోపణ చెయ్యొచ్చు... ఆ తరవాత వానిపై తగిన సాక్ష్యాధారాలతో మనం కేసుపెట్టొచ్చు!"

"వాడు ముస్లిమ్‌లీగరేనని నువ్వెలాగ భావిస్తున్నావు?"

మందస్మితవదనంతో, "నేను వాడిని దిగంబరుణ్ణిచేసి చూసాను సార్!" అని అన్నాడు.

"అయితే ఇక అరెస్టు వారంటుని కరక్టుగా నింపేయి: పేరు మొహమ్మద్ ఇక్బల్! తండ్రి పేరు మొహమ్మద్. లేదా ఇంకేదయినా పేరు లేదా తండ్రిపేరు తెలీదు. మతం: ముస్లిమ్. వృత్తి ముస్లిమ్‌లీగు కార్యకర్త. ఇలా నింపేయ్ వారంటు ఫారాన్ని."

"అలాగే సార్!" అని కొంచెంసేపు వూరుకొని "ఇక నేను సెలవు తీసుకుంటాను సార్!" అని శాల్యూట్ చేసి వెళ్ళిపోడాని కుద్యుక్తుడయ్యాడు.

"ఆగాగు....! ఎప్పుడూ సగం సగం పనులు చెయ్యకు. ఆ చేసేదేదో పూర్తిగా చెయ్యి. పోలీసు డైరీలో రామ్‌లాల్ హత్యకు సంబంధిం

చిన హంతకులింకా పట్టుబడలేదని- కాని వాళ్ళకు సంబంధించిన భోగట్టా త్వరలోనే తెలుస్తుందని వ్రాయి. ఇంతకీ జగ్గాకు హంతకులెవరయినదీ తెలుసంటావా?"

"తెలిసే వుంటుంది సార్....! ఆ దోపిడీదొంగలు గ్రామం వదిలి వెళ్ళిపోయేముందు జగ్గా ఇంటి వాకిట్లోకి ఓ గాజుల పేకట్టు గిరాటేశారు- దీన్నిబట్టిచూస్తే జగ్గా వాళ్ళతో కలవలేదనే విషయం విదితమవుతోంది. తమతో జగ్గా చేతులు కలపలేదనే కోపంతో ఆ దోపిడీదొంగలు, జగ్గ యింటి వాకిట్లోకి వాడిని అవమానపరచాలనే ఉద్దేశ్యంతో గాజుల పేకట్టు గిరాటేసుంటారు. వాళ్ళెవరయినదీ బహుశా జగ్గాకు తెలిసే వుంటుంది సార్" అని సమాధానమిచ్చాడు.

"అయితే వాడిద్వారా వేగరం ఆ పేర్లు రాబట్టు, అవసరమయితే వాడిని చితకబాదు."

"వాడిని కొట్టకుండానే ఇరవైనాలుగు గంటలలో ఆ దోపిడీ దొంగల పేర్లను వాడిచేత చెప్పిస్తాను" అని సగర్వంగా అన్నాడా సబ్ ఇనస్పెక్టరు.

"అలాగే కానియ్యి! సీకిష్టమైన పద్ధతిలోనే వాళ్ళ పేర్లు రాబట్టు!" అని కాస్త విసుగ్గా అని, ఓ చిన్న పొడి దగ్గుదగ్గి ఆఁ....! అన్నట్లు చెప్పమరచాను. ఇవాళ చేసిన రెండు అరెస్టుల భోగట్టా రిజిష్టరులో రెండు ప్రత్యేకమయిన పేజీలలో వేరువేరుగా నమోదు చెయ్యి. ఈ రెండు అరెస్టుల మధ్య మరికొన్ని యితర అరెస్టులు నమోదు చెయ్యడానికి అవకాశ ముండేటట్లు జాగ్రత్తపడు. అన్నింటినీ కలగా పులగం చేసెయ్యకు" అని హెచ్చరించాడు.

"అలాగేసార్....! నేను చాలా జాగ్రత్తగా ఎంటర్ చేస్తాను" అని మరోసారి శాల్యూట్ చేసి వెళ్ళిపోయాడు సబ్ ఇనస్పెక్టరు.

ఇక్బాల్‌ని జుగ్గాను ఒక టాంగాలో "చుందున్నగర్" పోలీసు స్టేషనుకు తీసుకురమ్మని కానిస్టేబుల్సుకి ఆజ్ఞాపించి, తను ముందుగా పోలీసు స్టేషనుకు సైకిలుమీద వెళ్ళిపోయాడు.

ఇక్బాల్ విద్యాధికుడయినందున అతనిని గౌరవించాలనే సంకల్పంతో టాంగాలో ఫ్రంటుసీటు మధ్యని అతనిని కూర్చోబెట్టేరు. టాంగా డ్రైవరు తన మామూలు జాగాలో కూర్చోకుండా గుఱ్ఱానికి ఇటూ అటూ వున్న అడ్డుపట్టెలలో ఒక దానిపైన కూర్చొని తోలుతున్నాడు. జుగుత్ సింగ్ టాంగా వెనకాలనున్న సీటుపై పోలీసు కానిస్టేబుల్సు మధ్య కూర్చున్నాడు. అది బాగా దుమ్మురేగే మట్టి రోడ్డు- రైలు రోడ్డుకి సమాంతరంగా వేయబడింది.

అటువంటి ప్రయాణం జుగ్గాకు క్రొత్తేంకాదు! అలవాటే....! ఆ రహదారి జుగ్గాకు బాగా పరిచితమయినదే! ఆ పోలీసు కానిస్టేబుల్సుకూడా జుగ్గాకు కొద్దో గొప్పో తెలిసినవాళ్ళే! అంచేత అదేదో పెద్ద అవమానకరమైన విషయంగా భావించి జుగుత్‌సింగ్ మౌనంగా వుండలేక పోయేడు! "ఈ రోజుల్లో మీ పోలీసు స్టేషనులో సాలామంది ఖైదీలుంటారు!" సంభాషణ కుపక్రమించేడు జుగుత్‌సింగ్.

"అబ్బే! ఒక్కడూ లేడు! మత కలహాలలో పాల్గొంటున్నవాళ్ళను మేము అరష్టు చెయ్యడంలేదు. తరిమివేస్తున్నాము. ఈ గొడవల్లో ఇతర నేరస్తులను పట్టుకోడానికి నిజానికి మాకు తగినంత వ్యవధి వుండటం లేదు. గత వారం రోజులలో మేము మిమ్మల్నే అరష్టుచేశాము. ప్రస్తుతం రెండు సెల్లులూ ఖాళీగానే వున్నాయి. నువ్వొక్కడివి ఒక దాంట్లో అంచక్కా వుండొచ్చు!" అని సమాధానమిచ్చాడో కానిస్టేబులు.

"బహుశా బాబుగారికి అలా ఒంటరిగా వుండడమే ఇష్టమనుకుంటాను! ఏం బాబూ! తమకిష్టంలేదా?" ఇక్బాలుని ఉద్దేశించి అడిగేడు జుగుత్‌సింగ్.

అందుకు ఇక్బల్ సమాధానమివ్వలేదు. ఆ సంభాషణను మార్చాలనే ఉద్దేశంతో, "ఈ హిందూస్తాన్, పాకిస్తానుల ఏర్పాటువల్ల మీకు చేతులనిండా పని తగిలినట్లుంది!" అని ఓ కానిస్టేబులు కేసి చూసి అన్నాడు జుగత్‌సింగ్.

"అవును! ఈ దారుణమైన మారణహోమ సమయంలో మా పోలీసు బలగం సగంకంటే అధికంగా తరిగిపోయింది!"

"ఎందుకని? వాళ్ళు పాకిస్తానులో కలిసిపోయేరా?"

"ఏమో! ఆ సంగతి నాకు తెలీదు: వాళ్ళుమాత్రం వెళ్ళడానికిష్టపడలేదు. స్వాతంత్ర్య దినోత్సవంనాడు సూపరింటెండెంటు బాబుగారు ముస్లిమ్ పోలీసులనందర్నీ నిరాయుధుల్ని చేసేరు! వాళ్ళు పారిపోయేరు: మనలో మనమాట! వాళ్ళ ఉద్దేశాలు మంచివికావు. వాళ్ళను మనం ఎప్పుడూ నమ్మకూడదు!" అని అన్నాడా కానిస్టేబులు.

మరో కానిస్టేబులు, "ఔను! నిజమే! వాళ్ళు లాహోరులో గల హిందువుల్ని ఎన్నో నరకయాతనలు పెట్టడానికి తోడ్పడ్డారట! మత విద్వేషాలను రెచ్చగొట్టే వాళ్ళకు ముస్లిమ్ పోలీసుల మద్దత్తుకూడా వుందట!" అని అన్నాడు.

"అసలు వాళ్ళ ఆర్మీకూడా అటువంటిదే! సిక్కు లేక గూర్ఖా ట్రూప్సు లోనికి తల దాచుకొనేటందుకు పరుగెత్తే అవకాశం లేని ప్రజల్ని బెలూచీ సోల్జర్లు నిలువునా కాల్చి చంపేస్తున్నారట!"

"భగవంతుడు విధించే శిక్షనుండి అట్ళు తప్పించుకుపోనేరు! అసలీ పెపంచకంలో ఎవ్వరూ భగవంతుడిధించే శిక్షనుండి తప్పించుకోనేరు!" అని జుగత్‌సింగ్ అనేసరికి అంతా అతనికేసి ఆశ్చర్యంతో చూసేరు. ఇక్బల్‌కూడా వెనుదిరిగి చూసేడు; అది జుగత్‌సింగ్ కంఠస్వరమేనని నిశ్చయించుకొనేటందుకు.

"బాబుగారూ! తామేటంటారు? తాము తెలివైనోరు! నేనన్నది నిజమా కాదా? సెప్పండి బాబూ సెప్పండి! భగవంతుడిధించే శిచ్చను ఎవురైనా తప్పించుకోగల్రా?" అనడిగాడు జుగ్గా ఇక్బల్‌నుద్దేశించి! అందుకు ఇక్బల్ సమాధానమివ్వలేదు.

"దేఁవుడిఘించే శిచ్చను ఎవరూ తప్పించుకోనేరు! భాయి మీత్ సింగ్ నాకు సెప్పిన ఓ విసయం మీకిప్పుడు సెపతాను. ఇది మీరంతా జాగ్రత్తగా వినాల్సిన విసయం! రూపాయిలో పదహారణాల విలువచేసే విసయం!" ప్రతి రూపాయి విలువా పదహారణాలే అయినప్పుడు అందులోని విశేషత ఏఁవిటో ఇక్బలుకి బోధపడలేదు. జుగ్గా చెప్పే విషయం వినేటందుకతను ఏఁవీ ఆసక్తి కనపరచలేదు. జుగుత్‌సింగ్ చెప్పడం మొదలెట్టేడు.

"అమృతసర్‌నుంచి లాహోరుకి ఓ ట్రక్కునిండా బెలూచీ సిపాయిలు వస్తున్నారట! అఖ్ఖ పాకిస్తాన్ సరిహద్దు కాడికొచ్చినాక తమ తుపాకీల సివర్నిగల బాకులతో ఆ రోడ్డంట పోతున్న ఎంతోమఁది సిక్కులను పొడిచి సంపేసినారట! ఎవుడైనా సిక్కు సైకిలుమీదగాని నడచిగాని ఆ రోడ్డంట పోతూంటే, అది ప్రక్కనుంచి ట్రక్కును నెమ్మదిగా డ్రైవరు పోనిచ్చేవోడట! అప్పుడు పుట్‌బోర్డుపైనున్న సిపాయిలు ఆడిని తమ తుపాకీ మడమలతో వెనక్కు ఒక్క తోపు తోసేసేవోరట! వెంటనే డ్రైవరు ఆడిపైనుంచి స్పీడుగా ట్రక్కును తోలుకు పోయేవోడట! ఈ తీరులో ఎంతోమందిని సంపేసినారట! పాకిస్తాను సమీపిస్తున్న కొద్దీ మరింత ఉల్లాసంగా మనుషుల్ని తొక్కించుకుంటూ పోతున్నారట! ఇహ పాకిస్తాన్ సరిగ్గా ఓ మైలు దూరంలో వుందట! గొప్ప స్పీడుగా డ్రైవరు డ్రైవు సేత్తున్నాడట! అంతల్లో ఏటయిందో తెలుసా?"

"ఏఁవయింది?" అని ఓ పోలీసు కానిస్టేబులు అడిగాడు.

ఒక్క ఇక్బల్ మినహా మిగిలిన వాళ్ళంతా ఎంతో శ్రద్ధగా వింటున్నారు. ఆఖరికి టాంగావాలాకూడా గుఱ్ఱం తోలడం మానేసి వెనుదిరిగి వింటున్నాడు.

"వినండిబాబూ వినండి. ఇక్కడే జాగ్రత్తగినాల! అ డ్రైవరు గొప్ప స్పీడుగా డ్రైవుసేత్తా ఎల్తాండగా, ఓ గజ్జికుక్క రోడ్డుకడ్డంగా పరుగెట్టినాది! సాలామంది మనుసులపైనుంచి బుద్ధిపూర్వకంగా ట్రక్కును తోలుకుపోయి ఆళ్ళ సావుకి కారకుడైన ఆ డ్రైవరు- ఆ గజ్జికుక్కను రచ్చించడం కోసమని ట్రక్కుని కసింత కుడి పక్కకు కోసేడు! అంతే! టక్ మని ఓ పెద్ద చెట్టుకు గుద్దేసినాదా ట్రక్కు! ఆ డ్రైవరు ఇద్దరు సిపాయిలు అక్కడికక్కడే సచ్చినారు. మిగిలిన వోళ్ళంతా తీవ్రంగా గాయపడ్డారు! దీన్ని మీరేఁటంటారు?" అని అందరికేసి ప్రశ్నార్ధకంగా చూశాడు.

దుర్మార్గులను భగవంతుడు తప్పక శిక్షిస్తాడనే అభిప్రాయంతో ఆ పోలీసు కానిస్టేబుల్సంతా ఏకీభవించారు. కాని ఇక్బల్ ఉద్రిక్తుడై, "ఆ ప్రమాదానికి ఎవరయ్యా కారకులు? ఆ కుక్కా? దేఁవుడా?" అని కనుబొమలు చిట్లిస్తూ చిరాగ్గా అడిగాడు.

అందుకు సమాధానంగా ఓ కానిస్టేబులు, "దేఁవుడే! కాకపోతే ఇలా ఎందుకు జరుగుతుంది? నిండుప్రాణాలతో వున్న తోటి మానవులెందర్నో తన ట్రక్కు చక్రాలక్రింద పడతోసి నిర్దయగా త్రొక్కించుకుపోయిన ఆ డ్రైవరు, ఆ దిక్కుమాలిన గజ్జికుక్క తన ట్రక్కు క్రింద ఎక్కడపడి చస్తుందోననే ఆందోళనతో ట్రక్కుని ప్రక్కకుకోసి చెట్టుకి గుద్దించేయడాన్ని ఏఁవంటారు?" అని అతని ముఖంలోకి ప్రశ్నార్ధకంగా చూశాడు.

''నువ్వేచెప్పు!'' అన్నాడు ఇక్బల్ మెల్లగా, మరమత్తు చెయ్య డానికి మరి వీలులేని జుగ్గాకి తప్పితే మిగిలిన వాళ్ళకెలాగైనా నచ్చ చెప్పొచ్చనుకున్నాడు ఇక్బల్!

జుగ్గా టాంగావాలాకేసి తిరిగి, ''భోలా! నీకు భగవంతుడంటే భయంనేదా? గుఱ్ఱాన్ని అలా తెగబాదడం పాపం కాదా?'' అనడిగాడు.

భోలా గుఱ్ఱాన్ని కొట్టడం ఆపుచేసి జుగ్గావేపు అదోలాగ చూసేడు: అది తన గుఱ్ఱం, తనిష్టమొచ్చినట్లు కొట్టుకుంటాడు! తప్పేం? అనేభావం అతని ముఖంలో స్పష్టంగా గోచరించింది.

సంభాషణను పెంచాలనే, ఉద్దేశ్యంతో, ''భోలా! నీయాపారంయెలా సాగుతోంది?'' అనడిగాడు జుగ్గా.

"భగవంతుడు కరుణామయుడు'' అని ఓసారి ఆకాశంకేసి చూసి, ఆ వెంటనే ''ఇనస్పెట్టరు బాబుగారుకూడా కరునామయులే! ఏదో ఇలా బతుకుతున్నాం!'' అని అన్నాడు.

''మరి పాకిస్తానుకు పోదల్చినోళ్ళనుండి నువ్వు బాగా డబ్బు గుంజనేదా?''

భోలా కాస్త కోపంగా, "యెదవడబ్బు కక్కుర్తికోసం పానాలు పోగొట్టుకుంటానా? నీకో దండం బాబూ! నీ సలహా నీదగ్గరే అట్టి పెట్టుకో! అల్లరిమూకలు సుట్టుముట్టినప్పుడు వీడు హిందువా, సిక్కా, ముస్లిమా అని సూసి మరీ సంపరు. మూకుమ్మడిగా అందరినీ సంపే త్తారు. ఆ మధ్యోనాడు సుమారు ఓ మైలు పొడవున పెద్ద ముస్లిమ్ శరణార్థుల గుంపొకటి పాకిస్తానుకేసి పోతోంది! ఆ ప్రక్కనుంచి ఓ జీపులో నలుగురు సిక్కు సర్దారులు పోతూ ఆళ్ళని సూసి, తమ దగ్గరున్న మరతుపాకుల్ని ఆళ్ళమీదికి పేల్చినారు. ఆనాడు ఆళ్ళు ఎంతమందిని తమ మరతుపాకులతో సంపినారో ఆ భగవంతుడికే ఎరిక! ముస్లిములతో నిండి

వుండే నా టాంగాను ఎవ్వరైనా మత కలహాలలో పాల్గొనేవోళ్ళు సూసి నట్టయితే నా గతేంకాను? ముందు అళ్ళు నన్ను సంపేత్తారు! ఆ తరువాత ఏటనుకొని ఏం నాభం? డబ్బుకోసం ఇట్టాటి సాహసానికి నా నాడిగట్ట లేను!" అని అన్నాడు.

"అయితే మరి ఆనాడా సిక్కు సర్దారుల జీపు క్రిందకో కుక్కదూరి దానినెందుకు పడద్రోయలేదు? వాళ్ళను శిక్షించేటందుకు దేవుడు కుక్క నెందుకు పంపించలేదు? అప్పుడు దేవుడు నిద్రపోతున్నాడా ఏంవిటి?" అని ఎత్తి పొడిచాడు ఇక్బల్.

ఇక్బల్‌కి ఏంవని సమాధానం చెప్పతమో ఎవ్వరికీ బోధపడలేదు. కొంచెంసేపు ఎవ్వరూ మాట్లాడలేదు.

జుగ్గా తన సహజసిద్ధమైన ధోరణిలో, "బాబూ! సెడ్డపనులుసేత్తే సెడ్డ ఫలితాలొత్తాయనే సంగతిపై తమకు నమ్మకం నేదా? ఎవురు సేసిన కర్మ ఆరనుభవింపక తప్పదు బాబూ! భాయి మీట్‌సింగ్ ఇదే మాటం టూంటా రెప్పుడూ! గ్రంథ సాహెబాలోకూడా ఇదే వ్రాసుందట!" నిష్కపటంగా అన్నాడు.

"బానాను! రూపాయకు పదహారణాల విలువగల నిజమిది!" అని హేళనగా అన్నాడు ఇక్బల్.

జుగుత్‌సింగ్ నవ్వుతూ, "అచ్ఛా బాబూ! మీ నమ్మకాలు మీవి! మా నమ్మకాలు మావి! తమలాంటి సదువుకున్నోళ్ళు మాలాంటోళ్ళతో ఎప్పుడూ ఏకీభవించరు!" అని ఇక్బల్‌తో అని- టాంగావాలా నుద్దేశించి, "భోలా! ఎంతోమందాడోళ్ళను బలవంతంగా ఎత్తుకొచ్చి చాలా చవగ్గా అమ్మేత్తున్నారని విన్నాను. నువ్వో మంచిపిల్లని కొనుక్కొని పెళ్ళి సేసుకోకూడదూ?" అని అన్నాడు.

టాంగావాలాలోని పుంసత్వం దెబ్బతింది! "నాను సేతకాని దద్దమ్మననుకున్నావా ఏటి? నువ్వు కాసీ కర్చునేకుండా ఓ ముసల్మాని

అమ్మాయిని పొందగలిగినప్పుడు, అక్కడికి నానే నేటి పేతకానోణ్ణి? బలవంతంగా ఎత్తుకొచ్చినదాన్ని కొనుక్కొని పెళ్ళి సేసుకోవలసిన కర్మ నాకేటి పట్టింది?" అని కాస్త కటువుగా సమాధాన మిచ్చాడు.

దాంతో జుగ్గడిలోని కోపం పెల్లుబికింది. కందగడ్డలా మారిన జుగుత్‌సింగ్ ముఖంకేసి దిగ్భ్రమనిపోయి చూడసాగేరు పోలీసు కాని స్టేబుల్సు. తను చాలా తెలివితక్కువగా మాట్లాడినట్లు అప్పుడు గ్రహించేడు భోలా!

"జుగ్గా నువ్వందర్నీ నీ ఇష్టమొచ్చినట్లు యేళాకోళంసేత్తావు. కాని ఎవురయినా నీకు తగిన సమాధానం ఇత్తే ఇట్టే కోపం తెచ్చేసుకుంటావు" అని అన్నాడు భోలా.

"ఈ బేడీలు, ఈ సంకెళ్ళు నేకపోయినట్టయితే నీ శరీరంలోని ఎముకలన్నీ ఇరగ్గొట్టుండేవోడిని. ఇవాళ నువ్వు బతికిపోనావు. మళ్ళీ నువ్వీమాటన్నావంటే నీ నాలుక చీల్చేత్తాను." అని పళ్ళు పటపట కొరుకుతూ అన్నాడు జుగుత్‌సింగ్.

భోలా బాగా భయపడిపోయేడు. "పట్టికొట్టినే కోపం తెచ్చుకోకు. నాననేదేటంటే....?

"ఛప్ నోరుముయ్ నంజకొడకా!"

ఆ సంభాషణ అక్కడితో ఆగిపోయింది. భోలా తన గుర్రాన్ని అదమాయించే శబ్దంవినా ఇంకే శబ్దమూ వినిపించలేదు.

నూరాన్‌తో తన రహస్య సమావేశాలసంగతి ఇలా అందరికి ఎలా తెలిసిపోయిందా అని ఆశ్చర్యపోయేడు జుగుత్‌సింగ్. నూరాను, తనూ ఒకరితో ఒకరు పరస్పరమూ మాట్లాడుకోడం బహూశా ఎవరో వినే వుంటారు. అందుకనే ఈవిషయం ఇలా బయటకుపొక్కింది. చుండున్నగ్గర్ వాసి అయిన భోలాకుకూడా ఈ విషయం తెల్సినప్పుడు- మానోమజ్రాలో

ప్రతి ఒక్కరికి ఈ విషయం తెలిసేవుంటుందనుకున్నాడు జుగుత్‌సింగ్. తనకూ, ఆమెకూ సంబంధమున్నాదని వెల్లడయినట్లు ఇంకా నూరానుకు, ఆమెతండ్రి ఇమామ్‌బక్ష్‌కు బహుశా తెలిసుండకపోవచ్చుననుకున్నాడు జుగుత్‌సింగ్.

మధ్యాహ్నానికి వాళ్ళంతా చుందున్నగ్గర్ చేరుకున్నారు. టౌనికి సుమారు రెండు ఫర్లాంగుల దూరంలోవున్న పోలీసు స్టేషనుముందు టాంగా ఆగింది.

ఆ ఖైదీలను మొదట రిపోర్టింగ్‌రూమ్‌కి తీసుకెళ్ళేరు. ఆ గదిలో ఓ టేబులుంది. దాని వెనకాలగల గోడకి అరవ కింగ్‌జార్జి ఫొటో ఓపాత ఫ్రేములో వ్రేలాడుతోంది. దానిక్రింద ఓ అట్టపై ఉరుదులో "లంచ మిచ్చుట లంచము పుచ్చుకొనుట నేరము" అని వ్రాయబడుంది. దాని కెదురుగావున్న గోడమీద ఓ కేలండరుమీద చించబడిన గాంధీగారి ఫొటో అంటించబడుంది. దానిక్రింద ఇంగ్లీషులో "నిజాయితీయే ఉత్తమధర్మం" అని అర్థమిచ్చే వాక్యం వ్రాయబడుంది. ఇకపోతే పారిపోయినవారివి దుష్ప్రవర్తన గలవారివి- తప్పిపోయినవారివి ఫొటోలు కొన్ని వున్నాయి.

హెడ్ కానిస్టేబులు ఓ పెద్ద రిజిష్టరు తెరచి- అందులో ప్రత్యేకమైన పేజీలలో వేర్వేరుగా ఆనాడు జరిగిన సంఘటనలను నమోదుచేసేడు. డైరీలోని ఎంట్రీలను పూర్తిచేసేక ఆ ఖైదీలను సెల్సు దగ్గరకు తీసుకెళ్ళేడు. ఆ పోలీసు స్టేషనులో రెండు సెల్సు మాత్రమే వున్నాయి. అవి పోలీసు బారెక్సుకి అభిముఖంగా వున్నాయి.

జుగ్గాయొక్క రాక మంచి ఆనందకరమైన విషయమయింది, అక్కడున్న కానిస్టేబుల్సుకి. జుగ్గాని పరిహసించాలనే ఉద్దేశ్యంతో "ఓః నువ్వు మళ్ళీ వచ్చేవా? దీన్ని నువ్వు నీ మామగారిల్లు అనుకుంటున్నావు కదూ?" అని బారెక్సునుంచి అరచేడొక కానిస్టేబులు.

"జాను నాచే చెరచబడ్డ పోలీసోళ్ళ కూతుళ్ళెంత మందున్నారో సూద్దామని వచ్చినాను." టాంగాలో అతను పొందిన అశాంతినంతా మరచి పోయి గొంతుకంతా విప్పి బిగ్గరగా సమాధానమిచ్చేడు జుగుత్‌సింగ్.

"ఓరి బద్మాష్! ఇంకా నీ తెగు లజగ లేవన్నమాట! ఉండుండు! ఇనస్పెక్టరుగారు రానీ. వారికి నువ్వన్నమాటలు చెపుతాను."

"మీ అల్లుడిపట్ల మీరలా ప్రవర్తించలేరని నాకుతెల్సు." అన్నాడు జుగ్గా వెటకారంగా.

ఇక్బాల్‌పట్ల మాత్రం వాళ్ళు కొ_త్త ఔదార్యంగా వున్నారు. క్షమా పణ చెప్పుకొని అతని చేతి బేడీలు తొలగించేరు. ఒక కుర్చీ, టేబులు, మంచం ఆ సెల్లులో వేసేరు. తనకు లభ్యమయిన చాలా రకాల ఉరుదూ, ఇంగ్లీషు డైలీ న్యూస్‌పేపర్లు, మేగజీన్లు సేకరించి ఆ సెల్లులో టేబులుపై వుంచేడు హెడ్ కానిస్టేబులు. నీళ్ళతో ఓ కూజా, ఓ గాజుగ్లాసు ఆ టేబులు వెనకాల పెట్టించేడు. జుగ్గాని వుంచిన సెల్లులో ఏ వసుపాయాలూ చెయ్యలేదు. ఓ ముష్టి వాడికి పడేసినట్లుగా అతని చేతిలో చపాతీలు పడేసేరు. అతనవి తిన్నాక యినపపూచల్లోంచి అతని దోసిలిలోనికి త్రాగడానికని నీళ్ళు పోసేడాక కానిస్టేబులు. కఠినమైన సిమ్మెంటునేలే అతని పాన్పు!

వైదీలపట్ల చూపబడుతున్న ఆదరణలోని యీ వ్యత్యాసం ఇక్బాల్ కేమీ ఆశ్చర్యాన్ని కల్గించలేదు. ఎన్నో శతాబ్దాలనుంచి వర్ణ విభేదాలు పాటించబడుతున్న యీదేశంలో, సాంఘిక అసమానత్వమనేది మనుషుల మస్తిష్కాలలో ఓటూజాలా తరతరాలనుంచీ వ్రేలాడుతోంది. చట్టబద్ధంగా యీ కులతత్వాన్ని ఒకవేళ అంతమొందించినా, ఇది మరో రూపంలో ప్రత్యక్షమవొచ్చు. పాశ్చాత్యనాగరికతా పద్ధతుల్ని అలవర్చుకున్న ఢిల్లీ లోని సెక్రటేరియేట్ సిబ్బందికి వారివారి అధికార హోదానిబట్టి ప్రత్యేక

సౌకర్యాలు సమకూర్చబడుతున్నాయి. కారుల పార్కింగ్ విషయంలో పైతం సీనియారిటి, హోదాలు గమనింపబడుతున్నాయి. కొన్ని ప్రవేశ ద్వారాలు ప్రత్యేకంగా కొంతమంది పెద్ద అధికార్లకోసం కేటాయించబడ్డాయి. ఆఖరికి మరుగుదొడ్ల విషయంలోకూడా వారివారి హోదా, సీనియారిటీ గమనించబడుతోంది. సీనియర్ ఆఫీసర్సుకి వేరుగా, జూనియర్ ఆఫీసర్సుకి వేరుగా, స్టెనోగ్రాఫర్సుకివేరుగా, క్లర్క్సుకివేరుగా, క్లాస్‌ఫోర్ ఎంప్లాయిస్‌కి వేరుగా ఇలాగ ప్రత్యేకించబడ్డాయి. ఇలాంటివ్యత్యాసాలతో కూడిన ఆదరణ యీ సమాజంలోని వ్యక్తులకు ప్రభుత్వపరంగా లభ్యమవుతున్నప్పుడు. ఒకే నేరంక్రింద అరెస్టుచేయబడిన వ్యక్తులపట్ల చూపబడుతున్న ఆదరణలోని వ్యత్యాసం గురించి ఏమంత పట్టించుకోనక్కరలేదనుకున్నాడు ఇక్బల్.

మధ్యాహ్న భోజనానంతరం ఇక్బల్ మంచంమీద నడుంవాల్చేడు. జగ్గాయొక్క సెల్లులోంచి గట్టిగా గుర్రు వినిపిస్తోంది.

ఇక్బల్‌మాత్రం నిద్రకు నోచుకోలేదు. ఒక సున్నితమైన రిస్టువాచీలోని హెయిర్ స్ప్రింగ్‌ని ఒకసారి తాకితే అది ఎంత తీవ్రంగా ప్రకంపిస్తుందో- అంతే తీవ్రంగా ఇక్బల్ మనసు తనకు జరిగిన అన్యాయానికి తీవ్రంగా ఊగిసలాడుతోంది.

లేచికూర్చొని, హెడ్ కానిస్టేబులు అక్కడ టేబులుపైవుంచిన న్యూస్‌పేపర్లు తీసి పేజీలు తిరగెయ్యసాగేడు. వాటన్నింటిలోను ఒకే రకమయిన వార్తలు- ఒకేరకమైన ఎడిటోరియల్సు- ఒకేరకమైన స్టేట్‌మెంట్సు. హెడ్‌లైన్సులో కించిత్తు పదాలకూర్పులో తేడా కన్పిస్తున్నవే గాని మొత్తానికి అవన్నీ ఒకరే వ్రాసినట్లున్నాయనుకున్నాడు ఇక్బల్. ఆఖరికి వాటిలో ప్రచురింపబడిన ఫొటోలలోకూడా ఏమీ తేడాలేదు. విసుగ్గా పేజీలుత్రిప్పుతూ వివాహసంబంధమయిన ప్రకటనలదగ్గర దృష్టి నిలిపేడు. ఒక్కొక్కప్పుడు ఇందుకు సంబంధించిన విషయాలను చదవడంలో

ఇక్బల్ వినోదాన్ని పొందుతూవుంటాడు. రకరకాల న్యూస్‌పేపర్లలోని విశేషాలు ఇంచుమించు ఒకేలా ఎలాగుంటాయో, అలాగే పంజాబీ యువకుల అభిరుచులుకూడా ఇంచుమించు ఒకేలాగుంటాయనుకున్నాడు ఇక్బల్. ఇల్లాలిలో పంజాబీయువకులు వాంఛించే సుగుణాలు ఇంచుమించు ఒకే తీరులో ఉంటూంటాయి. పురుష స్పర్శ రవ్వంతైనా తగలని పవిత్ర మైన కన్యలనే ప్రతిఒక్కరూ కోరుతూంటారు. విశాల దృక్పథంగల ఏ కొద్దిమందో వితంతువులను పెళ్ళి చేసుకొనేటందుకు ముందుకొస్తూంటారు. అవయినా వాళ్ళ శీలం చెడలేదనే నమ్మకం ఏర్పడినప్పుడే! ఓ గృహిణిగా బాగా చాకిరీ చెయ్యగలిగే సహనవతినే సాధారణంగా చాలామంది కోరు కుంటూంటారు. బాగా చదువు సంస్కారముగల ఏ కొద్దిమందో కట్న కానుకల గురించి కులమతాల గురించి అంతగా పట్టించుకోరు. తెల్లగా చక్కగా వుండే యువతుల్ని పెళ్ళాడడానికే సాధారణంగా ఎక్కువమంది యువకులు ఇష్టపడతారు. ఇకపోతే కొంతమంది జాతకాలనుకూడా పరిశీ లిస్తూంటారు. అనుకూల జాతకాలయినట్లయితే ఇహ ఏ గొడవలు లేకుండా భార్యాభర్తలు అంచక్కా సుఖంగా జీవించగలరని వాళ్ళ నమ్మకం. ప్చ్! ఏమిటో ఇలాంటివన్నీ వట్టి మూఢనమ్మకాలనుకున్నాడు ఇక్బల్. ఆ న్యూస్‌పేపర్లను అవతలకు గిరవాటేసి మేగజిన్సును తిరగ వెయ్యనారంభించేడు. ఆ మేగజిన్సు న్యూస్‌పేపర్లకన్నా అధ్వాన్నంగా వున్నట్లలని కనిపించింది. అజంతా, ఎల్లోరా గుహల గురించొక వ్యాసం- ఇండియాలో వయోజన ఓటింగ్ గురించొక వ్యాసం- విశ్వకవి రవీంద్ర నాథ టాగూరు గురించొక వ్యాసం- ప్రేమచంద్ కథలగురించొక వ్యాసం- ఒక కథ, ఓ సీరియల్ నవల, సినిమా నటీనటుల వ్యక్తిగత జీవితం గురించొక వ్యాసం ఇలాంటి విషయాలతోనే నిండున్నాయవి. ఆ మేగ జిన్సుని ప్రక్కకు గిరవాటేసి మళ్ళీ నడుం వాల్చేడు.

ఒక రకమయిన నిరుత్సాహం అతని మనస్సుని ఆవరించింది.

అప్పుడతని స్మృతిపథంలో కొచ్చింది; మూడులోజులనుంచీ తనకు నిద్ర సరిగా పట్టలేదన్నసంగతి!

తననొక రాజకీయ ఖైదీగా ప్రజలు గుర్తించినట్లయితే ఎంతో బాగుంటుందనుకున్నాడు. దేశంకోసం అనగా ప్రజలకోసం తను అరెస్టయ్యేడు. ఏమి త్యాగం! తనొక రాజకీయ ఖైదీ. ఎలాగైనాసరే తన పార్టీ అధిష్టానవర్గాని కీసంగతి కబురు చెయ్యాలి, ఎలాగ? ఆలోచిస్తూ నిద్ర మైకంలో పడ్డాడు.

నిద్రలో ఓ కల!

పెద్ద పెద్ద హెడ్ లైన్సులో అత్యధిక సర్క్యులేషనుగల ప్రసిద్ధ న్యూస్‌పేపర్లన్నింటిలోనూ తనను అరెస్టు చేసినట్లు- మళ్ళీ వదిలేసినట్లు ప్రజలంతా తన ధైర్యసాహసాలను ఘనంగా కొనియాడి తను విజయాన్ని సాధించినందుకుగాను అభినందించినట్లు- ప్రజలంతా తననొక నాయకుడిగా గుర్తించినట్లు.... ఇక్బాల్ ఓ మధురాతి మధురమైన కలగన్నాడు.

ఆనాటి సాయంత్రం ఓ పోలీసు కానిస్టేబులు ఇక్బాల్ సెల్లులోనికి ఓ కుర్చీ తీసుకొచ్చి వేశాడు.

"ఈ సెల్లులో నాతోపాటు ఇంకెవరినయినా ఉంచుతారా?" అని కాస్త దిగులుతో అడిగేడు ఇక్బాల్.

"లేదుబాబూ....! సబిన్‌స్పెక్టరుగారు తమతో ఏవో కొన్ని విషయాలు మాట్లాడడానికని వస్తున్నారు. వారికోసం ఈ కుర్చీ!" అని సమాధానమిచ్చాడా కానిస్టేబులు.

సబిన్‌స్పెక్టరు వచ్చి, "లోపలకు రావడానికి నన్ననుమతిస్తారా?" అని ఎంతో మర్యాదగా అడిగాడు.

ఇక్బాల్ తలూపుతూ, "దయచెయ్యండి....! ఏమిటిలా దయచేశారు?" అని అడిగాడు.

"అయ్యా.... ఇక్బల్‌గారూ....! ఇప్పుడు మేము మీ సేవకులం. మీకేం కావాలో ఆజ్ఞాపించండి: మేము చేస్తాం" అని మందస్మిత వద నంతో అంటూ కుర్చీమీద కూర్చున్నాడు.

పరిస్థితుల కనుగుణంగా తన వాగ్ధోరణిని, ప్రవర్తనను మార్చుకో గలిగే సామర్థ్యం ఆ సబినస్పెక్టరికుందన్న సంగతి ఇక్బల్ గ్రహించాడు. ఈ రకమైన సామర్థ్యానికే ఇంగ్లీషులో "డిప్లమసి" అని అంటారని అతనికి తెల్సు!

"అయ్యా! ఇనస్పెక్టరుగారూ.... హత్యానేరంక్రింద అరస్టు చేయ బడిన ఖైదీల విషయంలో తమ పోలీసువారు ఇంత ఉదారంగాను, దయార్ద్రహృదయతతోను వ్యవహరిస్తారనినాకింతకుముందు తెలీదు. నన్నో హంతకుడిగా భావించి అరస్టు చేసేరనుకుంటున్నాను. అవునా? దర్యాప్తు చేసేటందుకై మీ పోలీసువారంతా ఏ ట్రైనులో మానోమఙ్రా వచ్చారో అదే రైలుబండిలో నేనూ వచ్చాను. ఈ సంగతి మీకు తెలీదా?" అనడిగాడు.

"తమపై మేమింకా నేరారోపణ ఏదీ చెయ్యలేదు. అనుమానం మీద తమను నిర్బంధించాము. అంతే! సరిహద్దు ప్రాంతాలలో రాజకీయ విప్లవవాదుల సంచారాన్ని మేము అనుమతించము" అని నవ్వుతూ అని– కొంచెంసేపు మౌనంగా వూరుకొని, "బానుగానీ మీరు మీ పాకిస్తానుపోయి అక్కడే మీ పార్టీ ప్రచారం ఎందుకు చేసుకోకూడదు?" అని అడిగాడు.

ఇక్బల్‌కి బాగా ఒళ్ళు మండింది. కాని తనకోపాన్ని బయట కను పడనీయకుండా లోలోనే అణచుకొని "ఇనస్పెక్టరుగారూ.... నన్ను పాకి స్తాను వెళ్ళిప్రచారం చెయ్యమనడంలో మీఉద్దేశ్యమేమిటి?" అనిఅడిగాడు.

"మీరొక ముస్లిమ్....! అంచేత పాకిస్తానుకుపోయి అక్కడ మీ పార్టీ ప్రచారం చేసుకోమంటున్నాను."

"పచ్చి అబద్ధం.... నన్నుగురించి మీకు తెలిసిన తదితర విషయాలు కూడా పచ్చి అబద్ధాలే! మీ అవివేకాన్ని కప్పిపుచ్చుకోవడానికి నాపై ఒక అబద్ధపుకేసు పెట్టాలని మీరు చూస్తున్నట్లుంది" అని ఇక్బల్ కోపోద్రిక్తుడై అన్నాడు.

"ఏమండోయ్! శాస్త్ర విచక్షణాజ్ఞానంతో నాలిక సరిదిద్దుకొని మరీ మాట్లాడండి. మీ ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే పడడానికి నేను మీ బాబు గారి సొమ్మేంతింటూ బ్రతకడంలేదు. మీపేరు ఇక్బల్! మీరు సుంతీ చేయించుకున్నారు. ఆ సంగతి నా కళ్ళతో నేను చూశాను.... ఇకపోతే ఇటువంటి సమయంలో మీరు రాజకీయోద్యమం పేరిట మానోమజ్రా రావడమే ఓ నేరం! మీపై కేసు పెట్టడానికిదిచాలు" అని అన్నాడా సబిన స్పెక్టరు చిరాగ్గా.

"ఈ విషయం న్యూస్‌పేపర్లకెక్కినా, కోర్టుకెక్కినా యీ నేరారోపణ చాలదు! అసలింతకీ నేను ముస్లిమునికాదు.... సరే! ఆ విషయం అలాగుంచండి. మత విద్వేషాలు రెచ్చగొట్టేటందుకు నేను మానోమజ్రా రాలేదు. సాంఘికసేవ చెయ్యడానికొచ్చాను.... అసలింతకీ మానోమజ్రా నేనెందుకొచ్చినదీ మీకు చెప్పాల్సిన పనిలేదు. అది మీకనవసరం! నన్ను మీరు ఇరవై నాలుగుగంటలలో విడుదల చెయ్యని పక్షంలో నేనొక హెబియస్ కార్పస్ పిటీషన్‌పెట్టి మీరు మీ విద్యుక్తధర్మాన్ని విస్మరించి న్యాయ పద్ధతికి విరుద్ధంగా ఎలా ప్రవర్తించినదీ కోర్టువారికి తెలియజేస్తాను."

ఆ సబ్ ఇనస్పెక్టరు బిగ్గరగా ఓ వికటాట్టహాసంచేసి, "అబ్బో! హెబియస్ కార్పస్ పిటీషనే! పాపం! తాము చాలాకాలం విదేశాలలో నివసించినట్లున్నారు, ఇప్పుడూ తామింకా ఆ'ఫూల్సు పేరడైజ్' లోనే నివసిస్తున్నట్లు భావిస్తున్నట్లున్నారు. అనుభవంమీద ఇక్కడిపరిస్థితులన్నీ మీకు బోధపడతాయిలెండి" అని టకీమనిలేచి వెళ్ళిపోయాడు. ఇక్బల్ సెల్లు ఉక్కుగజాలగేటు మళ్ళీ యథాప్రకారం లాక్ చెయ్యబడింది.

ఆ తరువాత ఆ సబ్ ఇనస్పెక్టరు జుగ్గావున్న సెల్లుగేటు తాళం తీయించి లోనకెళ్ళేడు.

"ఇనస్పెక్టరుబాబూ....! సత్‌శ్రీ అకల్! అన్నాడు జుగ్గా సవినయంగా.

ఆ అభివందనాన్ని ఆ సబినస్పెక్టరు అందుకోకుండా, "ఏమిరా! నువ్వింకా యీ వెధవపనులు చేస్తున్నావన్నమాట" అని అన్నాడు.

"బాబూ.... నామాట నమ్మండి- ఈ విసయంలోమాత్రం నానొట్టి అమాయకుణ్ణి. నాకేటీతెల్దు. దేవుడిపై ఒట్టేసి సెపుతున్నాను. నాకేటీతెల్దు బాబూ" అన్నాడు జుగ్గా.

సబినస్పెక్టరు గోడకు చేరబడి, "అయితే మరి దోపిడీ జరిగిననాటి రాత్రి నువ్వెక్కడున్నావు?" అని అడిగాడు.

జుగ్గా ఆందోళనతో "ఆ దోపిడీతో నాకేటీ సంబంధంనేదు బాబూ" అని సమాధానమిచ్చేడు.

"అయితే మరి ఆనాటిరాత్రి నువ్వెక్కడున్నావు?" మళ్ళీ అదే ప్రశ్న?

జుగ్గా దీనంగా నేలకేసిచూస్తూ- "పొలానికెళ్ళినాను. కాలువ నీరు పొలానికి పెట్టేవంతు అయ్యాల మాకొచ్చినాది" అని సమాధానమిచ్చాడు.

అది అబద్ధమని సబినస్పెక్టరికి తెలుసు. "ఆ కాలువపై అధిపత్యం వహిస్తున్న ఆసామినడిగి నువ్వుచెప్పినదాంట్లో ఎంతవరకూ సత్యముందో తెల్సుకుంటానులే! అయితే మరి నువ్వు ఆ రాత్రి ఇల్లువదలి పొలాని కెళుతున్నట్లు మీ గ్రామ హెడ్‌మన్‌తోచెప్పి అనుమతి పొందేవా?"

జుగ్గా ఏమీ సమాధానమివ్వలేదు.

"అడవిపందుల్ని తరిమివెయ్యడానికి నువ్వు పొలానికెళ్ళినట్లు మీ అమ్మ చెప్పింది. నిజమేనా?"

జుగ్గా వెంటనే సమాధానమూ ఇవ్వలేదు. కొంచెంసేపు అయేక, "నాకా దోపిడీదొంగలతోగాని, కూనీతోగాని, ఏటీ సంబంధంలేదు. నా మాట నమ్మండి- నాకేటి తెల్దు!" అని మనవిచేశాడు.

"ఎవరా దోపిడీదొంగలు?"

"ఆళ్ళెవరో నాకు తెలీదుబాబూ! నానేగాని ఆసమయంలో వూళ్ళో వుంటే- మా వూళ్ళో కూనీసేసి దోపిడీ సెయ్యగలిగే దమ్ము ఆళ్ళకుండుం డేదే కాదు! నాసత్తా తమకు తెలియందికాదు! ఇంతకీ ఆళ్ళెవరో నాకు తెల్దు బాబూ తెల్దు!"

"ఒరేయ్! ఎందుకురా అబద్ధాలాడతావు? వాళ్ళెవరో నీకు తెల్సు నని నాకు తెల్సు. నువ్వెవడివో వాళ్ళకు తెల్సు! నువ్వెవడివో వాళ్ళకు తెలియక పోయినట్లయితే నీ కెందుకురా ఓగాజులపేకట్టు బహూకరిస్తారు? ఇప్పటికింకా మించిపోయినదేంపీలేదులే! ఆ దోపిడీ దొంగలెవరో చెప్పు!" జుగ్గా సమాధానమివ్వలేదు!

"ఓరేయ్! నువ్వు మంచిగా సమాధానమివ్వవని నాకు తెలుసు. తొక్క లెక్కపోయేటట్లు నిన్ను హంటర్‌తో బాది, చర్మం ఒలిపించి కారం రాస్తేగాని నువ్వు సమాధానమివ్వవు!"

జుగ్గా కాస్త భయపడ్డాడు. నిజం చెప్పించడానికి పోలీసువారు అను సరించే పద్ధతులన్నీ జుగ్గాకు అనుభవైక వేద్యమే! మంచం కోళ్ళక్రింద చేతుల్ని వుంచి ఆ మంచంమీద సుమారు అరడజనుమంది దుక్కానక్క ల్లాంటి పోలీసువాళ్ళు కూర్చోడం ఓ పద్ధతి! నోట ఉచ్చరింపరాని అసభ్య మైన మోటుపద్ధతులలో హింసాకాండ జరపడం. ఆమంట రోజులతరబడి వుంటుంది! వీటన్నింటికీ తోడు తినడానికి తిండి, త్రాగడానికి నీరు సరిగ్గా ఇవ్వకుండా నానా బాధలూ పెట్టటం- ఇవన్నీ జుగ్గా స్మృతిపథంలో మెదిలేయి.

"నన్ను రక్షించండి బాబూ నన్ను రక్షించండి. నాకేటీతెల్దు! భగవంతుడిమీద ఒట్టేసి సెప్తున్నాను. ఆ దోపిడీగురించి నాకేటీ తెల్దు! నన్ను రక్షించండి!" అని ఆ సబ్ ఇనస్పెక్టరు పాదాలు పట్టుకొని ప్రార్థించసాగాడు.

ఆ సబినస్పెక్టరికి లోలోన చాలా ఆనందంగా వుంది; రాక్షసుడిలాంటి జుగ్గా తనకు పాదాక్రాంతుడయినందుకు! ఇక్బాల్‌లాంటి చదువుకున్నవాళ్ళతోనే పేచీ! ఒకంతటికిగాని దారికిరారు ఇక్బాల్‌లాంటివాళ్ళు. ఒకడికి తెద్దునా, అందరికీ తెద్దునా అనేరకం మనుష్యుల కోవలోకి ఇక్బాల్ వస్తాడని అనుకున్నాడా సబినస్పెక్టరు.

"ఒరేయి జుగ్గా! వాళ్ళపేర్లు చెప్పడానికి నీకు నేను రెండురోజులు టయిమిస్తున్నాను. చెప్పకపోయినట్లయితే పశువుని బాదినట్లుగా నిన్ను బాదుతాను." అంటూ జుగ్గా చేతులలోంచి తన పాదాలను బయటకు లాక్కొని అవతలకెళ్ళిపోయేడు.

అలాంటి వాళ్ళతో ఇహ మామూలు పద్ధతిలో వ్యవహరించ కూడదనుకున్నాడు. తన ఎత్తుగడల నిక మార్చుకోవాలనుకున్నాడు. విభిన్న మనస్తత్వాలుగల ఆ ఇద్దరి దగ్గరనుంచి తగిన సమాధానాలు రాబట్టడానికి తానానాడు చేసిన ప్రయత్నం ఫలించనందుకు కాస్త అసంతృప్తి చెందేడా సబినస్పెక్టరు.

7

ఆ సంవత్సరం సెప్టెంబరునెల ప్రారంభంలో మనోమజ్రాలో అలవాటులోనున్న కార్యక్రమాలేవీ వేళకు సవ్యంగా జరగటంలేదు. ట్రైన్సన్నీ అంతకుముందుకన్నా చాలా ఆలస్యంగా వస్తున్నాయి. ఎక్కువగా రాత్రివేళ ట్రైన్సు వెళుతున్నాయి. రానురాను గడియారమే తప్పు తిరుగుతున్నదేమో అన్నంత అసంబద్ధంగా వుంది మనోమజ్రాలోని జీవితం.

మీట్‌సింగ్ ఎప్పుడు లేచి ప్రార్థన ప్రారంభిస్తాడా అని ఇమామ్ బక్ష్ కాచుక్కూర్చునేవాడు. మసీదులో ఇమామ్‌బక్ష్ ఎప్పుడు ప్రార్థన ప్రారంభిస్తాడా అని మీట్‌సింగ్ కాచుక్కూర్చొనేవాడు.

మెయిల్ ట్రైన్ వచ్చేవేళ మారిపోయిందనేసంగతి గుర్తించని కారణంగా- మానోమజ్రాలోని వాళ్ళు భళ్ళున తెల్లారితేనేగాని లేవలేక పోతున్నారు. పొద్దుపోకముందే అంతా ఇళ్ళకు చేరి- ఇంత ముద్దమింగి, ఎక్స్‌ప్రెస్ రాకముందే (అది వచ్చినా రాకపోయినా) నిద్ర కుపక్రమిస్తున్నారు.

గూడ్సుట్రైను పాకిస్తానుకు ఇంచుమించు వెళ్ళలేదనేచెప్పాలి. అవి మానోమజ్రావరకూ వచ్చి ఆగిపోతున్నాయి! రాక్షసిట్రైన్సుమాత్రం విపరీతమయినస్పీడుతో అర్థరాత్రప్పుడుగాని-వేకువఝామునగాని అప్పుడప్పుడు వెళుతూ మానోమజ్రా గ్రామీణుల కలలను భగ్నపరుస్తూండడం కద్దు!

నిజానికి మానోమజ్రాలో వచ్చినమార్పు ఇదికాదు! కొంతమంది సిక్కుసోల్జర్లు మానోమజ్రా రైల్వేస్టేషను సమీపంలో టెంటులు వేసుకొని శిష్ట వెయ్యడమే నిజమైన మార్పు! బస్తాలనిండా ఇసుక కుక్కి- వంతెనకు దగ్గరగానున్న సిగ్నల్‌వద్ద పెద్ద కుప్పగా పేర్చి, మిషన్‌గన్ను అమర్చేరు. సాయుధసైనికులు ఆ ప్రాంతమంతటినీ కాపలాకాస్తూ ఏ గ్రామస్తుడినీ ఆ రైల్వే లైనువైపు రానివ్వడంలేదు! ఢిల్లీనుంచి వచ్చే ప్రతిట్రైను అక్కడ విధిగా ఆగుతోంది. డ్రైవరు, గార్డు మారేక పాకిస్తాన్ వెళతోంది! పాకిస్తాన్‌నుంచి వచ్చేవి మానోమజ్రా చేరుకానేసరికి, అప్పుడే జైలులోంచి విడుదల అయిన ఓ ఖైదీలా ఆనందాన్ని హాయినీ అనుభవిస్తున్నాయి.

ఒకనాటి ఉదయం పాకిస్తాన్‌నుంచి వచ్చిన ఓ ట్రైను మానోమజ్రా రైల్వేస్టేషనులో ఆగింది. పైనుంచి చూడ్డానికది ప్రశాంత సమ

యంలోని ట్రైనులా అగుపిస్తోంది. పైకప్పుమీదగాని, ఫుట్‌బోర్డుమీద గాని, బఫర్సుమీదగాని ప్రయాణీకులు లేరు. ఇటువంటి సమయంలో అంత రద్దీలేని ట్రైన్సు రావడం విడ్డూరమే. అందులో ఏదో విశేషం వుండే వుంటుందనుకున్నారు, మానోమజ్రా గ్రామస్థులు.

ఆ ట్రైను ఇలా ఆగిందోలేదో చివరి పెట్టెలోంచి గార్డు క్రిందకు దిగి వెంటనే స్టేషను మాస్టరు ఆఫీసుగదిలోకి వెళ్ళాడు. ఆ తరువాత ఆ ఉభయులూ సోల్జర్సు టెంట్సు దగ్గరకెళ్ళి వాళ్ళ ఆఫీసర్ ఇన్‌ఛార్జితో ఏదో మాట్లాడేరు. అతను ఓ సోల్జర్ని చందున్నగ్గర్ పంపేడు. ఆ తరువాత అక్కడ తచ్చాడు గ్రామస్థులందర్నీ తగిలేయమని తన సోల్జర్ల నాజ్ఞాపించేడు. వాళ్ళు అక్కడ తచ్చాడుతున్న గ్రామస్థులందరినీ తగిలేశారు.

ఓ గంటసేపయేక ఓ ఏభైమంది సాయుధపోలీసులతో సబిన్స్పెక్టరు స్టేషనుకొచ్చేడు. వాళ్ళొచ్చినవెంటనే హుకుమ్‌చాంద్ తన అమెరికన్ కారులో అక్కడికొచ్చేడు.

మానోమజ్రా రైల్వేస్టేషనుకు పట్టపగలు వచ్చిన ఆ రాక్షసి ట్రైను ఆ గ్రామస్థులలో తీవ్రమైన సంక్షోభాన్ని రేకెత్తించింది. వాళ్ళు తమ ఇళ్ళమిద్దెలపైకి ఎక్కి రైల్వేస్టేషనులో ఏంజరుగుతున్నదీ గమనించ సాగేరు. అక్కడనుంచి వాళ్ళకగుపించినది ఆ ఫ్లాట్‌ఫారం యీ చివరనుంచి ఆ చివరవరకూవున్న ఆ రాక్షసిట్రైను నల్లని పైకప్పు మాత్రమే. స్టేషను బిల్డింగు, స్టేషనులో ఆగివున్న గూడ్సు ట్రైన్సు అడ్డుగా వుండడంవల్ల వారికింకేమీ కనిపించలేదు. అయితే వుండుండి ఓ సోల్జరో లేక ఓ పోలీసు కానిస్టేబులో స్టేషనులోంచి బయటకొచ్చి మళ్ళీ లోనికెళ్ళిపోతూండడం మాత్రం వాళ్ళు గమనించేరు.

ఆ మధ్యాహ్నం ఆ గ్రామ స్త్రీలు గుంపులు గుంపులుగా కలుసుకొని ఆ ట్రైనుగురించి ముచ్చటించుకున్నారు. ఆ తరువాత వాళ్ళంతాకలసి గురుద్వారాకి వెళ్ళేరు, మరి కొన్నివిశేషాలు తెల్సుకొనేటందుకు.

స్త్రీలు ఆనోటా యీనోటావిన్న పుకార్లలోగల నిజాన్ని హెడ్మన్ ఇంట్లో కూర్చొని చర్చించసాగేరు. తమ మొగాళ్ళకు ఆ ట్రైనుగురించి ఏం తెలుసో తెలుసుకోవాలనే కుతూహలంతో వున్నారా స్త్రీలందరూ! ఏదైనా ఒక పుకారు పుడితే భోగట్టా చేసేటందుకై సాధారణంగా ఆ గ్రామంలోని పురుషులంతా గురుద్వారాకు- స్త్రీలంతా హెడ్మన్ ఇంటికి వెళుతూండడం ఆచారం.

నిజానికి ఆ గ్రామానికి నాయకుడనే వాడెవడూలేడు. హెడ్మన్ (గ్రామాధికారి) అయిన బంటాసింగ్ రివెన్యూకలక్షన్లు చేసేటందుకై వంశపారంపర్య హక్కురీత్యా ప్రభుత్వంచే నియమింపబడిన వ్యక్తి. ఆ గ్రామాధిపత్యం ఆ కుటుంబానికిగల వంశపారంపర్యపు హక్కు! బంటా సింగ్‌కి ఆ గ్రామంలోగల అందరికంటే అధికంగా భూమిగాని, ఆస్తి పాస్తులుగాని లేవు. ఒక సామాన్యరైతు కుటుంబీకుడు. కష్టపడి పనిచేసే వ్యవసాయదారుడు. ఎప్పుడైనా ఆ గ్రామానికి గవర్నమెంటు అధికార్లు గాని, పోలీసువారుగాని వచ్చి బంటాసింగ్ ద్వారా ప్రభుత్వ కార్యకలాపా లను నిర్వహించే సమయంలో బంటాసింగ్‌కు కించిత్తు ప్రభుత్వాధికారి హోదా చేకూరుతూంటుంది.

ఏ విషయంపైనైనా చర్చ జరిగేటప్పుడు ఆ గ్రామసభలలో సాధా రణంగా మసీదు ముల్లా అయిన ఇమాంబక్ష్ భావాలుగాని- భాయి మీట్ సింగ్ భావాలుగాని ప్రకటిత మవుతూవుంటాయి.

ఇమామ్‌బక్ష్ ఒక నేతపనివాడు. పంజాబులోని నేతపనివాళ్ళు తరతరాలనుంచీ అక్కడివాళ్ళచే పరిహాసాలకు గురవుతూండబడే వాళ్ళలో

ఒకరు. అడంగితనం, పిరికితనంగల వాళ్ళుగా అక్కడ సేవపనిచేసే పురుషులు పరిగణింప బడుతూంటారు. వ్యభిచారిణులగు భార్యలుగల జాతి వారిగా వారికాప్రాంతంలో ఒక అపఖ్యాతి వున్నది. కాని ఇమామ్‌బక్ష్ యొక్క వయస్సు, అతని ధర్మనిరతి, శాంతస్వభావం, అతనిపట్ల ఆ గ్రామస్తులకు గౌరవభావాన్ని కలుగజేసినాయి. అతని కుటుంబంలో పరంపరలుగా జరిగిన విషాదసంఘటనలు- అతనిపట్ల దయను, వాత్సల్యాన్ని ఆ గ్రామస్తులలో పెంపొందింపజేసినాయి. తాము ఎవరినయితే దయదలుస్తారో వారిని ఎంతో గాఢంగా ప్రేమించే స్వభావం పంజాబీలది.

ఇమామ్‌బక్ష్ భార్య, కొడుకు ఒకరి తరవాతొకరు కొద్దిరోజుల వ్యవధిలో చనిపోయేరు. దృష్టి మందగించింది. అంచేత మగ్గం మూలబడింది. ఇంచుమించుగా అడుక్కొనే పరిస్థితి ఏర్పడింది. అంతాపోగా మిగిలిన ఒక్కగానొక్క కూతురయిన నూరాన్ కోసం అతను బ్రతుకుతున్నాడు.

మసీదు ఆవరణలో ఓ గుడిసె వేసుకొని అందులో మకాంపెట్టి ముస్లిమ్ బాలబాలికలకు ఖురాన్ బోధిస్తున్నాడు. ఖురాన్ సూక్తులు వ్రాయబడిన రక్షలను తయారుచేసి, శారీరక మానసిక అస్వస్థలతో తీసుకుంటున్న వారికి ఇచ్చి, వారిచ్చే దానితోఎలాగో అతికష్టంమీద బ్రతుకు వెళ్ళబుచ్చుతున్నాడు. అతనికి ఎన్నో సామెతలు, అద్భుతమైన కథలువచ్చును. అవి వినడానికి గ్రామస్తులు తరచుగా అతని దగ్గరకు వస్తూంటారు.

నిజం చెప్పాలంటే అతనిని చూసేసరికి ఎవరికైనాసరే తప్పక గౌరవభావం కల్గుతుంది. సన్నగా, పొడవుగా వుంటాడు. తెల్లగా నిగనిగలాడే గడ్డం, పండుజుత్తు వుండి మంచి హుందాగా ఉంటాడు. ఒక వేదాంతిలాంటి చూపతనిది. మొత్తానికతని ఆకృతి చూసేసరికి ఎవరికైనా

సరే అతనిపట్ల గౌరవభావం కలుగుతుంది. ఆ గ్రామస్తులకతను ఇమామ్ బక్ష్ కన్న, ముల్లాగాకన్నా ఓ "తాతయ్య"గా బాగా పరిచితుడు.

మీత్‌సింగ్‌పై అంతటి గౌరవభావంగాని, వాత్సల్యంగాని ఆగ్రామస్తులకు లేదు. మొదట మీత్‌సింగ్ కూడా ఓ మామూలురైతే: కష్టపడి పనిచెయ్యడానికతనికి అంతగా వొళ్ళొంగేదికాదు. అందుకే కాబోలు దేవాలయ పూజారయిపోయాడు: అతనికి కొంచెం స్వంత భూమి లేకపోలేదు. కాని దానిని శిస్తుకిచ్చేశాడు. ఆ గ్రామీణులలో మతవిశ్వాసం, దైవభక్తి లోపించనంతకాలం అతనికేలోటూ వుండదు. వాళ్ళిచ్చే దక్షిణలు, ప్రసాదం అతని జీవితాన్ని సుఖప్రదం చెయ్యడానికి చాలు. ఇకపోతే అతనికి పెళ్ళాం, పిల్లలూ ఎవ్వరూ లేరు. సంభాషణా చాతుర్యంగాని, మతగ్రంథాలు చదివి అర్థం చెప్పగలిగే శక్తిగాని అతనికి అంతగాలేదు. ఇకపోతే అతని ఆకారంకూడా ఏమంత ఆకర్షణీయంగావుండదు. పొట్టిగా దుక్కగా శరీరంనిండా రోమాలతో అసహ్యంగా వుంటాడు. ఇంచుమించు ఇమామ్ బక్ష్ వయస్సే అతనికీ వుంటుంది. చాలా అపరిశుభ్రంగా వుంటాడు. గ్రంథ సాహెబాను చేతబట్టినప్పుడు మాత్రమే తలపాగా ధరిస్తాడు. తతిమ్మా వేళల్లో జుత్తును ముడివెయ్యకుండా వదులుగా వుంచేస్తాడు ఇకపోతే అతనికి రెండేరెండు జతల దుస్తులున్నాయి. అవికూడా సాధారణంగా మురిగ్గా అసహ్యంగా వుంటూంటాయి.

అయితే ఒకటి: మీత్‌సింగ్ సాధారణంగా ఎంతో శాంతంగా వుంటూంటాడు. ఈర్ష్యాసూయలు ఇంతవరకూ ఏనాడూ ఇమామ్‌బక్ష్‌పట్ల అతనికిగల వాత్సల్యాన్ని విషపూరితం చెయ్యలేదు. తన మతస్తులకు తానేమయినా చెప్పేసందర్భంలో ఇమామ్‌బక్ష్ ఏవైనా సలహాలు ఇస్తేమాత్రం వాగ్వివాదం స్నేహపూర్వకమైన ధోరణిలో మాత్రమే వుండేది.

విషాదకరమయిన వాతావరణంలో ఆవాళ గురుద్వారాలో అంతా సమావేశమయ్యేరు. ఏం మాట్లాడడానికి ఎవరికీ ఏమీ తోచలేదు. భవిష్యత్తు

గురించి తమకేదో తెలిసినట్లు వాళ్ళలో వాళ్ళు గుసగుసలాడుకోసాగేరు.

ఇమామ్‌బక్ష్ మెల్లిగా సంభాషణకుపక్రమించాడు. "అల్లా దయ ఎలాగుందో మరి....! మనం చాలా చెడ్డరోజులలో జీవిస్తున్నాం" అని అన్నాడు.

బాధగా నిట్టూర్చుతూ- "అవును ఇవి నిజంగా చెడ్డరోజులు" అని అన్నారు కొంతమంది.

మీట్‌సింగ్ గొంతుక సవరించుకొని "ఇది కలియుగం తాతయ్యా! అంచేత ఇలాగున్నాయి రోజులు" అని అన్నాడు.

కొంతసేపటివరకూ ఎవ్వరూ ఏమీ మాట్లాడలేదు. ఏం చెయ్యడానికీ తోచని పరిస్థితిలో సాధారణంగా మానవులకు భగవంతుడు జ్ఞాపకానికొస్తూంటాడు. "ఓ అల్లా" "ఓ గురూ!" అని భగవంతుణ్ణి ఉద్దేశించి తమను రక్షించమని లోలోన అంతా ప్రార్థించసాగారు.

"లామ్‌బార్ దరా" (హెడ్మన్‌ని ఆ ప్రాంతంలో ఇలా పిలుస్తారు) రైల్వేస్టేషనులోని ఛోగట్టా బహుశా నీకు తెలిసేవుంటుంది.... డిప్యూటీ దొరగారు నీకింగా కబురుచెయ్యలేదేం?" అనడిగాడు ఇమామ్‌బక్ష్.

"తాతయ్యా.... నాకెలా తెలుస్తుంది చెప్పు? వారు నాకు కబురు పెడితేనేకదా నేనక్కడకు వెళ్ళడానికి వీలవుతుంది. వారు స్టేషనులోనే వున్నారు. ఎవర్నీ ఆ చుట్టుప్రక్కలకు చేరనివ్వడంలేదు" అని సమాధానమిచ్చాడు హెడ్మన్.

ఓ యువకుడు కంచుగంటలాంటి గొంతుకతో "ఈ క్షణంలో మనమంతా కట్టగట్టుకొని పోవటంనేదు. సావు సమీపించినట్లంతా ఇదైపోతున్నారేటి....? టేషనులో ఏటి జరుగుతున్నదీ మనకు తొరలోనే తెలుస్తాది. ఇంతాసేత్తే అదొక రైలు-! గవర్నమెంటోరి డబ్బునిగాని, ఆయుధాల్నిగాని అది తీసుకెళ్తోందికాబోలు.... అందుకనే దాన్ని వాళ్ళంతా

కాపలా కాస్తున్నారేమో.... ఇంతకీ మీరెవురూ ఇనటంనేదా ఎంతో మందక్కడ దోచుకోబడ్డారని" అని అన్నాడు.

పళ్ళు పటపట కొరుకుతూ "నోరు ముయ్యరా యెదవగాడిదా.... నీకెందుకురా యీ గొడవ....? ఏదో పెద్దోళ్ళు మాట్లాడుకుంటూంటే మద్దె నీగొడవేట్రా....? నీ వుద్దేశమేటో సెప్పమని నిన్నెవుడయినా అడిగినాడట్రా? బుద్దినేకపోతేసరి" అని కోపడ్డాడా యువకుడి తండ్రి.

"ఇంతకీ నానసేదేటీ అంటే....

"ఇక నువ్వేటీ అనక్కరనేదు. నోర్మూసుకో" అని మహాకోపంతో ఆజ్ఞాపించేడతని తండ్రి.

ఇమామ్‌బక్ష్ తన గెడ్డాన్ని వేళ్ళతో దువ్వుకుంటూ నీరసంగా "ఈ మధ్య రైలుబళ్ళలో ఏవేవో చాలా సంఘటనలు జరుగుతున్నాయని నేను విన్నాను" అని అన్నాడు.

"సంఘటనలు" అని వినంగానే అక్కడున్న వాళ్ళందరూ ఎంతో బాధాకరమయిన అనుభూతికి లోనయారు. కొంచెం సేపయేక "అవును: ఎన్నో సంఘటనలు జరుగుతున్నట్లుగా తెలుస్తోంది'' అని అన్నాడు మీట్‌సింగ్.

"ఈ సమయంలో మనం కోరవలసింది అల్లా దయనుమాత్రమే:" ఆ సంభాషణను ప్రారంభించిన ఇమామ్‌బక్షే ఆ సంభాషణను అక్కడితో ఆ విధంగా ముగించాడు.

"యా అల్లా!" అని "వా గురూ" అని వారివారి మత సంప్రదాయాల కనుగుణంగా కొంతమంది భగవన్నామాన్ని స్మరించసాగారు. బయటకూర్చున్న కొంతమంది కునికిపాట్లు పడుతున్నారు.

అంతట్లో అకస్మాత్తుగా గురుద్వారా ద్వారందగ్గర ఓ పోలీసు కానిస్టేబులు ప్రత్యక్షమయ్యాడు. గ్రామాధికారితోపాటు మరి కొంతమంది

గబుక్కున లేచి నిలబడ్డారు. కునికిపాట్లు పడుతున్నవాళ్ళని ప్రక్కవాళ్ళు మెల్లిగా పొడిచి లేపేరు. "ఏం? ఏమయింది?" అని ఆశ్చర్యంతో అడిగి తలపాగాలు చుట్టుకున్నారు వాళ్ళు.

"ఇక్కడెవరయ్యా గ్రామాధికారి?" అని ఆ పోలీసు కానిస్టేబులు వాళ్ళకేసిచూస్తూ అడిగాడు.

"నేనుబాబూ!" అంటూ అతనిదగ్గరకెళ్ళాడు బంటాసింగ్. అతన్ని కాస్త దూరం తీసుకెళ్ళి అతని చెవిలో ఏదో గొణిగేడా కానిస్టేబులు.

బంటాసింగ్ వెళ్ళిపోవడానికి వెనక్కు తిరిగేసరికి "రెండు మిలటరీ ట్రక్కులు స్టేషను సమీపంలో వున్నాయి. నేనక్కడే వుంటాను. ఓ అరగంటే టయిము అర్జంట్" అని గబగబా వెళ్ళిపోయేడా పోలీసు కానిస్టేబులు.

ఆ రహస్యమేమిటో తెలుసుకోవాలనే కుతూహలంతో గ్రామస్తులంతా బంటాసింగ్‌ని చుట్టుముట్టేరు. ఆ రహస్యాన్ని కాపాడడమనేది అతిముఖ్యమైన విషయమైందతనికి. అతను అధికారికమైన స్వరంతో, "మీరంతా తక్షణం మీమీ ఇళ్ళకు వెళ్ళి మీ ఇళ్ళలోవున్న కట్టెల్ని. కిరసనాయిల్ని స్టేషను సమీపంలోవున్న మిలటరీ ట్రక్కులదగ్గరకు తీసుకురండి మీకక్కడ వాటి ఖరీదు ఇచ్చివేయబడుతుంది" అని అన్నాడు. కారణం చెపుతాడేమోనని ఇంకా వాళ్ళంతా నిరీక్షించసాగారు.

బంటాసింగ్ కఠోరంగా "నేను చెప్పినది మీకు వినిపించలేదా....? చెవుడా? మొద్దుల్లా ఇంకా అలా చూస్తూ నిలబడ్డారేం? పోలీసు వాళ్ళచే కొరడాదెబ్బలు తినాలనుందా? వెళ్ళి వేగం పట్రండి.... ఊఁ....! వేగం వెళ్ళండి" అని ఆజ్ఞాపించాడు.

వాళ్ళల్లోవాళ్ళు గొణుక్కుంటూ తమతమ ఇళ్ళకు వెళ్ళేరు. ఆ గ్రామాధికారికూడా తన ఇంటికి వెళ్ళాడు.

కొన్ని నిముషాల అనంతరం ఆ గ్రామస్తులంతా కట్టెల మూటలు, సీసాలతో కిరసనాయిలు పట్టుకొని రైల్వేస్టేషను కెళ్ళేదారిపద్ద సమావేశ మయారు.

రెండు పెద్ద మిలటరీ ట్రక్కులు ఒకదానివెనుకొకటి అక్కడ ఆగివున్నాయి. చాలా ఖాళీ పెట్రోలు డబ్బాలు అక్కడున్న నూతికి ఎదురుగుండా వరుసగా పేర్చబడున్నాయి. స్టెన్‌గన్ను చేబూనిన ఓ సిక్కు సోల్జరు వాటి సంరక్షకుడిగా అక్కడ నిలబడున్నాడు.

ఓ సిక్కు మిలటరీ ఆఫీసరు ఒక మిలటరీ ట్రక్కు వెనకాల కాళ్ళు వ్రేలాడేసుకొని కూర్చున్నాడు. గ్రామస్తులు తెస్తున్న కట్టెల మోపుల్ని మొదటి ట్రక్కులో పడేయమని చెపుతూ గ్రామస్తుల నమస్కారాలను అందుకున్నాడు తల తాటిస్తూ.

గ్రామాధికారి బంటాసింగ్ అతని ప్రక్కనే నిలబడి ఎవరెవరు ఎంతెంత తెచ్చినదీ ఆ వివరాలు పద్దు వ్రాసుకుంటున్నాడు. ట్రక్కులో తాము తెచ్చిన కట్టెల మూటల్ని పడేసి టిన్నులలో తాము తెచ్చిన కిరసనాయిలు పోసేసి గౌరవప్రదమైన దూరంలో ఎంతో వినయంగా చేతులు కట్టుకొని నిలబడుతున్నారు.

తనవంతు కట్టెలమూటను ఇమామ్‌బక్ష్ ట్రక్కులో పడేసి- కిరసనాయిలు బాటిలును హెడ్మన్ చేతికిచ్చేసి ఊడిపోయిన తలపాగాను చుట్టుకుంటూ "సలామ్ సర్దారు బాబుగారు!" అని సలామ్ చేశాడు. ఆ ఆఫీసరు అదోలా అతనికేసిచూసాడు.

"సర్దారుబాబుగారు! అంతా సవ్యంగా వున్నట్లేనా?" అని సంభాషణ కుపక్రమించాడు.

ఆ ఆఫీసరు కోపోద్రిక్తుడై, "నీకు బుద్ధీ, జ్ఞానం ఉందా లేదా? కనిపించడంలేదూ నేను పని తొందరలో ఉండడం? వెళ్ళు....వెళ్ళు—"

అని కసిరాడు. ఇమామ్‌బక్ష్ ఖిన్నవదనుడై మెల్లగా తన గ్రామస్తులు నిలబడున్న దగ్గరకు వెళ్ళి అక్కడే తలొంచుకొని నిలబడ్డాడు.

రెండు ట్రక్కులూ నిండిపోయినతరువాత- డబ్బుకోసం ఆ మర్నాడుదయం కేంపుకు రమ్మనమని హెడ్మన్‌కి చెప్పి రైల్వేస్టేషనువేపు ఆ ట్రక్కుల్ని గొప్ప స్పీడుగా తీసుకెళ్ళిపోయారు.

ఆ కట్టెలు, కిరసనాయిలు ఆ మిలటరీ సోల్జర్లకెందుకో తెల్సుకోవాలనే కుతూహలంతో ఆ ట్రక్కుల్ వెళ్ళిపోయిన వెంటనే హెడ్మన్ చుట్టూ మూగేరా గ్రామస్తులు.

ఇమామ్‌బక్ష్‌కి జరిగిన అవమానానికి ఓ రకంగా తనుకూడా బాధ్యు డేనని బాధ లోలోన ఆ హెడ్మన్‌ని పీడిస్తోంది, ఆ గ్రామస్తులలో అసహనం అంతకంతకు ఎక్కువవుతోంది.

"ఏమయ్యా! ఏమిటిదంతా....? ఏమీ చెప్పకుండా ఎందుకిలా దాస్తున్నావు? ఏమిటీ రహస్యం? అక్కడికి నువ్వేదో మా అందరికన్నా మహా గొప్పవాడివై పోయాననుకుంటున్నావా ఏమిటి? మాతో మాట్లాడాల్సిన అవసరం నీకిక లేదన్నమాట" అని నిష్ఠురముగా మాట్లాడేడు మీట్‌సింగ్.

"నాకేం తెలీదు బాబూ తెలీదు. తెలుస్తే మీ కెందుకు చెప్పను? మీరు బొత్తిగాచిన్నపిల్లలలాగామాట్లాడుతున్నారు. ఇవన్నీ ఎందుకో చెప్పమని ఆ సోల్జర్లను, పోలీసువాళ్ళను నేనెలా నిలదీసి అడగ్గలను? ఆ పంది ముట్టి వెధవ మన తాతయ్యతో ఎలా మాట్లాడేడో చూశారా? ఎవరి ఆత్మ గౌరవం వారిచేతుల్లోనే వుంటుంది. అనవసరమైనవిషయాల జోలికి పోయి నాకు నేనుగా వారిచే ఎందుకవమానింపబడాలి?" అని అన్నాడు హెడ్మన్.

ఆ హెడ్మన్ అనిన ఆ మాటలలోగల భావాన్ని ఇమామ్‌బక్ష్ గ్రహించి, "మన లాంబర్‌దరా చెప్పినది యదార్థమే! మనం ఎంతో

మర్యాదగామాట్లాడుతూండేటప్పుడు ఎదుటివాడు కుక్కలా మొరుగుతూంటే ఇహ మరి మాట్లాడకూడదు. మౌనంగా వూరుకోవడమే ఉత్తమం! ఇక పదండి అంతా ఇళ్ళకు పోదాం! వాళ్ళేం చేస్తున్నదీ మీకంతగా చూడాల నుంటే మీ ఇళ్ళ పైకప్పుల పైనుంచి చూడొచ్చు." అని అన్నాడు. అంతా తిరుగుముఖం పట్టారు.

ఇళ్ళకు చేరుకున్న వెంటనే- స్టేషనుదగ్గర వాళ్ళేంచేస్తున్నదీ చూడాలనే కుతూహలంలో తమతమ ఇళ్ళ పైకప్పుల మీదికెక్కారు. ఆ మిలటరీ ట్రక్కులు వాళ్ళకక్కడనుంచి అగుపిస్తున్నాయి. అవి తూర్పు దిక్కుగా రైలుమార్గం ప్రక్కనేగల మట్టిరోడ్డుపైనుంచి సిగ్నలు వరకూ వెళ్ళి, అక్కడనుంచి ఎడంచేతివైపు తిరిగి క్రాసింగ్‌వద్ద లైనుదాటి స్టేషనుకేసి వయనించి ట్రైనువెనకాల అదృశ్యమయిపోయాయి. ఆనాడా గ్రామస్తులు అలా ఇళ్ళ పైకప్పుల పైననే నిలచి ఎంతో కుతూహలంతో చూడసాగారు.

"నీ కేమయినా కనిపించిందా? అంటే నీకేమయినా కనిపించిందా!" అని పరస్పరం ప్రశ్నించుకుంటూ తిండీ తిప్పల్ని సైతం మరచిపోయి ఎంతో కుతూహలంతో చూడసాగారు. సాయంత్రమయినా వాళ్ళానాడు ఇళ్ళ పైకప్పుల్ని వదలి క్రిందకు దిగిరాలేదు. అక్కడేదో జరగబోతుందని అందరికీ తెల్సు. కాని ఏం జరగబోతున్నదీ ఎవ్వరకీ తెలీదు. సూర్యాస్త మానం అయింది చీకటిపడింది. నల్లని గొడుగులా అగుపిస్తోంది రైల్వే స్టేషను వాళ్ళకు మరేమీ కనిపించలేదు. అంతా ఇళ్ళ పైకప్పుల మీద నుంచి క్రిందకు దిగారు.

ఆ తరవాత మరికొంతసేపటికి స్టేషనువేపు నీలిరంగులోవున్న నారింజపండు వర్ణం దాల్చింది. అది క్రమక్రమంగా రాగివర్ణం దాల్చింది. ఆ తరవాత మరింత తేజోవంతంగా ప్రకాశించసాగింది! ఎఱ్ఱని అగ్ని

జ్వాలలు నల్లని ఆకాశాన్ని చుంబిస్తున్నాయి. గ్రామంవేపు నెమ్మదిగా గాలి వీచసాగింది. ఆగాలి మండుతున్న కిరోసిన్ వాసనను, కట్టెల వాసనను, మాంసం వాసనను మోసుకొస్తోంది!

ఆనాడా గ్రామం భయంకరమైన విశ్శబ్దంలో మునిగిపోయింది. ఆ దుర్వాన నేమిటని ఒకర్నొకరు ప్రశ్నించడానికి ప్రయత్నించలేదు! వాళ్లు గ్రహించేరా వాసనేమిటో?! అది పాకిస్తానునుంచి వచ్చిన ట్రైనని తెల్సిన వాళ్ళకు ఆ వాసనేమిటో తెల్సు!

ఆకాశాన్ని తాకేటంత గంభీరమైన ఇమామ్‌బక్ష్ గొంతుక ఆనాడు ప్రార్థనాసమయంలో తొట్రుపడింది. అతిదీనంగా హీనస్వరంతో భగవంతుణ్ణి ప్రార్థించడం ఇమామ్‌బక్ష్ జీవితంలో అదే మొదటి పర్యాయమయుంటుంది!

8

అవాళ ఉదయంనుంచీ హుకుమ్‌చాంద్ రెస్టుహౌస్‌లో లేడు. ఆ మధ్యాహ్నం అతని సేవకుడు బొట్టెలను, థర్మాస్ ఫ్లాస్కుతో టీని పట్టుకెళ్ళడానికి రెస్టుహౌస్‌కి వచ్చాడు. వాడు అక్కడున్న బేరరికి, స్వీపరికి ఆ ట్రైనుగురించి చెప్పేడు.

ఆ సాయంత్రం అక్కడున్న సేవకులు, వాళ్ళ కుటుంబీకులు స్టేషను ప్రక్కగల చెట్లపైనుంచి మీదకు లేచిన పొగను, అగ్నిజ్వాలలను చూసారు. ఆ అగ్నిజ్వాలల తేజోవంతమయిన కాంతికిరణాలు రెస్టుహౌస గోడలపైపడి పరావర్తనం చెందుతున్నాయి. అవాళ హుకుమ్‌చాంద్ బాగా అలసిపోయాడు. అతని అలసట శారీరకమయినదికాదు అది మానసికమైనది.

ఒక్కసారిగా అసంఖ్యాకమైన మృతదేహాలను చూసేసరికి అతను చైతన్యరహితమైన ప్రతిమలా కొయ్యబారిపోయాడు. అతిభయంకరమైన

ఆ దృశ్యం అతని హృదయాన్ని కలచివేసింది. అటువంటి మహా ఘోరమైన దృశ్యాన్ని అంతకుముందెన్నడూ అతను చూడలేదు. ఎలాగో అతి కష్టంమీద గుండె దిటవు చేసుకొని, విధి నిర్వహణ కుపక్రమించాడు.

ఓహ్హో! ఎన్నిశవాలు! పురుషులవి, స్త్రీలవి, పిల్లలవి! వందలాది శవాలు! సామాన్లను దించినట్లుగా పీనుగుల్ని ఆరైలుబండీనుంచి క్రిందకు దించారు. ఆ పీనుగుల రైలు ఖాళీ అయింది.

సాయంత్రం అయింది.

పీనుగుల్ని కాల్చడానికి ఏర్పాట్లన్నీపూర్తిచేశారు సోల్జర్లు. పీనుగుల్ని కాల్చే దరిద్రగొట్టు దిక్కుమాలిన ఉద్యోగం తను చేస్తున్నందుకు లోలోన హుకుమ్‌చాంద్ చాలా అసహ్యించుకున్నాడు! చితి అంటించిన వెంటనే హుకుమ్‌చాంద్ రెస్టుహౌస్‌కి వచ్చేశాడు.

హుకుమ్‌చాంద్ వచ్చేసరికి బేరరు, స్వీపరు, వాళ్ళ కుటుంబీకులు డాబాపైనుంచి అగ్నిజ్వాలలకేసి చూస్తున్నారు. వాళ్ళు అతన్ని చూసి క్రిందకు దిగొచ్చి గది తలుపులు తెరచేటంతవరకూ అతను వరండాలో నిలబడ్డాడు.

గది తలుపులు తెరచినవెంటనే హుకుమ్‌చాంద్ తన ప్రక్కమీద నీరసంగా పడుకున్నాడు. స్నానంసంగతి, భోజనంసంగతి అతనికి గుర్తు లేదు. ఓ సేవకుడు అతని జోళ్ళిప్పి కాళ్ళు పట్టసాగాడు. మరో సేవకుడు బాల్చీలతో నీరుతెచ్చి బాత్‌రూంలోని నీటి కుండీలను నింపసాగేడు.

కొద్ది నిముషాల అనంతరం కాళ్ళు పడుతున్న ఆ సేవకుణ్ణి యింక మించుగా తన్నినంతపనిచేసి గభుక్కున లేచి బాత్‌రూంలోకెళ్ళేడు హుకుమ్‌చాంద్.

స్నానంచేసి, నైట్‌డ్రస్ వేసుకున్నతరవాత హుకుమ్‌చాంద్ కాస్త స్థిమితపడ్డాడు. పంకాగాలి చల్లగా తగులుతోంది. దేముడితో కళ్ళుమూసుకొని మళ్ళీ తన పరుపుమీద పడుకున్నాడు.

కళ్ళు మూసేసరికి ఆ పీనుగుల దృశ్యం అతని స్మృతిపథంలో మెదిలింది. భయంకరమైన పీనుగులు....! రకరకాల పీనుగులు!! గట్టిగా కళ్ళు నలుపుకున్నాడు. అయినాసరే ఆ పీనుగులు అతని స్మృతిపథంలోంచి పోలేదు. ఒకడు బయటకూడివచ్చిన తన ప్రేవుల్ని పట్టుకొని "చూడు! నేనేమిటి పట్టుకున్నానో!" అన్నట్లు కళ్ళుతేలేసి చూస్తున్నాడు. ఓమూలని స్త్రీల, పిల్లల శవాలు ప్రోగుపడి నోళ్ళువెళ్ళపెట్టి భీకరంగా బిర్రబిగుసుకుపోయి వున్నాయి. కొన్నిశవాలమీద కనీసం ఒక చిన్న గీరైనా లేదు. బహూశా వాళ్ళంతా గుండెలాగి చచ్చుంటారు.

బల్లేలతో పొడిచి చంపబడిన వాళ్ళ శవాలు, కత్తులతోను, గొడ్డళ్ళతోను నరకబడిన వాళ్ళ శవాలు, తుపాకీలతో కాల్చి చంపబడినవారిశవాలు కంపార్టుమెంట్సులో అసంఖ్యాకంగా ప్రోగుపడివున్నాయి. ఇకపోతే మరుగుదొడ్లన్నీ యువతీయువకుల శవాలతో నిండివున్నాయి. మలమూత్రముల దుర్వాసన, భరించరానంతగా వుంది.

ఇదంతా స్మృతిపథంలో కొచ్చేసరికి కడుపులో త్రిప్పేసి హుకుమ్ చాంద్‌కి వాంతొచ్చినంతపనయింది. వీటన్నింటి మాటకేంగాని హుకుమ్ చాంద్ హృదయాన్ని బాగా కలిచివేసిన దృశ్యమొకటుంది.

తెల్లని పొడపైనగడ్డంగల ఓ ముసలిరైతు అప్పర్‌బెర్తుపై సామాన్లమధ్య కూర్చొనివున్నాడు. చూడ్డానికతను చనిపోయినట్లులేడు. క్రింద జరుగుతున్న పైశాచిక కృత్యాలను గుండె రాయిచేసుకొని చూస్తున్నట్లుగా వున్నాడు. అతని చెవిదగ్గరనుంచి గెడ్డంవరకూ స్రవించిన ఎర్రని రక్తం గడ్డకట్టుకుపోయింది. అతనింకా జీవించే వున్నాడేమోననే ఉద్దేశ్యంతో "బాబా! బాబా!" అని అతని భుజాన్ని పట్టుకొని కుదిపేడు. అతడు తన చల్లని చేతిని చాచి హుకుమ్‌చాంద్ కుడిపాదాన్ని పట్టుకున్నాడు. శరీరమంతటా చెమటలు క్రమ్మేయి హుకుమ్‌చాంద్‌కి. ఏదో

మాట్లాడాలనేఉద్దేశ్యంతో అతడు నోరిప్పేడు. కాని అతని గొంతుకలోంచి ఏమాటా వెలువడలేదు. అతను తనచేతితో మెల్లిగా హుకుమ్‌చాంద్ కాలి మడమ దగ్గరనుంచి కాలి పిక్కవరకూ అక్కడనుంచలా ముడుకు వరకూ తడివేడు. హుకుమ్‌చాంద్ గట్టిగా అరవాలని ప్రయత్నించేడు. కాని అతని గొంతుక మూగవోయింది. ఆ ముసలాడి చేయి అలా అతని తొడవరకూ తడివి కొయ్యబారిపోయి క్రిందకు వాలిపోయింది.

ఈదృశ్యానికి సంబంధించిన స్మృతి హుకుమ్‌చాంద్ హృదయాన్ని బాగా కలచివేసింది. అతని శరీరం గగుర్పొడిచింది. బాధగా మూల్గుతూ భీతితో లేచి కూర్చున్నాడు. అతని నేత్రాలలో భయం పేరుకుపోయింది. అంతే భయంతో చూస్తూ బేరర్ అతనిప్రక్క నిలబడున్నాడు.

"బాబూ! తాము బాగా అలసిపోయినట్టున్నారు. కాళ్ళు పట్టమని సెలవా?" అని వినయంగా అడిగేడు.

హుకుమ్‌చాంద్ ఏమీ సమాధానమివ్వలేదు. నుదిటిపై పట్టిన చెమటను తుడుచుకొని, 'హరేరామ్ హరేరామ్!' అనంటూ తలగడాకి ఆనుకొని పడుకున్నాడు. నరముల బలహీనత అతన్ని మరింత భయకంపితుణ్ణి చేసింది. "అబ్బ! ఎంత నీరసంగావుంది" అని అనుకున్నాడు. కొంతసేపయేక "కాస్త విస్కీపట్రా" అని బేరర్ని ఆజ్ఞాపించేడు.

బేరర్ ఓ ట్రేలో విస్కీసీసా, సోడాబుడ్లు, గాజుగ్లాసులు పెట్టి తీసుకొచ్చేడు. విస్కీని గాజుగ్లాసులో పావువంతు నిండేటట్టు పోసేడు హుకుమ్‌చాంద్. ఆ మిగిలిన భాగాన్ని సోడాతోనింపేడు బేరర్. అందులో సగం ఒకేగుక్కలో త్రాగి వెనక్కు చేరబడ్డాడు హుకుమ్‌చాంద్.

కొంచెంసేపట్లో అతని నరాలు విస్కీత్రాగిన కారణంగా కాస్త ఉద్రిక్తమయేయి. కాళ్ళు పట్టడం మళ్ళీ ప్రారంభించేడు సేవకుడు. కాస్త

బడలిక తగ్గినట్లు ఫీలయేడు. పైకప్పుకేసిచూస్తూ పడుకున్నాడు. స్టీవరు హుకుమ్‌చాంద్ బెడ్ ప్రక్కనేవున్న టేబులుమీద ఓదీపంపెట్టేడు.

ఏవో పురుగులు చిమ్మిచుట్టూ తిరిగి రివ్వున పైకప్పుమీదికెగిరి మళ్ళీ దీపంచుట్టూ తిరుగుతున్నాయి. గోడమీద మెల్లగాప్రాకుతున్నబల్లుల నోటపడేటంతవరకూ ఆ పురుగులు అలా ఎగురుతూనే వుంటాయి. వాటి గమ్యం అదే. ప్రతిజీవియొక్క గమ్యం మృత్యువే. ప్రతిజీవీ తనకు తెలీకుండానే మృత్యుముఖంకేసి పయనిస్తూంటుందనుకున్నాడతను. పడుకున్నవాడు పడుకున్నట్లుగా పక్కమీద చనిపోవచ్చు. అతనిశరీరానికి పురుగులు పట్టి, దుర్వాసన నల్దిశలా వ్యాపించిన్నాడు అందరికీ తెలుస్తుంది అతను చచ్చినట్లు. మరి తనుకూడా ఛఛః వెధవాలోచనలుః అలాంటి అవాంఛనీయమైన ఆలోచనలోంచి తప్పించుకోడం ఎలా? గ్లాసులో మిగిలివున్నవిస్కీని గుటుక్కున త్రాగేసి మళ్ళీ ఆ గ్లాసుని విస్కీతో నింపేడు.

మృత్యువంటే ఒక రకమైన భయం అతనికి మొదటినుంచీవుంది. ఒక మృతశిశువును ప్రసవించిన తరువాత అతని మేనత్త ఎలా మృత్యువాతబడిందో అతను కళ్ళారా చూసేడు తనుకన్న మృతశిశువుని చూసిన వెంటనే ఆమెకు మతివిభ్రమ కల్గింది. ఏదో దెయ్యంవచ్చి తనబిడ్డను చంపివేసినట్లు మృత్యువు తన కాళ్ళదగ్గరే కూర్చొని వున్నట్లు భ్రమించి అటువేపు వ్రేళ్ళతో నిర్దేశించి చూపుతూ భీతితో గిలగిల కొట్టుకొని కొద్ది రోజులలోనే ఆమె కన్నుమూసింది. ఆదృశ్యం హుకుమ్‌చాంద్ స్మృతిపథంలోంచి ఇంకా చెరిగిపోలేదు.

మరణభయాన్ని పూర్తిగా తొలగించుకోవాలనే పట్టుదలతో యూనివర్శిటీ సమీపానగల స్మశానస్థలిలో దగ్ధమవుతోండే శవాలను గంటలతరబడి చూస్తూ తన యౌవనదశలో గడిపిన రోజులు కొన్ని వున్నాయిః చిన్నా పెద్దా అన్నిరకాల వయస్సులలోనువున్న వాళ్ళ మృతదేహాలను

వాళ్ళ ఆత్మీయులు హృదయవిదారకంగా రోదిస్తూండగా స్మశానానికి తీసు కొస్తూండడం- వాటిని దహనపరుస్తూండడం చూస్తూవుండేవాడు. ఇలా తర చుగా స్మశాన భూములను సందర్శిస్తూండడంచేత అతనికి మృత్యుభయం కాస్త తగ్గకపోలేదు. కాని పూర్తిగా అతనిలో మృత్యుభీతి ఇంకా తొలగి పోలేదు.

ఈ భౌతికదేహం అశాశ్వతమయినదని బాగా హృదయానికి నాటే టట్లు తెల్సుకోవడంవల్ల- అతనిలో మానవత్వానికి సంబంధించిన దయ, సహనం, ప్రేమ, ధాతృత్వం ఇత్యాది ఉదాత్తమైన గుణాలు కొన్ని ఏర్ప డ్డాయి. ఇందువల్ల కష్టాలలోకూడా కాస్త ఉల్లాసంగా వుండడం అలవడిం దతనికి.

తనభార్య రూపవతి కాకపోయినా, చదువుసంధ్యలు లేకపోయినా సంస్కారవంతురాలు కాకపోయినా ఆమెతోనే జీవితాన్ని వెళ్ళబుచ్చు తూండడానికి ఈరకమైన వేదాంతధోరణే హేతువు.ఈప్రపంచంలో మృత్యు వొక్కటే సత్యమైనదనే నమ్మకం ఏర్పడడంవల్ల జీవితంలో ఈరకమై వైరాగ్యం అతనికేర్పడింది. శారీరక మానసిక సంబంధమైన సర్వవాంఛల యొక్క విలువా అత్యల్పమేనని అవి తాత్కాలికమయిన సుఖభోగాల్ని యిచ్చేవి మాత్రమేనని తెల్సుకున్నాడు. అప్పుడప్పుడు బహుమతులు పుచ్చుకుంటూ ఆపదలలోవున్న స్నేహితులకు సహాయంచేసినా ఓ లంచ గొండిగా మాత్రం ఎవ్వరిచేతా అతను గుర్తింపబడలేదు. పైగా విందులు, వినోదాలలోను- సానిమేళాలలోను పాల్గొంటున్నా శీలాన్నిమాత్రం చెడ గొట్టుకోలేదు. కారణం పాపభీతి: కాని ఓ పెద్దరైలుబండినిండా వచ్చిన పీనుగుల్ని చూసేక అతని వేదాంతధోరణి విచలితమయిపోయింది.

ఈ దారుణమైన మానవ మారణహోమాన్ని చూసేక ఎవరికర్మ ననుసరించి వారికలాంటి చావొస్తుందనే కర్మసిద్ధాంతంతో తనసుతాను

వంచించుకోలేకపోయేడు హుకుమ్‌చాంద్. అతనిహృదయం అనిర్వచనీయ మయిన భయాందోళనలతో కంపించసాగింది.

నాలుక కరచుకొని నోటంట రక్తం కారుతూండగా గుడ్లుతేలేసి అసువుల్నిబాసిన అతని మేనత్తబావు మళ్ళీ అతని స్మృతిపథంలో మెదల డం ప్రారంభించింది. విస్కీత్రాగి మైమరచిపోదామనుకున్నాడు. అంతల్లో అకస్మాత్తుగా ఆగది అతనికారు హెడ్‌లైట్సుచే ప్రకాశవంతమయింది. బహుశా ఆ కారు గేరేజిలో పెట్టబడుంటుందనుకున్నాడు.

బాగా చీకటిపడిందనేవిషయం అప్పుడు గుర్తించాడు హుకుమ్ చాంద్. బహుశా సేవకులంతా వాళ్ళవాళ్ళ ఇళ్ళకుపోయి వాళ్ళవాళ్ళ భార్యా బిడ్డలతో హాయిగా పడుకొనివుంటారు.... తనుమాత్రం ఏకాకిగా ఆ రెస్టు హౌస్‌లో పీడకలలుకంటూ ఇక అశేషరాత్రి గడపాల్సుంటుంది. ఇంతకీ తనెందుకలా ఏకాకిగా వుండడం? వాళ్ళని తనదగ్గరే పడుకోమనొచ్చుగా! వరండాలో బోలెడంతజాగావుంది. తనాజ్ఞాపిస్తే చచ్చినట్లు పడుకుంటారు. అవునుగానీ తనలాఆజ్ఞాపిస్తే- తను భయపడుతున్నట్లు వాళ్ళు పసిగడతారో ఏమిటో....? వాళ్ళమొహం! వాళ్ళకంతపాటి తెలివితేటలెక్కడ? "ఇవాళ రాత్రి మీతో నాకు పనుండొచ్చు. అంచేత మీరంతా నాకందుబాటులో వుండాలి. ఇవాళరాత్రి ఈ వరండా మీదే పడుకోండి" అని వాళ్ళతోచెపితే సరిపోతుందిగా. హుకుమ్‌చాంద్ ఆతీరులో ఆలోచించి, "ఏయ్ బేరర్" అని బేరర్ని కేకేసి పిలిచాడు.

"బాబూ" అంటూ లోనికొచ్చేడు బేరర్.

"ఇవాళరాత్రి పడుకోడానికి నా మంచం ఎక్కడ వేశావు?" అని అడిగేడు.

"తమ మంచం ఇంకా ఎక్కడా వెయ్యలేదుబాబూ! అవతల మబ్బుగావుంది. వర్షం వస్తుందేమో! తమాజ్ఞయితే వరండాలో మంచం వేస్తాను" అని సమాధానమిచ్చేడు.

"అవసరంలేదు. నేనివాళ గదిలోనే పడుకుంటాను కొస్త చల్లబడే టంతవరకూ ఆ కుఱ్ఱాడిని పంకా లాగమనిచెప్పు. ఆర్డర్లీలందర్నీ వరండా మీద పడుకోమన్నానని చెప్పు. వాళ్ళతో ఈ రాత్రి ఏదయినా అత్యవసర మైన పని నాకుండొచ్చు." అని బేరర్ కేసి చూడకుండా అధికారికమయిన గొంతుకతో అన్నాడు.

"అలాగేబాబూ! ఇంటికెళ్ళేముందు వాళ్ళతో చెపుతాను. తమకు భోజనం తీసుకురమ్మంటారా" అని అడిగాడు.

నిజానికి హుకుమ్‌చాంద్ తన భోజనంమాట మరచిపోయేడు.... "ఇప్పుడు నేను మరి భోంచెయ్యను ఆర్డర్లీలకు చెప్పు: వాళ్ళపక్కలు వరండామీద పరచుకొని పడుకోమన్నానని, డ్రైవర్నికూడా ఇక్కడే పడుకోమన్నానని చెప్పు: ఒకవేళ వరండామీద జాగాలేకపోతే ప్రక్క గదిలో పడుకోమను" అని ఆజ్ఞాపించాడు. బేరర్ వెళ్ళిపోయేడు. హుకుమ్ చాంద్ మనస్సు కొస్త తేలికపడింది. తనచుట్టూ చాలామంది మనుష్యు లుంటారు గనక ఇక నిర్భయంగా నిద్రపోవచ్చనుకున్నాడు.

వరండాపై పక్కలు పరచుకోడానికి స్థలాలకోసం ఆర్డర్లీలు చేస్తున్న హడావుడిని, ప్రక్కగదిలో సామాన్లను ఓ పక్కకు నెట్టుతున్న ధ్వనిని హుకుమ్‌చాంద్ విన్నాడు.

మళ్ళీ కారు హెడ్‌లైట్సు కాంతితో ఆగది కొద్దిక్షణాలసేపు ప్రకాశవంతమయింది. వరండా అవతల ఆకారు ఆగింది. స్త్రీ, పురుషుల కంఠధ్వనులను, గజ్జెల మ్రోతను అతను విన్నాడు. లేచి కూర్చొని బయ టకు తొంగిచూసేడు. అన్నట్లు తను వాళ్ళసంగతే మరచిపోయేడు. మళ్ళీ వచ్చేరన్నమాట.

"బైరా" అని బేరర్ని బిగ్గరగా పిలచేడు.

"బాబూ" అనంటూ వాడు గదిలోకొచ్చాడు.

"వెళ్ళి ఆ డ్రైవరుకుచెప్పు: ఆ ముసల్దానినీ, వాద్యగాళ్ళను వాళ్ళ ఇళ్ళదగ్గర దిగబెట్టేయమన్నాననీ" అని కొంచెం సేపు ఆగి గొంతుక సవరించుకొని. "వరండాలో పడుకున్నవాళ్ళందరినీ వాళ్ళవాళ్ళ క్వార్టర్సుకి వెళ్ళిపోమన్నాననిచెప్పు. అంతగా అవసరమయితే కబురు చేస్తాననిచెప్పు" అని చెప్పాడు.

తనావిధంగా వాళ్ళకు పట్టుబడినందుకు తన తెలివితక్కువతనానికి తనను తానే నిందించుకున్నాడు. బహూశా తన సేవకులు తనను చూసి నవ్వుకోవచ్చు. ఇంతకీ ఇప్పుడేమనుకొని ఏం ప్రయోజనం....? ఇలాంటి విషయాల గురించి ఏమీ పట్టించుకోకూడదనుకొని ఓ గ్లాసుడు విస్కీ పట్టించాడు.

బయట వరండాలో పక్కలు పరుచుకుంటున్న అర్డర్లీలు, హుకుమ్ చాంద్ మాటలువిని, బేరర్ ఇంకా ఏమీ చెప్పకముందే, పక్కలు చుట్టేసుకొని వెళ్ళిపోయే సన్నాహంలో వున్నారు.

ప్రక్కనున్న గదిలో పిదీపం తొలగించబడింది. డ్రైవరు మళ్ళీ కారు స్టార్టు చేశాడు. ఒకసారి హెడ్‌లైట్సు వెలిగించి మళ్ళీ ఆర్పేశాడు.

ఆ ముసిల్ది కాలెక్కకుండా బేరర్‌తో వాదానికి దిగింది. ఆమె గొంతుక అంతకంతకు హుకుమ్‌చాంద్‌ని ఉద్దేశిస్తూ అన్నమాటలు లోపలికి ధ్వనించింది అతడు కోపోద్రిక్తుడయేడు.

"ఇక్కడనుంచి వెంటనే వెళ్ళిపో. లేదా క్రితంరోజు నువ్వు నాకు బాకీ వున్నదంతా ఇప్పుడు వసూలుచేస్తాను. ఏయ్‌బేరర్.... దాన్ని తక్షణం ఇక్కడనుంచి పంపించేయ్" అని బిగ్గరగా అరచేడు. దాంతో ఆ ముసల్దాని గొంతుక అణగారిపోయింది. దాన్ని ఆ కార్లోకి నెట్టివేశారు. వెంటనే ఆ కారు చీకట్లోకి దూసుకుపోయింది. హుకుమ్‌చాంద్ లేచి టేబిలుపైనున్న దీపాన్ని తీసి ఓమూలనుంచాడు.

గోడమీదనున్న ఓ పురుగుని ఓ బల్లి పట్టుకుంది. ఆపురుగు దాని దవడలమధ్య టపటపమని కొట్టుకుంటోంది. ఆ దృశ్యాన్ని హుకుమ్‌చాంద్ ఏదో యాదాలాపంగా చూసేడు.

గది తలుపు తెరవబడి మళ్ళీ నెమ్మదిగా వేయబడింది. ఒక నల్లని ఆకృతి గదిలోకి ప్రవేశించింది. ఆమె చీరెపైగల వెండిజలతారు ఆ గుడ్డి దీపపు వెలుగులో తళతళ మెరుస్తోంది. హుకుమ్‌చాంద్ ఆమెకేసి పరిశీలనగా చూసేడు. ఆమె తన నల్లని విశాలనేత్రాలతో అతని ముఖంలోకి భయపడుతున్నదానిలా చూడసాగింది.

"మరేం భయంలేదులే! రా!" అని ఎంతో ఆప్యాయంగా ఆ అమ్మాయిని పిల్చి, తన ప్రక్కనే కూర్చోమని చేత్తో సైగచేశాడు.

ఆ అమ్మాయి మెల్లగావచ్చి, అతని మంచంమీద ఓ చివర్నిబెరుగ్గా చూస్తూ కూర్చుంది; హుకుమ్‌చాంద్ ఓచేత్తో ఆమె నడుమునుచుట్టి- రెండో చేత్తో ఆమె తొడలమీద, పొట్టమీద, అపరిపక్వమైన వక్షోజాలమీద తడవ సాగాడు; ఆమె నిర్లిప్తంగా కూర్చుంది.

హుకుమ్‌చాంద్ మరింత ముందుకుజరిగి ఆమెతో మెల్లిగా, "వచ్చి పడుకో" అని అన్నాడు. ఆ అమ్మాయి అతని ప్రక్కన పడుకుంది. ఆమె జలతారు చీరెకొంగు అతని ముఖానికి తగిలి అతన్ని పులకింపజేసింది.

బాగా ఎండినభూమిపై నీళ్ళు చిలకరించేటప్పుడొచ్చే వాసనలాంటిది ఆమె శరీరంలోంచి వెలువడుతోంది; ఆమె నిశ్వాసంలోంచి వెలువడే గాలి ఏలకపళ్ళవాసన కొడుతోంది. ఆమెవక్షం తేనెలా వాసనకొడుతోంది. హుకుమ్‌చాంద్ ఓచిన్నపిల్లాడిలా ఆమెను కౌగలించుకొని నిద్రపోయాడు.

9

ఒక పెద్ద ఉరుము హుకుమ్‌చాంద్‌ని మేల్కొలిపింది. గదిలో చిన్న గుడ్డి వెలుగుంది. మసిబారిన చిమ్నీలోంచి పచ్చనికాంతి తగు

మాత్రంగా ప్రసరిస్తోంది. అంతల్లో మరో పెద్ద మెరుపు, దానివెంటనే పెద్ద ఉరుము, చల్లని పెనుగాలి గదిలోకి వీచింది. రెపరెపలాడి దీపం ఆరిపోయింది. టపటపమని వర్షపు చినుకులు పడనారంభించాయి.

ఓ....! వర్షమే! ఎంతకాలానికెంతకాలానికి!

భూమంతా ఆర్చుకుపోయింది. ఆ సమయంలో వర్షానికి స్వాగతం పల్కని వారెవ్వరూ వుండరు! కాని ఆ కాలుతున్న శవాలమాటేమిటి? ఆ సంగతి జ్ఞాపకానికొచ్చేసరికి హుకుమ్‌చాంద్ శరీరమంతటా చమటలు క్రమ్మేయి. సుమారు నూరుగజాల పొడవున పేర్చబడిన వందలాది శవాలు! సగంకాలుతున్నశవాలు! వాటి గతేమిటి?

హుకుమ్‌చాంద్ నుదుటిపై నుండి చమటబిందువులు క్రిందకు వర్షించసాగాయి. అతనికి బెంగ పట్టుకుంది! ప్రక్కపై అడ్డంగా పడుకున్నాడు. ప్రక్కన అమ్మాయిలేదు. రెష్టుహౌస్‌లో ఒక్కడేవున్నాడు. తలగడాక్రింద పెట్టిన రిష్టువాచీ తీసి చుట్టూ చెయ్యి అడ్డుపెట్టి రేడియమ్ దయలు కేసి చూసాడు. అరున్నరఅయింది. రోజుకన్నా తనవాళ ఆలస్యంగా లేచినట్లు గుర్తించాడు.

వరండాపై ఎవరో దగ్గినట్లు శబ్దమయింది. తృళ్ళిపడి లేచాడు. తలంతా చాలా భారంగావుంది. కొస్త నొప్పెడుతోంది కూడాను. కళ్ళు గట్టిగా మూసుకొని రెండుచేతులతోను తల గట్టిగా పట్టుకొని నొక్కుకున్నాడొకసారి ఆ రాత్రి తను చాలా అధికంగా త్రాగి ఏమీ తినకపోవడం వల్లే అలా వుందనుకున్నాడు. కొంచెం సేపయేక కళ్ళిప్పి గదంతా పరిశీలించసాగాడు. లియజూసాడు.

ఈజీచైరులో పడుకొనివున్న ఆ అమ్మాయి అతని కంటపడేసరికి, తన తెలివితక్కువతనానికి, అశక్తతకు తనను తానే నిందించుకున్నాడు

హుకుమ్‌చాంద్. పాపం ఆ అమ్మాయి తన కోరిక తీర్చడానికొచ్చింది! కాని తను? ఛీఛీ! సిగ్గుసిగ్గు! ఎంత అశక్తుడు తను?

ఇంతకీ ఆచిన్నారిని తనెలా అనుభవించడం? తన కుమార్తె బ్రతికున్నట్లయితే సరిగ్గా అంతే వుంటుంది! ఈ రకమైన భావం కల్గేసరికి అతని హృదయం పశ్చాత్తాపంతో నిండిపోయింది! ఈ రకమైన పశ్చాత్తాపం తరచుగా కల్గుతూండడం అతనికి అలవాటే!

మరో బాటిలు విస్కీ త్రాగినట్లయితే తన కుమార్తెలాగున్న ఆ అమ్మాయిని ప్రక్కలో పడుకోబెట్టుకొని హాయిగా నిద్రపోగలడతను! తెలివొచ్చి మత్తొదిలేక, ఛఛ! తనెంత పాపిష్టిపని చేశాడని పశ్చాత్తాపం పడుతూంటాడు. సాధారణంగా చాలామంది జీవితాలు ఇదేవిధంగా ఛండాలంగా వుంటూంటాయి! తాము చేస్తున్నవి పాపిష్టిపనులని తెలిసికూడా భౌతికసుఖాల నపేక్షించి, ఎన్నో పాపిష్టిపనులు చేస్తూ, ఆ తరవాత పశ్చాత్తాప పడుతూ, మళ్ళీ అవే పాపిష్టిపనులు చేస్తూంటారు. మానవులీవిధంగా తెలిసి మరీ పాపిష్టి కూపంలో పడిపోతూంటారనుకున్నాడు హుకుమ్‌చాంద్.

ఆ తరవాత హుకుమ్‌చాంద్ ఫ్రూట్‌సాలిడ్ బాటిల్ తెరచి, ఓ గాజు గ్లాసులో పెద్ద చెంచాతో మూడు నాలుగుసార్లు వేసి థర్మోస్ ఫ్లాస్కులోని నీళ్ళు అందులో కొంచెం పోశాడు. ఆ నీళ్ళు బాగా పొంగి కొంచెం టేబుల్ మీదికి ఒలికిపోయాయి. పొంగు తగ్గేటంతవరకూ చెంచాతో బాగా కలిపి, ఆ తరవాత త్రాగేశాడు.

బుఱ్ఱ చేతులతో పట్టుకొని, టేబులు కానుకొని కొంచెంసేపలా కూర్చున్నాడు. కొంతసేపయేక రెండు పెద్ద త్రేనుపులొచ్చాయతనికి. శరీరం కాస్త తేలికపడ్డట్టు అప్పుడు ఫీలయాడు. రెండు మూడు కప్పుల వేడి టీ తాగుతే ఆ మిగిలిన బాధకూడా తగ్గొచ్చనుకున్నాడు.

టేబులుపైనున్న అద్దంలో తనముఖం చూసుకున్నాడు. కనుగొలుకులలో పచ్చని పుసులున్నాయి. నెరసిన తలవెంట్రుకలు, ముఖంపైగల ముడతలు, మీదపడుతున్న ముసలితనాన్ని అతనికి గుర్తుచేసినాయి. నాలుక చాపి చూచుకున్నాడు. దానిపై పచ్చగా అసహ్యంగా పాచి పేరుకపోయింది. నాలికచాచినప్పుడు నోట్లోంచిచొంగ టేబులుపై పడింది! ఛీఛీ! తన నోరు తనకే అసహ్యంగా వుంది. తను విడిచిపెడుతున్నగాలి తనకే కంపు కొడుతోంది. కడుపులో దేవికివేస్తున్నట్లుంది! పాపం ఆ అమ్మాయి ఎలా భరించిందో? ఆరాత్రి తన ప్రక్క నాఅమ్మాయి ఎలా పడుకోగలిగిందో? బహూశా ఎంతో బాధ పడుంటుందనుకున్నాడు హుకుమ్‌చాంద్.

హుకుమ్‌చాంద్ కాలకృత్యాలన్నీ తీర్చుకున్నాడు. టీ త్రాగుతూ వాలుకుర్చీలో పడుకొని నిద్రపోతున్న ఆ అమ్మాయి నొకసారి పరిశీలనగా చూసాడు. ఆమె కొద్దిగా నోరు తెరచి శవచ్ఛవంలా పడుకొనివుంది. తోనికి ఊపిరి తీసినప్పుడల్లా ఆమె రొమ్ములు బాడీకి నిండుగా అగుపిస్తున్నాయి! జుత్తు ముఖమంతా విరజిమ్మబడుంది. చీరె బాగా నలిగిపోయుంది. ఆమె మనస్ఫూర్తిగా తన పొందు కోరినట్లయితే ఆమెనను భవించడానికి తనకేమీఅభ్యంతరంలేదు! కాని తనుబాగాత్రాగితేగాని లాభం లేదు. అలాంటి పని చెయ్యాలంటే తన వొంటిమీద తెలివుండకూడదు! అవతల వరండామీదనుంచి అడుగుల చప్పుడు, పొడిదగ్గు వినిపించింది! హుకుమ్‌చాంద్‌యొక్క శారకమైన ఆలోచనల కంతరాయం కల్గింది.

అది నిజమైన దగ్గుకాదు. తనొచ్చినట్లు తెలియజెయ్యడంకోసం సబిన్‌స్పెక్టరు దగ్గిన పొడిదగ్గన్న సంగతి హుకుమ్‌చాంద్ గ్రహించాడు. తలుపు తెరచి వరండాలోకొచ్చాడు. సబిన్‌స్పెక్టరు న్యూస్‌పేపరు చదువుతున్నాడు. డిప్యూటీ కమీషనర్‌ని చూసి, కుర్చీలోంచి గబుక్కున ఒక గెంతు గెంతి, శాల్యూట్‌చేశాడు సబిన్‌స్పెక్టరు.

"ఇవాళ నీవు చాలా వేగంగా వచ్చినట్లున్నావు. అంతా సవ్యంగా ఉన్నట్లేనా" అనిఅడిగాడు హుకుమ్‌చాంద్.

"ఏం చెప్పమంటారుసార్! బ్రతికున్నందుకీరోజుల్లో ఎవరైనాసరే సంతోషించాలి! ఎక్కడా శాంతిలేదు. ఓ బాధాకరమైన సమస్య తరువాత అంతకంటె బాధాకరమైన మరోసమస్య" అని సబిన్‌స్పెక్టరు అంటూండగా హుకుమ్‌చాంద్‌కి శవాలసంగతి స్మృతిపథంలోకొచ్చింది.

"అన్నట్లు రాత్రి బాగా వర్షం పడినట్లుంది. రైల్వేస్టేషనుదగ్గర పనంతా సవ్యంగా పూర్తయిందా?" అని అడిగాడు.

"వేకువ ఝామున వర్షం ప్రారంభించినవెంటనే నేనక్కడికి వెళ్ళాను. శవాలు చాలావరకూ కాలిపోయాయి. కాని చాలా పుర్రెలు, ఎముకలు ఓపెద్ద కుప్పలా వుండిపోయాయి. వాటినేంచెయ్యాలమో నాకేం బోధపడలేదు. రైల్వేస్టేషనువేపుగాని, బ్రిడ్జివేపుగాని ఎవర్నీ రానివ్వవద్దని గ్రామాధికారికి కబురు చేసాను."

"అవి ఎన్ని శవాలో నువ్వు లెక్కబెట్టావా?"

"నేను లెక్కించలేదుగాని, వెయ్యిశవాలకుపైనవున్నట్లు ఆ సిక్కు మిలటరీ ఆఫీసరుగారు చెప్పేరు. ఒక్కొక్క కంపార్టుమెంటులో మామూలుగా ఎంతమంది పడతారోచూసి మొత్తం కంపార్టుమెంట్ల సంఖ్యచే ఆ సంఖ్యను గుణించి అతను ఉజ్జాయింపుగా లెక్కగట్టినట్లున్నాడు. మరో నాలుగైదు వందలమందికి పైగా చనిపోయుంటారని అతని అంచనా. ట్రైను పైకప్పుమీద వున్న వాళ్ళను, ఫుట్‌బోర్డ్సుపై వున్నవాళ్ళను, బఫర్సుపై వున్నవాళ్ళను వాళ్ళు చంపేసుంటారని వాళ్ళ శవాలు క్రిందకు పడిపోయుంటాయని అతని అభిప్రాయం. ట్రైను పైకప్పులమీద ఎక్కడ చూసినా రక్తపు మరకలే!"

"హరేరామ్! హరేరామ్! ఏ పాపం ఎరగని పదిహేనువందల మంది అమాయకప్రజలు ఎంతో దారుణంగా బలైపోయేరు. ఈ కలి

యుగంలో ఇంకెన్ని దారుణాలు జరగనున్నాయో ఏమిటో! ఈ ప్రపంచంలో మూర్ఖత్వం, క్రూరత్వం పెరిగిపోయింది. ఈ ప్రాంతంలోవున్న ప్రజలుకూడా ఇహ ఇట్లాంటి దారుణాలకొడిగట్టవచ్చని నాకనుమానంగా వుంది. ఈ సరిహద్దు ప్రాంతపు గ్రామాలలో చాలామంది ముస్లిములున్నట్లున్నారు. మరి వాళ్ల మాటేమిటి?"

"తమకావిషయం మనవి చెయ్యడానికే నేనిప్పుడొచ్చాను. కొన్ని గ్రామాలలోవున్న ముస్లిములు అప్పుడే శరణార్థుల శిబిరానికి చేరుకోడానికి బయలుదేరేరు. చుందున్నుగ్గర్ అప్పుడే చాలావరకూ ఖాళీ చెయ్యబడింది. బెలూచి, పటాన్ సోల్జర్సుతో కూడిన పాకిస్తాన్ లారీలు ఠోగట్టా అందిన వెంటనే ముస్లిములను తీసుకుపోవడానికి వస్తున్నాయి. కాని మానోమజ్రాలోని ముస్లిములు ఇంకా ఆ గ్రామాన్ని వదిలిపెట్టలేదు. ఆ గ్రామాధికారి నాకివాళ ఉదయమే రిపోర్టుచేసాడు. ఆ గ్రామానికి సుమారు నలభై ఏభై మంది సిక్కు కాందిశీకులు వేకువఝామున నదినిదాటి కాలినడకను వచ్చినట్లు: సిక్కు దేవాలయంలో వాళ్ళ నుంచడం జరిగింది."

హుకుమ్‌చాంద్ తీక్షణంగా చూస్తూ, "వాళ్ళనెందుకక్కడుండ నిచ్చేవు?" అనడిగిసమాధానంకోసంనిరీక్షించకుండానే, "జలంధరులోవున్న శిబిరానికి ఇలావచ్చే కాందిశీకులందర్నీపంపించమనిఖచ్చితమైనఆర్డర్సున్నాయన్న సంగతి నీకు తెలియందికాదు. ఇది చాలా తీవ్రమైన విషయం. ఏమాత్రం జాప్యంచేసినా మానోమజ్రాలోగల ముస్లిములను వాళ్ళు హత్యచేసి ఆస్తిపాస్తుల్ని దోచుకోవచ్చు."

"ఫరావాలేదుసార్! పరిస్థితి అదుపులోనేవుంది. మానోమజ్రాకు వచ్చిన ఆ కాందిశీకులు పాకిస్తానులో చెప్పుకోదగినంత అధికంగా ఏమీ పోగొట్టుకోలేదు. దారిలో అడ్డగించి వాళ్ళనెవరూ దోచుకోలేదు. ఇంకో గమనించదగ్గ విషయం ఏమిటీ అంటే మానోమజ్రాలోవున్న ముస్లిములు

కూడా వాళ్ళకు అన్న పానీయాలను సప్లై చేస్తూండటం! పాకిస్తానులో తమ ఆత్మీయుల్ని, ఆస్తిపాస్తుల్ని, పోగొట్టుకొని ప్రాణాలరచేతిలో పెట్టుకొని వచ్చిన కాందిశీకులు వాళ్ళయినట్లయితే పరిస్థితి ఇందుకు భిన్నంగా వుండేది. వర్షాలు బాగా పడితే మామూలు కాలినడకను నదిదాటి ఎవ్వరూ రాలేరు. నవంబరు, డిసెంబరు నెలలవరకూ సాధారణంగా నదిలో నీరు బాగానేవుంటుంది. ఈ ఏడాది ఇంతవరకూ పెద్ద వర్షాలు లేకపోవడంచేత రివర్ క్రాసింగ్స్ చాలావున్నాయి. రివర్ క్రాసింగ్స్‌వద్ద తగిన గస్తీ ఏర్పాటు చెయ్యడానికి చాలినంత పోలీసుబలగం నా ఆధీనంలో లేదు" అని అన్నాడు సబిన్‌స్పెక్టరు.

రెస్టుహౌస్ గ్రౌండువేపు హుకుమ్‌చాంద్ ఓసారి చూసేడు. వర్షం నిలకడగా పడుతోంది. గుమ్మాలు, గాతలు నీళ్ళతో నిండుతున్నాయి. మేఘం పట్టు ఇంకా బాగానేవుంది. "ఈ వర్షం ఇలాగే మరికొంతసేపు పడితే నదిలో నీటిమట్టం బాగా పెరుగుతుంది. అప్పుడు నది దాటడానికి ఏరేవూ అనుకూలంగా వుండదు. కాందిశీకుల రాకపోకల్ని వంతెనలవద్ద మాత్రమే ఎవరైనాసరే కంట్రోల్ చెయ్యగలరు." అని అన్నాడు. సబిన్‌స్పెక్టరు ఏమీ అనలేదు. మెరుపులు, ఉరుములు- వర్షంయొక్క- ఉధృతాన్ని సూచిస్తున్నాయి. వానజల్లు వరండామీద పడుతోంది.

"ఏది ఏమైనా ఈ ప్రాంతంలోగల ముస్లిముల నందరినీ వాళ్ళ కిష్టం వున్నా లేకపోయినా సురక్షిత ప్రాంతాలకు తరలించక తప్పదు. ఈ పని ఎంత వేగిరం జరిగితే అంత మంచిది" అన్నాడు హుకుమ్‌చాంద్.

కొంతసేపటివరకూ ఎవ్వరూ ఏమీ మాట్లాడలేదు. ఆ ఉభయులూ అలా వర్షంకేసిచూస్తూ కూర్చున్నారు. హుకుమ్‌చాంద్ మళ్ళీ సంభాషణ కుపక్రమించాడు. "ఎవరైనాసరే ఈ గాలివాన అంతమొందేటంతవరకూ ఎక్కడికీ వెళ్ళలేను. ఎంతో గర్వంగా నిటారుగా నిలబడున్న ఆ చెట్లు

గాలికెలా వంగిపోతున్నాయో చూడండి. మరికొంచెం గాలి ఎక్కువైతే విరిగిపోయినా విరిగిపోవచ్చు. ఏదిఏమైనా ప్రకృతి భీభత్సాన్ని ఎదుర్కొనే శక్తి మాత్రం మానవునికి లేదు" అని కొంచెంసేపాగి- "అయితే ఒకటి- ధైర్యసాహసాలు గలవాళ్ళు మాత్రం ఏటి కెదురీదగలరు!" అని అన్నాడు.

చాలామందికి తెలిసిన ఆ అతి సామాన్యమయిన విషయాలను శ్రద్ధాసక్తులతో వింటున్నవాడిలా హుకుమ్‌చాంద్ ముఖంలోకి చూస్తూ కూర్చున్నాడు సబినస్పెక్టరు. హుకుమ్‌చాంద్ గ్రహించేడు; ఆ సబ్ ఇనస్పెక్టరికి ఆ సంభాషణపై ఏమీ ఆసక్తి లేదని. అందుకని "రామ్‌లాల్ హత్యకు సంబంధించినకేసు విషయంపై మీ దర్యాప్తు ఎంతవరకూ వచ్చింది? మీరు ఇంకెవరినైనా అరెష్టు చేసారా?" అనడిగాడు.

"బద్మాష్ జగ్గా నిన్న వాళ్ళపేర్లు చెప్పేడుసార్. ఒకానొకప్పుడు వాళ్ళు జగ్గా గేంగులోవున్న వాళ్ళేనట. నదికి రెండుమైళ్ళ దిగువునవున్న 'కాపూరా' అనే గ్రామానికి చెందినవాళ్ళు. వారు మల్లిగాడు, మరోనలుగురూను. కాని జగ్గా వాళ్ళలోలేడు. వాళ్ళని అరష్టుచేసి తీసుకురమ్మనమని ఇవాళుదయం కానిస్టేబుల్సుని పంపించాను."

ఆ సబినస్పెక్టరు చెపుతున్నది హుకుమ్‌చాంద్ సరిగ్గా వినడంలేదు. దో ఆలోచిస్తూ కూర్చున్నాడు.

"జగ్గా విషయంలోను, ఆ యువకుడి విషయంలోను మనం పొరబడ్డాము." సబినస్పెక్టరు ఆగకుండా ఇంకా చెప్పుకుపోతున్నాడు. "జగ్గాకి ఓ ముస్లిమ్ సాలాడి కూతురితో సంబంధమున్నట్లు లోగడ తమకు మనవి చేశాను. రాత్రిళ్ళు దానితో గడపడంతోనే జగ్గాకి సరిపోతున్నది. రామ్‌లాల్‌ని హత్యచేసి ఆ ఇంట్లో అంతా దోచుకున్నాక మల్లిగాడు ఓ గాజుల పేకట్టు జగ్గా వాకిట్లోకి విసిరేడు."

హుకుమ్‌చాంద్ ఇంకేదో ఆలోచిస్తూ పరాగ్గా వింటున్నాడు.

"తాము అనుమతించినట్లయితే మల్లిగాడు, వాడిగాంగు వారికేశ, జగ్గాని, ఇక్బల్‌ని వదిలిపెట్టేస్తాము."

"మల్లిగాడు, వాడిగేంగు ముస్లిములా, సిక్కులా?" అని షన్నట్టుండి టపీమని అడిగాడు హుకుమ్‌చాంద్.

"అంతా సిక్కులే!"

ఆ మెజిస్ట్రేటు మళ్ళీ ఆలోచనలో మునిగిపోయాడు: వాళ్ళంతా ముస్లిములయితే బాగుండిపోయేది. రామ్‌లాల్‌ని హత్యచేసిన వాళ్ళు ముస్లిములని, ఆ గ్రామానికొచ్చిన ఇక్బల్ ముస్లిమ్‌లీగరని ఆ గ్రామస్తులకు వెల్లడయితే, ఆ గ్రామంలోగల ముస్లిములందరినీ పాకిస్తాన్ పంపి వెయ్యడానికి మానోమజ్రాలోగల సిక్కులంతా సమ్మతిస్తారని మనస్సులో అనుకున్నాడు. చాలాసేపటివరకూ అతిథియులూ మౌనంగాకూర్చున్నారు. కొంతసేపయాక ఏదో ఆలోచన తట్టి, ఏమీ వ్యాఖ్యానించకుండా నెమ్మదిగా లేచి నిలబడ్డాడు సబిన్‌స్పెక్టర్.

"వినవయ్యా ఇన్‌స్పెక్టరూ! మల్లిని, వాడిగేంగుని ఇప్పుడరెస్టు చేయొద్దు! ఇకపోతే ఆ బద్మాష్‌ని, ఇంకెవడినో అరెస్టు చేసారే వాణ్ణి వాదిలిపెట్టొద్దు. వాళ్ళవసరం మనకుంది!" అన్నాడు హుకుమ్‌చాంద్. ఇక వెళ్ళిపోదామనే ఉద్దేశంతో శాల్యూట్ చేశాడు సబిన్‌స్పెక్టరు.

"ఉండుండు. నేను చెప్పేది పూర్తిగా విను! అవసరమైన ఏర్పాట్లన్నీ పూర్తిచేశాక, మానోమజ్రాలోని ముస్లిముల నందరినీ తరలించడం కోసం ముస్లిమ్ శరణార్థుల శిబిరపు కమేండరికి ట్రక్కులకోసం కబురు చెయ్యి" అని ఆజ్ఞాపించాడు.

క్లిష్టమైనసమస్యలతో నిండిన ఆ సున్నితమైన వ్యవహారాన్ని ఆ మెజిస్ట్రేటు యొక్క ఆజ్ఞానుసారం నిర్వహించడంకోసం సైనుకోటు

తొడుక్కొని బయలుదేరడానికి సిద్ధమవుతూండగా, "ఇది అత్యవసరమైన పనవబట్టిగాని లేకపోతే నిన్నీ వర్షంలో వెళ్ళనిచ్చుండేవాడినికాను. ఒక్క క్షణమైనా వృధా చెయ్యకుండా పని చెయ్యాల్సిన సమయమిది." అని అన్నాడు హుకుమ్‌చాంద్.

"నాకు తెల్సుసార్! తక్షణమే నేను యాక్షన్ తీసుకుంటాను." అని మరోసారి శాల్యూట్‌చేసి సైకిలుమీద వెళ్ళిపోయాడా సబిన్స్పెక్టరు. జల్లులు జల్లులుగా పడుతున్న వర్షంకేసిచూస్తూ హుకుమ్‌చాంద్ వరండాలో కూర్చున్నాడు.

ఇంతకీ తనప్లాను రైటా,తప్పా? రైటో,తప్పో? ఏదైతేనేం? ఇహ దాని గురించి అదేపనిగా ఆలోచించకూడదనుకున్నాడు హుకుమ్‌చాంద్. తను మెజిస్ట్రేటుగాని మత ప్రచారకుడు కాడు; పాపపుణ్యాలను తప్పొప్పులను బేరీజు వేసుకోడానికి: రోజు రోజుకీ మరింత క్లిష్టంగా తయారవుతున్న సమస్యలెన్నింటినో తను పరిష్కరించాల్సొంది! ఆ సమస్య లన్నింటినీ నిర్దుష్టంగాను, ఖచ్చితంగాను పరిష్కరించడం చాలా కష్టం! జీవితాన్ని యధాతధంగా గ్రహించడమే తన కలవడింది! అంతేగాని జీవితాన్ని క్రొత్తమార్గాల్లోకి నెట్టివెయ్యడం గాని, జీవితంపై తిరుగుబాటు చెయ్యడంగాని, తన కలవడలేదు! చరిత్ర గతిలో మానవసమాజం ఎన్నోదోలాయమాన పరిస్థితులను సృష్టించింది. వివేకవంతుడైన మానవుని వ్యక్తిగత కృషి తక్షణమే సత్ఫలితాలనిచ్చి, ఎంతోమంది ప్రాణాలను కాపాడి సాంఘిక న్యాయాన్ని చేకూర్చుతుంది! ముస్లిముల ప్రాణాలను కాపాడడమే తన తక్షణ కర్తవ్యం! అది ఏ పద్ధతిలో వీలయితే ఆ పద్ధతిలో చెయ్యాలనుకున్నాడు.

తనచే జారీచేయబడ్డ వారంటు కారణంగా ఇద్దరు వ్యక్తులు అరెష్టు చెయ్యబడ్డారు. అయితే వాళ్ళను ఇంకే కారణంచేత నయినా అరెష్టు

చెయ్యొచ్చు: ఒకడు విప్లవవాది, మరొకడు దుష్ప్రవర్తన గలవాడు. ఇటువంటి మత కలహాల రోజులలో అటువంటివాళ్ళను కష్టడీలోనికి తీసుకోడం అవసరమే. ఇట్లాంటి సందర్భాలలో ఒక చిన్న పొరపాటు చేసినా అది పరిగణించదగ్గ పెద్ద పొరపాటయిపోవచ్చు. తన ప్లాను మంచి సమర్థవంతంగా నిర్వహింపబడొచ్చని అతనాశించాడు. తగిన ఆజ్ఞల్ని జారీ చెయ్యడమే తనపని. వాటిని నిర్వహించవలసేబాధ్యత తనక్రిందపనిచేస్తున్న ఉద్యోగస్తులది: కాని తన సబార్డినేట్సు తన ఉద్దేశ్యాలను సరిగ్గా అర్థం చేసుకోలేక తనను క్లిష్టమయిన పరిస్థితులలోకి నెట్టి వేస్తూండడం కద్దనుకున్నాడు హుకుమ్‌చాంద్.

బాత్‌రూమ్ తలుపు తెరచిన చప్పుడు లోపలినుంచి అతనికి వినిపించింది. బేరర్ని కేకేసి పిలచి, బ్రేక్‌ఫాస్టు తెమ్మనమని ఆజ్ఞాపించి గదిలోకి వెళ్ళిపోయాడు హుకుమ్‌చాంద్.

చేత్తో గెడ్డాన్ని ఆనుకొని మంచంమీద ఓ చివర్ని కూర్చుందా అమ్మాయి: హుకుమ్‌చాంద్‌ని చూసిన వెంటనే లేచి నిలబడి చీరెకొంగు సవరించుకుంది. హుకుమ్‌చాంద్ కుర్చీమీద కూర్చున్నాక, ఆమెకూడా మంచంమీద తలొంచుకొని కూర్చుంది. అవాంఛనీయమైన నిశ్శబ్దత అక్కడ కొంత సేపటి వరకూ నెలకొంది. కొంతసేపయాక హుకుమ్‌చాంద్ ధైర్యాన్ని కూడగట్టుకొని గొంతుక సవరించుకొని, "పాపం నీకాకలిగా వున్నట్లుంది. టీకోసం కబురు చేశాను" అని అన్నాడు. ఆ అమ్మాయి అతనికేసి దీనంగాచూస్తూ, "నేనింటికెళ్ళిపోతాను:" అనిఅంది.

"ముందు ఏదైనా కాస్త తిను. నేను డ్రైవరుతో చెపుతానులే నిన్నింటికి దిగబెట్టేయమని. ఇంతకీ నువ్వే వూళ్ళో వుంటున్నావు?"

"చందున్నగ్గర్‌లో: ఇనస్పెక్టరు బాబుగారి పోలీసుస్టేషనున్న వూరే మాది:"

మళ్ళీ కొంతసేపటివరకూ నిశ్శబ్దం. హుకుమ్‌చాంద్ నీరసంగా ఓసారి దగ్గి, గొంతుక సవరించుకొని, "నీ పేరేమిటి?" అనడిగాడు.

"హసీనా! హసీనా బేగమ్!"

"హసీనా! నీతల్లి నీకు చాలా మంచిపేరు పెట్టింది. హసీనా! ఆ ముసలమ్మేనా నీ తల్లి?"

ఆ అమ్మాయి నవ్వింది! అక్కడికొచ్చిన తరువాత ఆమె నవ్వడం అదే మొదటసారి! అంతకుముందెవ్వరూ ఆదరంగా ఆమెను ప్రశంసించ లేదు. ఇప్పుడా మెజిస్ట్రేటు తన కుటుంబ విషయంలో ఆసక్తి కనబరచి. తనపేరు అందంగా వుందని ప్రశంసించడం జరిగింది. అందుకే ఆమెకా ఆనందం!

"నేను పుట్టిన వెంటనే నాతల్లి చనిపోయింది. ఆ ముసల్ది నా అమ్మమ్మ" అని సమాధానమిచ్చింది హసీనా.

"నీ వయస్సెంత?"

"నాకు సరిగ్గా తెలీదు. పదహారు లేదా పదిహేడేళ్ళు. ఒకవేళంటే పద్దెనిమిదేళ్ళుకూడా వుండొచ్చు. ఇంతకీ నేను పుట్టుకతోనే చదువుకున్న దానిని కాదు. అంచేత నా పుట్టినతేదీని నేనెక్కడా వ్రాసుకోలేదు!" అని నవ్వుతూ అంది. ఆ మెజిస్ట్రేటుకూడా నవ్వేడు.

బేరర్ ట్రేలో టీ, గుడ్లు, రొట్టెలు, వెన్న మొదలగునవి తెచ్చాడు. హసీనా రొట్టెలకు వెన్నరాసి సాసరులోపెట్టి హుకుమ్‌చాంద్ ముందు టేబులుపై వుంచింది.

"నేనిందాక టీత్రాగాను. నాకేం ఆకలిగాలేదు. నేనిప్పుడేమీతినను" అని అన్నాడు హుకుమ్‌చాంద్.

"తాను ఏమీ తినకపోతే నేనూ ఏమీ తినను" అని ఓ వగలాడిలా అని, కత్తిని అక్కడ పడేసి అలిగినట్లు మంచంమీద కూర్చుంది!

హుకుమ్‌చాంద్ సంతృప్తి చెందేడు. ఆమెదగ్గరకెళ్ళి చేత్తో ఆమె నడుమునుచుట్టి లాలనగా, "నువ్వు తినితీరాలి. నిన్నరాత్రి నువ్వేమీ తిన లేదు." అని అన్నాడు.

హసీనా అతని పట్టును సడలించుకొని- "తాము తింటేనే నేనూ తింటాను. తాము తినకపోతే నేనూ తినను!" అంది బుంగమూతిపెట్టి.

"సరే! నువ్వింతగా బలవంతపెడితే నేను కాదనను" అని ఆమెను టేబులుదగ్గరకు లాక్కొచ్చి- "ఇద్దరం కలిపి తిందాం. కూర్చో!" అని తన వొళ్ళో కూర్చోబెట్టుకున్నాడు. హసీనా అతనివొళ్లో కాస్త జంకుతూ కూర్చొని, వెన్నరాసిన ఓ రొట్టెముక్కను అతని నోట్లో పెట్టింది! అతను "మరొద్దు, మరొద్దు" అని తింటూ అంటూంటే పకపకమని నవ్వుతూ అతని మీసానికంటుకున్న వెన్నను చేతితో మృదువుగా తుడిచివేసింది! రొట్టెముక్క తినడం పూర్తయేక "నువ్వీ వృత్తిలో ఎన్నాళ్ళనుంచీ వున్నావు?" అనడిగాడు హుకుమ్‌చాంద్.

"ఇదేం ప్రశ్న బాబూ! నేను పుట్టినదగ్గరనుంచీ ఈ వృత్తిలోనే వున్నాను. నాతల్లి గాయకురాలు. ఆమెతల్లికూడా గాయకురాలే! నాకు తెల్సినంతవరకూ మా పూర్వీకులందరిదీ ఇదే వృత్తి!"

"నేనడుగుతున్నది గాయకవృత్తి గురించికాదు; తతిమ్మా విష యాల గురించి!"

"తతిమ్మా విషయాలంటే తమ ఉద్దేశ్యం ఏమిటిబాబూ? డబ్బు కోసం మేంవు ఇతర మార్గాలేవీ త్రొక్కము. నేను పాడతాను, నృత్యం చేస్తాను. ఇంతకీ తాము వాంఛించే పాట, నృత్యం ఏతీరులో వుండాలో సెలవివ్వండి? అసలు తమకు పాటంటే ఏమిటో, నృత్యమంటే ఏమిటో తెలీదనుకుంటాను. తమకు తెల్సిందల్లా విస్కీ త్రాగడం, తదితరపనులూను అవునా?"

హుకుమ్‌చాంద్ నీరసంగా పొడిదగ్గుదగ్గి- "ఇంతకీ నేనేమీ కాని పని చెయ్యలేదుగా!" అని మెల్లిగా గొణిగాడు.

హసీనా అతని బుగ్గమీద మెల్లగా చిటికేసి- "మెజిస్ట్రేటుబాబు గారూ! దుష్టద్దేశంతోనే నన్ను తాము ప్రక్కని పడుకోబెట్టుకున్నారు. కాని తాము బాగా అలసిపోవడంచేత ఓ రైలింజనులా గుర్రుపెడుతూ రాత్రి నిద్రపోయారు." అతనెలా రాత్రి గుర్రుపెట్టినదీ ఓసారి అనుకరించి ఫకాలున నవ్వింది. హుకుమ్‌చాంద్ గోముగా ఆమె కురుల్ని నిమురుతూ మళ్ళీ మామూలు ధోరణిలో ఆలోచించసాగేడు. తనకుమార్తై జీవించుంటే సరిగ్గా ఇంతే వుంటుందనే భావం మళ్ళీ అతని స్మృతిపథంలోకొచ్చింది. అతనికి పాపభీతి కలుగలేదుగాని ఏదో అనిర్వచనీయమైన అనుభూతి కలిగింది. ఆ అమ్మాయిని అనుభవించాలని తనకిలేదు. ముద్దుపెట్టుకోవాలనీ లేదు. కౌగలించుకోవాలనీలేదు. కాని ఆమెను తన హృదయానికి హత్తు కొని తనవాళ్ళో పడుకోబెట్టుకోవాలనుంది.

"తాము మళ్ళీ ఏదో ఆలోచనలో పడిపోయేరు" అని అతని బుగ్గ మీద మెల్లగా చిటికేసి అంది హసీనా. ఆ తరువాత కెటిల్‌లోని టీ కప్పు లోకి పోసి, ఆకప్పులోనిటీ కొంచెం సాసరులోపోసి" కొంచెం టీ త్రాగండి అది మీ ఆలోచనలన్నీ ఆపుచేస్తుంది" అంటూ సాసర్ని అతని పెదవుల దగ్గ రుంచింది. హుకుమ్‌చాంద్ చెయ్యి అడ్డంపెట్టి, "వొద్దొద్దు! నేనిప్పుడే టీ త్రాగేశాను. నువ్వు త్రాగు" అని అన్నాడు.

"సరే అలాగయితే నేను టీ త్రాగుతాను లెండి. మీరలా ఏదో ఆలోచిస్తూ కూర్చోండి" అని టీ త్రాగసాగింది.

"హసీనా" కొంచెంసేపాగి మళ్ళీ "హసీనా" అని పిలిచాడు.

"చెప్పండి తమకేం కావాలి?" అని అడిగింది. అతని కళ్ళలోకి చూస్తూ.

హుకుమ్‌చాంద్ ఖాళీసాసర్ని ఆమెచేతులలోంచి తీసుకొని టేబులు మీద పెట్టి, ఆమెను మరింత దగ్గరగా తీసుకొని ఆమె శిరస్సుని తన శిరస్సుకి తాకించి మునివ్రేళ్ళతో ఆమెకురుల్ని దువ్వుతూ- "నువ్వు ముస్లిమ్‌వా?" అని అడిగాడు.

"ఔను! నేను ముస్లిమునే! 'హసీనాబేగం' అనేపేరుబట్టే తెలుస్తోందిగా నేను ముస్లిమునని. కొంపతీసి నన్ను సిక్కు అనుకుంటున్నారా ఏమిటి?"

"ముస్లిములంతా చందున్నగ్గర్ ఖాళీచేసి వెళ్ళిపోయారనివిన్నాను. మరి నువ్వు ముస్లిములయుండికూడా ఎలా వుండగలిగేవు?"

"చాలామంది వెళ్ళిపోయేరు. కాని తను చెప్పేటంతవరకూ మమ్మల్ని వుండమన్నారు ఇనస్పెక్టరుబాబుగారు. నిజానికి మాబోటి గాయకులకు నిర్ణీతమైన మతమంటూ ఏదీలేదనే చెప్పాలి. మేము అన్ని మతాలవాళ్ళకూ కావలసినవాళ్ళమే. మా పాట అంతా వింటారు."

"చందున్నగ్గర్‌లో ఇంకెవరైనా ముస్లిములున్నారా?"

"ఓ! ఉన్నారు." చెప్పడానికి కొ_త్త సంశయించి, "తాము వాళ్ళని ముస్లిములనిగాని, సిక్కులనిగాని, మొగాళ్ళనిగాని, ఆడవాళ్ళనిగాని ఏమనుకున్నా ఫరవాలేదు. కొజ్జాల మేళమొకటి ఇంకా అక్కడుంది." ఈ విషయం చెపుతున్నప్పుడు ఆమె బుగ్గలు సిగ్గువల్ల ఎఱ్ఱబడ్డాయి.

హుకుమ్‌చాంద్ తన చేతితో ఆమె కళ్ళను మూస్తూ, "ఎందుకూ సిగ్గు? నేను నవ్వనులే. నువ్వు హిందువువిగాని, ముస్లిమువిగాని కాకపోవచ్చు. కాని హిజ్రాస్‌లాంటి దానివి మాత్రం కావు. అవునా?" అని అడిగాడు.

"అబ్బ! పోన్లెద్దురూ ఏమిటీ ప్రశ్నలన్నీ?" ఆమె ఇంకా సిగ్గుపడుతూనే వుంది.

ఆమె కళ్ళపైనుండి తన చేతిని తొలిగిస్తూ, "హిజ్రాస్ ఇంకా అక్కడ ఎలా ఉండగల్గుతున్నారు? వాళ్ళెందుకు వదిలేయబడ్డారు?" అనడిగాడు.

"చెపుతాను ఏమీ అనుకోరుగదా!"

"ఊఁహు ఏమీ అనుకోను."

"అవాళేమయిందంటే హిందువులు నివసించే వాడలో ఒకరింటి దగ్గర ఓ పాప పుట్టింది. మత సంబంధమయిన అలజడులున్నా ఏమీ లక్ష్య పెట్టకుండా పాడ్డానికి హిజ్రాస్ వాళ్ళింటికెళ్ళేరు. అక్కడ సిక్కులు వాళ్ళని పట్టుకున్నారు. హిజ్రాస్ ముస్లిములయిన కారణంగా వాళ్ళని చంపాలనుకున్నారు. అందుకనే సిక్కులంటే నాకసహ్యం!" అని టకీమని చెప్పడం ఆపుచేసిందామె.

"ఊఁ చెప్పు! చెప్పు! ఆ తరువాత ఏం జరిగింది?" అమిత కుతూహలంతో అడిగేడు హుకుమ్‌చాంద్.

ఆ సమయంలో ఆ హిజ్రాస్ ఎలాఅయితే చప్పట్లు కొడుతూ నవ్వేరో అలాగే చప్పట్లుకొట్టి నవ్వి, వాళ్ళ తోళ్ళు వాయిస్తూ బొంగురు పోయిన కంపిత స్వరాలతో పాడుతూ తమ లంగాలు గాలిలోకెగిరేటట్లు గిర్రున కొంతసేపు తిరిగి టపీమని ఆగి ఆ సిక్కుల గుంపువేపుచూస్తూ "మమ్మల్ని తామూచూ పేరు కదా; ఇప్పుడు చెప్పండి మేము హిందువులమో, ముస్లిములమో" అని అడిగారు. వాళ్ళలా అడిగేసరికి ఆసిక్కులు తప్ప అక్కడ మూగిన ఇతరమతస్తులంతా ఫకాలుననవ్వారు. ఆ సంఘటనను ఎంతో కుతూహలంతో వింటున్న హుకుమ్‌చాంద్‌కూడా ఫకాలున నవ్వాడు.

"నేను చెప్తున్నది ఇంకా పూర్తికాలేదు వినండి. ఆ సిక్కులు తమ ఆయుధాల్ని పట్టుకొని వాళ్ళదగ్గరకెళ్ళి, 'ఇప్పటిమట్టుకి మిమ్మల్ని ప్రాణాలతో వదలిపెడుతున్నాము. త్వరలోనే మీరు చందున్నగ్గర్ విడిచిపెట్టి వెళ్ళిపోవాలి. లేదా చంపేస్తాము' అని భయపెట్టారు. ఒక హిజ్రా చప్పట్లు కొట్టి ఓ సిక్కు నాయకుడి గెడ్డాన్ని నిమురుతూ, 'ఎందుకూ మీరంతా పిల్లల్నికనడం మానేసి మాలాగ తయారవుతారా?' అని అడిగాడు. వాడలా అడిగేసరికి ఆ సిక్కులకుకూడా నవ్వొచ్చింది. 'ఈ కొజ్జా వెధవల్ని చంపితేనేం?చంపకపోతేనేం? పదండర్రా' అంటూ వాళ్ళు వెళ్ళిపోయారు." అని చెప్పింది హసీనా.

"బాగుంది బాగుంది. అదిసరేగాని ఈ మతకలహాల అలజడిలో నువ్వుమాత్రం జాగ్రత్తగా ఉండాలి. ఎట్టి పరిస్థితిలోను ఇల్లువదిలి ఎటూ వెళ్ళకు." అని సలహాయిచ్చాడు హుకుమ్‌చాంద్.

"నాకేంభయంలేదు. నాకు చాలామంది తెల్సు. అదీకాక ఓ పెద్ద మెజిస్ట్రేటుగారి రక్షణ నాకుంది. నాకు భయమేమిటి? తామిక్కడున్నంత వరకూ ఎవ్వరూ నా తలలోని వెంట్రుకనుకూడా తెంపలేరు'' అందామె.

హుకుమ్‌చాంద్ ఏమీ అనకుండా మౌనంగా ఆమె కురుల్ని నిమర సాగాడు. హసీనా అతని ముఖంలోకి కొంటెగా చూసి నవ్వుతూ, ''నన్ను పాకిస్తాన్ పంపించెయ్యాలనుందా తమకు?'' అనడిగింది.

హుకుమ్‌చాంద్ ఆమెను మరింత దగ్గరగా హత్తుకున్నాడు. అతని శరీరం కాస్త వేడెక్కింది. గొంతుక సవరించుకొని, ''హసీనా! హసీనా! హసీనా!" ఏదో చెప్పాలనుకున్నాడు కాని అతని నోట్లోంచి మాట ఊడి రాలేదు.

''హసీనా! హసీనా! హసీనా! ఎందుకిన్నిసార్లు పిలుస్తున్నారు? నాకేం చెపుదమనుకున్నారా? చెప్పడానికెందుకు సంశయిస్తున్నారు? నిస్సంకోచంగా చెప్పండి.''

''ఇవాళ నువ్విక్కడ వుండిపోకూడదూ?''

''ఓస్ ఇంతేనా! మీరు కారివ్వకపోతే అయిదుమైళ్ళదూరం నేనెలాగూ నడిచి వెళ్ళలేను. కాని మరోరాత్రి నేనిక్కడ ఆడి పాడినట్లయితే ఓ పెద్ద నోట్లకట్ట నాకిచ్చుకోవలసుంటుంది."

"ప్చ్! డబ్బు మాటకేం? నా జీవితాన్నే నీ కర్పించడానికి సిద్ధంగా వున్నాను.'' అని అన్నాడు నాటకంలోని హీరోలాగ.

10

ఇక్బాల్‌ను ఓ వారం రోజులపాటు ఒంటరిగానే సెల్లులోవుంచారు. ఆ సెల్లులో న్యూస్‌పేపర్లు, మేగజిన్సుమాత్రమే అతనికి తోడుగావున్నాయి. అసలాగది చీకటిగావుంది. పైగా అతనికి దీపం ఇవ్వలేదు; సరిగ్గా గాలి తగిలే ఏర్పాటేదీ ఆ గదిలో లేదు. తుపాకీ ప్రేలుళ్ళ శబ్దాలు, గుడ్లగూబల అరుపులు, నిద్రపోతున్న పోలీసు కానిస్టేబుళ్ళ గురకలుతప్ప రాత్రివేళ ఇంకేమీ ఆ సెల్లులోకి వినిపించలేదు. వర్షం పడడం ప్రారంభించిన దగ్గర నుంచీ ఆ పోలీసుస్టేషను మరీ ఘోరంగా తయారయింది;

మొదటిరెండురోజులూ సాయంత్రంవేళ కొంతమంది కానిస్టేబుల్సు జగ్గాని ఎక్కడికో తీసుకెళ్ళి, ఓ గంటసేపయేక మళ్ళీ తీసుకొచ్చి అతన్ని సెల్లులో వుంచి తాళం వేసేవారు; అతన్ని ఎక్కడికి ఎందుకు తీసుకెళ్ళేదీ ఇక్బాల్‌కి తెలీదు. జగ్గాని అతను అడగనూలేదు; జగ్గా తనకుతానుగా చెప్పనూలేదు; కాని ఆ పోలీసువాళ్ళతో అతని పరిహాస పూర్వకమైన సంభాషణ మాత్రం అంతకు ముందుకంటే మరీ మోటుగాను, అసభ్యకరంగాను తయారయింది;

ఒకనాటి ఉదయం ఐదుగురు వ్యక్తులను స్టేషనుకు తీసుకొచ్చారు. వాళ్ళని చూసినవెంటనే జగ్గా కోపంతో పళ్ళు పటపట కొరుకుతూ వాళ్ళని

తిట్టసాగాడు రిపోర్టింగ్‌రూమ్ వరండా వదిలి వెళ్ళడానికి వాళ్ళు సమ్మతించలేదు. అక్కడనుంచి కదలవని ఖచ్చితంగా చెప్పేశారు.

ఆ క్రొత్త ఖైదీలెవరా అని ఇక్బల్ ఆశ్చర్యంగా వాళ్ళకేసి చూడసాగాడు. పోలీసువాళ్ళకూ, ఆఖైదీలకు జరుగుతున్న సంభాషణలో కొన్ని మాటలు అస్పష్టంగా అతని చెవిని పడుతున్నాయి. ఆ విన్నదాన్నిబట్టి హత్యానేరమో, దోపిడీనేరమో ఏదో ఒకటి వాళ్ళలో ప్రతివాడిపైన మోపబడుంటుందని అర్థం చేసుకున్నాడు ఇక్బల్. విశేషం ఏమిటీ అంటే చందున్నగ్గర్ పోలీసుస్టేషనుకు కొద్ది గజాల దూరంలోనే రోజూ హత్యలు జరుగుతున్నట్లు తుపాకీకాల్పులు వినిపిస్తున్నాయి. గృహ దహనాలు జరుగుతున్నట్లు మంటలగుపిస్తున్నాయి! అయినా పోలీసువారు ఎవ్వర్నీ ఎందుకు అరెస్టు చెయ్యలేదో ఇక్బల్‌కి అవగతమవలేదు! కొత్తగా వచ్చిన ఆ ఖైదీలగురించి వివరంగా తెల్సుకోవాలనే కుతూహలంతో ఇక్బల్ కటకటాలదగ్గర కెళ్ళేసరికి, ఓ కానిస్టేబులు జగ్గాని తీసుకొచ్చి, తాళంతీసి, ఇక్బల్ సెల్లులోకి వాడిని ప్రవేశపెట్టాడు.

"దండాలుబాబూ దండాలు! తమ పాదసేవసేసుకుంటూ ఏకో తమకాడ కసింత సదువు నేర్చుకోవాలనుకుంటున్నాను!" అన్నాడు జగ్గా. ఆ సమయంలో జగ్గా కొస్త ప్రశాంతంగానేఉన్నాడు.

కానిస్టేబులు గేటుమూసి తాళంవేస్తూ, "బాబూ! ఈ బద్మాష్‌గాడికి సక్రమమైన మార్గంలో ఎలా నడుచుకోవాలో బాగా బోధించండి" అని అన్నాడు.

"నువ్వెళ్ళెహ్! మహా పెద్ద సెప్పొచ్చినావు!" అని ఆ కానిస్టేబులుకేసి తీక్షణంగా చూస్తూ అని, ఇక్బల్‌కేసి తిరిగి, "బాబూ! తమవంటి సదువుకునోళ్ళరు, ఈ గవర్నమెంటోరు కలిసి నన్ను బద్మాష్‌నిసేసినారు! కాదంటారా?" అని అడిగాడు.

ఇక్బాల్ ఏమీ సమాధానం చెప్పలేదు. ఇక్బాల్ తనపాదాలను అక్క-డున్న కుర్చీమీద పెట్టి, పేపర్ల కట్టవేపు తేరిపారచూస్తూ కూర్చున్నాడు. జుగ్గా తన రాక్షస హస్తాలతో ఇక్బాల్ కాళ్ళు పడుతూ, "బాబూ! నాదొంగ బుద్ధి యున్నోళ్ళకి మేలుకొంది. నాకు యింగిలీసు రాదు సెప్పినట్టయితే తమ సేవ నాను సేత్తాను! ఏదో కసింత మాటాడడానికి సాలినంత యింగిలీసు సెప్పండి సాలు!" అని బ్రతిమాలే ధోరణిలో అన్నాడు.

"నువ్వింతవరకూ వున్న సెల్లు ఎవరికోసం ఖాళీ చేయించారు?"

"నాకు సరిగ్గా తెల్దు! రామ్‌లాల్‌ని సంపినోళ్ళకోసమని ఆడు సెప్పినాడు."

"నిన్నుకూడా వాళ్ళు అదే ఖూనీకేసు సందర్భంలో అరష్టు చేసే రనుకుంటాను."

"ఊఁ! అందుకే నన్నుకూడా జైల్లో ఎట్టినారు. అసలు మావూళ్లో ఎవురు ఏ నేరం సేసినాసరే ముందు నన్నొట్టుకుంటారు. మరి నాను బద్మాష్‌ని కదా!"

"అయితే మరి నువ్వు రామ్‌లాల్‌ని చంపలేదా?" అని ఇక్బాల్ అడిగేసరికి జుగ్గా అతని కాళ్ళు పట్టడం టపీమని ఆపేసి, తన రెండు చేతులతోను చెవులు మూసుకొని "హరి హరి! నాను నా సొంత గ్రామం లోని యాపారస్తుణ్ణి సంపేటంతటి నీచుణ్ణనుకుంటున్నారా ఏటి? గుడ్లెట్టే కోడిపెట్ట నెవుడైనా సంపుకుంటాడా? అదీగాక మా అయ్య జైలులోవున్నప్పుడు, లాయర్లకివ్వడానికి డబ్బు నేకపోతే రామ్‌లాల్ ఇచ్చినాడు. సేసిన మేలు మరచి పోయేటంతటి ఎధవ నంజకొడుకును కాను నాను!" అని అన్నాడు.

"బహుశా వాళ్ళు నిన్నిప్పుడు వదిలి పెట్టేస్తారనుకుంటాను."

"ఆళ్ళ కిష్టమైతే వొదిలేత్తారు: నేకపోతే వొదర్రు! ఏదో వో కేసెట్టేత్తారు నామీద! నై సెప్పునేకుండా బల్లెం వుంచుకున్నాననో, అను మతి లేకుండా ఆ రాత్రి ఇల్లొదిలిపెట్టి ఎల్లినాననో, ఏదో వొకటి!"

"అయితే ఆవాళ రాత్రి నువ్వు వూళ్ళో లేకపోవడం నిజమేనన్న మాట!"

జుగ్గా మఠంవేసి కూర్చొని, ఇక్బాల్ పాదాలను తన వొళ్ళోకి తీసుకొని పిసుకుతూ- "నానా పొద్దు రేత్రి వూళ్ళో లేనిమాటమాత్రం నిజం! కాని నా నెవుర్నీ కూనీ సెయ్యనేదు. కాని ఇప్పుడు మాత్రం నాను కూనీ సెయ్యబడుతున్నాను" అన్నాడు కొంటెగా.

జుగ్గాయొక్క ఉద్దేశాన్ని ఇక్బాల్ గ్రహించాడు. ఆ విషయమై అదేపనిగా జుగ్గాని ప్రశ్నించడం మంచిపని కాదనుకున్నాడు. ఎంచేతంటే జుగ్గాని ఉద్రిక్తుణ్ణి చెయ్యడం సులభంగాని శాంతింపజెయ్యడం కష్టమని ఆ కొద్దిపాటి పరిచయంతోనే ఇక్బాల్ గ్రహించాడు. జుగ్గా మరింత గౌరవ భావంతో ఇక్బాల్ కాళ్ళు పడుతూ, "బాబూ! తాము సాలా ఏళ్ళు తెల్లదొరల దేశంలో వున్నారా?" అని అడిగాడు.

"ఊఁ! ఉన్నాను." జుగ్గాతో సంభాషణను కొనసాగించాలని ఇక్బాల్‌కి మరిలేదు. కాని జుగ్గా మౌనంగా కూర్చోలేకపోయాడు.

"అయితే బాబూజీ! తమ కక్కడ సాలామంది దొరసానమ్మలతో యిదుండుంటాది! అవునా?" అనడిగాడు.

ఇక్బాల్ చిరాగ్గా "ఓ! నేను చాలామంది దొరసానుల్ని చూసాను" అని సమాధానమిచ్చాడు.

జుగ్గా మరింత గట్టిగా అతని కాళ్ళు పడుతూ, మహోత్సాహంతో, "వారేవ్వా! బాబూజీ! తాము గొప్ప అదురుష్టవంతులు. సొరగసౌక్యాలు

రుసిసూసినారు. దొరసానమ్మలు సొరగంనుంచిదిగొచ్చిన దేవకన్నెల్లాగుంటారు. ఆళ్ళ వొళ్ళు తెల్లగా మెత్తగా సిల్కులాగుంటాది! ఇక్కడ మన ఆడోళ్ళు నల్లగా గేదెల్లా గుంటారు!" అని అన్నాడు.

"నిజానికి తెల్లదొరసానులంతా నువ్వనుకుంటున్నంతగా ఉద్రేకింప జేసేటట్లుండరు! ఇంతకీ నీకు పెళ్ళయిందా?"

"లేదుబాబూ! ఈ బద్మాష్‌గాడికి పిల్లనెవ్వరిస్తారు సెప్పండి? ఎవుడికి తగినోళ్ళు ఆడికి దొరుకుతారు! డబ్బుకోసం వొళ్ళమ్ముకొనే లంజలుంటారు కదా మరి! ఆళ్ళతోనే కాలక్షేపం సేసేత్తుంటాను!"

"అలాంటివాళ్ళతో నువ్వేమయినా సంతృప్తి చెందగల్గుతున్నావా?"

"ఓ! నానెప్పుడైనా ఏదైనా కేసుమీద ఫీరోజ్‌పూర్ఎలితే, అక్కడ లాయర్లకి, గుమస్తాలకి యివ్వగా డబ్బుమిగిల్తే, అప్పుడు జల్సాసేత్తాను. ఓ మంచి సానిముండను కల్సుకొని రేత్రంతటికీ బేరమాడతాను. సరసానికొచ్చే అందరిలాంటి మొగాడిననే అనుకొని ఆళ్ళొప్పేసుకుంటారు! కాని నా సత్తువ ఆళ్ళకేటితెల్సు?" అని ఓసారి మీసం మెలేసి, "నా సరసానికి తట్టుకోనేక, 'అమ్మబాబోయ్! నీకు దండమెడతాను. వొగ్గెయ్! వొగ్గెయ్! నీడబ్బు నీకిచ్చేత్తాను. తీసుకొని వొగ్గెయ్' అని నాసామిరంగా వొకటే గోల!"

చాలామంది యువకులు ఇలాగే కోతలు కోస్తూంటారని ఇక్బాల్ అనుకున్నాడు! "నీకు తగిన ఓ మంచిపిల్లను చూసుకొని వేగంగా పెళ్ళి చేసుకో! అప్పుడది నీ చెవులు పట్టుకొని కిరుకిరు మనిపిస్తుంది!" అన్నాడు ఇక్బాల్.

"నాబోటోళ్ళు పెళ్ళిసేసుకుంటే మాత్రం సుకపడతారా ఏటి? అదీ కాక పెళ్లాంతో సరదాగా సరసాలాడుకుం కూకోడానికి మాలాంటోళ్ళకు

అంతఃపురాలు, ఏకాంతమందిరాలు వుండవుగా! వేసవిలో ఆరుబయట అంతా పడుకుంటారు. అంతా ఆదమరచి నిద్రోతేనేగాని పెళ్లాం పక్కలో పడుకోడానికెవ్వుడికీ వీలుసిక్కదు! ఇకపోతే చలికాలంలో ఆడోళ్ళమాని ఆడోళ్ళు, మొగోళ్ళమాని మొగాళ్ళు వేర్వేరుగా యిళ్ళలో పడుకుంటారు. అలా దొడ్డి కెళ్ళొత్తామని సెప్పి సల్లగా జారుకోవాల!''

"అబ్బో నీకింకా పెళ్ళికాకపోయినా ఆ సంగతులన్నీ బాగా తెల్సి నట్లుందే!''

"నాకు పెల్లి కాకపోతేనేం? పెల్లయినోడు సేసే పనులన్నీ నాను సెయ్యగలను!''

"ఓ! అలాగా? అయితే నువ్వు పెళ్ళయినవాళ్ళు చేసేపనులన్నీ చేస్తున్నావన్నమాట!"

"కాదుబాబూ! అట్లాటి పనులు శెయ్యడం నాకలవాటే. అసలు ఆపనే నన్నీ జైలులోకి లాక్కొచ్చింది! ఇదీ ఒకందుకు మంచిదేఅయింది నెండి. ఇలా జరక్కపోతే నాకు తమ దరిశెన బాగ్గెం సేకూరుండేదికాదు. ఏవో నాల్గు ఇంగిలీసు ముక్కలు నాకు నేర్పండి బాబూ! గుడ్డుమారినింగు గుడ్డు యీవినింగు యిట్టాంటి మాటలు నేర్పండి బాబూ!''

"ఇంగ్లీషువాళ్ళు మనల్ని వదిలిపెట్టి వెళ్ళిపోయారు. అంచేత మరి ప్పుడు ఇంగ్లీషు నేర్చుకోడం అనవసరం! నీ మాతృభాష బాగానేర్చుకో."

ఈ సలహా జగ్గాకి నచ్చలేదు. ఇంగ్లీషుభాష వచ్చినవాళ్ళే మహా మేధావులని వాడి ఉద్దేశ్యం!

"నేను మా బాసని ఎవ్వరిదగ్గరైనా నేర్చుకోగలను. ఎవ్వరిదగ్గరో ఎందుకు? మా భాయి మీట్‌సింగే నాకు గురుముఖి నేర్పుతామన్నారు. కాని నానింకా నేర్చుకోడం ప్రారంభించనేదు. బాబూ! తాము ఎన్నో క్లాసు పాసయినారు? వదోక్లాసు పాసయినారా?''

"పదోక్లాసేకాదు; పదహారోక్లాసుకూడా పాసయేను!''

''అబ్బో! పదహారే! నానింతవారకు పదహారో క్లాసు పాసయినోళ్ళెవర్ని సూడనేదు. మావూళ్ళో రామ్‌లాల్ నాలుగోక్లాసు పాసయినాడు. అతనిప్పుడు చనిపోనాడు. మీట్‌సింగ్ ఏం పాసయినాడో నాకు తెల్దు. కాని ఆరికి సదవడం వొచ్చు. ఇనస్పెక్టర్‌బాబు ఏడోక్లాసు పాసయినాడు. డిప్యూటీ బాబుగారు పదోక్లాసు పాసయినారు. తాము పదహారు! అబ్బ! తాము గొప్ప తెలివైనోరు!"

ఈ ప్రశంస మరీ అతిగా వున్నట్లు పీలయేడు ఇక్బాల్. "నీకు కొంచమయినా చదవడం, వ్రాయడం వచ్చా?" అనడిగేడు.

"రాదు బాబూ! మా పెద్దయ్యా కొడుకొకడున్నాడు, ఆడు బళ్ళో నేర్చుకున్న పద్యాలు కొన్ని నాకు సెప్పేడు. వాడు సెప్పిన వాటిలో ఓ పద్యం సగం ఇంగ్లీషు, సగం హిందూస్తానీ....

"పిజియన్-కాబూటర్, ఓడెన్-ఫ్లై. లుక్-దేఖో, అస్మాన్-స్కై- ఇది తమకుతెల్సా?" అనడిగేడు జగ్గా.

"నాకుతెలీదు. ఇంతకీ నీకతను అక్షరాలు నేర్పలేదా?"

"ఎ బి సీ లా....? ఆడికోటి మహా తెలిస్తేకదా నాకు నేర్పడానికి.. నాకెంతతెల్సో ఆడికీ అంతే తెల్సు? ఎ బి సి పేర్ హేవ్‌యు బీన్ ఎడ్‌వర్డ్ యీజ్ డెడ్, ఐ వెంటు టు మోరన్ తమకిది తప్పకుండా తెల్సేవుంటుంది" అన్నాడు జగ్గా.

''తెలీదు. ఇదికూడా తెలీదు!" అన్నాడు ఇక్బాల్.

"అదిసరేగాని ఇప్పుడు తమరు నాకు కసింతఇంగిలీసు సెప్పండి." అనడిగేడు జగ్గా.

"గుడ్‌మార్నింగ్, గుడ్ నైట్" అనే ఈమాటలు ఎలా అనాలో జగ్గాకి చెప్పేడు ఇక్బాల్.

జీవితంలో కాస్త గుట్టుగా చెయ్యవలిసే కొన్ని పనులకు ఇంగ్లీషులో ఏమంటారో చెప్పమని జగ్గా బలవంత పెట్టేసరికి ఇక్బాల్లో సహన శక్తి తగ్గింది. అదే సమయంలో క్రొత్తగా తేలబడిన ఆ అయిదుగురు ఖైదీలను ప్రక్క సెల్లులోకి ప్రవేశపెట్టేరు పోలీసు కానిస్టేబుల్సు. వాళ్ళని చూసేసరికి జగ్గాలోని ఉల్లాసమంతా క్షణంలో అంతరించింది.

11

ఉదయం పదకొండు గంటలయేసరికి వర్షం తగ్గింది. కాని చిన్న తుంపర పడుతోంది. సబిన్స్పెక్టరు సైకిలు తొక్కుతూ ముందుకు పోతు న్నాడు. హెడ్ కానిస్టేబులుకంటే ముందుగా స్టేషనుకి పోవాలని అతని సంకల్పం. స్పీడు హెచ్చించేడు.

మల్లిగాడిని వాడి గేంగును అరెస్టుచేసి హెడ్కానిస్టేబులు అప్పుడే పోలీసు స్టేషనుకు తీసుకొచ్చేసుంటాడేమిటి చెప్మా? కొంపతీసి డైరీలో ఎక్కించేసుంటాడేమిటి....? ఒకవేళ డైరీలో ఎక్కించేసుంటే చాలా గొడవ. ఆ కాగితాలు చింపుతే? ఎందుకు చింపేరని లాయరు ప్రశ్నలవర్షం కురిపిస్తాడు. అప్పుడు చాలా ఇరకాటంలో పడాల్సొంటుంది. ఇంతకీ హెడ్ కానిస్టేబులు మంచి అనుభవజ్ఞుడు. అంత తొందరగా డైరీ నింపడని తనకు తాను ధైర్యం చెప్పుకున్నాడు. కాని జగ్గాని, ఇక్బాల్ని అరెస్టు చేసిన అనంతరం ఆ హెడ్ కానిస్టేబులుయొక్క అనుభవంపైగల నమ్మకం అతనికి కాస్త తగ్గింది. మామూలుగా అలవాటులోవున్న పనికానప్పుడు దానిని అతనంత సవ్యంగా చేస్తాడనే నమ్మకం అతనికంతగా లేదు. ఆ ఖైదీలను ఎక్కడుంచడమో అతనికి స్థితెల్సా? అతనొక రైతు కుటుం బీకుడు. పట్టి భయస్తుడు. చదువుకున్న మధ్యతరగతి యువకులంటే మరీ భయం. ఇక్బాల్ని కదల్చగలిగేపాటి గుండెధైర్యం అతనికి లేదు. అత నంటే భయం వుండడంవల్లే అతని సెల్లులో ఓ మంచం, కుర్చీ, టేబుల

మరేమీ జగ్గా చెయ్యలేదని చెప్పేడు మల్లిగాడు. వాడలా చెప్పేసరికి జగ్గా ఎలా విజృంభించాడో తాము చూసుంటే ఎంతో బాగుండిపోయేది. చూడ వలసిన దృశ్యమది! దెబ్బతిన్న ఓ క్రూరజంతువులా ప్రవర్తించేడు వాడు. వాడికళ్ళు ఎర్రగా చితనిప్పుల్లా తయారయేయి. పెద్దగా పెడబొబ్బలు పెడుతూ రొమ్ముపై బాదుకుంటూ ఇష్టమొచ్చినట్లల్లా ప్రేలేడు. ఇనపగజా లను పట్టుకొని అటూ ఇటూ వూపుతూ మల్లిగాడికేసి తీక్షణంగా చూస్తూ పకీలుకాకీలు పిరిచేస్తానని ప్రతిజ్ఞచేసేడు. ఇహ మరి లాభంలేదని జగ్గా యొక్క కోపం తగ్గేటంతవరకూ మల్లిగాడిని వాడిగేంగుని రిపోర్టింగ్ రూమ్‌లోనే వుంచేశాము. జగ్గా కొంత శాంతించేక వాడిని ఇక్బాల్ బాబు గారి సెల్లులోకి పంపించి ఆసెల్లులో మల్లిగాడిని, వాడిగేంగుని పెట్టేము." అని జరిగిన సంగతంతా చెప్పేడు కానిస్టేబులు.

పళ్ళికిలించి మెల్లిగా నవ్వుతూ, "ఇదంతా బలేతమాషాగావుంది.... మరో తమాషాకూడా ఇహ జరుగబోతోంది. నేను మల్లిగాడిని, వాడిగేం గుని వదిలేయదల్చుకున్నాను" అని అన్నాడు. ఆ కానిస్టేబులు ఆయో మయంగా ఆ సబిన్స్పెక్టరు కేసి చూసేడు.

"నాకెంత సర్వీసుందో అంత సర్వీసూ నీకుకూడా ఉన్నప్పుడు ఇలాంటి పాలసీలు అర్థమవుతాయి నీకు....! ఆ హెడ్‌కానిస్టేబులు టీ త్రాగడం పూర్తయిందో లేదో వెళ్ళిచూడు." ఆ కానిస్టేబులు మరింకేమీ ప్రశ్నించడానికవకాశమివ్వకుండా అక్కడినుంచి పంపించేశాడు.

హెడ్‌కానిస్టేబుల్ని పిలవడానికి గబగబా వెళ్ళేడా కానిస్టేబులు. కొంచెంసేపయేక ట్యార్‌మని తేన్చుకుంటూ హెడ్‌కానిస్టేబులు స్టేషను కొచ్చేడు. అతని ముఖంపై చక్కని చిరునవ్వు తాండవిస్తోంది. సబిన్స్పె క్టరు అది గమనించకుండా, "తలుపేసి వచ్చి ఇలాకూర్చో!" అని ఆ

హెడ్‌కానిస్టేబుల్ని ఆజ్ఞాపించేరు. దాంతో ఆ హెడ్‌కానిస్టేబులు ముఖం వెలవెల పోయింది.

తలుపేసొచ్చి టేబులుప్రక్క నిలబడి, "తలుపేశానుసార్! ఏమిటి తమాజ్ఞ?" అనడిగేడు విధేయతతో.

"కూర్చో కూర్చో! తొందరేం లేదులే!" కూర్చున్నాడా హెడ్ కానిస్టేబులు, "ఇవాళ నువ్వు చెయ్యాల్సిన పనులు చాలావున్నాయి. వాట న్నింటినీ నువ్వు వ్యక్తిగతంగానే చెయ్యాలి!"

"అలాగే సార్!"

"మొట్టమొదట మల్లిగాడిని, వాడి గేంగుని మానోమజ్రా తీసు కెళ్ళి, ఆ గ్రామస్తులంతా చూస్తుండగా వాళ్ళని వదిలెయ్యి. సాధారణంగా దేవాలయందగ్గర చాలామంది వుంటారనుకుంటాను. అక్కడ వదిలేస్తే బాగుంటుందేమో! అక్కడి పరిస్థితినిబట్టి ఎలా వీలయితే అలాచెయ్యి. ఆ తరువాత బద్మాష్ సుల్తానా గురించి, వాడి గేంగ్ గురించి భోగట్టా చెయ్యి."

"భోగట్టా చేస్తానుగానీ సార్! బద్మాష్ సుల్తానాతోపాటు వాడి వాళ్ళంతా పాకిస్తాన్ వెళ్ళిపోయినట్లు అందరికీ తెల్సుసార్!"

"మానోమజ్రాలో దోపిడీ జరిగిన తరువాత వాడు పాకిస్తాన్‌వెళ్ళి పోయుండొచ్చుగా! అయినా ఈ విషయమై వాళ్ళనడగడంలో నష్టం ఏమీ వుండదు. వాడిఉనికి వాళ్ళకు తెల్సినదీ లేనిదీ మనకు తెలుస్తుందిగా!"

హెడ్‌కానిస్టేబులు ముఖం విప్పారింది. "నాకిప్పుడు అర్థమయింది సార్....! ఇంకేమయినా ఆజ్ఞలున్నాయా సార్?"

"ఊఁ...! ముస్లిమ్‌లీగరయిన ఇక్బల్ మానోమజ్రాలోవున్న కాలంలో ఏమైనా అలజడి లేవదీసినది లేనిదీ ఆ గ్రామస్తుల్ని భోగట్టా చెయ్యి."

ఆ హెడ్ కానిస్టేబులు, సబిన్స్పెక్టరు ముఖంలోకి అయోమయంగా చూస్తూ, "సార్....! ఆ బాబుగారిపేరు ఇక్బల్‌సింగ్! అతను సిక్కుమత స్తుడు. చాలాకాలం ఇంగ్లండులో నివసించడంచేత ఆ జుత్తు మనలాగే కత్తిరించేసుకొని క్రాఫింగ్ చేయించేసుకున్నాడు. శుభ్రంగా గెడ్డం గీయించేసుకున్నాడు" అని అన్నాడు.

ఆ సబిన్స్పెక్టరు ఓసారి హెడ్‌కానిస్టేబులు ముఖంలోకి తేరిపార చూసి నవ్వుతూ, "ఇక్బల్ అనే పేరుగలవాళ్ళు చాలా మందుంటారు. నేను మాట్లాడుతున్నది మొహమ్మద్ ఇక్బల్ గురించి. నువ్వు ఇక్బల్ సింగ్ గురించి ఆలోచిస్తున్నట్లున్నావు. మొహమ్మద్ ఇక్బల్ ముస్లిమ్ లీగ్ మెంబరు" అని అన్నాడు.

"అర్థమయిందిసార్! తమ ఆజ్ఞల్ని కార్యరూపంలోకి త్వరలోనే తీసుకొస్తాను" అని అన్నాడు. కాని నిజానికి అతనికేమీ అర్థం కాలేదు. ముమ్ముందు ఆ స్కీమేమిటో అవగత మవొచ్చుని ఆశించేడు. ఇక సెలవు తీసుకొని వెళ్ళాలనే ఉద్దేశ్యంతో శాల్యూట్ చేశాడు.

"ఆగు! మరొక్క విషయముంది." అని లేచి నిలబడి "ఓ కానిస్టేబుల్ని నా దగ్గరకుపంపు. నేనో ఉత్తరం ఇస్తాను. ఆ ఉత్తరాన్ని ముస్లిమ్ శరణార్థుల శిబిరపు కమేండరుకి అందజేయమనాలి. రేపు మానో మర్రాకు కొంతమంది కానిస్టేబుల్సుని పంపించాలని నాకు నువ్వు గుర్తు చెయ్యి. ఎప్పుడో తెల్సా? ఈ ప్రాంతంలోగల ముస్లిములను తీసుకుపోవ డానికి పాకిస్తానీ సైనికులు వచ్చినప్పుడు!" అని చెప్పేడు.

హెడ్ కానిస్టేబులికి కొంచెం కొంచెంగా అర్థమవసాగిందాప్లాను. "అలాగేసార్" అనంటూ మరోసారి బూట్లతో మడమలు టకీమనికొట్టి శాల్యూట్‌చేసి వెళ్ళిపోయేడు.

హెడ్‌కానిస్టేబులు, కొంతమంది కానిస్టేబుల్సు రైఫిల్సు, బేడీలు పట్టుకొని మల్లిగాడూ వాళ్ళూ వున్న సెల్లుదగ్గరకెళ్ళేరు. వాళ్ళంతా లేచి నిలబడ్డారు. ఓ కానిస్టేబులు తాళం తీసి తలుపు తెరచేడు. పోలీసువారు బహుశా మల్లిగాడిని, వాడి గేంగుని కోర్టుకు తీసుకెళుతున్నారేమోననుకున్నాడు జుగుత్‌సింగ్.

జుగుత్‌సింగ్ కోపాన్ని చూసి మల్లిగాడు భయకంపితుడయేడు. ఆ జిల్లా అంతటికీ జగ్గా గొప్ప బలవంతుడిగాను, ధైర్య సాహసాలుగలవాడిగాను, కఠినాత్ముడుగాను పేరు పొందేడు. అందుకనే జగ్గాతో వివాదపడడానికి మొదట మల్లిగాడు భయపడ్డాడు. కాని జగ్గా నోటికొచ్చినట్లల్లా తిట్టడంవల్ల అతనితో వివాదపడక తప్పిందికాదు. తన స్వంత ముఠాకు మల్లి లీడరు. తన సహచరులముందు తన పరువు కాపాడడంకోసం వాడి డంకులన్నీ బయటపెట్టి, తనూ దూషించేడు. వాడు మరీ రెచ్చిపోయి నోటికొచ్చినట్లల్లా కూసేడు. తిట్లకు తిట్లలోనే బదులు తీర్చాలనుకున్నాడు కాని ఇనుప కటకటాలు వాళ్ళని వేరుచేసేయి. పైగా పోలీసువాళ్ళ కావలా ఒకటి. ఆ పోలీసువాళ్ళు మల్లిగాడికి వాడి సహచరులకు బేడీలు తగిలించి వాటినన్నింటినీ ఓ పెద్ద గొలుసుకి కలిపేరు. ఓ కానిస్టేబులు ఆ గొలుసును గట్టిగా పట్టుకున్నాడు.

"ఇక నడవండి" అన్నాడు హెడ్‌కానిస్టేబులు.

ఇటూ, అటూ, వెనకాలా రైఫిల్సు పట్టుకొని ముగ్గురు కానిస్టేబుల్సు నడుస్తున్నారు. వాళ్ళు జగ్గావున్న సెల్లు పక్కనుంచి వెళుతున్నప్పుడు జగ్గా వాళ్ళని- వాళ్ళు జగ్గాను చూసేరు.

మల్లిగాడు ఎగతాళిగా "నువ్వు నీ ఈ పాతనేస్తాన్ని మరచిపోబోకు! నిన్ను ఇక్కడొదిలిపెట్టి ఎల్లడానికి మాకు చాలా ఇచారంగా వుంది!" అని అన్నాడు.

వాడి సహచరులంతా ఫకాలున నవ్వి "అద్ని ఇక్కడే వుండనీ." అని అన్నారు. నేలకేసి తేరిపారచూస్తూ జగ్గా ఇంకా అలా కూర్చొనే వున్నాడు.

"ఏంవర్రా మీఆత్మల్ని ఎవర్తిప్రేమయినా క్షోభపెడుతోందా? మరేం వాగకుండా నోరు మూసుకొని తిన్నగా పదండి." అన్నారా పోలీసువాళ్ళు అయిష్టంగా. నిజానికి ఆ దృశ్యం వాళ్ళకి ఆనందాన్ని ఇచ్చేదిగావుంది.

"మాపాతనేస్తానికి మరి మాఁవు ఈడ్కోలు చెప్పొద్దా? ఓ సర్దార్ జుగుత్‌సింగ్‌జీ! దండాలు దండాలు. మరి మాఁవు ఎల్తాము. మరి సిపోళ్ళె వరికైనా ఏదైనా వార్త సెప్పమంటావేమిటి? ఆ సాలోని కూతురికి ఏదైనా ప్రేమవార్త!"

ఆ మాటలేవీ వినబడనట్లుగా జగ్గా మౌనంగా గజాలు పట్టుకొని కూర్చున్నాడు. వాడి ముఖం ఎర్రగా కందగడ్డలా తయారయింది. తన పిడికిళ్ళ మధ్య ఇనుపగజాలను కోపంతో గట్టిగా బిగించేడు.

నవ్వుతున్న తన సహచరులవేపు మల్లిగాడు తిరిగి, "సర్దార్ జుగుత్‌సింగు ఈపొద్దు డీలా అయిపోయిండు. ఈడు మనల్ని ఇవాల మరి సాగనంపడు. అంచేత మనమే మరోసారి ఈడికి ఈడ్కోలు సెప్పి పోదాం." అని బేడీలు తగిలించబడున్న తన చేతుల్ని కలిపి జుగుత్‌సింగ్ కూర్చొనివున్న ఇనుపగజాల తలుపుదగ్గర కాస్తవంగి బిగ్గరగా, "సత్‌శ్రీ" అని అంటూండగా జగ్గా గబుక్కున తన చేతుల్ని కటకటాలలోంచి బయటకుచాచి తలపాగా వెనకాలగల జుత్తందుకున్నాడు. మల్లిగాడి టర్బన్ క్రింద పడిపోయింది. ఏదో హత్యచేస్తున్నవాడిలా జగ్గా బిగ్గరగా కేకలుపెడుతూ, బండబూతులు తిడుతూ మల్లిగాడి బుర్రను గజాలకేసి బాదసాగేడు!

ఇక్బల్ కుర్చీలోంచి గబుక్కున లేచి, "అలా చూస్తూ నిలబడ్డా రేం? వాడిని చంపేసేటట్లున్నాడు" అని పోలీసువాళ్ళకేసి చూస్తూ గట్టిగా అరచేడు.

"ఒరేయి జగ్గా! వదిలెయ్యరా! చచ్చిపోతాడురా! వదిలెయ్యరా!" అని కేకలెయ్యసాగేరు పోలీసు కానిస్టేబుల్స్. ఒక పోలీసు కానిస్టేబులు రైఫిల్ యొక్క మడమతో జగ్గాని ఓ పోటు పొడిచాడు. కాని జగ్గా లక్ష్యపెట్టలేదు. మల్లిగాడి బుర్రమీద చర్మం చిట్లి రక్తం కారుతోంది. వాడి నుదురు, తల చితుక గొట్టబడింది. వాడు బిగ్గరగా రోదించసాగాడు.

ఆ ఏడుపు విని సబిన్‌స్పెక్టరు అక్కడికి గాభరాగా పరుగెత్తుకొని వచ్చి జగ్గా చేతులమీద తన లాఠీకర్రతో గట్టిగా మోదసాగాడు. అయినా జగ్గా పట్టు వదలలేదు. దాంతో సబిన్‌స్పెక్టరు తన పిస్టల్‌తీసి జగ్గాకేసి గురిపెట్టి "ఒరేయి పందీ! వాడిని వదిలిపెట్టు. లేకపోతే షూట్ చేస్తాను" అని అన్నాడు.

జగ్గా మల్లిగాడిముఖాన్ని తన రెండుచేతులతోమూమీదికెత్తి తుప్‌న ఉమ్మి మరింత ఘోరంగా తిడుతూ వెనక్కి ఒక త్రోపు త్రోసేశాడు. మల్లిగాడువెనక్కి కుప్పలాకూలి పోయేడు. వాడిజుత్తు వాడిముఖంపైనా, భుజాలపైనా విరజిమ్మబడింది. వాడి సహచరులు వాడిని లేవనెత్తి వాడి నెత్తిపై కారుతున్న రక్తాన్ని, ముఖంపై అసహ్యంగా వున్న ఉమ్మిని తలపాగా గుడ్డతో తుడిచేశారు.

ఓ చిన్న పిల్లాడిలా మల్లిగాడు ఏడుస్తూ, "గాడిదకొడకా! నీతల్లి చావ! నీ అంతు సూత్తానుండు!" అని అన్నాడు.

ఆ పోలీసు కానిస్టేబుల్స్ వాళ్ళని మరక్కడుండనివ్వకుండా వెంటనే తీసుకుపోయారు. జగ్గా నీరసంగా వెనక్కిచతికిలబడ్డాడు. సబిన్‌స్పెక్టరు తన చేతులమీద కొట్టిన లాఠీదెబ్బల తట్లను అప్పుడు చూసుకున్నాడు. ఇక్బల్ ఇంకా ఏదో అరుస్తూనే వున్నాడు.

"నోరు మూసుకోండి బాబూ! నాను మీకేదో చేసినట్లు అలా అరుస్తున్నారేటి?" అని చిరాగ్గా అన్నాడు. జుగ్గా అంతకుముందే సందర్భం లోను ఇక్బాల్‌తో అంత మొరటుగా మాట్లాడలేదు. అందుకనే ఆ సెల్లులో జుగ్గాతో కలిసి వుండడానికి ఇక్బాల్‌కి భయం పట్టుకుంది.

"అయ్యా ఇనస్పెక్టరుగారూ! ఇప్పుడు ప్రక్క సెల్లు ఖాళీగానే వుంది గనుక దయుంచి నన్నందులోకి మార్చకూడదూ?" అని అభ్యర్థించాడు.

ఆ సబిన్స్పెక్టరు అదోరకంగా నవ్వుతూ నిర్లక్ష్యంగా, "ఓ! తప్పకుండా! మీ సౌఖ్యంకోసం ఏం చెయ్యమన్నా చేస్తాం! ఆ సెల్లులోకూడా టేబుల్సు, కుర్చీలు, ఇంకా అమాటకొస్తే ఫేను వేస్తాం. మరి మేం ఎందుకున్నట్టిక్కడ?" అనంటూ వెళ్ళిపోయాడు.

12

ఒక పెద్దరైలు పూర్తిగా శవాలతో నిండి వచ్చిందనే విషయం బయటకు పొక్కేసరికి మానోమజ్రా గ్రామమంతా అవాంఛనీయమైన నిశ్శబ్దంలో మునిగిపోయింది. ఆ గ్రామస్తులంతా తలుపులేసుకొని ఏవేవో గుసగుసలాడుకుంటూ ఇళ్ళలోనే కూర్చున్నారవాళ! ప్రతిఒక్కరికీ అనుమానం పట్టుకుంది. తమ పొరుగువాళ్ళు తమ శత్రువులేమోనని! ఆ ప్రమాదంలోంచి తప్పించుకొని బయటపడడానికి తమకు సహాయం చేసే వాళ్ళెవరా అని ఆలోచించసాగారు.

ఆ రాత్రి వాళ్ళకు సరిగా నిద్రపట్టలేదు. కలతనిద్ర పట్టింది! ఉదయం లేచిన వెంటనే వాళ్ళు గమనించారు: వర్షం చాలా సేపటినుంచీ పడుతున్నట్లు. ఆ సంగతి గమనించిన వెంటనే ఆ ట్రైను, కాలుతున్న వందలాది శవాలు వాళ్ళ స్మృతిపథంలోకొచ్చాయి. వెంటనే వాళ్ళంతా ఇళ్ళ పైకప్పుల మీదకెక్కి, రైల్వేస్టేషనుకేసి దృష్టి సారించారు. అక్కడ ట్రైను లేదు. అది ఎంత రహస్యంగా వచ్చిందో అంతే రహస్యంగా

వెళ్ళిపోయింది. ఆ స్టేషనంతా నిర్మానుష్యంగావుంది. సోల్జర్ల యొక్క-టెంటులన్నీ నీళ్ళతో బాగా నానిపోయి అణగారి పోయున్నాయి. అక్కడ నిప్పులుగాని, పొగగాని ఏదీలేదు. నిజం చెప్పాలంటే అక్కడ బ్రతికున్న వాళ్ళుగాని, చచ్చిన వాళ్ళుగాని ఎవ్వరూ లేరు!

అయినా గ్రామస్తులింకా అలా చూస్తూనే నిలబడ్డారు. బహుశా మరో ట్రైను ఇంకా ఎక్కువశవాలతో రావొచ్చునని వాళ్ళ అభిప్రాయం! మధ్యాహ్నమయ్యేసరికి మేఘాలన్నీ పడమటికి వెళ్ళిపోయాయి. అంతా నిర్మలంగా వుంది.

ఈ విషయమై తమ కంటే ఇంకెవరికైనా బాగా తెల్సునేమో!

తెల్సుకుంటేనో? ఏవయినా తగాదాలొస్తాయో ఏమిటో? ఎందు కొచ్చిన బాధనుకున్నారు!

స్టేషను ప్లాట్‌ఫారం మీదగాని, పాసింజరు షెడ్డులోగాని, మిలటరీ కేంపులోగాని పిట్టమనిషి కనిపించలేదు. స్టేషను బిల్డింగ్ గోడమీద ఓ వరసలో చాలా రాబందులు కూర్చొని వున్నాయి. గ్రద్దలు గుండ్రంగా తిరుగుతూ పైన ఎగురుతున్నాయి!

హెడ్ కానిస్టేబులు ఖైదీలతోను, రక్షకభటదళంతోను ఆ గ్రామం లోకి వస్తూండడం ఇళ్ళ పైకప్పులమీద నున్నవాళ్ళు చూసారు. ఆ వార్త అందరికీ మోసేశారు! హెడ్ కానిస్టేబులు వాళ్ళందరినీ తోడ్కుకొని వచ్చే సరికి, దేవాలయ సమీపంలోగల రావిచెట్టుక్రింద చాలామంది గ్రామస్తులు గుమిగూడారు. గ్రామాధికారికి సమన్ చేయబడింది!

ఆ గ్రామస్తులముందు ఆ ఖైదీల బేడీలను తొలగించేడా హెడ్ కానిస్టేబులు. వారానికి రెండుసార్లు పోలీసు స్టేషనుకు హాజరవవలసుం టుందని వాళ్ళకి చెప్పి, వాళ్ళ వ్రేలు ముద్రల్ను చిన్నచిన్న కాగితాలమీద తీసుకున్నాడు. ఇదంతా తెల్లబోయి చూస్తున్నారా గ్రామస్తులు.

బద్మాష్ జగ్గాకిగాని, ఆ మల్లిగాడికిగాని తమ వూళ్ళో జరిగిన దోపిడీతో సంబంధం వుండకపోవచ్చనుకున్నారు వాళ్ళు! మల్లిగాడిని వాడి అనుచరుల్ని అంచేతే వదిలేస్తున్నారనుకున్నారు. అయితే వాళ్ళను వాళ్ళ వూళ్ళో వదిలేయకుండా, హత్య, దోపిడీ జరిగిన తమవూళ్లో ఎందుకు వదిలిపెడుతున్నారో వాళ్ళకర్థంకాలేదు:

ఆ హెడ్ కానిస్టేబులు, హెడ్మన్‌ని కొస్త ప్రక్కకు తీసుకెళ్ళి కొంచెంసేపు ఏదో మాట్లాడాడు. ఆ తరువాత ఆ హెడ్మన్ వెనక్కు తిరిగొచ్చి, తన గ్రామస్తుల నుద్దేశించి, "ఈ మధ్య మీలో ఎవరైనా సుల్తానా బద్మాష్‌ని, వాడి గేంగుని చూసారా? పోనీ వాళ్ళ భోగట్టా అయినా విన్నారా? హెడ్ కానిస్టేబులు బాబుగారడుగుతున్నారు: వాళ్ళ ఉనికి మీకేమయినా తెలిస్తే చెప్పమని!" అని అన్నాడు.

సుల్తానా బద్మాష్ వాడి గేంగుతో పాకిస్తాన్ వెళ్ళిపోయినట్లు చాలా మంది చెప్పారు. వాళ్ళంతా ముస్లిములని, వాళ్ళ వూళ్లోగల ముస్లిములంతా అపూరాదిలిపెట్టి పాకిస్తాన్ వెళ్ళిపోయేరని, సుల్తానా తన గేంగుతోసహా వాళ్ళతోపాటే వెళ్ళిపోయాడని చెప్పారు.

"రామ్‌లాల్ హత్యకు ముందా, తరువాతా? ఎప్పుడెళ్ళిపోయాడు?" అని హెడ్‌కానిస్టేబులు అడిగాడు.

"తరువాతే!" అని అంతా ముక్తకంఠంతో చెప్పారు.

ఆ తరువాత చాలాసేపటివరకూ ఎవ్వరూ ఏమీ మాట్లాడలేదు. వాళ్ళంతా సందిగ్ధంగా ఒకరిముఖాలలోకొకరు చూసుకున్నారు. రామ్‌లాల్‌ని వాళ్ళే చంపుంటారా అనే అనుమానం వాళ్ళకప్పుడు కల్గింది: వాళ్ళు పోలీసువాళ్ళని ఈ విషయమై ఏమీ ప్రశ్నించకముందే హెడ్ కానిస్టేబులు, "మీలో ఎవరైనా ముస్లిమ్‌లీగు సభ్యుడయిన ఆ ముస్లిమ్ యువకుణ్ణిఅంటే

మొహమ్మద్ ఇక్బల్ బాబుని చూసారా? అతనితో మాట్లాడేరా?" అని అడిగాడు.

హెడ్మన్ దిగ్భ్రాంతి చెందేడు. ఇక్బల్ ముస్లిమని అతనికి తెలీదు. మీట్ సింగు, ఇమామ్‌బక్ష్ అతనిపేరు ఇక్బల్‌సింగ్ అని చెప్పేరు. ఆ మూకలో ఇమామ్‌బక్ష్ ఉన్నాడేమోనని అతను చూసాడు. కాని అతనగుపించలేదు.

ఇక్బల్ బ్రిడ్జిదగ్గర తిరుగుతూండడం తాముచూసామని కొంతమంది గ్రామస్తులు ఆ హెడ్ కానిస్టేబులుకి చెప్పారు.

"అతనిపై మీకేమయినా అనుమానముందా?" అని చాలామంది నడిగేడా హెడ్ కానిస్టేబులు.

అతనిపై తమకనుమానమున్నట్లు ఎవ్వరూ ఖచ్చితంగా చెప్పలేక పోయారు. విద్యావంతులయిన మేధావుల విషయంలో ఎవరూ ఏదీ ఖచ్చితంగా చెప్పలేరు. వాళ్ళ బయటకేమీ అగుపించని జిత్తులమారి వాళ్ళని వాళ్ళ అభిప్రాయం. మీట్ సింగ్‌కి బహుశా అతనిగురించి ఏమైనా తెల్సుండొచ్చని, అతని వస్తువులు ఇంకా గురుద్వారాలోనే వున్నాయని చెప్పేరు వాళ్ళు.

అంతాకలసి మీట్ సింగ్‌ని ముందుకు నెట్టారు. మీట్ సింగ్‌కేసి చూడకుండా, ఆ మూకలో తన ప్రశ్నలకు సమాధానాలిస్తున్న వ్యక్తితో, "భాయి మీట్ సింగ్‌తో నేను తరువాత మాట్లాడుతాను. మీలో ఎవరికైనా తెలుస్తే చెప్పండి. ఆ యువకుడు రామ్‌లాల్ హత్యజరిగాక ఈ గ్రామానికి వచ్చేడా, లేక ముందే వచ్చేడా?" అనడిగేడు.

ఈ ప్రశ్న మరింత విస్మయాన్ని కల్గించింది వాళ్ళకి. ఒక పట్నవాసపు బాబుకి ఈ హత్యతోను, దోపిడీతోను ఏం సంబంధముంటుందికనక? ఏమిటో? ఈ విషయమై తామేమీ ఖచ్చితంగా చెప్పలేమనుకున్నారు.

"సరే! మీలో ఎవరికైనా ఆ వడ్డీ వ్యాపారస్తుని హత్య గురించి గాని, సుల్తానా బద్మాష్ గురించిగాని, మొహమ్మద్ ఇక్బల్ గురించిగాని తగిన సాక్ష్యాధారాలతో ఖచ్చితమైన భోగట్టా తెలుస్తే, వెంటనే వచ్చి పోలీసుస్టేషనుకు రిపోర్టు చెయ్యండి. ఇక ఇళ్ళకువెళ్ళండి" అని అందర్నీ పొమ్మన్నాడు హెడ్ కానిస్టేబులు.

ఉల్లాసంగా ఏదో మాట్లాడుకుంటూ చిన్న చిన్న గుంపులుగా చీలి వెళ్ళిపోసాగారు వాళ్ళు! కానిస్టేబుల్సుతోసహా వెనుదిరిగి వెళ్ళిపోడానికి సిద్ధంగావున్న హెడ్ కానిస్టేబులు దగ్గరకు మీట్‌సింగ్ వెళ్ళి, "బాబూ! తాము అరెస్టు చేసిన యువకుడు ముసల్మాన్ కాదు. అతను సిక్కుమత స్తుడు. పేరు ఇక్బల్‌సింగ్" అని అన్నాడు.

అతను చెప్పిన విషయాన్ని ఆ హెడ్‌కానిస్టేబులు ఏమంతగా విని పించుకోలేదు. పచ్చనికాగితంమీద ఏదో వ్రాసుకోడంలో నిమగ్నుడయాడు. అతను వ్రాయడం పూర్తిచేసేటంతవరకూ మీట్‌సింగ్ ఓపిగ్గా నిరీక్షిం చాడు. అతనా కాగితాన్ని మడతపెడుతూన్నప్పుడు, "హెడ్డుబాబుగారూ!" అని మీట్‌సింగ్ మళ్ళీ చెప్పడం ప్రారంభించాడు.

ఆ హెడ్ కానిస్టేబులు కనీసం అతనివేపు చూడనైనా చూడలేదు! ఓ కానిస్టేబుల్ని చేత్తో సంజ్ఞచేసి పిలిచి, "సైకిలుమీదగాని, టాంగామీద గాని పాకిస్తాన్ మిలటరీ యూనిట్ కమేండరుదగ్గరకెళ్ళి ఈ చీటీ అతని కియ్యి! నువ్వు మానోమజ్రానుంచి వస్తూన్నట్లు, అక్కడ పరిస్థితి ఏమీ బాగులేనట్లు చెప్పు. ఇక్కడున్న ముస్లిములందరినీ తీసుకుపోడానికి అతను వెంటనే ట్రక్కులను, సోల్జర్లను పంపిస్తాడు. ఊ! వెళ్ళు! వేగంగావెళ్ళు!" అని ఆజ్ఞాపించాడు.

"అలాగేసార్!" అంటూ మడమల్ని టపీమని కలిపి శాల్యూట్ చేసి వెళ్ళిపోయాడు ఆ కానిస్టేబులు.

"హెడ్డుబాబుగారూ!" ప్రార్థనాపూర్వకంగా పిలిచాడు మీట్‌సింగు.

"హెడ్డుబాబూ! హెడ్డుబాబూ! హెడుబాబూ! నువ్వు నా చెవుల్ని కొరికేస్తున్నావు హెడ్డుబాబూ అని అదేపనిగా పిలుస్తూ! ఇంతకీ నీకేం కావాలి?" అనడిగాడు కోపంతో.

"ఇక్బల్‌సింగ్ సిక్కుమతస్తుడు!" అని గొణిగాడు.

"నువ్వు వాడి ఫేంటు గుండీలువిప్పి చూసావుటయ్యా! వాడు సిక్కో, ముసల్మానో తెల్సుకోడానికి: నువ్వొక చిన్న గురుద్వారా భాయీవి: నిజానిజాలు నీకేంతెల్సు? వెళ్ళి పూజచేసుకో!" అని, హెడ్ రెండు వరసలలో నిలబడివున్న కానిస్టేబుల్సు ముందు నిలబడి, "ఎటెంషన్! టర్న్ బై దిలెఫ్టు! క్విక్ మార్చ్!" అని అన్నాడు.

వాళ్ళు వెళ్ళిపోతూంటే, మీట్‌సింగ్ వెనక్కుతిరిగి, గ్రామీణులు ఆత్రుతతో ఏవేవో ప్రశ్నలువేస్తున్నా సమాధానాలు చెప్పకుండా గురుద్వారాలోకి వెళ్ళిపోయాడు.

13

ఆ హెడ్ కానిస్టేబుల్ రాకతో మానోమజ్రా రెండు ముక్కలయి పోయింది. వెన్నముద్దను కత్తి ఎంత సులభంగా రెండు ముద్దలుగా చీల్చ గలదో, అంతే సులభంగా ఆ గ్రామాన్ని ఆ హెడ్ కానిస్టేబులు రెండుగా విడగొట్టేడు.

ముస్లిములు తమ తమ ఇళ్ళలో నిరాశా నిస్పృహలతో కూర్చు న్నారు. పాటియాలాలోను, అంబాలాలోను, కాపుర్థాలాలోనుగల సిక్కులు, ముస్లిములపై జరిపిన దారుణకృత్యాలకు సంబంధించినవార్తలు అంతకుముందే వాళ్ళు విన్నారు. కాని అప్పుడు వాళ్ళు నమ్మలేదు. ఇప్పుడు మళ్ళీ అవన్నీ వాళ్ళ స్మృతిపథంలోకి వచ్చినాయి: గొప్పింటి ఘోషాస్త్రీల

పరదాలను వూడదీసి వాళ్ళను వివస్త్రలను చేసి నడిబజార్లలో నడిపించి మానభంగం చేసారని, ఎంతోమంది యువతుల్ని బలాత్కారంగా ఎత్తుకుపోయి చెఱచి చంపివేశారనీ, ఆ దుర్మార్గుల బారినుంచి తప్పించుకోడానికి మరో మార్గంలేక కొంతమంది మానవతులైన స్త్రీలు ఆత్మహత్య చేసుకున్నారని, పవిత్రమైన మసీదుల్ని పందులరక్తంచే అపవిత్రం చేసేరని, ఖురాన్ ప్రతులను ముక్కముక్కలుగా చించి పారేశారని వాళ్ళు లోగడ విన్నారు. తాము విన్నదంతా నిజమే అయుంటుందని వాళ్ళిప్పుడను కున్నారు.

మానోమజ్రాలోగల ప్రతి సిక్కూ దుష్టతలంపుగల శత్రువులాగే వాళ్ళ దృష్టి కగుపించసాగాడు. ఆ పొడుగాటి జుత్తు, గడ్డం చాలా అనాగరికంగాను, ఆ కృపాణం ముస్లిమ్ వ్యతిరేక చిహ్నంగాను వాళ్ళ కగుపించ సాగాయి. "పాకిస్తాన్‌లో సిక్కులుండరు. అది ముస్లిములస్వర్గం!" అనే భావం వాళ్ళకాసమయంలో కల్గింది.

ఆ గ్రామంలో చాలామంది సిక్కులు ముఖ్యంగా యువకులు చాలా కోపంగావున్నారు. ఎన్నడూ ముస్లిములను నమ్మకూడదనుకున్నారు. ముస్లిములకు సాధారణంగా ప్రభుభక్తి వుండదని తమ ఆఖరిగురువు చెప్పిన మాటలు వారికి గుర్తుకొచ్చాయి. తమ ఆఖరిగురువు సత్యమే చెప్పారని అప్పుడు అనుకున్నారు. భారతదేశచరిత్రలో ముస్లిమ్ పరిపాలనాకాలాన్ని పరిశీలించి చూసినట్లయితే, రాజ్యాధిపత్యం కోసం కొడుకులు తండ్రులను, తమ్ముళ్ళు అన్నలను దారుణంగా హత్య చెయ్యడం లేదా ఖైదుచెయ్యడం అగుపిస్తుంది. ఇకపోతే వాళ్ళు సిక్కులకు చాలా అన్యాయం చేశారు. తమగురువులు ఇద్దరిని చంపేశారు. ఒకగురువుని రహస్యంగాచంపేశారు. అతని పసిపిల్లల్ని కసాయివాళ్ళకన్నా అన్యాయంగాదాడి చంపారు. ఇస్లాం మతాన్ని స్వీకరించడానికి సమ్మతించని కారణంగా వేలకొద్దీ అమాయక ప్రజలను కత్తికి బలిచేశారు. పవిత్రమైన తమ దేవాలయాలలో గోవుల్ని

చంపి అపవిత్రం చేశారు. పవిత్రమైన తమ "గ్రంథసాహెబ్"ను చిన్నచిన్నముక్కలక్రింద చించిపారేశారు. స్త్రీలంటే వాళ్ళకు రవ్వంతైనా గౌరవంలేదు: సిక్కుశరణార్థులు చెప్పిన విషయాలు అప్పుడు వాళ్ళకు స్మృతిపథంలోకొచ్చేయి: ముస్లిముల చేతులకు చిక్కి శీలాన్ని పోగొట్టుకొనేకంటే మరణమే మేలనే ఉద్దేశ్యంతో, ఎంతోమంది స్త్రీలు నూతుల్లోకి దూకి ఆత్మహత్య చేసుకున్నారట: కొంతమంది మంటల్లోకి దూకి ఆత్మహత్య చేసుకున్నారట: కొంతమంది శరీరంపై కిరసనాయిలు పోసుకొని నిప్పంటించుకొని ఆత్మహత్య చేసుకున్నారట: ఆత్మహత్య చేసుకోకుండా మిగిలివున్న స్త్రీలను దిగంబరంగా నడివీధుల్లో వూరేగించి మానభంగం చేసి ఆ తరువాత ఎంతో దారుణంగా చంపేశారట: ఇప్పుడు భారతదేశానికి ప్రాణభీతితో వచ్చేస్తున్న వాళ్ళందర్నీ చంపేస్తున్నారు: ఓ రైలునిండా శవాలొచ్చేయిప్పుడు: వారి శవాలను దహనపరచడానికి మనోమజ్రా రైల్వే స్టేషను ఓ పెద్ద స్మశానభూమిగా మారింది:

పాకిస్తాన్‌నుంచి హిందువులు, సిక్కులు ప్రాణాలరచేతిలో పెట్టుకొని మానోమజ్రాలో తలదాచుకొనడానికని వస్తున్న సమయంలోనే రామ్‌లాల్ హత్య జరిగింది. అతన్ని ఎవరు హత్యచేశారో ఎవరికీతెలీదు. కాని రామ్‌లాల్ హిందువని అందరికీతెల్సు: సుల్తానాతోపాటు వాడి సహచరులంతా ముస్లిములే: వాళ్ళంతా పాకిస్తాన్ వెళ్ళిపోయారు: ఆ తరువాత తలపాగాగాని, గెడ్డంగాని లేని ఓ అపరిచితుడు ఆ గ్రామానికి వచ్చాడు: లేనిపోని అనుమానాలు రేకెత్తడానికి ఈ కారణాలు చాలు:

ఆ వూళ్ళోగల సిక్కులకు, ముస్లిములమీద జుగుప్స కల్గడానికీ పరిస్థితులన్నీ దోహదంచేశాయి. ముస్లిములు కృతఘ్నులని వాళ్ళనుకున్నారు: సిక్కులకుగాని కోపంవస్తే ఇహ ఎవరు ఏంచెప్పినా వినరు. ఆ సందర్భంలో తర్కం వాళ్ళతలకెక్కదు:

అదొక చీకటిరాత్రి! ఓ ప్రక్కనుంచి వర్షమేఘం క్రమ్ముకొస్తోంది. చంద్రుడు, నక్షత్రాలు మబ్బులమాటున అదృశ్యమయిపోయాయి. మెరపులు, ఉరుములు లేకుండానే వర్షం పడనారంభించింది! ఆ సమయంలో కొంతమంది సిక్కురైతులు హెడ్మన్ ఇంట్లో కల్సుకున్నారు. మీట్‌సింగ్ కూడా వాళ్ళమధ్యనున్నాడు.

"మనం చేసిన పాపాలకు భగవంతుడీవిధంగా మనల్ని శిక్షిస్తున్నాడు!" అనే భావంతో తప్పితే ఎవ్వరూ ఇంకేవిధంగాను చాలా సేపటి వరకూ మాట్లాడలేదు.

"ఔను! మనం చేసిన పాపాలకు భగవంతుడు మనల్నిలాగ శిక్షిస్తున్నాడు."

"పాకిస్తాన్‌లో చాలా పెద్దఎత్తున ఎన్నో ఘోరాలు జరుగుతున్నాయట!"

"పాపం పేరుకుపోయిందిగనక జరుగుతున్నాయి. చెడ్డపనులు చెడు ఫలితాలనే ఇస్తాయి!"

వాళ్ళలో ఓ యువకుడు, "అయితే మరి ఇందుకు తగినట్టుగా మనమిప్పుడేటిచెయ్యాలి? మనం ముస్లిములను అన్నదమ్ములనాగ, అక్కచెళ్ళెళ్ళనాగ చూసుకుంటున్నాం! మరటువంటప్పుడు, ఆళ్ళు మన మీదికెందుకిలా గూఢచారిని పంపినారు?" అనడిగాడు.

"ఇక్బల్‌గురించేనా నువ్వంటున్నది? అతనితో నేను చాలా సన్నిహితంగా మాట్లాడాను. మన సిక్కులందరికీ ఉండేటట్లుగానే అతనిచేతికి కూడా ఓ ఇనుపకంకణం వుంది. తనతల్లి కనీసం అదయినా ధరించమని బలవంతం చెయ్యడంవల్ల తాను ధరిస్తున్నట్లు నాకు చెప్పాడు. అయితే ఒకటే! మనలాగ జుత్తు, గెడ్డం పెంచలేదు! సిగరెట్లు కాల్చే అలవాటు

కూడా అతనికి లేదట! ఇంతకీ రామ్‌లాల్ హత్యానంతరం అతను మనూ రొచ్చాడు!" అని అన్నాడు మీట్‌సింగ్.

"భాయి! నువ్వు ప్రతివిషయాన్నీ చాలా తేలిగ్గా తీసుకుంటూంటావు! ఏదైనా ఒక ముఖ్యమయిన పనిని చేయాలనే ఉద్దేశంతో వొచ్చినోడు, ఓ ఆనువకంకణాన్ని చేతికేసుకొని, ఓ రోజంతా సిగరెట్లు కాల్చడం మానేసినందువల్ల ఏదైనా బాధ పడిపోతాడంటావేటి?"

"బాబూ! నేనొక సామాన్యమైన వ్యక్తిని! అయినా నేను ఖచ్చితంగా చెప్పగలను; ఇక్బాల్‌బాబుకీ హత్యతో ఏమీ సంబంధం లేదని. ఒకవేళ సంబంధమేవుంటే, హత్యానంతరం అతనీగ్రామానికి రానేరాడు!" అన్నాడు మీట్‌సింగ్. కొంచెంసేపు మౌనంగా ఊరుకొని, "అదీగాక ఆ దోపిడీ సందర్భంలోనే పోలీసువారు మల్లిగాడిని, వాడిసహచరుల్ని అరెస్టు చేశారు" అని అన్నాడు.

"ఇందుగురించే ఆళ్ళు మల్లిగాడిని, వాడిగేంగుని అరట్టుచేసినారని నువ్వెలా చెప్పగలవు?" అని అడ్డుతగిలేడో యువకుడు.

"అప్పుడు పోలీసోళ్ళు మల్లిగాడిని, వాడి అనుచరుల్ని వొగ్గేశారుగా! నేరం చెయ్యానేదని రుజువు కాకుండా కూనీకోరుల్ని పోలీసోళ్ళు వొగ్గేత్తారంటావేటి?" అనడిగాడు మరో యువకుడు.

"ఓ భాయీ, నువ్వు సబవూ, సందర్భమూ నేకుండా ఎప్పుడూ మాటాడుతూంటావు!" అని విమర్శించారు కొందరు.

"జానాను! ఎప్పుడూ సబవుగా మాట్లాడేది మీరేను! అయితే మరి జగ్గా ఇంటి వాకిట్లోకి గాజులపేకట్టు విసరినదెవరో చెప్పండి" అని వాళ్ళ ముఖాలల్లోకి ప్రశ్నార్థకంగా చూసాడు మీట్‌సింగ్.

"ఆ సంగతి మాకెలా తెలుస్తుంది?" అని ఎదురుప్రశ్న వేశారు వాళ్ళు.

"నేను చెప్తాను. ఆ గాజుల పేకట్టు విసరినది జగ్గా శత్రువయిన మల్లిగాడు. జగ్గాని అవమానపరిచే ధైర్యం ఈ ప్రాంతంలో మల్లిగాడికి తప్పితే ఇంకెవరికైనా వుందంటారా?" అని అడిగాడు మీట్‌సింగ్. ఆ ప్రశ్నకు ఎవ్వరూ సమాధానం చెప్పలేక పోయారు.

"సరే భాయీజీ! నువ్వు చెప్పినది నిజమేకావొచ్చు! ఈ విషయమై నీతో ఇప్పుడు వాదన అనవసరం! ఇంతకీ లాలా సచిపోనాడు! ఆ సచి పోయినోడి గురించి మనకెందుకిప్పుడీగొడవ? ఆ గొడవంతా ఆ పోలీ సోళ్ళే సూసుకుంటారు! ఆ జగ్గాగాడు, మల్లిగాడు, సుల్తానాగాడు ఆళ్ళ తగూలేవో ఆళ్ళలో ఆళ్ళే తేల్చుకుంటారు. ఇకపోతే ఆ ఇక్బల్‌బాబు ఆది తల్లితో ఆడు పోయినా మనకు బాధనేదు! ఇప్పుడా గొడవలు మనకనవ సరం! కాని ఇన్నాళ్ళయి మనతోవున్న ఈ పంది యెధవల సంగతే మన మిప్పుడు తేల్చుకోవాల! తరతరాలనుంచి మన ఉప్పుతింటూ మనకేంసేత్తు న్నారో సూడండి? ఆళ్ళని మన సొంత అన్నదమ్ముల్లాగ సూసుకుంటు న్నాము. కాని ఆళ్ళు నాగుపాముల్లాగ మనమీద విషం కక్కుతున్నారు!" అని ఆవేశంతో అన్నాడొక యువకుడు.

ఆ యువకుడలా అనేసరికి ఆ సమావేశంలో అకస్మాత్తుగా ఉద్రిక్తత ఏర్పడింది.

మీట్‌సింగ్ చాలా కోపంతో, "మన వూళ్ళోవున్న ముస్లిములు మీకేం అపకారం చేశారు? వాళ్ళు మీ భూముల్ని ఆక్రమించేరా? మీ ఇళ్ళను ఆక్రమించేరా? మీ ఆడవాళ్ళను చెరచేరా? చెప్పండి. చెప్పండి వాళ్ళు మీకు చేసిన అపకారమేమిటి?" అనడిగేడు.

"పాకిస్తాన్‌నుంచి వచ్చిన కాందిశీకుల్ని అడగండి. ఆళ్ళే సెపుతారు! అక్కడ ఆళ్ళు మనోళ్ళను ఏటిసేత్తున్నది? ఆళ్ళు మనోళ్ళను గోరంగా సంపేత్తున్నారట! గురుద్వారాలను ధ్వంసంచేసేత్తున్నారట." మొదట ఈ

విషయం లేవనెత్తిన ఆవేశపరుడైన యువకుడు కొరకొర చూస్తూ అన్నాడు.

"నేను కేవలం మానోమజ్రాగురించిమాత్రమే మాట్లాడుతున్నాను. మన వూళ్లోని ముస్లిములు మనకేమి అపకారం చేసేరోచెప్పండి."

వాళ్ళు ముస్లిములు.

"అయితే!" మీట్‌సింగ్ అయిష్టంగా భుజాలెగరేస్తూ వాళ్ళముఖాల లోకి ప్రశ్నార్ధకంగా చూసేడు.

ఇక ఆ వాదనను ఆపుచెయ్యడం తన శక్తికిమించినపనని హెడ్మన్ అనుకున్నాడు. అయినా ప్రయత్నిద్దామనే సంకల్పంతో, ఇంతవరకూ మన గ్రామంలో మతకలహాలకు సంబంధించిన ఘోరాలేమీ జరగలేదు. అయినాసరే ఇటుపైని ఏం చెయ్యాల్సినదీ ఇప్పుడు మనం నిర్ణయించు కుందాము. దేవాలయం దగ్గరనున్న కాందిశీకులు ఏదైనా చెడ్డపనిచేసి మన గ్రామానికి చెడ్డపేరు తెస్తారేమోనని నాకు భయంగావుంది అని అన్నాడు.

ఏదైనా చెడ్డపని అనేమాట ఆ సమావేశంలో ఉద్రిక్తతను మరింత పెంపొందించింది. అయితే ఈ ఉద్రిక్తత స్వభావం మహాకరకమైనది.

ఎక్కడినుంచోవచ్చి తమ గ్రామస్తులకు హాని కలుగజెయ్యడానికి వాళ్ళ కెన్ని గుండెలుండాలి? తమ గ్రామస్తులెవరూ గాజులు తొడుక్కొని చేతకాని దద్దమ్మలలా కూర్చోలేదు: ఎవరో పైనుంచొచ్చి తమ గ్రామ స్తులకు హానిచేస్తూంటే చూస్తూ వూరుకోడానికి? ఈ రకమైన భావం అక్కడున్నవాళ్ళలో అధిక సంఖ్యాకులకు కల్గింది; వాళ్ళ తార్కికబుద్ధి స్థిరత్వాన్ని కోల్పోయింది. మూక మనస్తత్వం సాధారణంగా సబబూ సందర్భాలకు అతీతంగా వుంటూంటుంది.

ముస్లిములను పందులుగా అభివర్ణించిన యువకుడు ఉద్రిక్తుడై "మనం బతికుండగా మన ముస్లిమ్ రైతుల వెంట్రుక ముక్కయినా ఎప్పుడైనా తెంపగలడా?" అని అందరి ముఖాలలోకి చూస్తూ అడిగేడు.

"నువ్వు రెండు నాల్కల వాడిలాగున్నావు. ఇందాక ముస్లిములను చంపాలన్నావు. ఇప్పుడు వాళ్ళని కాపాడడంకోసం కాందిశీకుల్ని హత మారుస్తానంటున్నావు. మేము చెప్తున్నదొకటి. నువ్వంటున్నదొకటి!" అని గద్దించి అన్నాడు హెడ్మన్.

ఆ యువకుడు ఉడుకుమోత్తనంతో, "సరే మీరంతా మహా తెలివైనోళ్ళు. ఏంచెయ్యాలో మీరే సెప్పండి'' అని గొణిగేడు.

''సోదరులారా వినండి! మనం కోపోద్రిక్తులమవడానికిది సమయం కాదు. మనవూళ్లో ఎవరికీ ఎవర్నీ చంపాలనిలేదు. కాని పైనుంచొచ్చేవాళ్ళ మనస్సులలో ఏముంటుందో ఎవరికితెల్సు? ఇప్పుడు మన గ్రామంలో నలభై ఏభైమంది కాందిశీకులున్నారు. భగవత్కృపవల్ల వాళ్ళంతా శాంతంగానేవున్నారు. త్వరలో మరికొంతమంది శరణార్థులు మన గ్రామానికి రావడానికి అవకాశం లేకపోలేదు. ఆ వచ్చేవాళ్ళు పాకిస్తాన్‌లో తమ తల్లుల్ని, తండ్రుల్ని, అన్నదమ్ముల్ని, అక్కచెల్లెళ్ళను, భార్యలను, పిల్లలను కోల్పోయిన వాళ్ళు కావచ్చు. అలాంటివాళ్ళను మన గ్రామంలో అడుగు పెట్టనివ్వకుండా ఆటంకపరచగలమా? ఒకవేళ వాళ్ళను గ్రామంలోకి రానిస్తే వాళ్ళు మన గ్రామంలోగల ముస్లిములను చంపి, వాళ్ళ ఇళ్ళను, ఆస్తిపాస్తుల్ని దోచుకోవచ్చు. ఇందుకు వాళ్ళకు మన మవకాశమిస్తామా చెప్పండి." అని అందరి ముఖాలలోకీ నిశితంగాచూస్తూ అడిగేడు హెడ్మన్.

"అవును. నిజమే! ఈ విషయమై మనం బాగా ఆలోచించాలి." అని అన్నాడొక ముసలాడు. ఆ సమస్యగురించి వాళ్ళంతా ఆలోచించ సాగేరు.

"తలదాచుకోడానికి స్థలం ఇవ్వకుండా కాందిశీకుల్ని మన గ్రామంలోంచి పొమ్మనగలమా?"

పొమ్మన లేమనుకున్నారు.

"నిలువనీడలేని అనాథుల్ని ఆదరించే పవిత్ర సాంప్రదాయం మనది. తరతరాలనుంచి మనగ్రామంలో బ్రతుకుతున్న ముస్లిములందరినీ గ్రామం వదలి పాకిస్తాన్ పొమ్మనమని కోరగలమా?"

అలా కోరలేమనుకున్నారు వాళ్ళు.

స్వగ్రామస్థుల తరవాతే ఎవరైనా ఆదరాభిమానాల కర్హులనుకున్నారు వాళ్ళు. ద్వేషంతో ముస్లిములగురించి ఎన్ని మాటలన్నప్పటికీ- వాళ్ళను తమ గ్రామంలోంచి తగిలెయ్యాలనే సూచన చెయ్యడానికి ఎవరికీ నోరు రాలేదు; అక్కడున్నవాళ్ళంతా సిక్కులే అయినప్పటికీ- ఏం చెయ్యాదానికి వాళ్ళెవరికీ ఏమీ తోచలేదు.

కొంచెంసేపయేక హెడ్మన్ "మన ఇరుగు పొరుగు నగల గ్రామాలలోని ముస్లిములలో కొందరిని చుందున్నగ్గర్ సమీపంలోగల శరణార్థుల శిబిరానికి, మరికొందర్ని జలంధర్‌లోగల శరణార్థులశిబిరానికి తరలించుకు పోయేరు. కొంతమంది అప్పుడే పాకిస్తాన్ వెళ్ళిపోయేరు." అని అన్నాడు.

మరో వ్యక్తి కలుగజేసుకొని, "ఔను నిజమే; కాపూరా, గుజ్జోమట్టాలలోగల ముస్లిములంతా క్రిందటి వారంలోనే వెళ్ళిపోయేరు. ఒక్క మన మానోమజ్రాలోనే ఇంకా ముస్లిములున్నారు. వాళ్ళని వెళ్ళిపొమ్మనమని మనవూళ్లో ఎవడు చెప్పగలడో తెల్సుకోవాలని నాకుంది. ఓ సోదరులారా! మీరు మానోమజ్రాను వదిలిపెట్టి వెంటనే వెళ్ళిపోండి అని మీలో ఎవరైనా వాళ్ళకి చెప్పగలరా?" అనడిగేడు.

ఇంకా ఎవరూ ఏసమాధానము చెప్పకముందే- గుమ్మంవేపు నుంచి పొడిదగ్గు వినిపించింది.

అంతా వెనక్కుతిరిగి చూసేరు. గుమ్మంలో ఎవరోవ్యక్తి నిలబడు న్నాడు. ఆ చీకట్లో అతనెవరైనదీ ఎవరూ సరిగ్గా గుర్తుపట్టలేకపోయేరు.

కళ్ళపైపడుతున్న హరికేన్ లాంతరు కాంతికి చెయ్యి అడ్డంపెట్టు కొని, "ఎవరది? లోనికిరండి" అని అన్నాడు హెడ్మన్.

ఇమామ్‌బక్ష్ లోనికొచ్చేడు. అతనివెంట ఇద్దరు ముస్లిములుకూడా లోనికొచ్చేరు. కూర్చోడానికి వాళ్ళకి జాగాఇచ్చేరు. వాళ్ళు కూర్చున్నాక, ఇమామ్‌బక్ష్ ఏం చెప్పడానికొచ్చాడా అని అతని ముఖంకేసి చూస్తూ అంతా కూర్చున్నారు.

ఇమామ్‌బక్ష్ వేళ్ళతో తన గెడ్డాన్ని దువ్వుకుంటూ "సోదరులారా! మాగురించి మీరేమిటి మాట్లాడుకుంటున్నారు" అని రుద్ధకంఠంతో అడి గాడు. అంతా హెడ్మన్‌కేసిచూస్తూ మౌనంగా కూర్చున్నారు.

హెడ్మన్ గొంతుక సవరించుకొని, "మమ్మల్ని ఎందుకడగడం? ఇది ఏ విధంగా మా గ్రామమో అదేవిధంగా మీ గ్రామంకూడాను" అని అన్నాడు.

"మీరంతా వినేవుంటారు. ఈ చుట్టుప్రక్కల గ్రామాలలోవున్న ముస్లిములంతా ఆయా గ్రామాలు ఖాళీచేసేసి వెళ్ళిపోయేరని. ఇంకా ఈ గ్రామంలో మాత్రమే మేం వుండిపోయేము. మీరు మమ్మల్నికూడా వెళ్ళి పొమ్మంటే వెళ్ళిపోతాము" అని అన్నాడు ఇమామ్‌బక్ష్.

మీట్‌సింగ్ బాధగా నిట్టూర్చేడు. అక్కడ తను ఏంమాట్లాడినా ఇక ప్రయోజనముండదని గ్రహించేడు. ఇంతకీ తన ఉద్దేశ్యాన్ని తను ముందే చెప్పేశాడు. అదీగాక ఆ గ్రామస్థుల దయాధర్మ భిక్షపై బతుక

తున్న వ్యక్తి తను. అంచేత ఈ విషయంలో తను కలుగజేసుకోడం అంత మంచిపని కాదనుకున్నాడు.

ఓ యువకుడు గంభీరమైన కంఠంతో "ఇమామ్‌బక్ష్ తాతయ్యా! నాను సెప్పేదిను. మా‌(వు ప్రానాలతో బతికున్నంతవరకూ ఎవుడూ మీ ఒంటిమీద సెయ్యి ఎయ్యనేడు. ముందు మా‌(వు సావాల. ఆ తరువాత మీ పానాలను మీరు కాపాడుకోవాలి" అని అన్నాడు.

మరో యువకుడు పిడికిలి బిగించి ఉక్రోషంతో, "ఔను తాతయ్యా! ముందు మా‌(వు ఆ తరువాత మీరు. ఎవుడైనా మీకేసి కళ్ళెత్తిచూత్తె ఆడితల్లి శీలాన్ని చెడగొడతాం" అని అన్నాడు. ఆడి తల్లిని, సెల్లిని, కూతుర్ని, భార్యని ఏదో చేస్తామన్నాడు మరొకడు.

చొక్కాతో కన్నీళ్ళొత్తుకొని, ముక్కు ఎగబీల్చి, "పాకిస్తాన్ వెళ్ళి మేము బావుకొనేదేముందిగనక? మేమంతా ఇక్కడే పుట్టాము. మాపూర్వీకులంతా ఇక్కడే పుట్టారు. మీ అందరిమధ్యా మీ సోదరులలాగ మే‌(వు జీవిస్తున్నాము." రుద్ధకంఠంతో అన్నాడు ఇమామ్‌బక్ష్.

మీట్‌సింగ్ ఇమామ్‌బక్ష్‌ని కౌగలించుకొని, చిన్నపిల్లాడిలా వెక్కి వెక్కి ఏడవసాగేడు. చాలామంది ముక్కులెగబీలుస్తూ లోలోన రోదించసాగేరు.

"అవును, మీరంతా మా సోదరులే! మీరు, మీ ఆత్మీయులు మీ ఇష్టమొచ్చినంతకాలం ఇక్కడుండొచ్చు. ఇక్కడనుంచి మిమ్మల్ని వెళ్ళగొట్టే హక్కు ఎవ్వరికీలేదు. మేము బ్రతికున్నంతకాలం మీ తలలో వెంట్రుకనైనా ఎవడూ పూడపీకలేడు. కాని తాతయ్యా! మేము చాలా తక్కువమంది వున్నాము. పాకిస్తాన్‌నుంచి వేలకొద్దీ శరణార్థులు వస్తున్నారు. వాళ్ళేదయినాచేస్తే అందుకెవరు బాధ్యులవుతారు?" అనడిగేడు హెడ్మన్.

"ఔను ఇదికూడా ఆలోచించాల్సిన విషయమే! మనవల్ల మన ముస్లిమ్ సోదరులకు ఏ హానీ జరగదని మనం హామీ ఇవ్వగలం. కాని నిత్యం అసంఖ్యాకంగా వస్తున్న కాందిశీకులవల్ల ఏహానీ జరగదని హామీ ఇవ్వగలమా?'' అనడిగేరు కొంతమంది.

సరిహద్దునానుకొనివున్న కొన్ని గ్రామాలు, పాకిస్తాన్‌నుంచి వస్తోన్న వేలాది కాందిశీకులతో చుట్టుముట్టబడుతున్నాయని- వాళ్ళంతా తుపాకులు, బల్లేలు ధరించి వున్నారని విన్నాను. వాళ్ళనాపగలిగేశక్తి మనకు లేదేమోనని భయంగావుంది నాకు" అని అన్నాడొకడు.

ఆ వెంటనే మరొకడు, "ప్చ....! ఆఁ....! వాళ్ళకి భయపడేదేమిటి? వాళ్ళని రానివ్వండి మరెప్పుడూ మానోమ వ్రావేపు కన్నెత్తయినా చూడకుండా వుండేటట్టు గొడ్లను బాదినట్లుగా బాది తరిమేద్దాం!" అన్నాడు పౌరుషంగా. ఆ సవాలు తీవ్రమైనదిగా ఎవరూ భావించలేదు. ఎందుకంటే అది వట్టి శుష్కమైన బడాయి అని వాళ్ళకు తెలుసు.

ఇమామ్‌బక్ష్ మరోసారి ముక్కు ఎగబీల్చి, "సోదరులారా! అయితే మరి మమ్మల్ని ఏం చెయ్యమంటారు?'' అని ఆందోళనతో అడిగేడు.

హెడ్మన్ గద్గదిక స్వరంతో, "ఏం చెప్పడానికీ నాకు నోరు రాకుండా వుంది. ప్రస్తుతం మనం ఎదుర్కొంటున్న పరిస్థితుల్ని చూస్తూ వుంటే ఈ అలజడులు తగ్గేటంతవరకూ మీరంతా శరణార్థుల శిబిరంలో తలదాచుకోడం శ్రేయస్కరమేమో ననిపిస్తోంది నాకు'' అని అన్నాడు.

హెడ్మన్ చెప్పిన ఈ సలహా విన్నవెంటనే అంతా నిర్ఘాంతపోయేరు. తమ గుండెల్ని ఎవరో బలవంతంగా పిండుతున్నట్లుగా బాధపడసాగేరు వాళ్ళు. తనిచ్చిన సలహావల్ల అక్కడ సభాసదులలో జనించిన దుర్భర దౌర్భాగ్య పరిస్థితిని సాధ్యమయినంత త్వరలో తొలగించాలనే ఉద్దేశ్యంతో "వర్షాధిక్యతవల్ల పడవ ఆడడానికివీలు లేనంతఅధికంగా నదిపొంగి

పారుతోంది. ప్రకృతి అనుకూలంగాలేదు. ఉన్నట్లయితే మిమ్మల్ని మేమంతా కలిసి భద్రంగా అవతలి ఒడ్డుకు చేర్చేసి వుండేవాళ్ళం. రైలు బళ్ళపైన, రోడ్డు వంతెనలను దాటి వెళ్ళడం తప్పితే మరోమార్గం ఇప్పుడు లేదు. అలా వెళితే ఏం జరుగుతున్నదీ మీకందరకూ తెల్సినదే. అందుకనే మీ శ్రేయస్సుకోరి ఈ అలజడులు తగ్గేటంతవరకూ శరణార్థుల శిబిరంలో తలదాచుకొని, తరువాత రమ్మనమని సలహా ఇచ్చేను. నా ఈ సలహాలో దురుద్దేశం ఏదీలేదు.'' అని కొంచెంసేపాగి రుద్ధమవుతున్న గొంతుకనుసవరించుకొని, "ఈవూళ్ళో నివసించడానికే మీరు నిశ్చయించు కున్నట్లయితే మిమ్మల్ని మేము హృదయపూర్వకంగా స్వాగతిస్తాము. మీ శ్రేయస్సుకోసం మాప్రాణాలనయినా త్యజించడానికి మేము వెనుదియ్యాము'' అని అన్నాడు.

ఆ హెడ్మన్ చెప్పిన సలహా ఎవ్వరికీ ఏ విధమైన అనుమానాలను కలుగజెయ్యలేదు. అది తమ ముస్లిమ్ సోదరుల శ్రేయస్సుగోరి ఇచ్చిన యుక్తమయిన సలహాగానే వారంతా భావించేరు. ఇమామ్‌బక్ష్ లేచి నిల బడే టంతవరకూ అంతా తలలు దించుకొని కూర్చున్నారు.

ఇమామ్‌బక్ష్ బాధగా ఓసారి ఊపిరితీసి, "సరే మేము వెళ్ళక తప్పకపోతే ఇహ మా సామాన్లను సర్దుకోవలిసుంటుంది. మా తాత ముత్తాతల నాటినుంచీ భద్రంగా కాపాడుకుంటున్న వస్తువుల నన్నింటినీ తీసుకుపోవడానికి వీలుగా మూటలు కట్టాలి అంటే ఈ రాత్రంతా చాలదు'' అని అన్నాడు.

ఇమామ్‌బక్ష్ అలా అనేసరికి హెడ్మన్ మరి దుఃఖాన్ని దిగమ్రింగు కోలేక పోయేడు. ఇమామ్‌బక్ష్‌ని కౌగలించుకొని బిగ్గరగా ఏడ్వసాగేడు. సిక్కులు, ముస్లిములు పరస్పరం చేతులు పట్టుకొని చిన్నపిల్లల్లాగ ఏడ్వసాగేరు. ఇమామ్‌బక్ష్ హెడ్మన్ కౌగిలిని మెల్లగా విడిపించుకొని,

"ఇప్పుడు ఏడ్వవలసిన అవసరమేలేదు. ఈ లోకంలో ఇటువంటి సంఘటనలు సహజమైనవే! ఈ లోకం తీరేయింత.

"స్నిగ్ధచ్ఛాయా నికుంజ నిశ్చలములైన
బుల్బులిపాటలు శాశ్వతములె
ఆమని ఏరీతి ననంతమగును
కందళింపవు సుమములు కలకాలమిటుల
సుఖమె సామ్రాజ్యమేలదు శాశ్వతముగ
దివ్య దివాప్రభాకరుం డంబుధింగ్రుంకు
కావి స్నేహానురాగం బశాశ్వతముకాదు
ఈ దివ్యసత్య మవగతముకానినాడు
జీవిత సత్యమెవండును ఎరుగలేడు."

అని అన్నాడు.

"ఈ దివ్యసత్య మవగతముకానినాడు జీవితసత్య మెవండును ఎరుగలేడు" అని నిట్టూర్పులతో అంతా బిగ్గరగా అన్నారు.

"అవును తాతయ్యా! నువ్వు చెప్పినది నిజం. జీవితమంటే ఇంతే అని కన్నీళ్ళొత్తుకుంటూ అన్నారు.

ఇమామ్‌బక్ష్, అతనిసహచరులు కన్నీళ్ళు ఒత్తుకుంటూ వెళ్ళిపోయేరక్కడనుంచి.

ఇమామ్‌బక్ష్ తన ఇంటికి వెళ్ళేడు. మసీదు నానుకొనివున్న ఓచిన్నగుడిసె అతని ఇల్లు. నూరాన్ నిద్రపోతోంది. గోడలో వున్న గూటిలో బుడ్డిదీపం వెలుగుతోంది.

నూరాన్ భుజం పట్టుకొని ఇటూ అటూ కుదుపుతూ, "నూరో! నూరో! లేవే!" అని బిగ్గరగా అరుస్తూ ఆమెను లేపేడు.

నూరాన్ కళ్ళుతెరచి, "ఏం? ఎందుకు?" అని అడిగింది.

"లేచి సామాన్లన్నీ సర్దు. మనం రేపుదయం వెళ్ళిపోతున్నాము." అని అన్నాడు నాటకంలోని పాత్రధారిలా.

"వెళ్ళిపోతున్నామా? ఎక్కడికి?"

"నాకు తెలీదు. బహుశా పాకిస్తాన్ కావొచ్చు."

ఆమాట వినేసరికి ఏదో దెబ్బతిన్నదానిలా గబుక్కున మంచం మీదనుంచి క్రిందకుదిగి, "నేను పాకిస్తాను రాను" అని ఖచ్చితంగా చెప్పేసింది.

ఆమె చెప్పినది తనకు వినబడనట్లు నటిస్తూ, "బట్టలన్నీ ట్రంకు పెట్టెలలో సర్దు. వంటసామాగ్రి అంతా ఓ గోనెసంచీలోపెట్టి, గట్టిగా త్రాడుకట్టు. మన గేదెకు కావలసిన చిట్టు, తౌడు,పులవలు ఇలాంటివికూడా మూటలు కట్టు. గేదెనుకూడా మనతోపాటు తీసుకుపోదాం" అనిఅన్నాడు.

భీతితో తల్లడిల్లిపోతూ, "నేను పాకిస్తాన్ రాను." అని బిగ్గరగా అరచింది నూరాన్.

"రావడానికి నీకిష్టంవున్నా లేకపోయినా నిన్నిక్కడ వాళ్ళు వుండనివ్వరు. తగిలేస్తారు. ఈ గ్రామంలోని ముస్లిములంతా రేపు శిబిరానికి వెళ్ళనిశ్చయించుకున్నారు."

"ఈ ఊరునుంచి మనల్ని ఎవరు తగిలేస్తారు? ఇది మనూరు. ప్రభుత్వాధికారులు, పోలీసులు చచ్చేరా?"

"నూరో తెలివితక్కువగా మాట్లాడకు. నేను చెప్పినట్లుచెయ్యి. వేలాది ప్రజలు పాకిస్తాన్‌కి పోతున్నారు. అలాగే వేలకొద్దీ ప్రజలు పాకిస్తాన్‌నుంచి వస్తున్నారు. వెళ్ళకుండా ఉండిపోయిన వాళ్ళని దారుణంగా చంపుతున్నారు. వేగిరం సామాన్లన్నీ సర్దు. నేను మన ముస్లిములకంద

రికీ రేపు బయలుదేరడానికి సిద్ధంగా వుండమని చెప్పివస్తాను.'' అని వెళ్ళిపోయేడు.

ఏం చెయ్యడానికీ నూరాన్‌కి తోచలేదు. ఆ రాత్రి ఎవ్వరికీ అగుపించకుండా ఎక్కడైనా పారిపోయి సురక్షితమైన స్థలంలో దాంగొని మానో మజ్రా నుంచి ముస్లిములంతా వెళ్ళిపోయేక తిరిగొస్తే బాగుండుననిపించిందామెకు. కాని ధైర్యంచాలింది కాదామెకు. అదీకాక అప్పుడు వర్షం బాగా పడుతోంది.

జగ్గా వస్తాడేమోననే చిన్న ఆశ ఆమెకింకా వుంది. పోలీసువారు మల్లిగాడిని వదిలేశారు. జగ్గానికూడా బహుశా వదిలేస్తారని ఆమె విశ్వసిస్తోంది. జగ్గా నిర్దోషి: ఆ సంగతి ఆమెకు బాగాతెల్సు: జగ్గాని ఈసరికి వదిలేసుంటారేమోననే అనుమానం కల్గడంచేత, ఆ చీకట్లో ఆ వర్షంలో తడుసుకుంటూ జగ్గా ఇంటికేసి బయలుదేరిందామె.

గ్రామస్తులంతా మేల్కొనేవున్నారు. ముస్లిములంతా తమ తమ సామాన్లను పట్టుకెళ్ళడానికి పీలుగా మూటలు కడుతున్నారు. ఎవరి ముఖంలోనూ సంతోషంలేదు.

నూరాన్ సందుగొందులన్నీదాటుకొని తిన్నగా జగ్గా ఇంటికెళ్ళింది. తలుపుగుద్దింది. నాలుగైదుసార్లు గుద్దింది. సమాధానంరాలేదు. అప్పుడామె ఆ గుడ్డి వెలుగులో బయటగొళ్ళెం వేసున్నట్లుగుర్తించింది. తన ముస్లిమ్ స్నేహితులను కలుసుకోడానికి జగ్గాతల్లి అలా వూళ్ళోకెళ్ళుంటుందని నూరాన్ అనుకుంది. గొళ్ళెంతీసి లోనకెళ్ళింది. ఆకొంపలో దీపంలేదు. ఆ చీకటింట్లో ఓమంచంమీద దుఃఖంతో కుమిలిపోతూ కూర్చుంది.

తనకుతానుగా ఒంటరిగా జగ్గా తల్లి ఎదుట పడడానికామెకు కాళ్లు రాలేదు. జగ్గా వస్తాడేమోననే ఆశమాత్రం ఆమెలో ఇంకా మిగిలివుంది. ఒకదాన్నొకటి వెంట తరుముతూ పోతున్న కారుమేఘాలకేసి చూస్తూ

అక్కడ అలాగే కూర్చుందామె. తెరలుతెరలుగా వాన జల్లులను కురిపిస్తూ ఆ మేఘాలు హడావుడిగా వెళ్ళిపోతున్నాయి.

ఓ గంటసేపయేక ఎవరివో అడుగుల చప్పుడు వినిపించింది నూరాన్‌కి. ఆ చప్పుడు తలుపువరకూవచ్చి ఆగిపోయింది. తలుపు తీసుండడం చూసి "లోపలెవరు?" అని అడిగిందొక ముసలమ్మ. ఆమె జుగ్గా తల్లి. నూరాన్ గొంతుక మూగవోయింది. ఆమె భయంతో కంపించిపోసాగింది.

"ఎవరునువ్వు?" గద్దించి అడిగిందామె.

నూరాన్ లేచి నిలబడి,"బీబీ!" అని అస్పష్టంగా గొణిగింది.

ఆ ముసలమ్మ లోనకొచ్చి గబుక్కున తలుపేసేసి, "జుగ్గా!జుగ్గా! నువ్వా? నిన్ను పోలీసోళ్ళు వొగ్గేశారా?" అని సంభ్రమాశ్చర్యాలతో మెల్లగా అడిగింది.

"ఊహూ! నేను జుగ్గానుకాను.నేను....నేను....నూరాన్ని. ఇమామ్ బక్ష్ కూతుర్ని" అంది కంపితస్వరంతో.

"నువ్వా! ఈ వేళప్పుడిక్కడి కెందుకొచ్చావు?" అనడిగిందామె కోపంగా.

"జుగ్గా తిరిగొచ్చేదా?"

"జుగ్గాతో నీకేటిపని? అసలు మా జుగ్గా జైల్లోపడ్డానికి నువ్వేకారణం. అసలింతకీ మీ అయ్యకు తేల్సా?. అర్ధరాత్రేల అడ్డమైనవాళ్ళతోను నువ్వు రంకుబోతున్నావని?"

జుగ్గాతల్లి అలా అనంగానే నూరాన్ మరీ దుఃఖాన్ని దిగమ్రింగుకోలేకపోయింది. చిన్నపిల్లలాఏడుస్తూ, "మేము రేపువెళ్ళిపోతున్నాము" అనంది. ఆ ముసలమ్మ హృదయం కరుగలేదు.

"అయితే ఏటంటావు? మీ ఇట్టమొచ్చినకాడికి మీరెల్లిపొండి. ఇంతకీ మీకూ మాకూవున్న సంబంధం ఏటి? మహా పెద్ద చెప్పొచ్చినావు ఎల్తున్నామని."

"నేనెళ్ళను. జుగ్గా నన్ను పెళ్ళి చేసుకుంటానని వాగ్దానంచేసేడు."

"ఎల్లెల్లే పింజారినంజా! ముస్లిమ్ సాలోడి కూతుర్ని సిక్కురైతు పెల్లాడ్తమా? మల్లీ ఆ మాటన్నావంటే పీపీక పిసికేత్తాను. నువ్విక్కడ నుంచి ఎంటనే ఎల్లిపో. నేదా మీ అయ్యకి, ఊరందరికీ సెప్పేత్తాను. మా జుగ్గాని ఏదోఇలా గిక్కడుందనిచ్చి నువ్వు పాకిస్తాన్ ఎల్లిపోవే నంజా!" నాగుపాములా బుస్ మందా ముసలమ్మ.

నూరాన్ వెక్కి-వెక్కి ఏడుస్తూ, "సరే బీబీ! నేనెళ్ళిపోతాను. నన్ను కోప్పడకు. జుగ్గా జైలునుంచితిరిగొచ్చినవెంటనే నేనతనికి అంతిమ నమస్కారం చెయ్యడానికి వచ్చేనని చెప్పు." అనంటూ ఆ ముసలమ్మ కాళ్ళు పట్టుకొని, "బీబీ! నేను వెళ్ళిపోతున్నాను. మరెప్పుడూ తిరిగిరాను. వెళ్ళిపోయేముందు నాపట్ల మరింత కఠినంగా వ్యవహరించకు. దయతో నన్ను సాగనంపు" అనంది దీనంగా.

జుగ్గాతల్లి అలా బిఱ్ఱబిగుసుకుపోయి నిలబడుంది. ఆమె ముఖంలో ఏరకమైన భావమూ ద్యోతకమవలేదు. కాని లోలోన ఆమె అంతరంగంలో కొంచెం మార్పు వచ్చింది. ఆమె హృదయం కాస్త మెత్తబడింది. "జుగ్గావస్తే చెప్తానులే" అనంది.

నూరాన్ దుఃఖాన్ని దిగమ్రింగుకోడానికి ప్రయత్నిస్తోంది. ఏడవడం మాని ఉండుండి చిన్నపిల్లలా వెక్కుతోంది. తన తలను ఆ ముసలమ్మ పాదాలకు తాకించి, "బీబీ!" అని పిలిచింది రుద్ధకంఠంతో.

"ఏటి? ఇంకేటి సెప్పదల్చుకున్నావు?" కాస్త కటువుగానే అడిగింది. మనసు మెత్తబడుతుందేమోననే భయంతో ముందు జాగ్రత్తకోసం బింకం సడలించకుండా ఇంకా కటువుగానే వుందామె.

"బీబీ!"

వినుగ్గా, "బీబీ బీబీ బీబీ—! మరేం చెప్పడానికి నోరు రావటం లేదా? ఆ చెప్పదల్చుకున్నదేదో త్వరగా చెప్పు." అనంటూ నూరాన్‌ని వెనక్కి ఓ నెట్టు నెట్టింది.

నూరాన్ గొంతుక సవరించుకొని- "బీబీ! ఇప్పుడు నేను పట్టిమని పిల్ని కాను. గర్భిణిని. జుగ్గా శిశువు నా గర్భంలో పెరుగుతోంది. నేను పాకిస్తాన్ వెళ్ళిపోయినట్లయితే, అక్కడ నాబిడ్డకు తండ్రి ఓ సిక్కు అని తెలుస్తే నాబిడ్డని వారు చంపేస్తారు!" అని ఎలాగో ధైర్యాన్ని కూడగట్టుకొని చెప్పింది.

జుగ్గా తల్లి నూరాన్ జుత్తు పట్టుకొని తన పాదాలపై పడేటట్లు ఆమెను ముందుకు ఒక్క లాగులాగింది ఓ ఉన్మాదినిలా! నూరాన్ ఆమె పాదాలను పట్టుకొని మళ్ళీ బావురుమని ఏడ్వసాగింది.

"ఎన్నో నెల?" నెమ్మదిగా అడిగింది జుగ్గాతల్లి.

"రెండో నెల"

నూరాన్ని మెల్లగా లేవనెత్తి మంచంమీద కూర్చోబెట్టి, తనూ ఆ ప్రక్కనే కూర్చుంది. నూరాన్ దుఃఖాన్ని దిగమ్రింగుకోడానికి ప్రయత్నిస్తోంది.

జుగ్గాతల్లి కొంచెంసేపు ఆలోచించి, "నిన్ను నానిక్కడ వుండనివ్వదల్చుకోలేదు. పోలీసోళ్ళబెడద నాకిప్పటికే జాస్తిగావుంది. ఈ అలజడులన్నీ తగ్గాక, మా జుగ్గావొచ్చేక, నువ్వెక్కడున్నాసరే అడే తీసుకొచ్చి ఏలుకుంటాడు. అది సరేగాని మీ అయ్యకు తెల్సా ఈ సంగతి?" అనడిగింది.

"తెలీదు. తెలిస్తే నన్ను ఇంకెవడికో ఇచ్చి పెళ్ళిచెయ్యడంగాని, చంపెయ్యడంగాని చేస్తాడు." అనంటూ మళ్ళీ ఏడవడం మొదలెట్టింది.

"ఏహే! ఎందుకూరికే అలాగేడుస్తావు? పల్లకూరుకో! ఆ ఎధవపని సేసేముందు ఈలాగవుద్దని ఎందు కాలోసించనేదు నువ్వు? అడదానివి గందా బుద్ధుండొద్దు? ఇంతకీ నీకు సెప్పేనుగా మా జుగ్గావొచ్చిన వెంటనే ఆడికి సెప్తానులే. నువ్వెక్కడున్నా సరే ఆడు నిన్నుతీసుకొస్తాడు."

నూరాన్ ఏడుపు మాని, "బీబీ! జుగ్గావస్తే వేగంగా పంపిస్తావు కదూ?" అని నిస్సహాయంగా ఆమెకేసి చూసింది,

"ఆడొచ్చిన వెంటనే నాను సెప్పినా సెప్పకపోయినా ఆడే నీ కోసం పరుగెత్తుకొని వస్తాడు. నువ్వాడికి దక్కకపోతే ఆడు పెల్లాన్ని డబ్బిచ్చి కొనుక్కోవాల. అప్పుడు ఇంట్లో పూచికపుల్లకూడామాకుమిగల్దు. ఇంట్లో వున్నవన్నీ అమ్మేయాల. మరేటనుకున్నావు? భయం నేదులే. జైలు నుంచొచ్చినవెంటనే ఆడే నిన్నెతుక్కుంటూవస్తాడు. భయపడకు" అని ధైర్యం చెప్పింది.

జుగ్గాతల్లి అలా అనేసరికి నూరాన్ మనస్సులో అస్పష్టమయిన చిన్న ఆశాకిరణం తళుక్కున మెరసింది. అప్పుడే తనా ఇంటికోడలయి పోయినట్లు, ఆ ఇల్లు, తను కూర్చొనివున్న మంచం, గేదె, ఆ ఇంట్లోగల సామానులు, అన్నీ తన స్వంతమయిపోయినట్లు భావించింది నూరాన్. తనకు పెళ్ళయిపోయినట్లు వెల్లడి చేసెయ్యాలనుకుంది. కాని తనతండ్రి గుర్తుకొచ్చేసరికి ఆమె వెర్రిమొర్రి ఆశలన్నీ ఉఫ్‌న గాలికెగిరిపోయేయి. అతి సులభంగా కోపం తెచ్చుకొనే స్వభావంగల ఆ ముసలమ్మ పాదాలకు వంగి నమస్కరించి "బీబీ! వెళ్ళి సామాన్లు సర్దుకోవాలి. నన్ను హృదయ పూర్వకంగా దీవించి పంపు." అని కొంచెంసేపు వూరుకొని, "వీలయితే మళ్ళీ ఉదయం మరోసారి నమస్కరించడానికి వస్తాను." అని నూరాన్ వెళ్ళిపోయింది.

నూరాన్ వెళ్ళిపోయేక జగ్గా తల్లి చీకట్లోకి జీవచ్ఛవంలా చూస్తూ ఆ మంచంమీద ఎంతోసేపలా కూర్చుంది. ఆనాటి రాత్రి మానోమజ్రాలో అర్ధేమంది నిద్రపోలేదు.

ఆ గ్రామంలోగల సిక్కులు, ముస్లిముల ఇళ్ళకు వెళ్ళి, తమతమ ప్రేమాభిమానాలను వ్యక్తంచేసి వాళ్ళు ఊరువిడచి వెళ్ళిపోతున్నందుకు తామెంతగా బాధపడుతున్నదీ కన్నీళ్ళతో తెలియజేసేరు. ఈ దురదృష్టకరమైన పరిస్థితులన్నీ త్వరలోనే చక్కబడతాయని, మళ్ళీ తామంతా కలుసుకొని యథాప్రకారంగా ఉంటామని ధైర్యంచెప్పేరు.

ఇమామ్‌బక్ష్ ముస్లిములందరి ఇళ్ళకూవెళ్ళి ప్రయాణానికి సిద్ధమవమని చెప్పి, ఇంకా నూరాన్ ఇంటికి చేరకముందే తను ఇంటికి చేసుకున్నాడు. ఇంట్లో ఎక్కడున్న సామాన్లు అక్కడేవున్నాయి. కూతురుపై కోపం తెచ్చుకొనేపాటి శక్తయినా అప్పుడతనికి లేదు. మానసికంగా అప్పుడతను కృంగిపోయాడు. ఎన్నో తరాలనుంచీ నివసిస్తున్న గ్రామాన్ని వదలి వెళ్ళిపోడానికి పిల్లలకీ పెద్దలకీ అందరికీ బాధగానే వుంటుంది. ఆఖరిసారిగా తమ స్నేహితురాళ్ళను కలుసుకోడానికి నూరాన్ వెళ్ళుంటుందనుకున్నాడు ఇమామ్‌బక్ష్. గోనెసంచుల్ని, ట్రంకుపెట్టెల్ని, డబ్బాలను బయటకుతీసి సామాన్లను పేక్‌చెయ్యాలనుకున్నాడు. అంతల్లో నూరాన్ లోపలకొచ్చింది.

"నీ స్నేహితురాళ్ళందర్నీ చూడ్డం అయిందా? మనం నిద్రపోయే ముందుగా సామానులన్నింటినీ బస్తాలలోను, పెట్టెలలోను డబ్బాలలోను సర్దాలి" అన్నాడు ఇమామ్‌బక్ష్.

"నువ్వు బాగా బడలిక చెందివున్నావు. సామాన్లు నేనుసర్దుతానులే. నువ్వెళ్ళి పడుకో" అనంది నూరాన్.

మంచంమీద కూర్చొని, "అవును నిజమే! నాకు కొత్త బడలిక గానేవుంది. ప్రస్తుతం బట్టలన్నీ పెట్టెలోసర్దు. ప్రయాణసమయంలో తిన దానికేదయినా వండుకున్నాక రేపుదయం పాత్రసామగ్రంతా బస్తాలలో మూటకడదాం" అని చెప్పి కాళ్ళు చాచుకొని మంచంపై పడుకొని చాలా వేగంగా నిద్రపోయేడు. తన చిన్నప్పటినుంచీ వున్న ఓ పాత ఇనుప ట్రంకుపెట్టెలో తన బట్టల్ని, తండ్రి బట్టల్ని సర్దింది.

ఆ తరువాత పొయ్యిలో నిప్పురాజేసి మర్నాటి భోజనంకోసం కొన్ని చపాతీలు తయారుచేసింది. ఆ తరువాత పాత్రసామాగ్రిని, తదితర సామాన్లను గోనెబస్తాలలో పేక్ చేసింది. ఇహ తన తలగడా, బొంత, దుప్పటి, తన తండ్రి తలగడా, బొంత, ఓ దుప్పటి ఓ బెడ్డింగ్‌లా చుట్ట చుట్టి త్రాళ్ళతో కట్టాల్సుంది. ఆ పని ఉదయం చెయ్యొచ్చు. గేదెపై మంచాన్ని పెట్టి దానిపై ఈ సామాన్లుంచి తీసుకుపోవచ్చనుకుందామె.

ఏకధారగా కురుస్తున్న వర్షపు హోరుకు, చల్లదనానికి, చాలారాత్రి వరకూ నిద్రపోకుండా మేల్కొనివున్న వాళ్ళకు ఓ కునుకు పట్టింది. మోటారు హారన్ల శబ్దం వినిపించేసరికి అందరికీ తెలివొచ్చేసింది.

ఆ వర్షంలో, బురదలో పెద్దగొడవచేసుకుంటూ ట్రక్కులువచ్చేయి. ఊరుబయట అన్నీ వరుసగా ఆగేయి. ఆ ట్రక్కుల ముందొక జీపు నిలబడింది. దానికొక లౌడ్‌స్పీకరు తగిలించబడింది. దాంట్లో ఇద్దరు ఆఫీసర్లు ఉన్నారు. ఆ ఆఫీసర్లిద్దరిలోను ఒకడు రాశసిక్కైను వచ్చేక కర్రలు, కిరస నాయిలు పట్టుకెళ్ళడాని కొచ్చిన సిక్కు ఆఫీసరు, రెండోవాడొక ముస్లిమ్ ఆఫీసరు.

ఆ జీపు వెనకాల పన్నెండు ట్రక్కులున్నాయి. ఒక ట్రక్కు పూర్తిగా పఠాన్ సోల్జర్లతో నిండివుంది. మరో ట్రక్కు పూర్తిగా సిక్కు

సోల్జర్లతో నిండివుంది. వాళ్ళంతా స్టెన్‌గన్సు ధరించి వున్నారు. మరీ సన్నని సందుగొందులుండడంచేత ట్రక్కు ఊళ్ళోకి వెళ్ళలేకపోయాయి.

ఆ ఆఫీసర్లు మాత్రం జీపులో తిన్నగా ఊరుమధ్యనున్న రావి చెట్టు క్రిందకెళ్ళి, అక్కడ దాన్ని ఆపి క్రిందకు దిగారు. సిక్కు ఆఫీసరు ఓ గ్రామస్థుణ్ణి పిలిచి, హెడ్మన్‌ని తీసుకురమ్మన్నాడు. ముస్లిమ్ ఆఫీసరు పఠాన్ సోల్జర్లని పిలిచి, వాళ్ళని ముగ్గురేసి చొప్పున విభాగించి, ప్రతి ముస్లిమ్ ఇంటికీ వెళ్ళి వాళ్ళని వేగంగా ప్రయాణానికి సిద్ధం చెయ్యమని పని పురమాయించాడు.

"ముస్లిములంతా వెంటనే బయలుదేరండి. ట్రక్కులు బయలుదేర డానికి సిద్ధంగా వున్నాయి. ఊఁ! వేగంగా బయలుదేరండి. ముస్లిములంతా మూటాముల్లె సర్దుకొని వేగంగా బయలుదేరండి." అనేలౌడ్‌స్పీకరు ధ్వని ఆ గ్రామమంతా ప్రతిధ్వనించింది. నెమ్మదిగా ముస్లిములు తమతమ ఇళ్ళ లోంచి బయటకురాసాగారు.

మంచాలతోను, బెడ్డింగులతోను, ట్రంకుపెట్టెలతోను కిరసనాయిలు టిన్నులతోను, మట్టి కుండలతోను, పాత్ర సామాగ్రితోను బళ్ళనునింపి, వాటని ట్రక్కుల దగ్గరకు కొందరు తోలుకుపోతే, మరి కొందరు పశు వుల్ని తోలుకుంటూ, భారంగా అడుగులు వేస్తూ, తమ గ్రామంకేసి దీనంగా చూస్తూ, ట్రక్కులదగ్గరకు చేరుకున్నారు. వాళ్ళకు వీడ్కోలివ్వ డానికి ఆ గ్రామంలోగల సిక్కులంతా అక్కడికి వచ్చారు. ముస్లిములంతా ట్రక్కుల దగ్గరకు చేరుకున్నాక ఆ ఆఫీసర్లిద్దరూ గ్రామాధికారితో ఏదో మాట్లాడుతూ నెమ్మదిగా నడుచుకుంటూ ట్రక్కులదగ్గరకొచ్చారు. వాళ్ళ వెనకాలే నెమ్మదిగా జీపుకూడా అక్కడకొచ్చి ఆగింది.

ఆ ముస్లిమ్ ఆఫీసరు గ్రామ హెడ్మన్‌తో, "ఈ ఎద్దుల బళ్ళను, పశువులను, ఇన్నోటి సామాన్లను తీసుకెళ్ళడానికి ప్రస్తుతం మేము ఏ

అరేంజిమెంట్సు చెయ్యలేదు. వీళ్ళందరినీ కొద్దుదారిని నడిపించి పాకిస్తాన్ తీసుకెళ్ళడానికి మేము రాలేదు. వీళ్ళందర్ని మొదట చుందున్నగర్ శరణార్థుల శిబిరానికి చేరుస్తాము. అక్కడినుంచి ట్రైనులో లాహోరు తీసుకెళతాము కేవలం బట్టలు, బెడ్డింగులు, డబ్బు, ఆభరణాలు మాత్రమే ఇప్పుడు వాళ్ళు తీసుకెళ్ళడాని కవకాశముంటుంది. మిగిలిన వాటన్నింటినీ ఇక్కడ వదిలివేయమని వాళ్ళకు చెప్పు. వాటిని భద్రపరుస్తామని వాళ్ళకి నువ్వు వాగ్దానం చెయ్యి!" అని అన్నాడు.

మానోమజ్రా గ్రామానికి చెందిన ముస్లిములంతా అతిత్వరలోనే పాకిస్తాన్ పంపివేయబడుతున్నారనే విషయం ఆ గ్రామాధికారికి అప్పుడే తెల్సింది. అలజళ్ళు తగ్గేటంతవరకూ వాళ్ళని శరణార్థుల శిబిరంలో అట్టి పెట్టుంచడానికి తీసుకెళుతున్నారనుకున్నాడేగాని, పాకిస్తాన్ పంపించివేసే ఉద్దేశంతో తీసుకెళుతున్నారనుకోలేదు. తమ ముస్లిమ్ సోదరులను పాకిస్తాన్‌కి పంపి వేయనున్నారనే విషయం తెలిసేసరికి, ఆ గ్రామాధికారి హృదయం తీవ్రమైన బాధతో క్షోభించసాగింది.

ఆ ముస్లిమ్ ఆఫీసరుకేసి నిస్సహాయంగా చూస్తూ రుద్ధకంఠంతో, "బాబూ! ఏం చెప్పమంటారు? ఏదో ఒకటి రెండురోజుల పాటయితే వాళ్ళ వస్తు సామాగ్రిని భద్రంగా కాపాడగలము. కాని తాము వాళ్ళను పాకిస్తాన్ తీసుకుపోతే వాళ్ళు తిరిగి రావడానికి కనీసం కొన్ని మాసాలు పట్టొచ్చు! డబ్బు పాపిష్టిది బాబూ! అన్నాళ్ళపాటు అది మాదగ్గరుంటే అది మామనస్సులను కలుషితం చెయ్యొచ్చు! అంచేత వాళ్ళ వస్తువులేవీ మేము భద్రపరచలేము. వాళ్ళ ఇళ్ళనుమాత్రం జాగ్రత్తగా చూస్తాం టాము" అని అన్నాడు.

ఆ ముస్లిమ్ ఆఫీసరు కోపంతో, "నీతో వాదించడానికి నాకిప్పుడు టైము లేదయ్యా! చూసేపుగా ఓ డజను ట్రక్కులు మాత్రమే నా ఆఫీ

నంలో వున్నాయి. వాటిలో బళ్ళను, పశువుల్ని ఎలా తీసుకెళ్ళడం?" అని అన్నాడు.

"తమకు మాపై ఎంత కోపమొచ్చినాసరే మేముమాత్రం మా సోదరుల ఆస్తిపాస్తుల్ని మాచేతుల్తో మేము తాకము. మమ్మల్ని వాళ్ళ శత్రువులుగా మార్చాలనా తమ ఉద్దేశ్యం?" అని కాస్త ధైర్యం తెచ్చు కొని అడిగాడు.

"వారేవ్వా! వారేవ్వా! వారేవ్వా! శహభాష్! నీధోరణి చాలా అద్భుతంగా వుందయ్యా! నిన్న వాళ్ళను మీరు చంపాలనుకున్నారనే భోగట్టా తెల్సింది మాకు! ఇవాళేమో వాళ్ళంతా మీ సోదరులని అంటున్నారు! రేపు మళ్ళీ మీమనస్సులు మారిపోవచ్చు!" హేళనగా నవ్వుతూ బిగ్గరగా అన్నాడా ముస్లిమ్ ఆఫీసరు.

"కెప్టెన్‌బాబుగారు! మమ్మల్ని ఇలా ఎత్తిపొడవకండి. మేము అన్నదమ్ములం! ఎప్పటికీ మేము అన్నదమ్ములమే!"

"సరే! సరే! ఇప్పుడెందుకీగొడవ? మీరంతా అన్నదమ్ములే! ఒప్పుకుంటానులే! కాని వీళ్ళ సామాన్లన్నీ తీసుకెళ్ళడం కుదరదు. మీ సర్దార్ ఆఫీసరుతోను, మీ గ్రామస్తులతోను నువ్వీ విషయం మాట్లాడుకో! నేను మా ముస్లిములకు నచ్చచెప్పుకుంటానులే!" అనంటూ జీపులోకెక్కి, "ఓ దజను ట్రక్కులు మిమ్మల్ని తీసుకెళ్ళడానికి సిద్ధంగా వున్నాయి. పాకిస్తాన్ వెళ్ళదల్చుకున్న వాళ్ళంతా ఓ పదినిముషాల్లో వాటిల్లో ఎక్కండి. మేమింకా మరికొన్ని గ్రామాలలోవున్న ముస్లిములను కూడా తరలించుకు పోవాల్సుంది. మీకు మీరుగా మొయ్యగలిగిన అత్యవసరమైన సామాన్లను మాత్రమే పట్టుకురావడానికి మీ కనుమతివ్వబడింది! మీ పశువుల్ని, బళ్ళను, మంచాల్ని, కుండల్ని, ఇంకా ఏమైనా పెద్దపెద్ద సామాన్లుంటే వాటన్నింటినీ ఈ గ్రామంలోగల మీ మీ స్నేహితుల ఇళ్ళలో వదిలిపెట్టి

రండి. మళ్ళీ ఎప్పుడైనా ఏదైనా అవకాశమొస్తే మీ ఈ సామాన్లనుతెచ్చి మీకప్పజెపుతాము. ఈ వ్యవహారం పూర్తిచేసుకోడానికి మీకు పదినిము షాలు టైమిస్తున్నాము. ఆ వెంటనే ట్రక్కులు బయలుదేరతాయి!" అని స్పీకరులో ప్రకటించాడు.

ఆ ప్రకటన విన్నవెంటనే ముస్లిములంతా తమతమ బళ్ళను వదిలి పెట్టి జీపుచుట్టూ మూగి, తమ సామాన్లను వదిలిపెట్టి రావడానికి తీవ్రంగా తిరస్కరించారు! ఆ ముస్లిం మిలటరీ ఆఫీసరు మళ్ళీ మైక్రోఫోన్ స్విచ్ ఆన్‌చేసి, "సైలెన్సు! సైలెన్సు! ఇదే నా ఆఖరి హెచ్చరిక: పదినిముషా లలో ట్రక్కు బయలుదేరతాయి! మీరు ట్రక్కులలో కెక్కినా ఎక్కక పోయినా నాకేం సంబంధంలేదు. ట్రక్కుమాత్రం పదినిముషాలలో బయలు దేరి తీరతాయి" అని ప్రకటించాడు.

ఈ ప్రకటనను సిక్కులు విని, సలహాకోసం సిక్కు మిలటరీ ఆఫీసరు దగ్గర కెళ్ళారు.

ఆ సిక్కు ఆఫీసరు వాళ్ళవేపు చూడనేలేదు. పైకిలేచివున్న తన షైనుకోటుకాలరు కేసి, బురదనీళ్ళలో నిలబడివున్న ట్రక్కులకేసి, పశు వులకేసి, బళ్ళకేసి, మనుష్యులకేసి తృణీకారభావంతో చూస్తూ నిలబడ్డాడు.

"సర్దార్‌బాబుగారూ! మా గ్రామ హెడ్మన్ చెప్పినదాంట్లో సత్యం లేదంటారా? ఇతరుల ఆస్తిని దగ్గరుంచుకోడం మంచిపనంటారా? అది అపార్థాలకు తావివ్వదంటారా?" అని ఎంతో దీనంగా అడిగాడు మీట్‌సింగ్.

ఆసిక్కు ఆఫీసరు మీట్‌సింగ్‌ని ఓసారి ఎగాదిగాచూసి, "భాయీజీ! ఇతరుల ఆస్తిపాస్తుల్ని, ఇతరుల పెళ్ళాలను, చెల్లెళ్ళను, కూతుళ్ళను ఏట్టి పరిస్థితులలోను ముట్టకూడదు. పాపం! నువ్వు చాలా అమాయకుడి లాగున్నావు. నీలాంటివాళ్ళను పాకిస్తాన్ పంపిస్తే అప్పుడు కొన్ని భయం

కరమైన సత్యాలను తెల్సుకోగలరు. అక్కడ మీ చెల్లెళ్ళను, తల్లులను, పెళ్ళాలను చెఱచి, మిమ్మల్ని దిగంబరులనుచేసి, కాలిబూట్లతో తంతూ, ముఖంమీద ఉమ్మతూ నడివీధుల్లో వూరేగించిననాడు, మీకు సరియైన ధర్మాధర్మ విచక్షణాజ్ఞానం కల్గుతుంది!" అని అన్నాడు.

అక్కడున్న సిక్కులందరి ముఖాలపైన చెప్పుతో కొట్టినట్లయింది ఆ సిక్కు ఆఫీసరు ఉపన్యాసం! కాని ఆ ఉపన్యాసంవిని వెనుకనుంచి ఎవరో చప్పట్లు కొట్టారు. అంతా వెనుదిరిగి చూసారు.

వాళ్ళెవరూ మానోమజ్రా వాళ్ళుకారు! మల్లిగాడు, వాడిసహచరులు సిక్కు దేవాలయానికి అంతకు తొలినాడొచ్చిన శరణార్థులు ఓ దగ్గర నిలబడున్నారు!

మల్లిగాడు కొంచెం ముందుకొచ్చి అదోలా నవ్వుతూ, "దయా ధర్మాలను ఈవూరోళ్ళకు పెట్టిందిపేరు! కాని నిజానికి ఆళ్ళగురించి ఆళ్ళే సూసుకోలేరు! ఇహ పైవాళ్ళగురించి ఆళ్ళేటిసూడగల్రు నామొకం! సర్దార్ బాబుగారూ! మరేం పరవాలేదు. ఈ ముస్లిముల ఆస్తిపాస్తుల్ని మాం(ఫు సూత్తాము. వాటి బాధ్యత మాకొదిలేయమని ఆ ముస్లిమ్ బడాబాబుగారితో సెప్పండి. ఈ వూరోళ్ళు ఈ సామాన్లను దోచుకోకుండా కాపాడ్డంకోసం మీ సిపాయిల్ని కొంతమందిని మాకు సహాయంగా వుంచండి." అని అన్నాడు.

మల్లిగాడు అలా అనేసరికి అక్కడ పెద్ద గంద్రగోళం బయలు దేరింది. ఆ గ్రామస్తులంతా గొంతెత్తి అరుస్తూ అటూ ఇటూ పరుగెత్త సాగారు! కొంతమంది ముస్లిమ్ మిలటరీ ఆఫీసరు దగ్గరకెళ్ళి అతన్ని చుట్టుముట్టేరు. అతను చెప్తున్నది వినిపించుకోకుండా, అతని ఆజ్ఞల్ని తిరస్కరిస్తూ ఎవరికి తోచిన సలహాలను వారివ్వసాగారు. దాంతో అతను సిక్కుసైనికులచే చుట్టుముట్టబడున్న సిక్కు ఆఫీసరుదగ్గర కొచ్చి,

"ముస్లిములు ఇక్కడ వదిలి పెట్టబోయే సామాన్లను వెనుకకు తీసుకు పోయే ఏర్పాట్లను మీరేమయినా చేశారా?" అనడిగాడు.

ఆ సిక్కు ఆఫీసరు ఇంకా ఏ సమాధానము చెప్పకముందే, ఓ పెద్ద గోలగా అన్నిప్రక్కలనుంచి ఎంతోమంది తమ అసమ్మతిని తెలియజేశారు: దాంతో ఆ సిక్కు ఆఫీసరు కిక్కురుమనకుండా నోరు మూసుకొని కూర్చున్నాడు.

ఆ ముస్లిమ్ మిలటరీ ఆఫీసరు తీక్షణంగా చూస్తూ, "అంతా నోరు మూసుకోండి" అని బిగ్గరగా అరచాడు. గోలకాస్త తగ్గింది.

"మరొక్క అయిదునిముషాలలో అంతాట్రక్కులలోకెక్కండి. ఒక మనిషి మొయ్యగలిగే బరువుకి మించినసామాను తీసుకురావడానికి ఎవ్వరికీ అనుమతి ఇవ్వబడదు. ఇష్టంలేని వాళ్ళంతా వుండిపోవచ్చు. ఇదే ఆఖరిసారి చెప్పడం." అని హెచ్చరించాడు.

సిక్కు మిలటరీ ఆఫీసరు నెమ్మదిగా పంజాబీ భాషలో, "అంతా తేలిపోయింది. ఈ ముస్లిముల పశువుల్ని, బళ్ళను, ఇళ్ళను, తదితరసామాన్లను ఈ ప్రక్క గ్రామంవాళ్ళు చూడ్డానికి ఒప్పుకున్నారు. నేనొక లిస్టు వ్రాయించి ఆ తరువాత మీకు పంపుతాను" అని అన్నాడు.

ఆ ముస్లిమ్ ఆఫీసరు ముఖంమీద అస్వభావికమైన నవ్వు గోచరించింది: మానోమజ్రా ముస్లిములు, సిక్కులు ఇహ చేసేదేమీలేక వాళ్ళకేసి నిస్సహాయంగా చూసేరు. తాము వదిలిపెట్టబోయే సామాన్లవిషయమై ఎవరిమటుక్కి వారు సురక్షితమైన ఏర్పాట్లు చేసుకొనేటందుకు వారికిక తగినంత వ్యవధికూడా లేకపోయింది: ట్రక్కులను డ్రైవర్లు స్టార్టు చేశారు. ఒకమనిషి మొయ్యగలిగేపాటి సామాన్లను పట్టుకొని చప్పున ట్రక్కులలోనికెక్కమని పఠాన్ సోల్జర్సు ముస్లిములనందరినీ తొందర చెయ్యసాగారు.

ఆ ముసురులో, ఆ బురదలో, ఆ గందరగోళంలో పఠాన్‌సోల్జర్లు తమ స్టెన్‌గన్ను యొక్క మడమలతో సిక్కుల వీపుమీదకొడుతూ గొర్రెలమందను తరిమినట్లు దూరంగా తరిమేశారు! ఇదేమిటీ ఘోర మన్నట్లు వాళ్ళు ఒకరిముఖాలొకరు చూసుకున్నారు!

దూరంనుంచే తమ అంతిమ నమస్కారాలను గట్టిగా కేకలేస్తూ పరస్పరం తెలియజేసుకున్నారు. అంతా ట్రక్కులో కెక్కడం పూర్తయేక, ఆ ముస్లిమ్ మిలటరీ ఆఫీసరు తన జీపులో ఓసారి ఆ ట్రక్కుచుట్టూతిరిగి అంతా సవ్యంగా వున్నట్లు సంతృప్తిచెందేక, సిక్కుఆఫీసరు దగ్గరకొచ్చి, "గుడ్‌బై" చెప్పాడు!

తమ ముఖాలలో ఏరకమైన ఆనందాన్నిగాని, ఉద్రేకాన్నిగాని అగుపడనీయకుండా ఇద్దరూ యాంత్రికంగా షేక్‌హాండ్ చేసుకున్నారు. జీపుని ట్రక్కుకి ముందుకు తీసుకుపోయి, మైక్రొఫోన్‌లో మరోసారి తాము బయలుదేరబోతున్నట్లు ప్రకటించి, "పాకిస్తాన్!" అని అరిచేడు. "శాశ్వతంగా వర్ధిల్లుగాక!" అని సోల్జర్లంతా ముక్తకంఠంతో నినదించారు. ఆ ట్రక్కు ఆ బురదదారిలోంచి చుందున్నగ్గర్‌కేసి బయలుదేరేయి. అవి కనుమరుగయేటంతవరకూ అక్కడే నిర్లిప్తంగా చూస్తూ నిలబడ్డారా గ్రామంలోని సిక్కులంతా.

14

వెనుదిరిగి పోబోతున్న గ్రామాధిగారిని, గ్రామస్తుల్ని ఆగ మన్నాడా సిక్కు మిలటరీ ఆఫీసరు. సిక్కుసోల్జర్లు వాళ్ళవెనకాల తుపాకులు పట్టుకొని నిలబడ్డారు. ముస్లిములు వదిలివెళ్ళిన ఆస్తిపాస్తులకు సంరక్షకుడిగా మల్లిగాడిని తాను నియమించడానికి నిశ్చయించినట్లు, ఎవరైనాసరే వాడిజోలికిగాని, వాడి సహచరులజోలికిగాని, వెళ్ళినట్లయితే కాల్చి చంపేస్తామని ఆ ఆఫీసరు హెచ్చరించేడు.

మల్లిగాడు, వాడి సహచరులు, శరణార్థులు కలిసి వాళ్ళసామాన్లను తమ స్వంతం చేసుకోసాగేరు. ఆనాటి ఉదయమంతా ఆ గ్రామీణులు తమతమ ఇళ్ళగుమ్మాలలో కూర్చొని- దిగాలుపడి నిరాశతోచూడసాగేరు: ముస్లిమ్ గృహాలలోకి చొచ్చి మూలమూలలా గాలిస్తున్న మల్లిగాడిముఠా వేపు, శరణార్థులవేపు, కాపలాగా నియమింపబడిన సిక్కుసోల్జర్లు అప్పుడప్పుడు వచ్చి వెళుతూండడం వాళ్ళు గమనించారు.

కఱ్ఱలతో నిర్దయగా బాదుతూ లాక్కుపోతున్నప్పుడు బాధతో జాలిగా అఱచే పశువుల అరుపులు వాళ్ళు వింటున్నారు. భీతావహమైన కోళ్ళ,బాతుల అరుపులు ఒకేఒకకత్తివేటుతో నిశ్శబ్దతలో లీనమయిపోవడం కూడా వాళ్ళు గమనిస్తున్నారు. కాని నిస్సహాయంగా కూర్చొని బాధగా నిట్టూర్చడంతప్ప మరేమీ చెయ్యలేకపోయారా గ్రామీణులు.

పుట్టకొక్కుల కోసమని నదికేసి వెళ్ళొచ్చిన ఓ గొర్రెల కాపరి నదిలో నీటిమట్టం బాగా పెరిగిందని తన గ్రామస్తులకు చెప్పేడు.

పెరగనీ! బాగా పెరగనీ! మానోమజ్రాను పూర్తిగా ముంచేయనీ పాపం బాగా పేరుకుపోయింది. ఇదంతా కొట్టుకుపోవాలి. మనతోపాటు మల్లిగాడిని, వాడిగేంగుని, శరణార్థుల్ని, సిపాయిల్ని, పశువుల్ని అన్నింటినీ ముంచేయని. రాక్షసులకన్నా అన్యాయంగా మనుష్యులుప్రవర్తిస్తున్న ఈ రోజుల్లో ఏదోవోలా చావడమే మంచిదనుకున్నారు వాళ్ళు! వాళ్ళ హృదయాలలో గూడుకట్టుకొనివున్న దుఃఖభారం, వాళ్ళ నిస్సహాయతను ఈవిధంగా వ్యక్తీకరింపజేసింది.

వర్షం ఏకధారగా కురుస్తోంది. నదిలో నీటిమట్టం అంతకంతకు పెరుగుతోంది. రెండుప్రక్కలా ఒడ్డులను వొరుసుకొని పారుతోంది. ఆ మధ్యాహ్నం మరోగ్రామస్తుడు సట్లెజ్‌నది దగ్గరకెళ్ళొచ్చి నది బాగా పొంగిపారుతోందని ఊరందరికీ చెప్పేడు. ఆసంగతి అంతకుముందే

వాళ్ళకు తెల్సుగనక అదేమంత విశేషమైన వార్తగా వాళ్ళు భావించలేదు. ఆ తరువాత మరొకడువచ్చి, నదిలో నీటిమట్టం అంతకంతకు పెరుగు తోందని చెప్పేడు. ఆ తరువాత మరొకడు, ఆ తరువాత మరొకడు ఇలా ఎంతోమంది నదిలో నీటిమట్టం పెరుగుతోందని చెప్పేరు.

ఇంతమంది చెప్పేసరికి హెడ్మన్ బంటాసింగుకు భయమేసింది. ఎక్కడైనా గండిపడే ప్రమాదం వుందేమో చూసొద్దామని నదిదగ్గర కెళ్ళేడు. నిజమే: నదిలో నీటిమట్టం బాగా పెరిగింది. రెండురోజులనుంచీ పడుతున్న వర్షంవల్ల కాకపోయినా, కొండలలో మంచుకరిగిన అనంతరం వర్షం పడడంవల్ల నీటిమట్టం అంత అధికంగా పెరిగుంటుందనుకున్నాడు. కాలువలగట్లకు వరదలవల్ల గండ్లు పడకుండా నిరోధించేటందుకై బహుశా కాలువలగేట్లు మూసేసుంటారని, మరో మార్గంలేక నీరంతా నదిలోంచే పారుతోందని భావించేడు బంటాసింగ్.

ఉవ్వెత్తుగా లేచిపడుతున్న అలలతో సుళ్ళుతిరుగుతూ, నురగలు కక్కుతూ ఉరకలువేసి మహోధృతంగా ప్రవహిస్తోన్న సట్లెజ్‌నదికేసి చూసేసరికి బంటాసింగ్ గుండెలో చిన్నగుబులు బయలుదేరింది. రాత్రి వేళ అంతా ఆదమరచి నిద్రపోతున్న సమయంలో గట్టుకి ఎక్కడో ఓ దగ్గర గండిపడి ఆనది తమ గ్రామాన్ని ముంచేస్తుందేమోననే అను మానం కల్గింపతనికి. సాయంత్రమయేసరికా గ్రామస్తులు తమగ్రామాన్ని వదిలిపెట్టి వెళ్ళిపోయిన ముస్లిముల గురించి, మల్లిగాడు, వాడిసహచరులు, శరణార్థులు కలిసిచేసిన దుశ్చర్యల గురించి ముచ్చటించుకోడం తగ్గించి అంతకంతకు పొంగి ప్రవహిస్తున్న సట్లెజ్‌నది గురించి ముచ్చటించుకో సాగేరు. స్త్రీలు మిద్దెలపైకెక్కి పశ్చిమానగల నదికేసి ఆందోళనతో చూడ సాగేరు. పురుషులు మాటిమాటికి నలుగురేసి అయిదుగురేసి చొప్పున నదిదగ్గరకు కలిసివెళ్ళి పరిస్థితి ఎలావున్నదీ గమనించి గ్రామస్తులకు తెలియజేస్తున్నారు.

సూర్యాస్తమానం కాకముందు మరోసారి హెడ్మన్ నదిదగ్గర కెళ్ళేడు. మధ్యాహ్నం తను చూసినప్పటికన్నా అప్పుడు నీటిమట్టం బాగా అధికమయినట్లు గుర్తించేడు. అంత స్వల్పవ్యవధిలో నదిలో నీటిమట్టం అంత అధికంగా పెరగడం అంతకుముందతనెప్పుడూ చూడలేదు. ఆ కట్ట దగ్గర ఆరాత్రి కొంతమందిని కాపలా వుంచడం శ్రేయస్కరమనుకున్నాడు బంటాసింగ్. కాస్త ధైర్యసాహసాలుగల యువకుల్ని పిలిచి ఒక్కొక్క గ్రూపులో ముగ్గురేసుండునట్లు వాళ్ళని నాల్గు గ్రూపులుగా విభజించి ఒక గ్రూపు తరువాత మరో గ్రూపు ఆ రాత్రంతా నది కట్టదగ్గర కాపలా వుండేటట్లు నియమించేడు. హెడ్మన్ ఈ ఏర్పాటు చెయ్యడంవల్ల ఆ గ్రామస్తులంతా నిర్భయంగా నిద్రపోగలిగేరు.

అర్ధరాత్రిగడిచేక నదికట్టదగ్గర కాపలాగావున్న ముగ్గురువ్యక్తులూ, అదరాబాదరాగావచ్చి గట్టిగా కేకలేసి హెడ్మన్‌నిలేపి, సహాయం చేయమని అర్థించే మనుష్యుల అరుపులు తాము విన్నట్లు, ఆ అరుపులు నదిలోంచి గాని, నది అవతలిగట్టు మీద నుంచిగాని వచ్చుంటాయని ఎంతో గాభరాగా తెలియజేసేరు. ఏమిటో చూసొద్దామని టార్చిలైటుపట్టుకొని వాళ్ళతో నదిఒడ్డు దగ్గరకెళ్ళేడు హెడ్మన్.

ఆ నల్గురూ నదిగట్టుపై నిలబడి టార్చిలైటు కాంతి పడ్డంతవరకూ నదియొక్క ఉపరితలాన్ని జాగ్రత్తగా పరిశీలించి చూసేరు. ఉరకలేస్తూ సుళ్ళుతిరుగుతూ ప్రవహిస్తున్న నీరుతప్ప ఇంకేమీ కనిపించలేదువాళ్ళకి.

ఊపిరి బిగబట్టి జాగ్రత్తగా విన్నారు. నీటిపై పడుతున్న వర్ష బిందువుల చప్పుడు తప్ప ఇంకేమీ వినిపించలేదు. మీరు విన్న గొంతుకలు మనుష్యులవా? నక్కలవా? అని నది ఉపరితలంకేసి చూస్తూఅడిగేడు హెడ్మన్. ఒక్కొక్కప్పుడు నక్కల అరుపులు మనుష్యుల ఆర్తనాదాల లాగుంటాయని అతని అభిప్రాయం. "మాకు తెల్దా నక్కల అరుపులు

ఏలాగుంటాయో? అవి మనుసుల అరుపులే. ఏరా కార్నైలా! అవి మనుసుల అరుపులేకదూ? స్పష్టంగా యున్నాంకదూ?"

"మరేటీ అనుమానంనేదు! అవి మనుసుల గొంతుకలే! "హేయ్! హేయ్!" అని ఏదో బాధతో మూల్గుతున్నట్లున్నాయా గొంతుకలు.

బంటాసింగ్ ఎన్నిసార్లు అడిగినా ఇందుకు భిన్నంగా వాళ్ళు సమాధాన మివ్వలేదు. మధ్యని హరికేన్ లాంతరుంచి ఆ నల్గురూ ఓ చెట్టు క్రింద కూర్చున్నారు. వాళ్ళు రైనుకోట్లులాగ వాడుతున్న, గోనెబస్తాలు బాగా తడిసి నానిపోయేయి. వాటితోపాటు వాళ్ళ దుస్తులుకూడా తడిసి పోయాయి. ఓ గంటసేపయేక మేఘాలు కొస్త విడాయి. వర్షం క్రమక్రమంగా తగ్గి ఆగిపోయింది. పశ్చిమదిశ దిఙ్మండలంపై చంద్రుడు మబ్బుల మాటునుంచి ప్రకాశిస్తున్నాడు. చంద్రకాంతి నీటిపైబడి ఆవలి ఒడ్డునుంచి ఈవలి ఒడ్డువరకూ ఓ వెడల్పయిన తగరపు బాటలా ప్రతిఫలిస్తోంది.

నల్లగా అండాకృతిలోవున్న పదార్థమేదో వంతెన స్తంభాన్ని గ్రుద్దుకొని మానోమత్రాకేసివున్న ఒడ్డుకేసి ఆ ప్రవాహంలో కొట్టుకొచ్చింది. ప్రక్కలకు కొయ్యలు తగిలించబడున్న ఓ పెద్ద డ్రమ్ములాగ వాళ్ళకగుపించిందది. మళ్ళీ ప్రవాహంలో పడేటంతవరకూ ముందుకు వెనక్కి ఊగిసలాడి చంద్రకాంతిలో ప్రతిఫలిస్తున్న మార్గంలోకి కొట్టుకొచ్చింది. అప్పుడు వాళ్ళు పోల్చుకున్నారు. అదొక ఆవు కళేబరమని. ఆ తరువాత ఎండుగడ్డి కుప్పలు, బట్టలమూటలు కొట్టుకురావడం వాళ్ళు చూసేరు.

"ఎగువనున్న ఏదో గ్రామాన్ని ఈ సట్లైజ్‌నది పొట్టను పెట్టుకున్నట్లుంది" అని అన్నాడు హెడ్మన్.

"ఉష్! ఆ శబ్దాన్ని వినండి." అని వాళ్ళలో ఒకడు మెల్లగా గొణిగేడు.

"మీ కినిపిస్తోందా ఆ శబ్దం?"

"ఉష్!"

ఊపిరి బిగబట్టి వాళ్ళు జాగ్రత్తగా విన్నారు. అది మనుష్యుల అలికిడి కాదు. ఏదో గర్జన. ఉరుములాంటి గర్జన. మళ్ళీ జాగ్రత్తగా విన్నారు.

బహుశా అది ట్రైను వస్తోన్న చప్పుడై వుంటుందనుకున్నారు వాళ్ళు. అంతకంతకు 'గుఫ్ గుఫ్' మనే శబ్దం మరింత స్పష్టంగా వినిపించసాగింది. దూరంలో లీలగా రైలింజను వాళ్ళ కగుపించింది: ఆ యింజనుకు హెడ్‌లైటు లేదు. ట్రైనులో ఎక్కడా దీపాలు లేవు. ఇంజను పొగగొట్టంలోంచి నిప్పు రవ్వలు గుఫ్ గుఫ్‌న మీదికెగురుతున్నాయి. ట్రైను బ్రిడ్జీదాటి మానోమజ్రా స్టేషనులో ఆగింది: అది పాకిస్తాను నుంచి వచ్చిన బండి!

"రైలుబండీలో దీపాలు లేవు!" అన్నా డొకడు.

"ఇంజను ఈలెయ్యనేదు!" అన్నాడింకొకడు.

"ఇది రాక్షసి బండి నాగుంది!" అన్నాడు మరొకడు.

రాక్షసిబండనే మాట వినేసరికి హెడ్మన్ గుండె భీతితో కంపించింది: "బాబ్బాబు! ఆ మాట మళ్ళీ అనకు! అది గూడ్సు బండయ్యుంటుంది! ఇందాక బహుశా మీరీ గూడ్సుబండి యొక్క కూతే వినుంటారు. ఎవడినైనా హత్య చేసేటప్పుడు వాడు ఎలా ఆర్తనాదం చేస్తాడో అలాగే ఈ క్రొత్త అమెరికన్ యింజన్లు యీలేస్తాయి" అని అన్నాడు

"అదెలా వీలవుద్ది? మాఁవు ఓ గంట క్రిందట యిన్నామూ అది పల్లి?" అని వాళ్ళలో ఒక డన్నాడు.

"ఇప్పుడు మరేవీ వినిపించలేదుగా!" అని అన్నాడు హెడ్మన్.

కొద్ది రోజుల క్రితం రైల్వే లైనుకు అవల ఎక్కడైతే వెయ్యికి పైగా మృతదేహాలను దహనపరిచారో అక్కడ నుంచి విచార సూచకంగా ఓ నక్క కూతలాంటి కూత వినిపించింది. ఆ వెంటనే మొర్రోమని కొంతమంది ఏడుస్తున్నట్లు వినిపించింది. వాళ్ళంతా భయకంపితు లయ్యారు !

"బహుశా అవి నక్కలయుంటాయి ! ఆడవాళ్ళు ఏడ్చినట్లుగా అవి కూస్తాయి !" అన్నాడు హెడ్మన్.

"అబ్బే ! ఆ ఏడుపు నక్కల ఏడుపుకాదు, అది కచ్చితంగా మను సుల ఏడుపే !" అన్నాడొకడు.

అదే సమయంలో వాళ్ళకి నీళ్ళపై తేలుతూ ఏవో కొట్టుకు పోతున్న ట్లగుపించింది. కాని ఆ చీకట్లో వాళ్ళకి స్పష్టంగా ఏఁవీ అగు పించలేదు. తెల్లారే వరకూ వాళ్ళక్కడే కూర్చున్నారు. మేఘాలు ఉత్తర దిక్కుగా పోయాయి. సూర్యోదయం అయింది.

నదిలో .... కొట్టుకు పోతున్నాయి .... ఎడ్లబళ్ళు ఎడ్లతో సహా ! గాడిదలు .... కంచర గాడిదలు .... వీపులపై మూటలతో సహా. స్త్రీలు, పురుషులు, వాళ్ళ భుజాలకు వ్రేలాడుతున్న బట్టల మూటలతో సహా. చంటిపిల్లలు తల్లుల పాలిండ్లను కరచుకొని, చంకలలో వ్రేలాడుతూన్న శోలెలలో ! వాళ్ళ లేత పిరుదులు నీళ్ళలో మునుగుతూ తేలుతూ....

ఆకాశంలో .... గ్రద్దలూ, రాబందులు.

ప్రవాహంలో కొట్టుకుపోతున్న శవాలపై వ్రాలి, ముక్కులతో పొడిచి మాంసాన్ని చీల్చి, మాంసఖండాలను కాలిగ్రోళ్ళతో పట్టుకొని ఒడ్డు కెగిరి అక్కడ తినేసి, మళ్ళీ శవాల మీద గ్రద్దలు, రాబందులు.

తెల్లారేక, వెలుగొచ్చాక నదిపై వాళ్ళ కళ్ళ కగుపించిన భయంకర మైన దృశ్యమది !

"పూర్తిగా కొన్ని గ్రామాలకు గ్రామాలు రాత్రి వరదల్లో మునిగి పోయినట్లున్నాయి?" అన్నాడు హెడ్మన్ బాధగా నిట్టూరుస్తూ.

"అయితే మరి ఆ వూరోళ్ళు యీ వర్షంలో రాత్రివేళ బళ్ళకు పసువుల్ని ఎందుకు పూనేరు చెప్మా?" అని తన సందేహాన్ని వెలిబుచ్చా డాకడు.

హెడ్మన్ కొంచెంసేపాలోచించి "బాబాసు! అది కూడా ఆలో చించాల్సిన విషయమే! ఈ కొట్టుకు పోతున్నవాళ్ళు తమ సామాన్లతో సహా మూక ఉమ్మడిగా ఎటో పారిపోతూ యీ వరదల్లో చిక్కుకున్న ట్లున్నారు" అని అన్నాడు.

బ్రిడ్జీ ఆర్చీల లోంచి యింకా చాలా మానవ మృతదేహాలు కొట్టు కొస్తూండడం వాళ్ళు చూసారు. అవి బ్రిడ్జి స్తంభాలకు గ్రుద్దుకొని, వెనుదిరిగి కొంచెంసేపాగి, సుడుల మధ్య కొంతసేపు గిరగిర తిరిగి, గుబుక్కున పైకి లేచి మళ్ళీ ప్రవాహంలోపడి కొట్టుకు పోతున్నాయి.

ఒడ్డు ప్రక్కనుంచి కొట్టుకు పోతున్న శవాలను మరింత దగ్గర నుంచి చూడాలనే వుద్దేశ్యంతో వాళ్ళు బ్రిడ్జి దగ్గర కెళ్ళారు.

వాళ్ళల్లో ఒకడు. "ఓలనాయినోయ్! ఎంతగోరం! ఎంత గోరం! వీళ్ళంతా ప్రమాదవశాత్తూ మునిగి సచ్చిపోనేదు. కూనీ సెయ్యబడినారు!" అని గుండెలు బాదుకుంటూ అన్నాడు.

అంతా నిశ్చేష్టులై నిర్లిప్తంగా చూడసాగారు! తెల్లని పండు గెడ్డం గల ఓ ముసలి రైతు శవం నీళ్ళపై వెల్లకిలా కొట్టుకొచ్చింది. శిలువ వేయబడినట్లు అతని చేతులు నిటారుగా ప్రక్కకు చాచబడి వున్నాయి. అతని బోసినోరు తెరవబడుంది. కళ్ళుమూతలు పడున్నాయి. మెడపైన ఓ పెద్ద గాయముంది. అది ఏటవాలుగా వక్షస్థలం వరకూ

వ్యాపించి వుంది. అతని పిడికిలిలో ఓ శిశువు చీర యిమిడి వుంది. దాని వెనకాల ఓ రంధ్ర ముంది!

పెద్ద కట్టుదుక్కల్లాగా ఎన్నో శవాలు కొట్టుకొస్తున్నాయి. కొన్ని శవాలు బ్రిడ్జి యొక్క ఆర్చీల మధ్యనుంచి వేగంగా కొట్టుకు పోతున్నాయి. మరికొన్ని బ్రిడ్జిస్తంభాలకు గ్రుద్దుకొని, వెనక్కు తిరగబడి, తమ శరీరం మీదున్న గాయాలను, మళ్ళీ అలలు తిరగేసేటంత వరకూ చూపించి కొట్టుకు పోతున్నాయి! కొన్ని శవాలకు కొన్ని అవయవాలు లేవు! కొన్ని శవాల పొట్టలు బల్లేలతో చీల్చబడున్నాయి! చాలామంది స్త్రీల రొమ్ములు మొదలంటా కోసివేయ బడున్నాయి.

నదిలో శవాలు కొట్టుకుపోతున్నాయి!

ఆకాశంలో గ్రద్దలు, రాబందులు ఎగురుతున్నాయి!

ఆ హృదయ విదారకమైన భయంకర దృశ్యాన్ని మరి చూడలేక హెడ్మన్, అతనితో వచ్చిన గ్రామస్తులు తమ తలపాగా కొనలను ముఖాలపై కప్పుకున్నారు.

"భగవంతుడింకా మనపై దయ కలిగున్నాడు! పైన ఎక్కడో మూక వుమ్మడి హత్యలు జరిగినట్లున్నాయి. ఈ విషయం మనం పోలీసోళ్ళకు తెలియజేద్దాం!" అని వాళ్ళలో ఒకడు మెల్లగా అన్నాడు.

"పోలీసోళ్ళకా? ఎందుకూ? ఆళ్ళేటి సెయ్యగల్రు? అయితే నువ్వే ఎల్లి సెప్పు?" అని వెటకారంగా అన్నా డొకడు.

శోకతప్త హృదయాలతో భారంగా అడుగులు వేస్తూ మానో మజ్రా కేసి బయలుదేరేరు వాళ్ళు. తమ గ్రామస్తుల కేమని చెప్పడం?

నదిలో నీటిమట్టం యింకా ఎక్కువయిందనా? కొన్ని గ్రామాలు వరదలలో కొట్టుకు పోయాయనా? పైన ఎక్కడో మూకవుమ్మడి

హత్యలు జరిగాయనా ? నదిలో వందలాది శవాలు తేలియాడుతున్నా యనా? ఏమని చెప్పడం ? ఏమని చెప్పకమో వాళ్ళకు బోధపడ లేదు.

తీరా వాళ్ళు గ్రామంలో అడుగుపెట్టిన తరువాత, నదిలోని నీటి మట్టం యొక్క పరిస్థితి తెల్సుకొనేటందుకు వాళ్ళ దగ్గర కెవ్వరూ కుతూహలంతో రాలేదు. వాళ్ళంతా మిద్దెలమీద కెక్కి రైల్వేస్టేషను కేసి కుతూహలంతో చూస్తూ కూర్చున్నారు.

పగటివేళ ఒక రాక్షసి ట్రైను మనోమజ్రా స్టేషనులో ఆగుండ డమే వాళ్ళ కుతూహలానికి కారణం ! ఇంజను తూర్పుదిశ కభిముఖంగా వుండడంచేత అది పాకిస్తాను నుంచొచ్చిన ట్రైనని వాళ్ళు గ్రహించేరు.

ఈ పర్యాయం కూడా ఆ ప్రదేశమంతా పూర్తిగా సైనికులతోనూ, పోలీసు వాళ్ళతోనూ నిండివుంది. నదిలోంచి వందల కొద్దీ మానవ మృతదేహాలు కొట్టుకొస్తున్నాయన్న సంగతి యీలోగా ఒకరి నుంచొకరికి అలా ఆ గ్రామస్థు లందరికీ తెల్సిపోయింది.

స్త్రీల, పిల్లల శరీరావయవాలను ఎంత ఘోరంగా ఖండించి నది లోకి త్రోసివేశారో, కళ్ళారా చూసొచ్చిన వాళ్ళ ద్వారా తెల్సుకొని ఆ గ్రామస్థులు గుండెలు బాదుకున్నారు. అంత దారుణంగా వధింపబడిన వారెవరో తెల్సుకోవాలనే కోర్కెగాని, నది దగ్గరకెళ్ళి ఆ శవాలను చూడాలనే అభిలాషగాని వాళ్ళ కెవ్వరికీ కల్గలేదు.

రైల్వే స్టేషనులో ఆగివున్న రాక్షసి ట్రైను ఆ గ్రామస్థుల దృష్టిని తన కేసి మళ్ళింప జేసుకుంది.

ఆ ట్రైనులో ఏమున్నదీ. ఆ గ్రామస్థు లందరికీ బాగా తెలుసు! కఱ్ఱలకోసం, కిరసనాయిలు కోసం మళ్ళీ ఆ సైనికులు తప్పక వస్తారని వాళ్ళనుకున్నారు. మరి తమవద్ద కిరసనాయిలు లేదు. ఇకపోతే ఆ కొద్ది

పాటి కళ్లులు బాగా తడిసి నానిపోయాయి. అవి మందవు. వాళ్ళొస్తే ఏంవని సమాధానం చెప్పడమా అనే ఆలోచనలో పడ్డారు వాళ్ళు.

కాని వాళ్ళు రాలేదు. ఎక్కడినుండో ఓ 'బుల్‌డోజరు' వచ్చింది. స్టేషను కవతలి ప్రక్క ఓ విశాలమైన స్థలంలో ఆ 'బుల్‌డోజరు' కొన్ని గంటలసేపు పనిచేసి ఓ పెద్దగొయ్యి త్రవ్వింది.

ఆ బుల్‌డోజరు కేసి చూస్తూ అంతవరకూ బద్ధకంగా కూర్చున్న సైనికులకు, పోలీసులకు పిలుపు వచ్చింది. వాళ్ళంతా ప్లాట్‌ఫారం మీది కెళ్ళేరు: ఆ తరువాత గోనెబస్తాలతో శవాలను మోసుకొచ్చి ఆ గోతిలోకి విసిరేయడం మొదలెట్టేరు. సూర్యాస్తమానం అయేటంత వరకూ ప్లాట్‌ఫారం మీదనుంచి శవాలను తెస్తూ గోతిలోనికి అలా విసిరేస్తూనే ఉన్నారు.

శవాలన్నింటినీ గోతిలో పడెయ్యడం పూర్తయేక మళ్ళీ బుల్‌డోజరు మేల్కొంది. బయటకు త్రవ్వితీసిన మట్టిని మళ్ళీ ఆ గోతిలోకి త్రోసివేసి మళ్ళీ ఆ స్థలాన్ని యథాప్రకారం చదునుగా చేసేసింది.

మానిన గాయపు మచ్చలా అగుపిస్తోందా స్థలం. నక్కలబారి నుండి, ఆ సమాధిని సంరక్షించడం కోసం, అక్కడ కొంతమంది సోల్జర్సుని అట్టిపెట్టేరు.

15

ఆవాళ సాయంత్రం సామూహిక ప్రార్థనలు సలపడంకోసం మానోమజ్రా గ్రామీణులంతా గురుద్వారాలో సమావేశమయ్యేరు. సంవత్సరాది రోజున లేదా గురువు పుట్టినదినం రోజున తప్పితే మామూలు రోజులలో గురుద్వారాలో అలా సమావేశమయే అలవాటు వాళ్ళకిలేదు. సాధారణంగా గురుద్వారాకు వచ్చేవాళ్ళు ఆ పూళ్ళోని ముసలివాళ్ళు, స్త్రీలూను. ఇకపోతే యితరులు తమపిల్లలకు నామకరణం చేసే సంద

ర్భాలలోను, పెళ్ళిళ్ళ సందర్భాలలోను, మరేదయినా శుభకార్యాలు చేసే సందర్భాలలోను వస్తూంటారు.

ఆ గ్రామంలో రామ్‌లాల్ హత్య జరిగిన దగ్గరనుంచీ గురుద్వారాకు ప్రార్థనలకోసం వచ్చేవారి సంఖ్య బాగా అధికమయింది. ఒంటరిగా వుండడానికి అంతా జంకుతున్నారు. ముస్లిముల యిళ్ళకేసి చూడడానికే జంకుతున్నారు. ఆ యిళ్ళ ప్రక్కనుంచి వెళ్లాల్సొచ్చినప్పుడు అటుకేసి చూడకుండా గబగబా వెళ్ళిపోతున్నారు.

గురుద్వారాలో కూర్చొని భగవంతుని ధ్యానిస్తే కొంతలో కొంతయినా మనశ్శాంతి లభ్యమవొచ్చుననే ఆశతో ఆ గ్రామంలోని సిక్కులంతా సాయంత్రమయేసరికి గురుద్వారా చేరుకున్నారు. సిక్కుల పవిత్ర గ్రంథము గ్రంథసాహెబా వున్న మెయిన్‌హాలు, ఆ ప్రక్కనున్న రెండు గదులు ఆ గ్రామీణులతోను, శరణార్థులతోను బాగా కిక్కిరిసిపోయేయి. గడపలో వారి పాదరక్షలన్నీ ఓ వరుసలో పేర్చబడున్నాయి.

గ్రంథసాహెబాను తెరచి హరికేన్ దీపపుకాంతిలో మీట్‌సింగ్ సాయం సంధ్యాకాల ప్రార్థనను పఠిస్తూంటే వాళ్ళలో ఒకడు మీట్‌సింగ్ వెనకాల నిలబడి నెమలి యీకల కుంచెతో విసరసాగేడు.

ప్రార్థన పూర్తయేక మీట్‌సింగ్ పవిత్రగ్రంథ సాహెబాను మూసి దానిని చక్కని రంగుసిల్కువస్త్రంలో చుట్టి పీఠంపై యథాస్థానంలో వుంచి నమస్కరించాడు. ఆ తరువాత అంతా కలసి చేతులు జోడించి సామూహికంగా ఓ కీర్తన పాడారు. మీట్‌సింగ్ చేతులు జోడించి వాళ్ళందరికి ముందునవున్నాడు. కీర్తన అనంతరం మీట్‌సింగ్ తమ పదిమంది గురువుల పేర్లను, స్వమత రక్షణార్థమై అసువులుబాసిన వీరుల పేర్లను, పుణ్యస్థలాల పేర్లను ఉచ్ఛరించేడు. తమను ఆశీర్వదించమని గురువుల్ని ప్రార్థించేడు: మీట్‌సింగ్ వాక్యాన్ని ఆపినప్పుడల్లా "తథాస్తు" అని

అంటూ, ప్రతీ విజ్ఞాపన తరువాత, "వ్హా గురు!" అని బిగ్గరగా తమ గురువుల్ని స్తుతిస్తూ మిగిలిన వాళ్ళంతా ధ్యానించేరు. ఆఖరున వాళ్ళంతా తమ నుదురునేలకు తాకేట్లుగా వంగి భక్త్యంజలి సమర్పించేరు. ఆ కార్యక్రమం అక్కడితో ముగిసింది.

కొంతసేపటికి బాగా చీకటి పడింది. కొందరు గాఢనిద్రలో మునిగిపోయేరు. కొందరు కునికిపాట్లు పడుతున్నారు. కునికిపాట్లు పడుతున్న వాళ్ళకి మోటారు కార్లు వస్తున్న శబ్దం వినిపించింది. తామేదో కలగంటున్నట్లు, కలలో మోటారుకార్ల హారన్లు వింటున్నట్లు వాళ్ళు భావించారు. మరోసారి మోటారుకారు హారను వాళ్ళకి వినిపించింది. ఇంకా తాము కలలో ఆ హారను శబ్దం వింటున్నట్లే భావించేరు వాళ్ళు.

అవాంఛనీయం మిలటరీ ఆఫీసర్లు ఎట్లాంటి జీపులో వచ్చేరో అట్లాంటి జీపులోనే వాళ్ళెవరోగాని వచ్చేరు. వాళ్ళకా గ్రామంలోని సందు గొందులన్నీ బాగా తెల్సినట్లుంది. ఇంటింటికీ వెళ్ళి "ఇంట్లో ఎవరైనా ఉన్నారా?" అని భోగట్టా చేసేరు. సమాధానంగా కుక్కలు మొరిగేయి.

ఆ తరువాత వాళ్ళు గురుద్వారా దగ్గరకొచ్చి జీపు ఆపుచేసి అక్కడపడుకొని నిద్రపోతున్న వాళ్ళకేసి చూస్తూ, "మీరంతా చచ్చేరా?" అని వాళ్ళలో ఒకడు ప్రశ్నించేడు.

కునికిపాట్లు పడుతున్న వాళ్ళలో ఒకడు "ఊః!" అని మూలిగేడు.

"మీలో ఒక్కడైనా బ్రతికున్నాడా లేక అంతా చచ్చారా?" అని బిగ్గరగా అడిగేడా యువకుడు.

తృళ్ళిపడి చాలామంది గబుక్కున లేచేరు. కొంతమంది పిల్లలు ఏడవడం మొదలెట్టేరు. మీత్ సింగ్ దీపంవొత్తిని హెచ్చించి అలా అడిగినదెవరో తెల్సుకోవాలనే కుతూహలంతో అటుకేసి చూసేడు. ఆ తరువాత మీత్‌సింగు, హెడ్మన్ కలసి కాస్త జంకుతూ వాళ్ళదగ్గరకెళ్ళేరు.

తాము సృష్టించిన సంక్షోభాన్ని ఆయువకులు గమనించేరు. గ్రామాధికారిని, మీట్‌సింగ్‌ని లక్ష్యపెట్టకుండా తిన్నగా ఆ హాలు గుమ్మందగ్గర కెళ్ళేరు. ఆ హాలులో కిక్కిరిసివున్న జనసమూహం కేసి చూస్తూ, "మీరంతా చచ్చేరా?" అని ఒకడడిగేడు.

"మీలో కనీసం ఒక్కడైనా బ్రతికున్నాడా?" అని మరొకడడిగేడు.

హెడ్మన్ చాలా కోపంగా, "ఈ గ్రామంలో ఏ ఒక్కరూ చావలేదు. ఇంతకీ మీకేంకావాలి?" అనడిగేడు.

వాళ్ళింకా ఏ సమాధానమూ చెప్పకముందే వాళ్ళ సహచరులు మరిద్దరు అక్కడికొచ్చేరు. వాళ్ళు కాకీ యూనీఫారాలు ధరించివున్నారు. వాళ్ళ భుజాలకు రైఫిళ్ళు వ్రేలాడుతున్నాయి.

"చూడబోతే ఈ గ్రామమంతా చచ్చినట్లేవుంది." అని అన్నాడు రైఫిల్సు పట్టుకున్నవాళ్ళలో ఒకడు.

"భగవంతుడు మమ్మల్నింకా దయతో చూస్తున్నాడు. మావూళ్ళో ఎవరూ చనిపోలేదు" అని మీట్‌సింగ్ సగర్వంగా సమాధానమిచ్చేడు.

"ఊ! ఇంకా చావలేదూ? బ్రతికేవున్నారా? చచ్చేరేమోననుకున్నాము" అని హేళనగా అన్నాడాయువకుడు.

ఆ తరువాత వాళ్ళంతా తమ జోళ్ళను గుమ్మందగ్గర వదిలిపెట్టి హాలులోకి ప్రవేశించేరు. హెడ్మను, మీట్‌సింగ్ వాళ్ళ వెనకాతే హాలులో కెళ్ళేరు. హాలులోవున్న పురుషులంతా లేచినిలబడి, తమ తలపాగాలను తలకు చుట్టుకోసాగేరు. స్త్రీలు పిల్లలను తమ వొడులలో పడుకోబెట్టుకొని మళ్ళీ నిద్రబుచ్చాలనే సంకల్పంతో జోకొట్టసాగేరు. ఆ వచ్చిన వాళ్ళందరికీ నాయకుడిలాగ అగుపిస్తున్న యువకుడు కూర్చోమని సంజ్ఞచేసేడు. అంతా కూర్చున్నారు.

ఆ నాయకుడు కయ్యానికి కాలుదువ్వే స్వభావం గలవాడిలా అగుపించేడు. ఇంకా అతనికి మీసం, గెడ్డం బాగా రాలేదు. కుర్రాడనేచెప్పాలి. మహావుంటే పద్ధెనిమిది లేక ఇరవై సంవత్సరాల వయస్సుండవచ్చు. పొట్టిగా, సన్నగా ఆడదానిలాగున్నాడు. అతను తొడుక్కున్న కాకీ అర్మీ షర్టు అతనికి చాలా వదులుగావుంది. బుల్లెట్లతోనిండిన నల్లని తోలుపటకా రొమ్ము భాగానికి అడ్డుగా యజ్ఞోపవీతంలాగ అతని భుజంపైనుంచి వ్రేలాడుతోంది. ఆబెల్టుకి దిగువప్రక్క రివాల్వర్ వ్రేలాడుతోంది.

ఆ యువకుడు తనచేత్తో రివాల్వర్ తోలుసంచీపైన, బుల్లెట్లపైన పాముతూ సంపూర్ణమైన ఆత్మవిశ్వాసంతో చుట్టూ ఓసారి కలయజూసి, "ఇది సిక్కుల గ్రామమేకదూ?" అని అడిగేడు.

ఆ అడిగిన తీరుబట్టి అతనొక చదువుకొన్న పట్నవాసపు యువకుడని ఆ గ్రామస్తులు గ్రహించేరు. పట్నవాసపు చదువుకున్న కుర్రాళ్ళు గ్రామీణరైతులను చాలా చిన్నచూపు చూస్తూంటారని, తమకంటే అధికులమన్నట్లు వాళ్ళు భావిస్తూంటారని, కనీసం వయస్సునిబట్టయినా తమను గౌరవించరని ఆ గ్రామ పెద్దల అభిప్రాయం.

"అవునుబాబూ! ఇది సిక్కుల గ్రామమే. ముస్లిములుండేవారు గాని వాళ్ళంతా వెళ్ళిపోయేరు" అని సమాధానమిచ్చేడు హెడ్మన్.

"ఎలాంటి సిక్కులు మీరు? చీము, నెత్తురువున్న సిక్కులా లేక చీము, నెత్తురు లేని సిక్కులా?" రెచ్చగొట్టే ధోరణిలో అడిగేడా యువకుడు.

ఆ ప్రశ్నకు ఏమని సమాధానమివ్వాలో ఎవ్వరికీ బోధపడలేదు. గురుద్వారాలో స్త్రీల, పిల్లల ఎదుట ఈ ధోరణిలో మాట్లాడడం సబబు కాదని ఎవ్వరూ ఎదిరించ లేకపోయేరు.

"సిక్కుల, హిందువుల మృతదేహాలతో ఎన్ని ట్రైన్లు వస్తున్నాయో మీకు తెలీదా? రావల్పిండి, ముల్తాన్, గుజ్రన్‌వాలా, షేక్‌పురాలలో ఎంతమందిని మూకవుమ్మడిగా హత్యచేశారో, ఇంకా చేస్తున్నారో మీకు తెలీదా? పీకమొయ్యా తిని తొంగోదంతప్పితే మీకింకేమీ తెలీదు? ఇంతకీ మీరు సిక్కులేనా అని? గొప్ప యుద్ధవీరులుగా ప్రపంచ ఖ్యాతిగాంచిన సిక్కుజాతికి చెందిన వారుగా చెప్పుకోడానికి మీకు సిగ్గులేదూ? ఛీఛీ! సిగ్గు సిగ్గు!" అని ఎంతో ఆవేశంతోను, ఉద్రేకంతోను అని తన విశాలమైన నేత్రాలతో ఓసారి అందరి ముఖాలలోకి తీక్షణంగా చూసేడు; తననెదిరించడానికి ఎవరైనా సాహసిస్తారేమోనని? వాళ్ళు కాస్త సిగ్గుపడి తలలు దించుకున్నారు.

"అయితే సర్దార్‌బాబూ! మమ్మల్ని ఏం చెయ్యమంటారు ? మన ప్రభుత్వంవారు పాకిస్తాన్‌తో యుద్ధం తలబెట్టినట్టయితే అప్పుడుచూపిస్తాం మా సత్తువ" అని అన్నాడు హెడ్మన్.

ఆ నాయకుడు తృణీకారంగా, "ప్రతిదీ ప్రభుత్వమే చెయ్యాలనా నీఉద్దేశ్యం? ఇంతకీ పరమనీచులు పిరికిపందలుతోనిండిన పెట్టుబడిదార్ల ప్రభుత్వం ఏం చెయ్యగలదు? పాకిస్తాన్‌లోవున్న ముస్లిములు ముందుగా వాళ్ళ ప్రభుత్వం అనుమతిపొందే అక్కడున్న మన సోదరీమణులకు మానభంగాలు చేస్తున్నారా? ప్రభుత్వానుమతిని ముందుగాపొందే రైళ్ళను ఆపుచేసి, ప్రాణాలరచేతిలో పెట్టుకొని పారిపోయొస్తున్న వాళ్ళందరినీ చంపుతున్నారా? నువ్వు చెప్పినది మహా బాగుంది. ఏపనయినాసరే ప్రభుత్వమే చెయ్యాలంటున్నావు. చాలా గొప్పవిషయం. శహబాష్ బ్రేవో!" అని అన్నాడు తన రివాల్వర్‌కేస్ పైని దర్పంతో ఓ చరుపు చరచి.

"అయితే సర్దార్‌బాబూ! మమ్మల్నిప్పుడు ఏం చెయ్యమంటారు? అని తడబడుతూ, సంకోచిస్తూ అడిగేడు హెడ్మన్.

"అలా అడగండి చెప్తాను. వినండి. అంతా జాగ్రత్తగావినండి." అని కొంచెంసేపాగి, ఓసారి చుట్టూ కలయజూసి, "వాళ్ళు పాకిస్తాన్‌లో చంపిన ప్రతిఒక్క హిందువూ, సిక్కుకి బదులుగా ఇక్కడ ఇద్దరేసి ముస్లిములను చంపాలి! వాళ్ళు అక్కడ మానభంగంచేసిన ప్రతిఒక్క స్త్రీకి బదులుగా ఇద్దరు ముస్లిమ్ స్త్రీలకు మానభంగం చెయ్యాలి. వాళ్ళు అక్కడ దోచుకున్న ప్రతి ఒక్క గృహానికి బదులుగా ఇక్కడ రెండేసి ముస్లిమ్ గృహాలనుదోచుకోవాలి. అటునుంచొచ్చే ప్రతిఒక్క ట్రైనులోడు శవాలకు బదులుగా ఇటునుంచి రెండేసి ట్రైనులోడ్ల శవాలు పంపాలి. వాళ్ళక్కడ నాశనంచేసిన ప్రతిఒక్క 'కన్వోయ్'కి బదులుగా ఇక్కడ రెండేసి కన్వోయ్‌లను ముట్టడించి నాశనంచెయ్యాలి. ఇలాచేస్తే అప్పుడు వాళ్ళకి, మనకికూడా అమాయకప్రజల్ని చంపడం దోచుకోడం చేలసవి నన్న సంగతి బోధపడుతుంది!" తన వాగ్ధోరణి సభాసదుల హృదయాలపై ఎలా పనిచేస్తోందో గమనించడంకోసం కొంచెంసేపు చెప్పడం మాని, ఓసారి అందరి ముఖాలలోకి నిశితంగా చూసేడు.

అక్కడున్న వాళ్ళంతా నోళ్ళు వెళ్ళబెట్టి అతను చెప్పినదంతా శ్రద్ధగా విన్నారు. ఒక్క మీట్‌సింగ్ మాత్రమే తలెత్తలేదు. ఏదో చెప్పా లనే ఉద్దేశ్యంతో, ఓమారు గొంతును సవరించుకొని ఎంచేతోగాని ఏమీ మాట్లాడకుండా నోరు మూసుకొని వూరుకున్నారు.

"సోదరులారా! నేనిప్పుడు చెప్పినదంతా మీరంతా శ్రద్ధగా వినే ఉంటారు. మరి మీ ఉద్దేశ్యమేమిటి?" అని కొంచెంసేపాగి, అందరిముఖా లలోకి ఓసారి తీక్షణంగాచూసి, "మాట్లాడరేం?" అనడిగేడు.

"నాఅభిప్రాయం ఏమిటంటే.... నా అభిప్రాయం ఏమిటంటే...." అని మీట్‌సింగ్ నసుగుతూ చెప్పడం మొదలెట్టేడు. "ఇక్కడున్న ముస్లి ములు మనకేమి అన్యాయం చేసేరని వీళ్ళని చంపడం? అక్కడెక్కడో పాకిస్తానులో ముస్లిములు హిందువుల్ని, సిక్కుల్ని చంపుతున్నారనే

కోపంతో ఇక్కడ మనం అమాయకులైన ముస్లిములను చంపడం పాపం కాదా? ఎవరైతే నేరం చేస్తారో వారే శిక్షార్హులు" అని అన్నాడు మీట్ సింగ్.

ఆయువకుడు మీట్ సింగ్‌కేసి చాలా కోపంగా చూస్తూ, "పాకిస్తాన్ లోవున్న హిందువులు, సిక్కులు ఏం నేరం చేసేరని వాళ్ళని మహా ఘోరంగా మూక ఉమ్మడిగా ఊచకోత కోస్తున్నారు? వాళ్ళు ఏ నేరమూ చెయ్యని అమాయకులు కాదంటారా? అక్కడి స్త్రీలు నేరం చేసేరనేనా వాళ్ళని బలాత్కరించి మానభంగం చేస్తున్నారు? అక్కడ డొద్దూడని పసిపిల్లలు కూనీలు చేసేరనా వాళ్ళని వాళ్ళ తల్లిదండ్రుల ఎదుట నిలువునా చీరేసి చంపుతున్నారు?" అనడిగేడు. మీట్ సింగ్ మరి నోరెత్తలేదు. మీట్ సింగును మరింత చిత్తు చెయాలనే సంకల్పంతో, "ఏం భాయీ? ఇప్పుడు చెప్పు; నువ్వేం చెయ్యదల్చుకున్నావో?" అనడిగేడు.

"బాబూ! నేనొక ముసలి భాయీని. నేను నాచేతుల్ని ఎవ్వరిమీదికి ఎత్తలేను. ఆఖరికి యుద్ధభూమిలో శత్రువులమీదికిగాని, కూనీకోర్ల మీదికి గాని, నేను నా చేతుల్ని ఎత్తలేను. అదీగాక నిరాయుధులైవున్న అమాయక ప్రజల్ని చంపడం వీరత్వమనిపించుకోదు. ముస్లిముల చేతులలో మన ఆఖరి గురువు గోవింద్‌సింగ్ ఎన్ని బాధల్ని పొందినదీ ఆ భగవంతుడికి మాత్రమే తెల్సు. వాళ్ళు అతనిసల్గురు కుమారుల్ని చంపేశారు. అయినాసరే వారు ఆనాడు సిక్కులందరిచేతా ముస్లిమ్ స్త్రీలను ఏ పరిస్థితిలోను తాకమని చెప్పించి మతపరమైన ప్రమాణం చేయించేరు."

"ఈ రకమైన సిక్కిజం అంటే ఏమిటో మాకు తెల్సు. నీలాంటి వాళ్ళు ఈ దేశానికి ఓ శాపంలా తయారయేరు. మన 'గురూ'కి స్త్రీలపై ఎంతటి పవిత్రభావం వుందో చెప్పేవేగాని ముస్లిములగురించి వారు ఏం చెప్పినదీ చెప్పేవుకావు. 'ఇతర జాతులవాళ్ళంతా చచ్చేకే తురకలకు సహాయంచెయ్యి' అని కదూ చెప్పేరు."

"నిజమే కాని గురువుగారి స్వంత సైన్యంలో ముస్లిములుకూడా వుండేవారు."

"ఉండేవారుకనుకనే, వారు నిద్రపోతున్నప్పుడు వాళ్ళలో ఒకడు అయన్ని పొడిచి చంపేడు."

ఇహ ఏం చెప్పడానికి తోచక మీట్‌సింగ్ అతనికేసి అయోమయంగా చూస్తూ నిలబడ్డాడు.

"అతను నిద్రపోతున్నప్పుడు వాళ్ళల్లో ఒకడు పొడిచి చంపేశాడు మన మత గురువుని!" ఈ విషయాన్ని మళ్ళీ మరింత వత్తిపల్కేడు ఆ నాయకుడు.

"ఔను నిజమే! వాళ్ళలోకొంతమంది దుర్మార్గులున్నారు. అలాగని"

"ఒక్క మంచివాడిని చూపించు?"

మీట్‌సింగ్ మరి సమాధానం చెప్పలేకపోయాడు. తన పాదాలకేసి నిర్లిప్తంగా చూస్తూ నిలబడ్డాడు. అతనిమౌనాన్ని అతని ఓటమిగా వాళ్ళు భావించారు! ప్చ్! అతనిమాటకేం? అతను ముసలాడు! అతన్ని ఓమూల కూర్చొని ప్రార్థించుకోనివ్వండి అని చాలామంది ముక్తకంఠంతో అన్నారు.

ఆ ఉపన్యాసకుడు కాస్త శాంతించి, సభాసదులవేపు తిరిగి దాంబికమైన గొంతుకతో, "అంతా జ్ఞాపకముంచుకోండి. ఎన్నడూ మరచిపోకండి. ముస్లిమ్‌కి ఆయుధం పట్టడంతప్పితే శాంతియుతమైన సంప్రదింపులెలాగో తెలీదు!" అని అన్నాడు అదేదో గొప్ప దేవవాక్కన్నట్లు. ఆ సమూహంలో అధిక సంఖ్యాకులు ఆ సిద్ధాంతం యదార్థమేనని ఒప్పుకున్నట్లు తలలూపేరు.

"ఇక్కడున్న మీలో ఎవరికైనా మన గురువుపై ప్రేమవున్నదా? సిక్కుజాతికోసం మీలో ఎవడైనా ప్రాణాలను అర్పించ

గలడా?" ఎవడికైనా ధైర్యముందా ? అని ప్రతి ప్రశ్నను ఓ సవాలులా విసురుతూ అడిగేడా యువకుడు. ఆ గ్రామస్తులు విషమ పరిస్థితికి లోనయారు: ఆ ఉపన్యాసం ముఖ్యంగా అక్కడున్న యువకుల్ని బాగా రెచ్చగొట్టింది. తమ వీరత్వాన్ని రుజువు చెయ్యాలనుకున్నారు వాళ్ళు: కాని మీట్ సింగ్ అక్కడుండడంవల్ల వాళ్ళు కొంత ఇరకాటస్థితిలో పడ్డారు. తామేమన్నా మీట్ సింగ్ నొచ్చుకుంటాడేమోనని వాళ్ళ భయం.

"అయితే మమ్మల్ని ఏం చెయ్యమంటారు?" అని హెడ్మన్ నిష్కపటంగా అడిగాడు.

"చెప్తాను: గుండెధైర్యం వున్నట్లయితే నేను చెప్పినట్లు చెయ్యాలి. రేపు పూర్తిగా ముస్లిములతో నిండివుండే రైలొకటి పాకిస్తాన్ వెళుతుంది. మీరు మొగాళ్ళయినట్లయితే ఎన్ని హిందూ, సిక్కు శవాలను రిసీవ్ చేసుకున్నారో అంతకు రెట్టింపు ముస్లిమ్ శవాలను పాకిస్తానుకి పంపించాలి!'' అని అన్నాడా యువకుడు. అంతా ఒకరి ముఖాలొకరు అదోలా చూసుకున్నారు. ఏదో అనిర్వచనీయమైన బలహీనత వాళ్ళలోకి ప్రవేశించింది.

''ఆ బండిలో మన మానోమజ్రాలోని ముస్లిములుంటారు." ఎవరి ముఖాలకేసీ చూడకుండా మీట్ సింగ్ అన్నాడు.

"భాయి! నీకంతా తెల్సినట్లే మాట్లాడుతున్నావే? నీమొహం నీకేం తెల్సు? నువ్వు వాళ్ళకు టిక్కెట్లిచ్చేవా? లేక రైల్వేలో ఉద్యోగంచేస్తున్న నీ బాబెవడైనా చెప్పాడా? మహా తెల్సినట్లు మాట్లాడుతున్నావే: ఆబండిలో వున్న ముస్లిములెవరైనా ఊరుకొనేదిలేదు: వాళ్ళు ముస్లిములవునా కాదా అన్నవిషయం మాత్రం మాకు కావలసినది: వాళ్ళు సజీవంగా ఈ సట్లెజ్ నదిని దాటి వెళ్ళడానికి వీల్లేదు: ధైర్యంగా, నిస్సంకోచంగా మా పథకాన్ని

మీరంగీకరించినట్లయితేనే మీతో మేము మాట్లాడతాము: మీరు పిరికిపందలయినట్లయితే ఆ సంగతి సిగ్గువిడచి చెప్పండి: మీకో నమస్కారంచేసి పుంసత్వమున్న పురుషులకోసం ఇంకేవూరయినా వెళతాము:" అని మహోగ్రుడై అన్నాడాయువకుడు. కొంచెంసేపు నిశ్శబ్దం తాండవించిందక్కడ: ఆ యువకుడు రివాల్వర్ వుంచిన తోలుసంచీపైగల "టాటో" (సిపాయిలు తమ స్థలములకు పోవను గుర్తైన వాద్యము)ను వాయించి,ఓపిగ్గా అందరిముఖాలను ప్రత్యేకంగా ఓసారి వీక్షించాడు

"వంతెనకాడ కాపలాగా మిలటరీవాళ్ళున్నారు:" అని వెనుక నుంచెవరో అన్నారు. ఎవరా అని అంతా వెనుదిరిగి చూసారు.

మల్లిగాడు!

అవతల చీకట్లో వాడు చాలాసేపటినుంచీ నిలబడి అంతా వింటున్నాడు: ఒంటరిగా మానోమజ్రా రావడమంటే వాడికి భయమే: కాని ఆవాళ వాడు ధైర్యంగా పవిత్రమైన గురుద్వారాలోకి ప్రవేశించగలిగాడు. వాడి ముఠావాళ్ళంతా వాడివెనకాల ద్వారందగ్గర నిలబడున్నారు.

"మిలటరీ వాళ్ళగురించిగాని, పోలీసువాళ్ళ గురించిగాని, మీరేమీ భయపడనక్కర్లేదు; ఈ విషయంలో వాళ్ళెవ్వరూ ఏమీ కలుగజేసుకోరు. ఇంతకీ ఆసంగతి మేము చూసుకుంటాము:" అని వెనుకనున్న మల్లిగాడికేసి చూస్తూ అని కొంచెంసేపూరుకొని, "ఇక్కడెవరైనా వలంటీర్లుగా పని చెయ్యడానికి సిద్ధంగా వున్నారా?" అడిగాడు.

"నానున్నానుబాబూ! నానిక తమ సెప్పుసేతల్లోనే వుంటాను:" అని ఓ కథానాయకుడిలాగా అన్నాడు మల్లిగాడు.

జుగ్గా జైలులో మల్లిగాడిని చావబాదేడన్న సంగతి అప్పుడే ఆ గ్రామస్థులకు తెల్సిపోయింది: పోయిన ప్రతిష్ఠను తిరిగి నిలబెట్టుకోవాలని వాడి ఉబలాటం:

"బ్రేవో! కనీసం ఒక్కడైనా వున్నాడు. సంతోషం!పవిత్రమయిన సిక్కుమతాన్ని స్థాపించబోయే ముందు, ప్రాణాలను తృణప్రాయంగా త్యాగం చెయ్యగలిగే అయిదుగురు వ్యక్తులు తనకు కావాలన్నారు పరమ పూజనీయ గురునానక్! వాళ్ళు మహామనీషులు! అలాంటివాళ్ళు మన కిప్పుడు అయిదుగురుకంటే అధికంగా కావాలి! అయితే ఇంకెవరు తమ ప్రాణాలను త్యాగం చెయ్యడానికి సిద్ధంగా వున్నారు!" అనడిగాడా యువకుడు. మల్లిగాడి సహచరులు నల్గురూ గడపదాటి లోనికొచ్చేరు. వాళ్ళవెనకాల చాలామందున్నారు. వాళ్ళలో శరణార్థుల శాతం అధికం!

గమనించదగ్గ విశేషత ఏమిటీఅంటే, తమ ముస్లిమ్ సోదరులు గ్రామం విడిచి వెళ్ళిపోతున్నప్పుడు కంటతడిపెట్టిన ఆ గ్రామ యువకులలో కొంతమంది ఆ స్వచ్ఛంద సేవాదళంలో చేరడానికి సమ్మతించడం! ఏభై మందికిపైగా జేరారా దళంలో!

వాళ్ళందరినీ వేతేగా కూర్చోమనిచెప్పి, "ప్రస్తుతానికి ఈ వలం టీర్సు చాలు! ఇంకా అవసరమయితే అప్పుడు మళ్ళీ మిమ్మల్ని కోరతాను! మనం తలపెట్టిన సాహసోపేతమైన కార్యం జయప్రదంగా జరగడం కోసం మనమంతాకలిసి ఓసారి భగవంతుణ్ణి భక్తిపురస్సరంగా ప్రార్థిద్దాం!" అని అన్నాడు.

అంతా లేచి నిలబడ్డారు. స్త్రీలు తమ పిల్లల్ని నేలపై పడుకోబెట్టి పురుషుల ప్రక్కకెళ్ళి నిలబడ్డారు.

గ్రంథసాహెబా ఉంచబడిన చిన్న పీఠంకేసి అంతా తిరిగి చేతులు జోడించి నిలబడ్డారు.

ఆ యువకుడు మీట్‌సింగ్‌కేసి తిరిగి "భాయీజీ! ప్రార్థన చేయిస్తారా?" అనిఅడిగాడు.

"సర్దార్ బాబూ! ఇది మీదళం! అందేత మీరిచే మీరే ప్రార్థనచేయించండి!" అని అన్నాడు వినయంగా.

ఆ యువకుడు గొంతుక సవరించుకొని కళ్ళు మూసుకొని తమ మత గురువులందరి పేర్లు వల్లించేడు. తాము తలపెట్టిన సాహసోపేత కార్యం నిర్విఘ్నంగా కొనసాగేటట్లు ఆశీర్వదించమని వారిని ప్రార్థించాడు. ఆ తరువాత వాళ్ళంతా తమ తమ మడుకులపై అనుకొని, తమ నుదుర్లు నేలకు తాకేటట్లుగా వంగి బిగ్గరగా....

"నానకుని పరమపవిత్ర నామమందు
అధిక ప్రత్యయ మిచ్చెడు యాశవలన
దేవుని పవిత్ర సంకల్ప దివ్యప్రభను
మాకు కలిగెడు నిలలోన మంచిబుద్ధి."

అని అన్నారు. ఆ తరువాత అంతా లేచి నిలబడి....

"సిక్కులే పాలకులు. వారిశత్రువులు విశ్లథులు. ఆశ్రితులే రక్షితులు!" అనే భావంగల గీతాన్ని గానంచేసేరు. వందనాలతో ఆ చిన్న శుభకార్యం మంచి విజయోత్సాహంతో ముగిసింది.

ఆ యువనాయకుడు మినహా మిగిలిన వాళ్ళంతా కూర్చున్నారు. మంచి విజయోత్సాహంతో ముగిసిన ఆ ప్రార్థన ఆ యువనాయకుడిలో నమ్రతాగుణాన్ని పెంపొందించడం ఓ విశేషమేనని చెప్పాలి: "సోదర సోదరీమణులారా! ఈ వేళగాని వేళలో మిమ్మల్ని కలత పెట్టినందుకు నన్ను క్షమించండి! అయ్యా భాయీజీ! తామకూడాను! హెడ్మన్‌గారూ! మీరుకూడాను! మీకు కలుగజేసిన ఈ అసౌకర్యానికి మమ్మల్ని మనస్ఫూర్తిగా క్షమించండి. ఆవేశంలో నేనేమయినా పరుషవాక్కులు పల్కి మీ హృదయాలను గాయపరచినట్లయితే నన్ను హృదయపూర్వకంగా క్షమించండి. గురుఆజ్ఞ నిర్వర్తించే టందుకే ఇదంతాను! ఇహ వలంటీర్లంతా ఆ ప్రక్కగదిలోకి పదండి. మిగిలిన వాళ్ళంతా విశ్రాంతి తీసుకోండి. సత్‌శ్రీ అకల్!" అని అన్నాడు.

"సత్ శ్రీ అకల్!" అని కొంతమంది అన్నారు.

వాకిలి ప్రక్కనున్న మీత్‌సింగు గది ఖాళీ చెయ్యబడింది. ఆయువకులు వలంటీర్లను వెంటబెట్టుకొని ఆ గదిలోకెళ్ళేరు. మరి కొన్ని లాంతర్లను ఆ గదిలోకి తీసుకొచ్చేరు. ఆ యువనాయకుడు ఓ మ్యాప్‌ను మంచంపై విప్పి పరచాడు. ఓ హరికేన్ లాంతర్ని మీదికెత్తి పట్టుకున్నాడు. వలంటీర్లంతా ఆ మ్యాప్‌చుట్టూ మూగారు!

"నది, వంతెన ఎక్కడ ఏ స్థితిలో ఎంతదూరంలో వున్నాయో మీరంతా గమనిస్తున్నారు కదూ?" అనడిగాడు వ్రేలుతో నిర్దేశించి చూపుతూ.

"ఊఁ! ఊఁ! చూస్తున్నాము!"

"మీలో ఎవరి దగ్గరయినా తుపాకులున్నాయా?"

వాళ్ళంతా ఒకరిముఖాలొకరు చూసుకున్నారు.

"లేవు! మాలో ఎవ్వరిదగ్గరా తుపాకులు లేవు!"

"పరవాలేదు. మా దగ్గర కొన్ని రైఫిల్సు వున్నాయి. రెండు స్టెన్‌గన్సుకూడా వున్నాయి. మీరు మీ కత్తుల్ని, బల్లేలను పట్టండి. ఈ సమయంలో అవి తుపాకులకంటే అధికంగా ఉపయోగ పడతాయి!" అని కొంచెంసేపు మౌనంగా వూరుకొని, "ఇహ పథకం వినండి. రేపు సూర్యాస్తమానం అయేక, బాగా చీకటిపడ్డాక, వంతెనమీదవున్న మొదటి స్పేన్‌కి అడ్డుగా ఓ బలమైన త్రాడును ఇంజను పొగగొట్టానికి ఓ అడుగు ఎత్తున వుండేటట్లు కడతాము. ట్రైను వంతెనపైనుండి పోయేటప్పుడు ట్రైను పైకప్పుపై కూర్చున్న వాళ్ళందరినీ అది నిస్సందేహంగా క్రిందకు తుడిచి పారేస్తుంది. ఈ రకంగా చచ్చేవాళ్ళ సంఖ్య సుమారు నాలుగైదు వందలుంటొచ్చు!"

ఆ పథకాన్ని వింటున్న వాళ్ళ కళ్ళు ఆశ్చర్యంతో తళుక్కున మెరిశాయి. వాళ్ళు ఒకరివేపొకరు చూసుకుంటూ అంగీకార సూచకంగా తలలూపారు.

హెడ్మను, మీట్‌సింగు తలుపుదగ్గర నిలబడి తమ పథకాన్ని వింటున్నారన్న సంగతి ఆ యువనాయకుడు గమనించాడు. వాళ్ళకేసి తిరిగి కోపంగా, "భాయీజీ! మీ కెందుకీ విషయాలన్నీ? వెళ్ళి ప్రార్థన చేసుకోండి!" అని అన్నాడు.

మారుమాట్లాడకుండా అతిథియులూ వెనుదిరిగారు. తానింకా అక్కడే తచ్చాడుతే తననుకూడా అలాగే పొమ్మంటాడని హెడ్మన్‌కు తెలుసు! అందుకనే ఆ యువకుడు పొమ్మని చెప్పకముందే మీట్‌సింగ్‌తోపాటు హెడ్మన్‌కూడా వెనుదిరిగాడు.

"అయ్యా హెడ్మన్‌గారూ! అర్జంటుగా పోలీసుస్టేషనుకెళ్ళి ఈ సంగతంతా రిపోర్టు చెయ్యండి!" అని హేళనగా అన్నాడా నాయకుడు. అంతా ఫకాలున నవ్వేరు.

నిశ్శబ్దంగా ఉండమని సభాసదులను కోరి, మళ్ళీ చెప్పడం మొదలెట్టేడు. "అర్ధరాత్రి గడిచాక చందున్నుగ్గర్‌ని ట్రైను వదిలి పెడుతుంది. ఆ ట్రైనులో ఏ కంపార్టుమెంటులోనూ లైట్లు వుండవు! ఆఖరికి ఇంజనుకు కూడా హెడ్‌లైటుండదు. నూరుగజాల కొకడి చొప్పున మనం మన వాళ్ళను ట్రైను బయలుదేరిన దగ్గరనుంచి బ్రిడ్జివరకూ వాళ్ళ చేతికి ఫ్లాష్ లైట్లు ఇచ్చి నిలబెడతాము. ప్రతివ్యక్తీ ట్రైను తనను దాటిన వెంటనే ప్రక్కవాడికి సిగ్నల్ ఇస్తాడు. ఇంతకీ ట్రైను మనను సమీపిస్తున్నకొద్దీ చప్పుడు ఎలాగూ వినిపిస్తుంది! కత్తులు, బల్లేలు పట్టుకున్నవాళ్ళు బ్రిడ్జి దగ్గర సిద్ధంగా వుంటారు. ట్రైను పైకప్పుపై నుంచి క్రిందపడ్డ వాళ్ళందరినీ చంపేసి నదిలోకి త్రోసెయ్యడం వాళ్ళపని! రైలు కమ్ములకు కొద్ది

గజాల దూరంలో తుపాకీలు పట్టుకున్నవాళ్ళు తుప్పలమాటున పొంచి వుండి, రైలు కిటికీలకేసి గుళ్ళవర్షం కురిపిస్తారు. ఒకవేళ ఆ బండిలోంచి ఎవరైనా కాల్పులు జరిపినా మరేం భయంలేదు. పాకిస్తానీ సైనికులు పన్నెండుమంది మాత్రమే ఆ ట్రైనులో వుంటారు. ఆ చీకట్లో ఎవర్ని షూట్ చెయ్యడమో వాళ్ళ కనుపించదు. తమ తుపాకులలో తూటాలు ఎక్కించుకోడానికైనా వాళ్ళకసలు టైముండదు! ఒకవేళ వాళ్ళు రైలు నాపితే ఇంకా ఎక్కువమందిని మనం చంపెయ్యొచ్చు!" అని అన్నాడు.

వాళ్ళంతా ఈ పథకం ఎంతో నిర్దుష్టంగాను, ఖచ్చితంగాను ఉందనుకున్నారు. ప్రతిఒక్కరూ సంతృప్తిచెందారు.

"చాలా రాత్రయింది. ఇహ నిద్రపోడం మంచిది. రేపుదయం మనం బ్రిడ్జీ దగ్గరకెళ్ళి ఎవరెవర్ని ఎక్కడెక్కడ నిలబెట్టాలో, ఎవరెవరికి ఏఏ పనులు పురమాయించాలో నిశ్చయించుకుందాము! భగవత్ కార్యాన్ని నిర్వహించడం కోసమే సిక్కుజాతి ఉద్భవించింది! విజయం మనదే!" అని అన్నాడు.

"విజయం మనదే!" అని అంతా ముక్తకంఠంతో నినదించారు. సమావేశం ముగించబడింది.

ఆ యువకులు గురుద్వారాలో ఓ గదిని ఆక్రమించుకున్నారు. మల్లిగాడు, వాడి గేంగుకూడా పడుకోడానికక్కడ జాగా సంపాదించుకున్నారు. చాలామంది గ్రామస్థులు తమతమ ఇళ్ళకు వెళ్ళిపోయారు. అక్కడున్నట్లయితే ఆ కుట్రలో తమకూ భాగమున్నట్లు పోలీసువారు భావించి, తమపైకూడా నేరారోపణ చేస్తారేమోనని వాళ్ళ భయం!

ఇద్దరు గ్రామస్థుల్ని వెంటబెట్టుకొని హెడ్మన్ బందుసింగ్ పోలీసు స్టేషనుకేసి బయలుదేరాడు.

16

"ఊఁ" అని నీరసంగా మూల్గి, "వాళ్ళు చంపదల్చుకున్నారా ఇనస్పెక్టర్? సరే! చంపనీ! నువ్వు మాత్రం చుట్టుప్రక్కలగల పోలీసు స్టేషన్సుకి సహాయాన్ని అపేక్షిస్తూ మెసేజ్ పంపు. ఆ రికార్డంతా జాగ్రత్తగా ఉంచు. ఈ దారుణ హత్యాకాండ నాపుచెయ్యడానికి మన శక్త్యానుసారం మనం పాటుపడ్డట్లు రుజువు చేసుకోడానికి కావలసిన రికార్డెడ్ ఎవిడెన్సుని మనం సృష్టించుకోవాలి!" అని అన్నాడు హూకుమ్ చాంద్.

హూకుమ్‌చాంద్ బాగా అలసి పోయినట్లగు పిస్తున్నాడు. నీరసంగాను, నిస్పృహ చెందిన వాడిలాగ అగుపిస్తున్నాడు. "నేనేంచెయ్యటం? ఈ ప్రపంచమంతా పిచ్చెత్తిపోతోంది! పిచ్చెత్తిపోనీ! ప్చ్! పోనిద్దూ! మరో వెయ్యిమందికి పైగా చచ్చిపోయారే అనుకో. అప్పుడు మళ్ళీ బుల్‌డోజరు తెచ్చి అందర్నీ పాతిపెట్టేస్తాము. అసలింతకీ ఈసమయంలో నది ఒడ్డున యీమారణహోమం జరిగినట్లయితే బుల్‌డోజరు అనవసరం. శవాలను నదిలోకి త్రోసెయ్యొచ్చు. లక్షలాది అమాయకప్రజలు ఎంతో ఘోరంగా చంపబడుతున్నప్పుడు, ఓ పెద్ద భూకంపం వచ్చి అందర్నీ ఒక్కసారిగా పొట్టను పెట్టుకుంటే ఎవ్వరికీ ఏ బాధా వుండదు." అని అన్నాడు హూకుమ్‌చాంద్ రుద్ధకంఠంతో.

తన సహజమయిన ధోరణికి విరుద్ధంగా హూకుమ్‌చాంద్ మాట్లాడు తున్నాడని ఆ సబిన్‌స్పెక్టర్ గ్రహించేడు. తన హృదయాన్ని కెలికి వేస్తున్న బాధను అణచుకొనే ప్రయత్నంలో అతనలా మాట్లాడుతున్నాడని గ్రహించేడా సబిన్‌స్పెక్టరు.

"సార్! జరుగుతున్న పనులగురించీ, మనం చేస్తున్న పనుల గురించీ నేను జాగ్రత్తగా రికార్డు మెయిన్‌టెయిన్ చేస్తున్నాను. నేను

సైనికుల్నిగాని, నా స్వంత కానిస్టేబుల్నిగాని విశ్వసించలేదు. నేను చేసినదేమిటీ అంటే: ట్రైనులో పాకిస్తానీ సైన్యం ముస్లిముల సంరక్షణార్థం వున్నదనే పుకారును వ్యాప్తి చెయ్యడం: ఈ పుకారు వాళ్ళని భయపెట్టడానికి బాగా పనికొచ్చింది. అదే సమయంలో నేను ముస్లిముల నందరినీ భద్రంగా శిబిరాలకు చేర్చివేశాను. కాని దాడి చేయదలచిన వాళ్ళకు యదార్థం తెలియడానికి ఎంతోసేపు పట్టలేదు. వాళ్ళు మహా కోపంతో ముస్లిముల గృహాలను దోచుకొని వాటికి నిప్పుపెట్టేరు. వాళ్ళల్లో కొంతమంది పోలీసుస్టేషనుకు నాగురించి వస్తారనుకున్నాను. కానిరాలేదు. వాళ్ళింకేదో క్రొత్త పథకం ఆలోచించుంటారు. ఇంతకీ చెప్పొచ్చేదేమిటీ అంటే: తమను తమ ఇళ్ళనుంచి ఖాళీ చేయించినందుకుగాను ముస్లిములు, వాళ్ళాశించినవన్నీ దోచుకోడానికి అవకాశం లేకుండా చేసినందుకు గాను సిక్కులు నన్ను ఎంతగా దూషించాలో అంతగాను దూషించేసు. ప్రస్తుతం తామకూడా నన్ను ఎందుకో ఒకందుకు తిట్టొచ్చు. నిజానికి నాకిప్పుడు సహాయపడుతున్నదల్లా ఈ బొటనవ్రేలు మాత్రమే:" అని నవ్వుతూ తన బొటనవ్రేలును, వ్రేలు ముద్రవేస్తున్న వాడిలా ఇటూ అటూ త్రిప్పేడా సబినస్పెక్టరు.

అవాళ హుకుమ్‌చాంద్ మనస్సు ఏమీ బాగులేదు. సబినస్పెక్టరు చెప్పినది అతను సరిగ్గా అవగాహన చేసుకున్నట్లు లేదు.

"చూడు ఇనస్పెక్టర్! ఈ వ్యవహారంలో నీకూ నాకూ చెడ్డపేరు తప్పితే ఇంకేమీ రాదు. ఇంతకీ మనమేం చెయ్యగలం? మనుష్యుల్ని తుపాకులతో కాల్చి, బల్లేలతో పొడిచి, కత్తులతో నరికి చంపాలనే సరదా, ప్రతి ఒక్కరికీ పట్టుకుంది. మనుష్యులతో కిక్కిరిసివుండే ట్రైన్సు మీదికి మోటారు కన్వాయిల మీదికి, నడిచిపోతూండే శరణార్థుల సమూహాల మీదికి, హోలీపండుగనాడు ఎర్రటి వసంతాన్ని పిచికారితో ఉల్లాసంగా చిమ్మేటట్లు, రైఫిలు గుళ్ళను విరజిమ్ముతున్నారు. మానవరక్తాన్ని

ఒకరిపై ఒకరు చిమ్ముకొనే ఘోరీ పండుగిది. తుపాకీగుళ్ళు ఎగిరే స్థానానికి వెళ్ళడంలో అర్థమేమయినా వుందంటావా? 'వీడు హుకుమ్‌చాంద్. డిప్యూటీ కమీషనరు. వీడిని ముట్టుకోకూడదు.' అనే విచక్షణాజ్ఞానం తుపాకీ గుండుకుండదు. ఇకపోతే ఆ గుండు ఎవరిచే పేల్చబడిందో వారి పేరయినా వుండదు. ఒకవేళ ఆ గుండుపై ఎక్కడో ఓ దగ్గర ఆ పేల్చిన వాడి పేరుందే అనుకో, అందువల్ల ప్రయోజనమేమిటి? ఏమీలేదు. అంచేత జుర్రలో బుద్ధి, జ్ఞానం వున్న ప్రతివ్యక్తీ వాళ్ళెంత వెర్రిగా ప్రవర్తిస్తున్నారో అంత వెర్రిగా ప్రవర్తించాలి. అంతా నటన. భయంకరమైన నటన. ఈ నాలుగు గోడలలోంచి అందరికన్నా ముందు బయటపడడానికి ప్రయత్నించాలి."

ఈ రకమైన హుకుమ్‌చాంద్ ధర్మోపన్యాసాలకు ఆ సబిన్‌స్పెక్టరు బాగా అలవాటుపడ్డాడు. అతని మనస్సులోగల నిజమైన అభిప్రాయాన్ని తెల్సుకోడానికి అతని ఈ రకమైన ధర్మోపన్యాసాలు అతి తక్కువగా మాత్రమే ఉపయోగ పడతాయని అనుభవ పూర్వకంగా గ్రహించేడు. కాని హుకుమ్‌చాంద్ తగినచర్య తీసుకొనే విషయంలో స్పష్టంగా కనబరుస్తూన్న అసామర్థ్యాన్ని గాంచి కాస్త ఆశ్చర్యపడ్డాడు సబిన్‌స్పెక్టరు.

హుకుమ్‌చాంద్ ఎన్నడూ ఏ విషయాన్నీ స్పష్టంగా, తిన్నగా చెప్పడనే విషయం ఆ సబిన్‌స్పెక్టరికి అనుభవైకవేద్యమే. అతని భావమేమిటో తెల్సుకోలేక తనెన్నోసార్లు అతనిముందు ఓ స్టుపిడ్‌లా వ్యవహరించిన సందర్భాలున్నాయి. ఓ చిన్న విషయాన్నికూడా డొంకతిరుగుడుగా చెపుతూంటాడు. అదేం డిప్లమసీయో మరి! అయితే ఒకటి! అతని డిప్లమసీ ఎవర్నీ ఎన్నడూ కష్టాలలోకి సాధారణంగా నెట్టివెయ్యదు. ఆ డిప్లమసీలో గల గొప్పతనం ఫలానా అని నిర్దేశించి చెప్పడం కష్టం! అతను చెప్పినట్లు చేస్తే, మంచి సమయస్ఫూర్తిగల తెలివైన వాళ్ళుగా ఎవరైనా సరే కీర్తింపబడతారు.

హుకుమ్‌చాంద్ గోప్యప్రయోజనాత్మకమైన సూచన లివ్వడంలో ప్రవీణుడు. కాని అవాళ చాలా నిస్పృహ చెందినవాడిలా అగుపిస్తున్నాడు.

"తాము నిన్న చందున్నగ్గర్‌లో ఉండుంటే బాగుండిపోయేది." ఆ సంభాషణను అసలు సమస్యకేసి మళ్ళించాలనే ఉద్దేశ్యంతో సబిన స్పెక్టర్ మళ్ళీచెప్పడం ప్రారంభించేడు. "నేను మరొక్క అయిదు నిముషాలు ఆలస్యంగా వెళ్ళుంటే అక్కడ ఒక్కముస్లిమయినా మిగలకుండా అంతా దారుణంగా చంపబడుండేవారు. కాని ఒక్కవ్యక్తయినా చంపబడలేదు. వాళ్ళందర్నీ నేను శిబిరానికి తరలించేను."

ఒక్కవ్యక్తయినా అనే పదాన్ని, వాళ్ళందర్నీ అనే పదాన్ని బాగా ఒత్తి పల్కేడు. హుకుమ్‌చాంద్ ముఖంలో ఏదైనా మార్పు వస్తుందేమోననే ఉద్దేశ్యంతో అతని ముఖ కవళికలను వీక్షించసాగేడు.

ఈ విషయం హుకుమ్‌చాంద్‌పై కొంతపనిచేసింది. "అయితే చందున్నగ్గర్‌లో ఒక్క ముస్లిమ్ కుటుంబమయినా యిప్పుడు లేదా ?" అనడిగేడు.

"లేదుసార్ ! ఒక్కటీలేదు !"

హుకుమ్‌చాంద్ గొంతుక సవరించుకొని, "ఈ గొడవలన్నీ సద్దుమణిగేక బహుశావాళ్ళు మళ్ళీ వచ్చేస్తారనుకుంటాను" అని అన్నాడు.

"రావొచ్చు ! కాని తిరిగి రావడానికి వాళ్ళ కిక్కడ యింకేవీ మిగలలేదు. వాళ్ళ ఆస్తిపాస్తులన్నీ దోచుకోబడ్డాయి. వాళ్ళయిళ్ళు దహనపరచబడ్డాయి. ఒకవేళ ఎవరైనా తిరిగొస్తే వాళ్ళబ్రతుకు ఒక మహాసముద్రంలోని ఓ చిన్న నత్తగుల్ల జీవితంకంటే ఘోరంగా ఉంటుంది."

"పరిస్థితు లెల్లకాలం యిలాగే వుండవు. ఇవి త్వరలోనే మారతాయి: ఒక వారం రోజులలోనే వాళ్ళు మళ్ళీ చందున్నగ్గర్ వచ్చే

స్తారు. విభేదాలన్నీ విస్మరించి సిక్కులు, ముస్లిములు ఒకే బందలోని నీళ్ళు త్రాగుతారు!" ఒక వెఱ్ఱిమొఱ్ఱి ఆశ హుకుమ్‌చాంద్ గొంతుక లోంచి ఈ రకంగా బయటపడింది.

"తామాశిస్తున్నట్లుగా జరగొచ్చు సార్! కాని యిలా జరగడానికి ఓ వారం రోజుల వ్యవధిచాలదేమో! చుందున్నగ్గర్‌లోవున్న ముస్లిమ్ శరణార్థుల్ని యీ రాత్రి ట్రైనులో పాకిస్తాన్ తీసుకుపోతున్నారట! బ్రిడ్జిదాటి ఆవలిఒడ్డుకి సజీవంగా ఎంతమంది వెళ్ళగలరో ఆ భగవంతుడికి మాత్రమే తెల్సు!"

సబిన్‌స్పెక్టరు యిలా అనేసరికి హుకుమ్‌చాంద్ ముఖం వెలవెల బోయింది. ఇహమరి తన నటనను కొనసాగించ లేకపోయాడు. "ఇవాళ్టి రాత్రి ట్రైనులో చుందున్నగ్గర్ కేంపులోని ముస్లిమ్ శరణార్థులు పాకిస్తాను వెళుతున్నట్లు నీ కెలా తెల్సింది?" అనడిగాడు.

"ఈ భోగట్టా నాకు కేంపు కమేండరు ద్వారా తెల్సింది. శిబిరం పైన దుండగులు దాడి జరిపే ప్రమాద మున్నట్లు అతనికి తెల్సిందట! అంచేత ఈ రాత్రి మొట్టమొదట ఏ ట్రైన్ లభ్యమయితే ఆ ట్రైన్‌లో శరణార్థుల్ని పాకిస్తాన్ పంపేయ దల్చుకున్నాడు. వాళ్ళు పాకిస్తాన్ వెళ్ళిపోకుండా శిబిరంలోనే వున్నట్లయితే శిబిరంలో ఒక్క ముస్లిమయినా సజీవంగా మిగలక పోవచ్చు! వాళ్ళు బయలుదేరిన ట్రైను తగినంత వేగంతో పోయినట్లయితే కొంతలో కొంతమందయినా ప్రాణాలతో పాకిస్తాన్ చేరుకోగలరు! ట్రైనును పడగొట్టాలనే ఉద్దేశ్యం సిక్కుల కున్నట్లు లేదు. ఆ ట్రైనును వీలయినన్ని ఎక్కువ శవాలతో పాకిస్తాన్ పంపాలని వాళ్ళ ఉద్దేశ్యం!"

"అయితే మరి ఆ కేంప్ కమేండరుకి యీ విషయమై నువ్వెందుకు తగు హెచ్చరిక చెయ్యలేదు? చేసుంటే వాళ్ళని పంపడానికి నిశ్చ యించుండక పోయేవాడేమో!"

"నన్ను క్షమించండి సార్ ! ఈ తలపెట్టబడిన ముట్టడి విషయమై నేనతనికి ఏమీ తెలియజెయ్యలేదు ! వాళ్ళు వెళ్ళకపోతే మొత్తం శిబిరమంతా ధ్వంసం చెయ్యబడుతుంది. అందుకనే అతనికి నేనీ విషయమై ఏమీ చెప్పలేదు. ఇరవై నుంచి ముప్పై వేలమంది వరకూ సాయుధ గ్రామీణ ప్రజలు రక్తదాహంతో ఉన్నారు. నా అధీనంలో ఏభై మంది పోలీసు కానిస్టేబుల్సు మాత్రమే ఉన్నారు. వాళ్ళల్లో ఏ ఒక్కడూ ఏ ఒక్క సిక్కుపైకి తుపాకిని బారుచేసి ఫైర్ చెయ్యలేదు ! తాము తమ పలుకుబడిని ఉపయోగించి ఆ సాయుధ ప్రజా సమూహానికి నచ్చచెప్పినట్లయితే, నేను ఆ కేంపు కమేండరుకీ శైనును దొంగచాటుగా సాయుధ ప్రజలు ముట్టడించ దల్చుకున్నట్లు చెప్పి శరణార్థులను యిప్పట్లో తీసుకెళ్ళవద్దని నచ్చచెపుతాను ?" అన్నాడు సబ్‌యినస్పెక్టరు తన బెల్టును సర్దుకుంటూ.

హుకుమ్‌చాంద్ కాస్త తడబడుతూ, "ఆవేశపరులై వున్న సాయుధ ప్రజా సమూహం ముందు నా పలుకుబడి ఏంపని చేస్తుంది? అబ్బే ! ఏం లాభం లేదు. మనం యీ విషయమై బాగా ఆలోచించాల్సుంది." అంటూ కుర్చీలో వెనక్కి చేరబడ్డాడు. ఏంచెయ్యడమా అని పిడికిలితో నుదుటిపై గుద్దుకుంటూ ఆలోచించ సాగాడు . కొంతసేపయాక "ఆ వడ్డీ వ్యాపారి హత్యా సందర్భంలో అరెస్టు చేసిన ఆ యిద్దర్నీ నువ్వేం చేశావు ?" అని అడిగాడు.

వాళ్ళ అరెస్టుకి సంబంధించిన భోగట్టాకు ప్రస్తుతాన్వయం ఏమిటో ఆ సబిన్స్పెక్టరుకి బోధ పడలేదు. "వాళ్ళింకా లాకప్‌లోనే వున్నారు. ఈ గొడవలు అంతమయేటంతవరకు వాళ్ళని లాకప్‌లోనే ఉంచమని తాము ఆజ్ఞాపించారు. ఈ లెక్కని వాళ్ళని మరి కొన్ని మాసాలపాటు లాకప్‌లో వుంచాల్సుంటుందేమో ననుకుంటున్నాను!" అని అన్నాడు.

"ఎవరైనా ముస్లిమ్ స్త్రీలుగాని లేదా ఎవరైనా అగంతకులైన ముస్లిములుగాని మానోమజ్రా విడచి వెళ్ళడానికి తిరస్కరించారా?"

"లేదు సార్ ! అంతా వెళ్ళిపోయారు" అని సమాధాన మిచ్చాడు. హుకుమ్‌చాంద్ మనసులో వున్న ఈ అమోఘమైన ఆలోచన ఏవిటో యింకా ఆ సబిన్‌స్పెక్టరుకి అవగతం కాలేదు.

అన్నట్లు ఎవడో ఓ ముస్లిమ్ సాలివాడి కూతురికి, జుగుత్‌సింగ్‌కు సంబంధమున్నట్లు లోగడ నువ్వొకసారి నాకు చెప్పావుకదూ? ఆ అమ్మాయి పేరేమిటని చెప్పావు ?"

"నూరాన్ !"

"ఓ ! ఇప్పుడు గుర్తు కొచ్చింది ! నూరాన్! ఇప్పుడామె ఎక్కడుంది ?"

"ముస్లిము లందరితోపాటు ఆమెకూడా వెళ్ళిపోయింది. ఆమె తండ్రి మానోమజ్రా గ్రామంలోని ముస్లిముల కందరికి ఓ రకమైన నాయకుడు ! ఆ గ్రామ హెడ్మన్ అతని గురించి నాతో చాలా చెప్పాడు. జుగ్గాతో అక్రమసంబంధంవల్ల అతని కూతురు నూరాన్ ప్రస్తుతం నెల తప్పిందనే అపవాదు కూడా వుంది !"

"సరే ! మరి ఆ రెండోవాడి సంగతేవిటి ? వాడేదో పొలిటికల్ వర్కరని చెప్పావు కదూ ?"

"ఔను సార్ ! పీపుల్సుపార్టీ అనో లేక అలాంటిదే యింకేదో అని చెప్పినట్లు గుర్తు. నా ఉద్దేశం ఏవిటీ అంటే: అతను దొంగ బురఖా క్రింద చెలామణీ అవుతున్న ముస్లిమ్ లీగరని: నేనతని బట్టలు విప్పి...." అని యింకా ఏదో అతను చెప్పబోతూంటే.

"అర్డర్సు వెయ్యడానికి నీదగ్గ రేమయినా బ్లాంక్ అఫీషియల్

పేపర్సు ఉన్నాయా?" అనడిగాడు హుకుమ్‌చాంద్: అతను చెప్పేదంతా వినడానికి ఓపికలేక.

"ఉన్నాయి సార్!" అంటూ కొన్ని పసుపుపచ్చని ప్రింటెడ్ పేపర్సు తీసి ఆ మెజిస్ట్రేటు చేతికందించాడు.

చెయ్యి ముందుకు చాచి సబిన్స్పెక్టరు జేబులోవున్న పెన్నును ఊడలాగి, కాగితాలను టేబులుపై పరచి, "ఆ ఖైదీల పేర్లేవిటి?" అనడిగాడు హుకుమ్‌చాంద్.

"జుగుత్‌సింగ్?"

"ఊ: జుగుత్‌సింగ్!" అని అంటూ ఖాళీస్థలంలో ఆ పేరు వ్రాసి క్రింద సంతకం పెట్టి, మరో కాగితంతీసి, "ఊ: మరొకడిపేరు?" అనడిగాడు.

"ఇక్బల్ మొహమ్మద్ లేదా మొహమ్మద్ ఇక్బల్: ఏది కరక్టయిన పేరో నేను నిశ్చయంగా చెప్పలేను."

"అతని పేరు ఇక్బల్ మొహమ్మదూ కాదూ: మొహమ్మద్ ఇక్బలూ కాదు: ఇక్బల్‌సింగ్!" అనంటూ ఆ పేరును ఖాళీస్థలంలో వ్రాసి క్రింద సంతకం చేశాడు.

సబిన్స్పెక్టరు కొద్ది క్షణాలసేపు అలా ప్రమాన్పడి చూసాడు. అతని పేరు 'ఇక్బల్‌సింగ్' అని హుకుమ్‌చాంద్ కెలా తెలిసింది? మీట్‌సింగ్‌ని పిలచి కనుక్కున్నాడేవిటి చెప్మా?

అనుమాన నివృత్తికోసం, "సార్: తాము ఎవర్నిపడితే వారిని నమ్మొద్దు: నేను స్వయంగా పరిశీలించి...." అని అతనింకా ఏదో చెప్పబోతూంటే.

"విద్యాధికుడైన ముస్లిమ్ యువకుడు ఇలాంటి సమయంలో ఇలాంటి సరిహద్దు ప్రాంతానికి వస్తాడని నువ్వు విశ్వసిస్తున్నావా? ముస్లి

ముల రక్తాన్ని కసితీరా త్రాగాలని ఉవ్విళ్ళూరుతున్న సిక్కులకు శాంతి, సహనాల గురించి బోధించడానికి ఏపార్టీ అయినా ముస్లిమ్ యువకుణ్ణి పంపిస్తుందంటావా? బాగా ఆలోచించు!" అని అన్నాడు హుకుమ్‌చాంద్.

సబిన్‌స్పెక్టరు ఆలోచించసాగాడు! సాధారణంగా విద్యార్థికుడెవ్వడూ ప్రమాదాలలో తలదూర్చ డానికంగీకరించడు. సురక్షితమైన స్థలంలోవుండే కబుర్లు చెపుతూంటాడు! అదీకాక ఇక్బాల్ కుడిచేతి మణికట్టుకి ఒక ఉక్కు కంకణం సిక్కులందరికీ ఉన్నట్లుగానే ఉంది! అంచేత ఇక్బాల్ సిక్కు మతస్తుడే అయుండొచ్చని అప్పుడనుకున్నాడు సబిన్‌స్పెక్టరు.

"తామే రైటుసార్. అతను సిక్కే అయుంటాడు! అయితే మరి దైర్రైను ముట్టడిని నివారించడానికి మన ఈ చర్య ఏ విధంగా తోడ్పడు తుందో నాకర్థం కాలేదు."

"నా ఈ చర్య కరక్టయినదే! చుందున్నుగ్గర్‌కి వెళ్ళేదారిలో నా ఈ చర్య గురించి బాగా ఆలోచించు. నీమటుక్కు నీకే అవగతమవుతుంది! నువ్వు చుందున్నుగ్గర్ చేరిన వెంటనే వాళ్ళిద్దర్నీ రిలీజ్ చేసేసి, వాళ్ళని తక్షణం మానోమఙ్ఞ్రా పంపించే ఏర్పాటు చెయ్యి. అవసరమయితే ఓ టాంగా తెప్పించి, వాళ్ళనందులో పంపించే ఏర్పాటు చెయ్యి. సాయంత్ర మయేసరికి వాళ్ళు మానోమఙ్ఞ్రాలో వుండితీరాలి!" అనిఅన్నాడు.

"అలాగే సార్!" అని ఆ కాగితాలు తీసుకొని, అతనికి గౌరవ ప్రపూర్వకంగా శాల్యూట్ చేసి, సైకిలుమీద బయలుదేరాడు.

క్రమక్రమంగా అతనిమనస్సులో క్రమ్ముకొనివున్న అయోమయపు మబ్బులన్నీ విడిపడ్డాయి. ఒక పెద్ద వర్షం పడిన అనంతరం మబ్బులన్నీ అదృశ్యమయేక, ఆకాశం ఎంత నిర్మలంగా వుంటుందో అప్పుడతని మనస్సు అంత నిర్మలంగా వుంది! హుకుమ్‌చాంద్ యొక్క ప్లానేమిటో అప్పుడతనికి సంపూర్ణంగా అవగతమయింది.

17

"మానోమజ్రాలో కొంతమార్పొచ్చినట్లు మీరు గమనించగలరు!" అన్నాడు సబిన్స్పెక్టరు: అతని టేబులుముందు నిల్చున్న ఇక్బాల్‌ని, జుగ్గాని ఉద్దేశించి. వాళ్ళేమీ అనలేదు. వింటూ నిలబడ్డారు.

సబిన్స్పెక్టరు తలెత్తిచూసి, ఇక్బాల్ నుద్దేశించి, "అరే! నిలబడి పోయే వున్నారే! కూర్చోండి!" అనంటూ ప్రక్కకు తిరిగి, "ఎవరోయ్ అక్కడ? ఏమిటీ నీపేరు? బాబుగారు కూర్చోడానికి ఇంకో కుర్చీ తీసుకు రాలేదేం?'' అని ఓ కానిస్టేబులుకేసి చూసి అని, మళ్ళీ ఇక్బాల్‌కేసి తిరిగి, "నాపై మీకు కోపం వున్నట్లు నాకు తెలుసు! కాని నన్నేంచెయ్యమంటారు? ఇది నా తప్పుకాదు! నా ఉద్యోగధర్మాన్ని నేను నిర్వర్తించక తప్పదు మరి! ప్రజలపట్ల విచక్షణ చూపితే ఏం జరుగుతుందో మీలాంటి చదువుకున్న వాళ్ళకు నేను ప్రత్యేకించి చెప్పనవసరం లేదు!" అని అన్నాడు. కానిస్టేబులు ఇక్బాల్ కోసమని ఓ కుర్చీ తెచ్చి వేశాడు.

"కూర్చోండి. మీరు వెళ్ళిపోయేలోగా మీకొక కప్పు టీ గాని, మరే దయినా గాని తెప్పిస్తాను" అని అన్నాడా సబిన్స్పెక్టర్ జిడ్డోడుతున్న ముఖంతో.

"మీ కరుణార్ద్ర హృదయతకు అభివందనాలు. ఇన్నాళ్ళయి నేను సెల్లులో కూర్చొనేవున్నాను. కాళ్ళు గుంజెక్కి పోయున్నాయి! నిలబడుండడమే నాకు సుఖంగా వుంది. మీరేమీ అనుకోక పోయినట్లయితే నా మనవి ఒకటుంది! మీరు మీ లాంఛనా లన్నింటినీ త్వరగా పూర్తిచేసి నన్ను ఎంత వేగిరం వీలయితే అంత వేగిరం వదిలిపెట్టండి!'' అతని ముఖంకేసి చూడకుండా ఇక్బాల్ అన్నాడు.

"మీ ఇష్టమొచ్చిన దగ్గరకు, మీ ఇష్టమొచ్చినప్పుడు వెళ్ళిపోడానికి మీకిప్పుడు స్వేచ్ఛవుంది! మిమ్మల్ని మానోమజ్రా గ్రామానికి దిగబెట్టడం కోసమని ఓ టాంగా తీసుకు రమ్మన్నాను. ఒక సాయుధ కానిస్టేబుల్ని మీతో పంపుతాను. తగిన రక్షణ లేకుండా చందున్నగర్‌లో వుండడం గాని, ఒంటరిగా ప్రయాణం చెయ్యడంగాని ఈ రోజుల్లో అంత మంచి పని కాదు!" అనంటూ ఒక పసుపుపచ్చ కాగితంతీసి, "జుగుత్‌సింగ్- ఆలమ్‌సింగ్ కొడుకు- వయస్సు ఇరవైనాల్గు సంవత్సరాలు- మానోమజ్రా గ్రామం- సిక్కు-జాతి- బద్మాష్ నెంబరు పది! "అని చదివాడు.

జుగుత్‌సింగ్ కళ్ళు ఆనందంతో మెరిసాయి! పోలీసువాళ్ళ లాంఛనప్రాయ తతంగమంతా వాడికి క్రొత్తకాదు!

"నిన్నువదిలేస్తున్నాము. నువ్వు డిప్యూటీ కమీషనర్ శ్రీ హుకుమ్ చాంద్ గారి ముందు ఎల్లుండుదయం పదిగంటలకు తప్పక హాజరవాలి. నీ వేలిముద్ర ఇక్కడవెయ్యి అంటూ జుగుత్‌సింగ్‌యొక్క ఎడంచేతి బొటన వేలును పెల్చి ఇంకింగ్ పేడ్‌పైనొక్కి కాగితంపై వేలుముద్ర వేయించాడు.

"నేనిక వెళ్ళిపోవచ్చా!" అనడిగాడు జుగుత్‌సింగ్.

"బాబుగారితో కలసి టాంగాలోవెళ్ళిపో. లేకపోతే చీకటిపడేలోగా నువ్వు ఇంటికి చేరుకోలేవు." అని తలెత్తి జుగ్గా ముఖంలోకి చూస్తూ, "మానోమజ్రా ఇదివరకటిలాగ లేదు!" అని అన్నాడు.

మానోమజ్రాపై సబిన్‌స్పెక్టరు చేసిన రిమార్కుపై జుగ్గాకాని, ఇక్బాల్ కాని ఏమీ ఆసక్తి కనపరచలేదు.

ఆ తరువాత సబిన్‌స్పెక్టరు మరో కాగితం తీసి, "ఇక్బాల్‌సింగ్! సోషల్ వర్కర్!" అని చదివేడు.

ఇక్బల్ ఆ కాగితంకేసి చిరాగ్గా చూస్తూ, "ముస్లిమ్‌లీగ్ మెంబరు మొహమ్మద్ ఇక్బల్, ఇక్బల్‌సింగ్‌గా మారిపోయేదా ఇప్పుడు? ఎలాక్కావాలంటే అలా డాక్యుమెంట్లను సృష్టించే సామర్థ్యం మీకున్నట్లుంది!" అని అన్నాడు.

సబిన్‌స్పెక్టరు నవ్వుతున్నవాడిలా పక్మికిలించి, "ప్రతి ఒక్కడూ తప్పులు చేస్తూనే వుంటాడు. తప్పులు చెయ్యడం మానవునివంతు. క్షమించడం భగవంతుని వంతు. నేను నాతప్పుని ఒప్పుకుంటున్నాను!" అని అన్నాడు.

"మీరు గొప్ప విశాలహృదయం గలవారు! కాని ఇండియన్ పోలీసులు ఎన్నడూ పొరపాటు పడరనే నమ్మకం నాకున్నది!" అని హేళనగా అన్నాడు ఇక్బల్.

"నన్ను వేళాకోళం చెయ్యాలని మీకుంటే చెయ్యండి. ఇట్లాంటి అలజడి రోజులలో మీరనుకున్న విధంగా ఉపన్యసించి సిక్కు ప్రజా సమూహాల చేతులలోచిక్కుకుంటే మీ గతేమవుతుందో మీరింకా గుర్తించినట్లు లేరు. వాళ్ళు మీ వాదాన్ని వింటూ కూర్చోరు! ముందు మిమ్మల్ని దిగంబరుణ్ణిచేసి మీరు సుంతీ చేయించుకున్నదీ లేనిదీ చూస్తారు! సిక్కులలో జుత్తూ, గెడ్డం లేని వాళ్ళు ముస్లిములా కాదా అని తేల్చుకోడానికి వాళ్ళు చేసే పరీక్ష ఇదొక్కటే! సుంతీ చేయించుకున్నవాళ్ళను వాళ్ళు నిర్దయగా చంపుతారు. నేను మిమ్మల్ని స్వేచ్ఛగా వదిలిపెట్టుంటే ఈసరికి వాళ్ళ చేతులలో మీరు చనిపోయుండేవారు. అంచేత మీరు నాకు కృతజ్ఞులై వుండక తప్పదు!" అని అన్నాడు.

ఇక్బల్ మాట్లాడే పరిస్థితిలో అప్పుడు లేడు. అదీగాక అప్రస్తుత విషయాల గురించి అతను సాధారణంగా ఎవ్వరితోనూ చర్చించడు. లోపల్లోపల అతను కోపంతో మండుతున్నాడు, ఆ సబిన్‌స్పెక్టర్ ధోరణికి. అంచేతే అతను అడ్డుతగలలేదు.

"మానోమజ్రాలో చాలా మార్పులొచ్చాయి!" అని మరోసారి అన్నాడా సబిన్‌స్పెక్టరు.

ఈ సారికూడా జుగ్గాగాని, ఇక్బాల్‌గాని ఏరకమైన ఆసక్తి కనపర్చలేదు. ఇక్బాల్ సంతకం చేసి ఆ పుస్తకాన్ని టేబులుపై పడేసి కనీసం వీడ్కోలు వందనమయినా చెప్పకుండా గిరుక్కున వెనక్కు తిరిగాడు. జుగ్గా జోళ్ళు తొడుక్కున్నాడు.

"మానోమజ్రానుంచి ముస్లిములంతా వెళ్ళిపోయేరు." అని సబిన్‌స్పెక్టరు అన్నాడు నాటకీయత ఉట్టిపడేటట్లు.

వెళ్ళిపోతున్న జుగ్గా ఆగి- "ఏడకెళ్ళిపోనారు?" అనడిగాడు ఆందోళనతో.

"నిన్న వాళ్ళని శరణార్థుల శిబిరానికి తీసుకెళ్ళారు. ఇవాళరాత్రి ట్రైనులో పాకిస్తాన్ వెళ్ళిపోతారు."

"బాబూ! మావూళ్ళో ఏమైనా మతకలహాలొచ్చినాయా? ఆళ్ళెందుకెళ్ళిపోనారు?"

"వాళ్ళు వెళ్ళకపోయుంటే తప్పక మతకలహాలొచ్చుండేవి! దారి కడాకు ముస్లిములను చంపుకుంటూ పైనుంచి చాలామంది వొచ్చారు తుపాకులు పట్టుకొని! మల్లిగాడు, వాడి సహచరులు వాళ్ళతో చేతులు కలిపేరు. ముస్లిములు మీ గ్రామాన్ని వదిలిపెట్టి వెళ్ళకపోయున్నట్లయితే ఈసరికి మల్లిగాడు, వాడి సహచరులు కలసి మీ ఊళ్ళోగల ముస్లిములందర్నీ హతమార్చుండేవాళ్ళు! వాళ్ళు మీగ్రామ ముస్లిముల పశువులను, కోళ్ళను, బాతులను, పాత్ర సామాగ్రిని, తదితర వస్తువులను తమ స్వంతం చేసుకున్నారు."

జుగ్గా మరి కోపాన్ని పట్టలేకపోయాడు. పళ్ళు పటపటకొరుకుతూ "ఆడమ్మతో తొంగొనే ఆ నంజకొడుకు నానూళ్లో లేకపోడంసూసి

ఎంతపని చేసిండు? ఆడు మళ్ళీ మావూళ్ళో అడుగెట్టినాడంటే నా దుడ్డు కర్రను ఆడి పొట్టలోంచి గుచ్చేసి వెనకాలనుంచితీసేస్తాను" అనిఅన్నాడు.

ఆ సబిన్‌స్పెక్టరు పెదవులు నాక్కొంటి అవహేళన చేస్తున్నట్లుగా నవ్వుతూ, "ఓ సర్దార్! నువ్వెంతో ధైర్య సాహసాలు గలవాడిలా ఘనంగా మాట్లాడుతున్నావు. ఏదో వాడు పరాగ్గాఉన్నప్పుడు అకస్మాత్తుగా వాడి జుత్తు పట్టుకొని కొట్టినమాట వాస్తవమే! ఈ మహా ఘనకార్యం చేసినందుకుగాను నువ్వో పెద్ద సింహానివనుకోకు! మల్లిగాడు చేతులకు గోరింటాకు పెట్టుకొని, గాజులు తొడుక్కొని ఇంట్లో ఆడదానిలా కూర్చో లేదు! తనకు కావలసినవన్నీ దోచుకొని వాడు మీ ఊళ్ళోనే తన సహ చరులతో సహా తిష్టవేశాడు. నువ్వెళ్ళేసరికి వాడింకా మీ ఊళ్లోనే వుంటాడు!" అనన్నాడు.

"నా పేరినేసరికి మురికి నక్కలా పారిపోతాడు!"

"వాడికండగా వాడిసహచరులేకాక, ఇంకా ఎంతోమంది తుపాకులు పిస్తోళ్ళు ధరించి వున్నారు. ప్రాణంపై నీకేమయినా ఆశున్నట్లయితే ఎంతో జాగ్రత్తగా, మంచి తెలివితేటలతో నువ్వు ప్రవర్తించాల్సిం టుంది!"

జుగ్గా తల తాటిస్తూ, "సరే బాబూ! మనం మళ్ళీ ఎలాగా కల్సు కుంటాముగందా! అప్పుడు నన్నడగండి మల్లిగాడి గురించి! ఆడినోట్లో నానుమ్మకపోతే నాపేరు జుగుత్‌సింగే కాదు!" కోపాన్ని అణచుకోలేక తన చేతిమీద తుపుక్కున ఉమ్మికొని, తన తొడకు తుడిచేసుకున్నాడు. వాడిలో కోపం అంతకంతకు ఎక్కువవుతోంది. వాడి శరీరంలో రక్తం సలసల మరుగుతోంది! "కాకీబట్టలేసుకొని మీ పోలీసోళ్ళు అడ్డు తగలక పోయున్నట్లయితే, నాకేసి కన్నెత్తిసూసేవోళ్ళని అళ్ళ బాబులకాడికి పంపి చేస్తాను!" అని మహోద్రేకంతో అన్నాడు.

"సరేనయ్యా! నువ్వు గొప్ప ధైర్య సాహసాలు గలవాడివని మేమూ ఒప్పుకుంటున్నాము. నువ్వలా అంటున్నప్పుడు మేమెందుకు కాదనాలి? అది సరేగాని చీకటి పడకముందే నువ్వు ఇంటికి చేరుకో! నీతో పాటు ఈ బాబు గారినికూడా తీసుకుపో!" అని వాడితో అని ఇక్బాల్ కేసి తిరిగి, "బాబూ! మీరిక భయపడాల్సిన అవసరంలేదు. ఈ జిల్లా కంతటికి మిక్కిలి ధైర్య సాహసాలుగల వ్యక్తి మీకండగా వుంటాడు!" అని అన్నాడు.

ఆ ఎత్తిపొడుపుకి తగిన సమాధానం జుగ్గా ఇంకా చెప్పకముందే ఓ కానిస్టేబులు అక్కడికొచ్చి టాంగా తీసుకొచ్చినట్లు చెప్పాడు.

"సత్ శ్రీ అకల్ ఇనస్పెక్టరుబాబూ! మల్లిగాడు మొర్రోమని ఏడుస్తూ నామీద పిర్యాదు చెయ్యడానికి తమ కాడికొచ్చినప్పుడు తెల్సు కుంటారు: ఈ జుగ్గా వొట్టి గొప్పలు సెప్పేవోడు కాదని!"

సబినస్పెక్టర్ నవ్వుతూ, "సత్ శ్రీ అకల్ జుగ్గా! సత్ శ్రీ అకల్ ఇక్బాల్ సింగ్‌జీ!" అని అన్నాడు.

మరి వెనక్కి తిరిగి చూడకుండా ఇక్బాల్ అవతల కెళ్ళిపోయాడు. టాంగాలో వాళ్ళు బయలుదేరేరు. అదొక సుదీర్ఘమయిన గతుకులదారి.

ఈసారి జుగ్గా పోలీసు కానిస్టేబులుతోను, డ్రైవరుతోను, ఫ్రంటు సీటులో కూర్చున్నాడు. వెనుక సీటంతా ఇక్బాల్‌కి వదిలిపెట్టేసాడు. మాట్లాడే పరిస్థితిలో ఎవ్వరూలేరు. నిజానికి టాంగా డ్రైవరుకి ఆ సమయంలో టాంగా కట్టాలని లేదు. అయినా పోలీసువారి బలవంతంవల్ల కట్టేడు. గుఱ్ఱాన్ని అదేపనిగా బాదుతూ అయిష్టంగా తోలుతున్నాడు. ఇక పోతే మిగిలిన వాళ్ళంతా ఎవరి ఆలోచనల్లో వాళ్ళు మునిగిపోయారు.

ఆ మార్గంలోని గాతలన్నీ నీళ్ళతో నిండి వుండడంవల్ల మార్గం చదునుగా వున్నట్లగుపిస్తోంది. అది నిర్మానుష్యంగా వుంది. పొలాలలో

రైతు కూలీలెవ్వరూ కనిపించలేదు. కనీసం గడ్డిమేసే పశువులయినా కనిపించలేదు. రెండు గ్రామాలను దాటుకొని వాళ్ళు వెళ్ళేరు. కుక్కల సంచలనం తప్పితే ఆ గ్రామాలలో మనుష్యుల సంచలనం వాళ్ళకగుపించ లేదు. అయితే ఒకటి రెండుసార్లు ఎవరో తుపాకీయో, బల్లెమో పట్టుకొని దూరంగా ఓ గోడ వెనకాల నక్కివున్నట్లు ఓ త్రుటికాలం వాళ్ళకళ్ళకు అస్పష్టంగా కనిపించింది।

జగ్గా, కానిస్టేబులు, టాంగా డ్రైవరు అంతా సిక్కులవడంవల్ల, వాళ్ళతో తను వెళుతూండడంవల్ల తను బ్రతికి పోయేననుకున్నాడు. లేక పోతే ఈసరికి టాంగా ఆపి తన అంతు చూసుండేవారు। తన ప్రాణాలను కాపాడుకొనేటందుకు తన సిక్కిజమ్‌ను రుజువు చేసుకొనేటందుకు ఎక్కడ అవకాశముంటుందో అక్కడకు సాధ్యమయినంత వేగంగా వెళ్ళిపోవాలి. మానోమజ్రాలోవున్న తన సామాన్లను పట్టుకొని ఫస్టు ట్రైను అందుకో వాలి. బహుశా ట్రైన్సు నడవడంలేదేమో ! ఒకవేళ వున్నా ఇలాంటి సమయంలో రైలు ప్రయాణం చెయ్యడంలో ప్రమాద ముండదని ఎలా అనుకోడం ! ‘ ఇక్బల్ ’ అనే పేరు తనకొక శాపంలా తయారయింది। ఈనాడు ఈ భారతదేశంలో ఒక మనిషి చావు బ్రతుకులు సుంతీ చేయించుకున్నాడా లేదా అనే విషయంపై ఆధారపడు న్నాయి। విషాదాంతం కాకపోతే నవ్వుకోదగ్గ విషయమిది। ఈ పరిస్థితిలో తను మానోమజ్రాలో మీట్‌సింగ్ సంరక్షణలో చాలారోజులు తలదాచు కోవాల్సుంటుందేమో। అతని మనస్సులో ఏవేవో ఆలోచనలు గిర్రున తిరుగుతున్నాయి। ఢిల్లీ చేరుకున్నాక తన అరెస్టు గురించి తను రిపోర్టు చేస్తాడు। అప్పుడు తమపార్టీ పేపరు ఫ్రంటుపేజీలో తన ఫొటోవేసి, పెద్ద అక్షరాలతో “అశాంతి పరిస్థితిని సృష్టించేటందుకు ఆంగ్లో అమెరికన్ పెట్టుబడిదారుల కుట్ర, సరిహద్దులలో కామ్రేడ్ ఇక్బల్ అరెస్టు చేయ

బడ్డాడు: అని ప్రచురిస్తారు. అప్పుడు తనొక హీరో అయిపోవచ్చను కున్నాడు ఇక్బల్.

నూరాన్ ఏమయిందో తెల్సుకోడమే తన తక్షణ కర్తవ్యమను కున్నాడు జగ్గా! టాంగాలో ఇతరుల వేపుగాని, దాటివస్తున్న గ్రామాల వేపుగాని అతను చూడలేదు. మల్లిగాడి గురించి మరచిపోయాడు: నూరాన్ మాత్రం మానోమజ్రాలో వుండి వుంటుందనే ఆశ అతని మనస్సులో ఓమూల దాగివుంది: ఇమామ్‌బక్ష్‌ని వెళ్ళిపొమ్మని తమ వూళ్లో ఎవ్వరూ బలవంతపెట్టరు! ఒకవేళ అతను ఇతర ముస్లిములతోబాటు వెళ్ళిపోయినా నూరాన్ మాత్రం ఎక్కడో ఏ పొలాలలోనో దాక్కొని వుంటుంది: లేదా తలదాచుకొనేటందుకు తన తల్లి దగ్గరకొస్తుంది. తన తల్లి ఆమెను తరిమి వెయ్యదు: ఒకవేళ తన తల్లి నూరానును తరిమివేస్తే, తను ఇల్లొదిలిపెట్టి వెళ్ళిపోయి ఇక ఎన్నడూ ఇంటికి తిరిగిరాడు: అప్పుడు తన తల్లి జీవితాంతం వరకూ తను చేసిన తప్పిదానికి కుమిలి కుమిలి ఏడుస్తుంది:

టాంగా గురుద్వారా ఉన్న సందులోకి పోయేటందుకై నెమ్మదిగా పోతున్నప్పుడు జగ్గా తన ఆలోచనల్ని కట్టిపెట్టి, ఆ టాంగాలోంచి బయటకు దుమికి, ఎవ్వరికీ వీడ్కోలు చెప్పకుండా అదృశ్యమయి పోయాడు: గురుద్వారా దగ్గర ఇక్బల్ టాంగా దిగాడు.

టాంగా డ్రైవరు, కానిస్టేబులు వాళ్ళల్లోవాళ్ళు ఏదో మాట్లాడు కున్నాక, "బాబూ: నా అవసరం తమకింకేమయినా వుంటుందా?" అనడి గాడు కానిస్టేబులు ఎంతో వినయంగా.

"మరేం అవసరంలేదు. థ్యాంక్యూ!" అని ఆ కానిస్టేబుల్‌కి సమా ధాన మిచ్చాడు ఇక్బల్.

తను ఒంటరిగా గురుద్వారాలోకి వెళ్ళడం అంత శ్రేయస్కరం కాదేమోననుకున్నాడు ఇక్బల్. పోనీ వాళ్ళను తనకు తోడుగా లోపలకు రమ్మంటేనో? ఏం బాగుంటుంది?

"బాబూజీ! మా(వు మళ్లీ సానాదూరం ఎనక్కెల్లాల! ఇయ్యాలంతా నా గుర్రానికి తిండిగాని, నీరుగాని ఎట్టనేదు. అదీగాక ఈరోజు లెలా గున్నాయో తమకు తెలుసు కదా!" అన్నాడు టాంగా డ్రైవరు.

"ఊఁ....! సరే....! వెళ్ళిపో!" అన్నాడు ఇక్బల్. టాంగా డ్రైవరు, కానిస్టేబులు వెళ్ళిపోయేరు.

గురుద్వారాయొక్క వాకిట్లో చాలా హరికేన్ లాంతర్లు ప్రకాశిస్తున్నాయి. వాకిట్లో కొంతమంది స్త్రీలు వంటచేస్తున్నారు. మెయిన్‌హాలులో మీట్‌సింగ్ సాయం సంధ్యా ప్రార్థన చేస్తూంటే అతనికెదురుగా అర్థ వృత్తాకారంలో కొంతమంది కూర్చొనివున్నారు.

ఏ గదిలో అయితే ఇక్బల్ తన వస్తువుల్ని వదిలిపెట్టేడో ఆగది తాళం వేయబడుంది. ఇక్బల్ జోళ్ళు విప్పేసి, తలకు ప్యాకట్ రుమాలు చుట్టుకొని వాళ్ళదగ్గరకు మెల్లగా వెళ్ళేడు. కొంతమంది ప్రక్కకు జరిగి ఇక్బల్ కూర్చొనేటందుకు స్థలం ఇచ్చేరు. తనకేసిచూసి వాళ్ళల్లోవాళ్ళు ఏదో గుసగుసలాడుకోడం ఇక్బల్ గమనించేడు. వాళ్ళల్లో చాలామంది ముసలాళ్ళు, పట్నవాసపు వాళ్ళలాగ డ్రస్సులు వేసుకున్నారు. వాళ్ళంతా శరణార్థులయుంటారని గ్రహించడానికి ఇక్బల్‌కి అట్టేసేపు పట్టలేదు.

ప్రార్థన ముగిసేక మీట్‌సింగ్ గ్రంథసాహెబాను వెల్‌వెట్ క్లాత్‌లో చుట్టి పీఠంపై యథాప్రకారంగా వుంచేడు. ఇంకా ఎవ్వరూ ఇక్బలును ఏమీ ప్రశ్నించకముందే, "సత్ శ్రీ అకల్ ఇక్బల్‌సింగ్‌జీ! తాము మళ్ళీ వచ్చినందుకు నాకు చాలా ఆనందంగా వుంది. మీకు బాగా ఆకలేస్తున్నదను కుంటాను" అని అన్నాడు.

మీట్‌సింగ్ ఉద్దేశ పూర్వకంగానే తన వంశనామాన్ని వాళ్ళందరి మధ్యా అభివ్యక్తం చేసుంటాడని ఇక్బల్ అనుకున్నాడు. తన వంశనామం అతను ఉచ్చరించడంవల్ల అక్కడున్న ప్రజా సమూహంలోగల అపోహ

తొలగిపోయింది. అందుకు మీట్‌సింగ్‌కు మనస్సులోనే తన అభివందనా లర్పించేడు ఇక్బల్.

కొంతమంది ఇక్బల్‌కేసి చూస్తూ "సత్‌శ్రీ అకల్!" అని అన్నారు.

"సత్‌శ్రీ అకల్!" మందస్మిత వదనంతో వాళ్ళకేసిచూస్తూ అని మీట్‌సింగ్ దగ్గరకెళ్ళేరు ఇక్బల్.

"వీరు సర్దార్ ఇక్బల్‌సింగ్! గొప్ప సాంఘికకార్యకర్త. ఇంగ్లండు దేశంలో చాలాకాలం వున్నారు." అని వాళ్ళందరికీ ఇక్బల్‌ని పరిచయం చేసేడు మీట్‌సింగ్. ఎన్నో కళ్ళు అతనివేపు సంభ్రమాశ్చర్యాలతో చూసేయి.

ఏమిటి వీరు ఇంగ్లండు దేశంనుంచి వచ్చేరా? అన్నట్లు, "సత్‌శ్రీ అకల్!" అని మళ్ళీ అన్నారు.

వాళ్ళు ప్రదర్శిస్తున్న ఆ వినయ విధేయతల్ని చూసి ఇక్బల్ అదో లాగ ఫీలయేడు.

"ఇక్బల్‌సింగ్‌జీ తాము సిక్కుమతస్తులేనా" అని వాళ్ళల్లో ఒకడు అడిగేడు.

"ఔను." అని సమాధానమిచ్చేడు అప్పుడు. కాని ఓ పదిహేను రోజుల క్రితం తాను సిక్కుమతస్తుడు కాదని, తనకసలు మతమే లేదని, మతమనేది మానవజాతికి మత్తుమందు వంటిదని సమాధానమిచ్చేడు. కాని పరిస్థితులు మారిపోయేయి. ఏది ఏమైనా నిజానికి తను సిక్కువంశంలోనే జన్మించేడు. ఇది సత్యం.

"ఇంగ్లండు దేశంలో మీరు గెడ్డం గీయించేసుకొని, క్రాపు చేయించేసుకున్నారా?" అని ఆ వ్యక్తే అడిగేడు.

ఏమని సమాధానం చెప్పడమో తెలీక ఇక్బాల్ బాగా కలవరపడ్డాడు. ఎలాగో తేరుకొని, "లేదు. నేనెన్నడూ అసలు జుత్తు పెంచలేదు. పొడుగాటి జుత్తూ, గెడ్డంలేని మామూలు సిక్కుని నేను" అని సమాధానమిచ్చాడు.

"మీ తల్లిదండ్రులు సదాచార సంపన్నులు కారనుకుంటాను" అన్నాడు మీట్‌సింగ్. ఈ వివరణ వాళ్ళ అనుమానాన్ని ఉపశమింపజేయడానికి తోడ్పడింది. కాని ఇక్బాల్ మాత్రం ఇంకా తేరుకోలేదు.

మీట్‌సింగ్ నాడాకు తగిలించబడున్న తాళాల గుత్తిని బయటకూడ లాగి, హరికేన్ లాంతరు పట్టుకొని వాకిట్లోంచి తిన్నగా ఇక్బాల్ సామాన్లువున్న గది దగ్గరకెళ్ళేడు. ఇక్బాల్ అతనిని అనుసరించేడు.

"తమ సామాన్లను ఈ గదిలోవుంచి తాళంవేసేను. అన్నీ సరిగ్గావున్నాయో లేవో ఓసారి చూసుకోండి. నేనీలోగా తమకు భోజనం తీసుకొస్తాను" అని అన్నాడు మీట్‌సింగ్.

"వద్దు భాయీజీ! మీరేమీ శ్రమ పడకండి. చాలినన్ని ఆహారపదార్థాలు నాదగ్గర స్టాకులో వున్నాయి. అది సరేగాని నేను వెళ్ళిపోయిన తరువాత ఈ గ్రామంలో ఏం జరిగిందో చెప్పండి? వీళ్ళంతా ఎవరు?"

మీట్‌సింగ్ తాళంతీసి తలుపు తెరచి, గూట్లోవున్న నూనెదీపాన్ని వెలిగించాడు. ఇక్బాల్ బెడ్డింగు హోల్డాల్ విప్పి, అందులోగల వస్తువులన్నింటినీ బయటకు తీసేడు.

"భాయీజీ! నేను వెళ్ళిపోయేక ఇక్కడేం జరిగింది?" అని మళ్ళీ అడిగేడు ఇక్బాల్.

"ఏం చెప్పమంటారు బాబూ! మానోమఙ్రా రైల్వేస్టేషనుకు ట్రైన్సునిండా శవాలొచ్చేయి. ఒక ట్రైనులో వచ్చిన శవాలను దహనపరిచేరు. మరో ట్రైనునిండా వచ్చిన శవాలను పాతిపెట్టేశారు. అసంఖ్యా

కంగా నదిలోంచి శవాలు కొట్టుకొస్తున్నాయి. ముస్లిములంతా గ్రామా లొదిలిపెట్టి వెళ్ళిపోయేరు. వాళ్ళ స్థానాలను పాకిస్తాను నుంచొచ్చిన శర ణార్థు లాక్రమించేరు. ఇంతకంటే అధికంగా ఇంకేమయినా తెల్సుకోవా లనుందా మీకు!"

ఒక సెల్యులాయిడ్ ప్లేటును, గ్లాసును తన చేతిగుడ్డతో బాగా తుడిచి పరిశుభ్రపరచేడు ఇక్బాల్. ఆ తరువాత వెండి తొడుగుగల బుడ్డీని తీసి దానిని ఇటూ అటూ కుదిపి చూసేడు. ఫరవాలేదు. నిండుగానే వుందనుకున్నాడు.

"ఆ బుడ్డీలో ఏముందిబాబూ?" అనడిగేడు మీట్‌సింగ్.

"ఇందులోనా? ఇందులో.... ఓమందుంది. ఇదీ....ఇదీ.... ఆకల్ని పుట్టిస్తుంది." అని అన్నాడు కొస్త తడబడుతూ.

"ఓహో! అలాగా! ఆకలి పుట్టించే మందా అది. అది త్రాగేక ఆక లేస్తుంది. ఆకలేస్తే భోంచేస్తారు. భోంచేసేక ఆ తిన్న దరగడంకోసం తీక్షశక్తిని పెంపొందించే మాత్రలేసుకుంటారు. బాగుంది." అని నవ్వుతూ అన్నాడు మీట్‌సింగ్.

"అదిసరేగాని ఈ గ్రామంలో ఇంకేమయినా హత్యలు జరిగేయా!" అనడిగేడు ఇక్బాల్.

"ఇప్పటికి లేదు. ఇటుపైని జరిగితే జరగొచ్చు." అని ఏదో పరాగ్గా సమాధానమిచ్చేడు. అతని దృష్టంతా గాలి పరుపులోకి గాలికొడు తున్న ఇక్బాల్ మీదేవుంది. "నిద్రపోడానికిది చాలా బాగుంటుందను కుంటాను. ఇంగ్లండులో అంతా ఇలాంటి పరుపులమీదే పడుకుంటారా?" అనడిగేడు కుతూహలంతో.

పరుపు వాల్వుకి మరబిగిస్తూ, "ఇకముందు జరిగితే జరగొచ్చన డంలో మీ అభిప్రాయం ఏమిటి? ఈ గ్రామాన్ని వదిలిపెట్టి ముస్లిములంతా వెళ్ళిపోయినట్లేనా లేక ఇంకెవరైనా ఉండిపోయేరా?" అనడిగేడుఇక్బాల్.

"వెళ్ళిపోయేరు. ఈ రాత్రి ట్రైనులో వాళ్ళు పాకిస్తాన్ వెళ్ళనున్నారట. వంతెనదాటి వాళ్ళలో ఎంతమంది ఆవలి ఒడ్డుకు వెళ్ళగలరో ఆ భగవంతుడికి మాత్రమే తెల్సు. ఆ ట్రైనులో మానోమజ్రా ముస్లిములను, చందున్నగర్ ముస్లిములను పాకిస్తాన్ పంపిస్తున్నారట. ఇవాళరాత్రి బ్రిడ్జిదగ్గర కాచి, ఆ ట్రైనును ముట్టడించడానికి కొంతమంది పథకం వేసుకున్నారు. ఈగొడవలకేంగాని మీ తలగడానిండా గాలుందా?"

"ఊఁ! ఉంది! అదిసరేగాని, ఇంతకీ వాళ్ళెవరు? ఈ ఊరివాళ్ళు కారా?"

"వాళ్ళందరూ నాకు తెలీదు. కొంతమంది యువకులు కాకీడ్రస్సు లేసుకొని మిలటరీ కార్లలో వచ్చేరు. వాళ్ళదగ్గర రివాల్వర్లు, పిస్తోళ్ళు వున్నాయి. వాళ్ళతో పాకిస్తాన్‌నుంచి వచ్చిన శరణార్థులు కలిసేరు. ఈ గొడవలకేంగాని బాబూ దుక్కలాంటి వాడెవడైనా దీనిమీద పడుకుంటే ఇది పేలిపోదా?" అని ఆ పరుపుమీద చేత్తో నొక్కుతూ అడిగేడు మీట్‌సింగ్.

"ఓ! ఇదా సంగతి? మల్లిగాడిని, వాడి సహచరులను ఏ విచారణా లేకుండా వదిలి పెట్టడంలోగల పోలీసునీతి ఇప్పుడర్థమయింది. బహుశా ఆగ్గాకూడా వాళ్ళతోచేతులు ఇక కలపొచ్చు. ఇదంతా ఓ నిర్ణీతమైన పథకం ప్రకారం ఏర్పాటు చేయబడిందన్నమాట." అని మనస్సులో అనుకొని తలగడా చేతి ముణుకు క్రింద పెట్టుకొని పరుపుపై పడుకున్నాడు, పడక సీనులోని కృష్ణుడి పోజులో.

"అయితే భాయీజీ? ఈ దురంతాన్ని మీరాపుచెయ్యలేరా? వాళ్ళంతా మీ మాట వింటారుగా!" అనంటూ మీట్‌సింగ్ ముఖంలోకి చూసేడు.

మీట్‌సింగ్ ఆ గాలి పరుపుమీద ఓసారి చేత్తోనొక్కి, మృదువుగా తడివిచూసి, ఆ ప్రక్కనే నేలమీద కూర్చొని, "ఈ ముసలాడి మాట

లేవరు వింటారుబాబూ! ఇవి మనదేశానికి దుర్దినాలు! ఎవ్వరికీ దేనిమీదా విశ్వాసంలేదు. నీతి, న్యాయం, ధర్మం అన్నీ మంటగలసిపోయేయి. ఈ భయంకరమైన మారణహోమం అంతమొందే టంతవరకూ ఏదైనా ఒక సురక్షితమైన మారుమూల తలదాచుకోడం తప్పితే ఇహ ఎవ్వరూ చెయ్య గలిగేదింకేమీ లేదు. ఇంతకీ ఈ పరుపు క్రొత్తగా పెళ్ళయిన జంటకు అంత అనుకూలంగా ఉండదనుకుంటాను." ఆ పరుపుపై అరచేత్తో నొక్కుతూ అన్నాడు.

ఇక్బల్ హృదయం విచారంతో క్షుభితమయింది. "ఈఘోర దురంతాన్ని మీరెలాగైనా నివారించాలి. ఆ ట్రెయినులో పయనించే వాళ్ళంతా.... 'బాబయ్యా, మావయ్యా, పిన్నమ్మా, తాతయ్యా, అన్నయ్యా, వదినా, తమ్ముడూ, చెల్లెమ్మా, అక్కయ్యా, అని ఎంతో వాత్సల్యంతో కొద్ది రోజుల క్రితం వరకూ మీచే పిలవబడిన మానోమత్రా ముస్లిములేనని వాళ్ళకు మీరు చెప్పలేరా?"

మీత్‌సింగ్ బాధగా నిట్టూర్చాడు. అతనికళ్ళు చెమ్మగిల్లేయి. భుజం పైగల తువ్వాలుతో కళ్ళొత్తుకొని, "నేను చెప్పినందువల్ల ఏమీ ప్రయోజన ముండదని నాకు తెల్సు! వాళ్ళేం చేస్తున్నదీ వాళ్ళకు తెల్సు! వాళ్ళు చెయ్యదల్చుకున్న మారణహోమం జయప్రదంగా ముగిసినట్లయితే అభివందనలు తెలియజెయ్యడానికి బహూశా గురుద్వారాకువస్తారు. తమ పాపాలను కడిగేసుకొనేటందుకు పూజలుచేసి ముడుపులు చెల్లిస్తారు. దానిమాటకేంగాని ఇక్బల్‌సింగ్‌జీ! తమ ఆరోగ్యం బాగానేవుందా? పోలీసుస్టేషనులో వాళ్ళు తమను సరిగ్గా చూశారా?" అనడిగాడు.

"ఊ! చూశారు. బాగానేచూశారు. నా ఒంట్లో ఏ చికాకూలేదు. బాగానే వున్నాను." అని కొంచెంసేపు మౌనంగా ఊరుకొని, "ఏదోఒకటి మీరెందుకు చెయ్యకూడదు? మీరిలా ఊరుకోడం ఏమీ బాగులేదు. ఏదో

ఒకటి చేసితీరాలి:" అని అన్నాడుఇక్బల్ మీట్‌సింగ్ ముఖంలోకి నిశితంగా చూస్తూ.

"నేను చెయ్యగలిగినదంతా చేశాను; ఏది మంచిపనో, ఏదికాదో ప్రజలకు చెప్పడమే నాపని; అయినాసరే వాళ్ళు చెడ్డపని చెయ్యడానికి పంతంపడితే ఇక నేను చేసేదేముంది; వాళ్ళని క్షమించమని భగవంతుడిని ప్రార్థించడంతప్ప? నాకు చేతనయిందల్లా భగవంతుడిని ప్రార్థించడం మాత్రమే; ఇకపోతే పోలీసువారు, న్యాయాధికారులు, తమవంటి చదువుకున్న బాబులు ఇలాంటి పరిస్థితిలో ఏమైనా చెయ్యగలరేమో:"

ఇక్బల్ ఉలిక్కిపడి, "నేనా? నేనేం చెయ్యగలను ఈ పరిస్థితిలో; నాకు వాళ్ళెవ్వరూ తెలీదు; కొత్తిగా పరిచయంలేని నాలాంటివాడు చెపితే వాళ్ళెందుకు వింటారు?" అని అమాయకంగా అడిగాడు.

"తాము మా ఊరొచ్చినప్పుడే వాళ్ళకేదో చెప్పాలనుకున్నారుగా? పోనీ ఆ చెప్పదల్చుకున్నదేదో ఇప్పుడు వాళ్ళకెందుకు చెప్పకూడదు?"

"భాయీజీ; వాళ్ళు వీరావేశంతో తుపాకులు, బల్లాలు, కత్తులు పట్టుకొని బయలుదేరుతూంటే ఇప్పుడు వాళ్ళకు నేనేంచెప్పగలను? చెప్పినా వింటారావాళ్ళు? ఊహూఁ; వినరు; వాళ్ళ మార్గానికి అడ్డుపడకుండా తప్పుకోడమే ఈపరిస్థితిలో మంచిది:''

"నా ఉద్దేశమూ అదే; తాము తమ తెలివితేటలతో, పాశ్చాత్యదేశీయుల ఎత్తుగడలతో, వాళ్ళు చేయతలపెట్టిన ఈ ఘోరాన్ని నివారించే ఉపాయం ఆలోచించ గలరనుకున్నాను. అది సరేగాని భోజనంలోకి వేసిగానున్న చేపల పులుసు తెమ్మంటారా?" అనడిగాడు.

"వద్దు భాయీజీ వద్దు; ఇప్పుడేఁవీ వద్దు; నాకేఁవయినా కావలిస్తే తప్పక మిమ్మల్ని అడుగుతాను. అయినా ఇప్పుడు నాకు భోంచెయ్యాలని లేదు" అన్నాడు ఇక్బల్. పరుపు ప్రక్కనేవున్న స్టూలుపై హరికేన్

తాంతరుంచి, మీట్‌సింగ్ హాలులోకి వెళ్ళిపోయాడు. ఏం చెయ్యడానికి ఇక్బల్‌కి తోచలేదు. శరీరంలో ఏదో నలతగా వున్నట్లు ఫీలయేడు. లేనిపోని ఆలోచనలతో అతని బుర్ర బాగా వేడెక్కిపోయింది! తనేంచెయ్యాలమిప్పుడు? ఆవేశపూరితులైయున్న ఆ సాయుధ ప్రజా సమూహానికెదురుగా వెళ్ళి వాళ్ళు తలపెట్టినది తప్పుపనని, అవినీతికరమైన పనని స్పష్టంగా చెప్తేనో? తుపాకీగుళ్ళవర్షం తనపై కురుస్తుంది! తనునేలకొరిగిపోతాడు!

నిజంగా తానీవిధంగా ప్రాణత్యాగం చేసినట్లయితే, తన ప్రాణత్యాగంలోని పవిత్రతను ఎవరైనా గుర్తిస్తారా అని? అబ్బే! ఎవ్వరూ గుర్తించరు. అందర్నీ వాళ్ళెలా చంపుతున్నారో అలాగే తననూ చంపుతారు. తననో తటస్థవాదిగా వాళ్ళు గుర్తించరు. తనను దిగంబరుణ్ణిచేసి సుంతీ చేయించుకున్నదీ లేనిదీ చూస్తారు! తననో ముస్లిముగా భావించి చంపుతారు. అప్పుడు తను అనవసరంగా ప్రాణత్యాగం చేసినట్లవుతుంది! ఇంతకీ ఈరకంగా తను ప్రాణత్యాగం చెయ్యడంవల్ల ఏమైనా ప్రయోజనముందా అంటే లేదు! మానవత్వం లేని కొంతమంది తమ తమ స్వార్థ ప్రయోజనాలకోసం అమాయకుల్ని రెచ్చగొట్టి దారుణమైన మానవ మారణ హోమం చేయిస్తున్నారు! ఈ మూకుమ్మడి హత్యాకాండలో ఇరు వర్గాలలోను ఎవరి కెవరూ తీసిపోలేదు. ఒకర్ని మించొకరు ఎవరికి అవకాశం దొరికితే వారు మానవత్వాన్ని కోల్పోయి మరీ మారణహోమం చేస్తున్నారు. నిర్దిష్టమైన ఉద్దేశ్యం ఏదీలేని అమానుషమైన పనిది! ఈ దౌర్భాగ్య పరిస్థితిలో ఎవర్ని వారు సంరక్షించుకోవడమే ఉత్తమ ధర్మమనుకున్నాడు ఇక్బల్. విస్కీబుడ్డీ మూతతీసి ఓ సెల్యులాయిడ్ గ్లాసులో కొంచెం విస్కీపోసి, గుటుక్కున త్రాగేసి, మళ్ళీ ఆలోచించసాగాడు ఇక్బల్.

అసంఖ్యాకంగా తుపాకీగుళ్ళు ఎగురుతున్నప్పుడు వాటి మధ్యకు తను తలదూర్చడంవల్ల ఏమైనా ప్రయోజనముందా? ఊహూఁ! ఏఁవీలేదు: తుపాకీగుండు నా కెందుకీ గొడవన్నట్లు తటస్థంగా ఊరుకోదు: వీడు మంచివాడని, వీడు చెడ్డవాడని, వీడు అభ్యుదయవాదని, వీడు అభ్యుదయ నిరోధకుడనీ ఆ గుండు విచక్షణాజ్ఞానంతో పరిశీలించి మరీ తగలదు: వాళ్ళ తుపాకుల కెదురుగా తను వెళ్ళినట్లయితే వందలాది శవాలమధ్య తనూ కుప్పలా కూలిపోతాడు. తను సుంతీ చేయించుకున్నా, నిజానికి తను సిక్కుమతస్తుడేనని ఎవరూ గుర్తించరు: తను చచ్చాక ఈ యదార్థాన్ని ఒకవేళ ఎవరైనా గుర్తించినా తనకు చేకూరే ప్రయోజనమేఁవిటి? ఏఁవీ లేదు: కేవలం రాక్షసత్వంతో నిండిన మూర్ఖత్వాన్ని ఎదిరించడానికి వెళ్ళిన విద్యాధికుడైన ఓ సిక్కు జాతీయుడు తానని వాళ్ళా ఆవేశంలో గుర్తించగలరా అని? అబ్బే? వట్టిమాట: ఆఖరికా భగవంతుడయినా-ఛఛ: భగవంతుడేఁవిటి? భగవంతుడనేవాడు అసలు లేనేలేడు: ఇక్బాల్ గ్లాసులో మరికొంత విస్కీ పోసుకున్నాడు. ఆ డోసు అతని బుద్ధిని కొంచెం సునిశితం చేసి నట్లుంది:

త్యాగం ఎప్పుడు చెయ్యాలి? దానివల్ల ఏదైనా ప్రయోజన మున్నప్పుడు: అదయినా అధిక సంఖ్యాకులచే ఘనంగా గుర్తింపబడినప్పుడు చెయ్యాలి: వ్యక్తిగతంగా ఉపయోగపడేదిగా వుండకూడదా త్యాగం: వ్యక్తి ప్రయోజనాన్ని ఆశించి చేసే త్యాగం మంచిదికాదు. సంఘ ప్రయోజనాన్ని ఆశించి చేసే త్యాగానికి విలువ శాశ్వతంగా వుంటుంది: ఇంతకీ ఇప్పుడు తను ప్రాణత్యాగం చేసినందువల్ల సాంఘిక ప్రయోజనమేదయినా చేకూరుతుందా అంటే లేదు: అటువంటప్పుడు తనెందుకు ప్రాణత్యాగంచెయ్యాలి? అనవసరం:

మరో గ్లాసు ఖాళీ అయింది: అతనిబుర్ర గిర్రున తిరుగుతోంది. అందులో ఆలోచనలుకూడా అలాగే తిరుగుతున్నాయి: ఈ దేశంలో

సామాజిక వ్యవస్థ బాగా బూజుపట్టి చెడిపోయిందనుకున్నాడు. స్వార్థం, అవినీతి, అసహనం, దురాశ, మోసం, కపటం, దౌర్జన్యం, పరపీడన ఇత్యాది దుర్గుణాలన్నీ ఈ సమాజాన్ని జలగల్లాగపట్టి పీడిస్తున్నాయి. ఈ దేశంలో ఉన్నది కేవలం దోపిడీవ్యవస్థ. ధనవంతులు దరిద్రులను తరతరాలనుంచీ దోచుకు తింటున్నారీ దేశంలో. ఈ వ్యవస్థను అంతమొందించాలి: రక్తాన్ని చిందించయినా సరే ఈ దోపిడీ వ్యవస్థను అంతమొందించాలి.

ఇక్బాల్ మనస్సులో ఏవేవో అస్పష్టమయిన భావాలు విప్లవజ్వాలలను రేకెత్తిస్తున్నాయి. ఈ దేశంలోని కోట్లాది దరిద్రులు బాగుపడాలంటే, భారతీయ సంస్కృతని ఘనంగా చెప్పుకొనేదాన్ని మొట్టమొదటే నాశనం చెయ్యాలి. కర్మ సిద్ధాంతాన్ని కూకటివ్రేళ్ళతో పెళ్ళగించి వెయ్యాలి: ఆధ్యాత్మిక దేశమని ఘనంగా బడాయిలు చెప్పుకొనే ఈ భారతదేశంలో మతం ఓ మత్తుమందులాంటిది: గోసంరక్షణ, వర్ణవ్యవస్థ ఇదీ హిందువుల మతం—: చూడియావుల మాంసభక్షణ, సుంతీ ఇదీ ముస్లిముల మతం—: పొడుగాటిజుత్తు, గెడ్డం, ముస్లిమ్ ద్వేషం ఇది సిక్కులమతం; చరిత్రగతిలో ఏ మతమూ సమాజంలోగల పీడిత ప్రజానీకాన్ని ఉద్ధరించేటందుకు విప్లవజ్వాలలను రేకెత్తించేటందుకు ప్రయత్నించలేదు. పైగా పీడిత ప్రజానీకాన్ని కర్తవ్య విమూఢుల్ని చేసేటందుకై కర్మసిద్ధాంతాన్ని ప్రతిపాదించాయి: గత చరిత్ర తిరగేసిచూస్తే మత మౌఢ్యం మానవ మారణహోమాన్ని సృష్టించడానికి తప్పితే మరెందుకూ ఉపయోగపడలేదని విదితమవుతుంది: అంచేత ముందుగా అన్ని మతాలను సమూలంగా నిర్మూలించాలి: మతం జాతిని ఏకత్రితం చేసేటందుకు తోడ్పడుతుందనే వాదనలో యథార్థం లేదు. వర్గవిభేదాలు ఒకేజాతి మధ్య వైరుధ్యానికి, కలహాలకు హేతువవుతున్నాయి: మానవాభ్యున్నతికి తోడ్పడే సిద్ధాంత

బలంతో ఈ సమాజాన్ని పునర్నిర్మించాలి. ఈ దేశంలోగల సన్యాసులు, బైరాగులు,-బాబాలు, మఠాధిపతులు, యోగులు అంతా బూర్జువా సిద్ధాంతాలను ప్రచారంచెయ్యడానికి తప్పితే మరెందుకూ పనికిరారు. మతధర్మమనే సాకుతో ఇలాంటి వాళ్ళంతా ఈ దేశంలో దోపిడీ వ్యవస్థను జాగ్రత్తగా కాపాడే టందుకు మాత్రమే తోడ్పడుతున్నారు. ఈ దేశం ఈనాడింతటి అధ్వాన్న స్థితిలో వుండడానికిలాంటి వాళ్ళే కారకులు! అంచేత ముందుగా ఇలాంటి వాళ్ళ ప్రభావాన్ని పూర్తిగా అంతమొందించాలి! ఆ తరువాత ఈవ్యవస్థను కూకటి వ్రేళ్ళతో సహా కూలద్రోసి సరిక్రొత్త వ్యవస్థను నెలకొల్పాలను కున్నాడు ఇక్బల్. మరోగ్లాసు విస్కీ ఖాళీచేసేశాడు!

ఇక్బల్ బుర్రలో రకరకాలభావాలు వికృతంగా లాస్యంచేస్తున్నాయి. ఒకదానికొకటి సంబంధంలేని భావాలవి....! ఈ దేశంలో వ్యభిచారం విశృంఖలంగా సాగుతోంది. ఆడవాళ్ళు మొగవాళ్ళచేతులలో నలిగి పోతున్నారు. మహిళాలోకాన్ని మేల్కొల్పాలి! ఇహపోతే ఈ దేశంలోని కళలుకూడా బి. సి. నాటివి. పట్టి బూర్జువా కళలు! బూజుపట్టిన కళలు....! సాంఘికన్యాయం చేకూర్చేటందుకు తోడ్పడని కళలు! చిత్రలేఖనం, కవిత్వం, సంగీతం, నృత్యం అన్నీ ఒక్కలాగేవున్నాయి. శ్రమజీవుల్ని చైతన్యవంతుల్నిచేసి వర్గపోరాటానికి వాళ్ళను పురికొల్పే కళలు లేవు. అన్నీ పెట్టుబడిదార్లను సంతృప్తిపరచే కళలే. మరో విస్కీ గ్లాసు ఖాళీ చేసేశాడు ఇక్బల్.

శిథిలమయిపోయిన గృహాలపై అందమయిన మేడకట్టాలనుకోడం మూర్ఖత్వం. ముందు ఆ ఇంటిని పునాదులతోసహా పెకలించివేసి, అప్పుడు సరికొత్తగా ఆ స్థలంలో మేడకట్టాలి. ఎలా? సంఘటితబలంతో. శ్రమ జీవుల సంఘటితశక్తి చెయ్యలేని పనేదీ లేదీలోకంలో. ఆర్థికన్యాయం, సాంఘికన్యాయం అందరికీ సమానంగా చేకూరాలీ అంటే, ఈ దోపిడీ వ్యవస్థను సమూలంగా నాశనంచెయ్యాలి. ఇందుకు కావలసినది: ధైర్యం—

సంఘటిత శ్రామికశక్తి- విప్లవం- ఆయుధవిప్లవం- చైతన్యం- సమ్యత్వం- సమానత్వం! మరో విస్కీగ్లాసు ఖాళీ చేసేశాడు ఇక్బాల్. ఆ విస్కీ పట్టి మంచినీళ్ళలా వున్నట్లు ఫీలయేడు. రుచిని గ్రహించే జ్ఞానాన్ని అతని నాలుక పోగొట్టుకుంది.

ఇక్బాల్ విస్కీబుడ్డీని ఇటూ అటూ ఆడించేడు. అందులో కొంచెం విస్కీ ఇంకా మిగిలి వున్నందుకు ఎంతో ఆనందించాడు. ఆ కాస్తముక్కా త్రాగేశాడు. త్వరలోనే అతను స్పృహ కోల్పోయేడు. ఖాళీ సెల్యులాయిడ్ గ్లాసు అతని చేతిలోంచి ప్రక్కకు దొర్లిపోయింది.

18

గురుద్వారా వాకిట్లోవున్న పొయ్యిలలోని నిప్పు చల్లారి నివురు గప్పింది. ఉండుండివీచే గాలి దుమారం పైబూడిదను తొలగించి నిప్పుల్ని ప్రకాశవంతం చేస్తోంది. దీపాలు కాంతివిహీనంగా వెల్గుతున్నాయి. మెయిన్ హాలులో స్త్రీలు, పురుషులు, పిల్లలు పడుకొనివున్నారు. మీట్ సింగ్ మాత్రం ఇంకా మేలుకొనేవున్నాడు. ఎంగిలి ఎత్తి ఆ ప్రదేశాన్ని చక్కగా చీపురుతో శుభ్రపరుస్తున్నాడు. అంతట్లో ఎవరో తలుపు గ్రుద్దు తున్న చప్పుడు వినిపించిందతనికి. మీట్ సింగ్ తుడవడం ఆపుచేసి, వీధి తలుపు దగ్గరకెళ్ళి "ఎవరది ?" అనడుగుతూ తలుపు గడియతీసేడు.

జుగ్గా లోనికి ప్రవేశించాడు.

"నువ్వా జుగ్గా? ఏమిటి విశేషం? ఇంతరాత్రివేళ వచ్చేవేమిటి?" అనడిగేడు మీట్ సింగ్ అతనికేసి ఆశ్చర్యంగా చూస్తూ.

"భాయీజీ! గురూ సెప్పిన సూక్తొకటి తామిప్పుడు నాకు సదివి యినిపించాలి?" అని కోరేడుజుగ్గా.

"గ్రంథసాహెబా పీఠంపై విశ్రాంతి తీసుకొంటోంది. అయినా ఇప్పుడు దానితో నీకేంపని?"

"అదంతా తమకిప్పు డనవసరం!" అంటూ మీట్‌సింగ్ భుజంపై చెయ్యివేసి, "తాము త్వరగా అందులోవున్న కొద్దివాక్యాలు చదవగలరా?" అనడిగేడు.

మీట్‌సింగ్ ముక్కుతూ, మూల్గుతూ, "నువ్వెప్పుడూ వేళగాని వేళ లోనే గురుద్వారాకు వస్తూంటావు. అందరూ నిద్రపోతున్న సమయంలో, గ్రంథం విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో నువ్వొచ్చి గురుసూక్తులు చదవమంటున్నావు! సరే! ప్రాతఃకాలపు ప్రార్థనాగీతంలో కొంతభాగం నేనిప్పుడు చదువుతాను. లోనికిపద." అంటూ హాలులోకి దారితీసేడు.

"తాము ఫలానాది చదవాలనే పట్టుదల నాకేటీనేదు. ఏదో ఒకటి తామిప్పుడు చదవడం నాకు కావాలి" అని అన్నాడు జుగ్గా.

మీట్‌సింగ్ అక్కడున్న లాంతర్లలో ఓ లాంతరువత్తి పైకిత్రిప్పి మీది కెత్తేడు. గ్రంథసాహెబా ఉంచిన పవిత్రపీఠానికి ప్రక్కనే కూర్చు న్నాడు మీట్‌సింగ్. జుగ్గా పీఠం క్రిందవున్న నెమలి ఈకల విసనకర్రను తీసి మీట్‌సింగ్ ముఖానికి గాలి తగిలేటట్లు విసరసాగేడు. ప్రార్థనా గీతాలు గల ఓ చిన్నపుస్తకం మీట్‌సింగ్ తీసి దానిని కళ్ళకద్దుకొని తెరచేడు. తెరచేసరికి ఏ ప్రార్థనాగీతం కనిపించిందో దానినే చదవసాగాడు.

"ఎవ్వడు నిర్మించె నీ దినపక్షములు
నీయేడు దినములు ఋతువులారు
ఎవ్వడు చేసెనోయీ యధోలోక
అమరజేసె నెవడీ హవ్యవహాని
ఎవ్వడు గావించె నీ పుణ్యధరణిని
స్థిరమైన న్యాయంపు దేవళముగ

ఎవ్వడు సృష్టించె నెనలేని జీవుల
నగణీయ సహస్ర నామములతో
అతడే నేర్పరచెదీవి న్యాయముగను
దైవమే నిరతసత్యమాతదే సత్య దీప్తి కిరణమ్ము
గాన మనోవాక్కాయ కర్మలె ప్రమాణములు సుమ్ము
అతని సభాస్థలి మహనీయ సమలంకృతమ్ము
దైవమే వారి కార్యముల మన్నించు నిరతమ్ము
కలవుకొన్ని ప్రత్యేక కర్మతతులు
అవిజేసి ఫలితమందిరి బుద్ధిమతులు
కర్మ పరిపాకమందని మనుజులకును
ఓ నానకా ! ఇది భావిలో జరుగు నిశ్చయముగను."

ఇది చదవడం పూర్తయేక మీట్‌సింగ్ ఆ ప్రార్థనా గీతాల పుస్తకాన్ని ముడిచేసి దానిని మళ్ళీ కళ్ళకద్దుకున్నాడు. ఉపసంహారంగా ఉదయ సంధ్యాకాల ప్రార్థనా గీతాన్ని ఓసారి స్మరించేడు.

"ఒనర వాయువును పృథివియు జలము
ఈ మూడింట నిర్మితులము మనము
గాలి పరమ గురుని సందేశపురీతి
జీవశ్వాసల నిరతము నిచ్చుచుండు
జలదేవతా వంశాను గతమ్మైన
పృథివీమతల్లి ప్రియతమ పుత్రులము మనము."

మీట్‌సింగ్ ఇది చదువుతున్నప్పుడు అతని గొంతుక బాగా నీరసించి పోయింది. అసలు బయటకు స్పష్టంగా వినిపించనేలేదు. జుగత్ సింగ్ నెమలిఈకల వీవనను యథాస్థానంలోఉంచి పవిత్ర గ్రంథసాహెబా

ముందు నుదురు నేలకు తాకునట్లుగా వంగి, భక్తి పురస్సరంగా నమస్కరించేడు.

ఆ తరువాత మీట్‌సింగ్ ముఖంలోకిచూస్తూ, "ఇప్పుడు తాము చదివినది మంచిదేనా?'' నిష్కాపట్యంగా అడిగేడు జుగుత్‌సింగ్.

"మన గురూ చెప్పినదంతా మంచిదే'' అని సమాధానమిచ్చేడు మీట్‌సింగ్.

"దాని అర్థమేమిటి?"

"వ్చ్! దానర్థం ఇప్పుడు నీకెందుకూ? అది మన గురూ చెప్పినది. నువ్వేదయినా చెయ్యాలనుకుంటే గురూ నీకు సహాయపడతారు. నువ్వేదయినా చెడ్డపని చెయ్యాలనుకుంటే గురూ నీ మార్గాని కడ్డుగా నిలుస్తారు. అయినా సరే ఇంకా నువ్వా చెడ్డపని చెయ్యదల్చుకుంటే, నువ్వు పశ్చాత్తాప పడేటంతవరకూ గురూ నిన్ను శిక్షిస్తారు. ఆతరువాత నిన్ను క్షమిస్తారు." అని సమాధానమిచ్చేడు మీట్‌సింగ్.

"అవును నిజమే దానర్థం తెల్సుకొని నానేటి సేత్తాను. సరే భాయీజీ! నానిక ఎల్తాను. సత్‌శ్రీ అకల్."

"సత్‌శ్రీ అకల్''

జుగ్గా మరోసారి వంగి నమస్కరించి లేచేడు. తిన్నగా ఆ నిద్ర పోతున్న వాళ్ళ మధ్యనుంచి నడుచుకొనివెళ్ళి, తన జోళ్ళు తొడుక్కొని ప్రక్కనున్న గదికేసి చూసేడు. అందులో దీపం వెల్గుతోంది. ఆ గదిలో పడుకొని వున్నవ్యక్తి ఇక్బాలేనని జుగ్గా గుర్తించేడు. విస్కీబుడ్డిని వక్షస్థలంపై వుంచుకొని ఇక్బాల్ నిద్రపోతున్నాడు.

''సత్‌శ్రీ అకల్ బాబూజీ!'' అని కేకేశాడు జుగ్గా. సమాధానం రాలేదు.

"నిద్దురోతున్నారా బాబూజీ!"

మీత్‌సింగ్ కలుగజేసుకొని "అతనికి నిద్రాభంగం కలుగజెయ్యకు. అతనికి వంట్లో బాగులేదు. నిద్ర పట్టడానికతను మందు తీసుకున్నారు" అని అన్నాడు.

"సరే భాయీజీ! నాతరుపున సత్‌శ్రీ అకాల్ ఆ బాబుకి తామే చెప్పండి. మరి నానెల్తా. సెలవ్!" అని వెళ్ళిపోయేడు జుగ్గా.

19

తనొక తెలివితక్కువపని చేసినట్లు హుకుమ్‌చాంద్ ఫీలవసాగాడు. లేనిపోని వ్యసనాలకు లోనవుతే ఇలాగే వుంటుందనుకున్నాడు. ఏభై యో పడిలో వున్న తనకు పెళ్ళాం వుండికూడా సరసానికి అమ్మాయిలుకావాలి! తన కూతురి వయస్సులోవున్న అమ్మాయితో అందులోకీ ముస్లిమ్ వ్యభిచారిణితో! ఛఛ! ఎవరికైనా తెలుస్తే నవ్విపోతారు! పరిహాసాస్పదమైన విషయమిది! ఇంద్రియ నిగ్రహశక్తిని కోల్పోయి బొత్తిగా పట్టుతప్పిపోతున్నాడు తను. వయస్సు మీరుతున్నకొద్దీ తను ఇంగిత జ్ఞానాన్ని కోల్పోతున్నట్లు ఫీలయేడు హుకుమ్‌చాంద్!

జుగ్గాను, ఇక్బాలును వదిలి పెట్టడంవల్ల ట్రైను ముట్టడి నివారింపబడొచ్చని మొదట అనుకున్నాడు హుకుమ్‌చాంద్. కాని తన పథకం తప్పేమోనని ఇప్పుడనుకుంటున్నాడు. అతని మనస్సులో ఆందోళన, అనిశ్చిత పరిస్థితి ఏర్పడ్డాయి! ఆ బద్మాష్ జుగ్గా, సోషల్ వర్కర్ ఇక్బాల్ ఎటువంటివాళ్ళో పూర్తిగా తెల్సుకోకుండానే వాళ్ళని విడుదల చేయించేడు తను! బహుశా తనకంటే అధికంగా వాళ్ళే సందర్భంలో ఊడబొడిచే దేఁవీ ఉండకపోవచ్చు! వామపక్ష సాంఘిక కార్యకర్తలలో కొంత మంది గొప్ప ధైర్య సాహసాలుగల వారిగా సంఘంలో చెలామణీ అవుతూంటారు! మరి ఈ ఇక్బాల్ ఎలాంటివాడో ఏఁవిటో! ఏదిఏమైనా గొప్ప మేధావే అయుంటాడు. అయితే ఒకటి! ఇలాంటి వ్యక్తులను సామాన్య

ప్రజలు ఈజీఛైర్ మనుష్యులని అభివర్ణిస్తూ వుంటారు. ఇతరులు తమ విధుల్ని తాము సక్రమంగా నిర్వహించనప్పుడు విమర్శించడం తప్పితే ఈ రకం వ్యక్తులు తమకుతాముగా చేసేదేమీ వుండదు: ఇకపోతే ఆ బద్మాష్ జుగ్గా పేరుమోసిన రాక్షసి వెధవ: రైళ్ళలో, బస్సులలో, రహదార్లలో ఎన్నో దొంగతనాలు చేసిన దుర్మార్గపు వెధవ వాడు: డబ్బుకోసం, లేదా పగ తీర్చుకోడం కోసం వాడెటువంటి పనైనా చెయ్యగలడు: వాడికంతటి ధైర్య సాహసాలున్నాయి మల్లిగాడిపై వాడికి పగుందిగనక, మల్లిగాడు చెయ్యదల్చుకున్న పనికి జుగ్గా అడ్డుతగలొచ్చు: ఒకవేళ మల్లిగాడు జుగ్గా రాక విని భయపడి పారిపోయినట్లయితే జుగ్గాకి అనురక్తి తగ్గిపోవచ్చు. అప్పుడు వాడు ఆ మతోన్మాదులతో కలసి మూకఉమ్మడి హత్యలు, దోపిడీలు చెయ్యొచ్చు: జుగ్గాలాంటి వాళ్ళు ప్రియురాళ్ళకోసం ఎన్నడూ ప్రాణాపాయకరమయిన పనులలో తలదూర్చరు. నూరాన్ ఒకవేళ చంపబడితే జుగ్గా మరొకర్తిని చేబడతాడు. జుగ్గా క్రైమ్ను ముట్టడిని, మూకఉమ్మడి హత్యలను నివారించగలడనే నమ్మకం ఇప్పుడతని కంతగా లేదు:

దారుణమైన మానవ మారణహోమాన్ని నివారించే ప్రయత్నంలో తన పాత్రకూడా ఏమంత సంతృప్తికరంగా లేదని హుకుమ్‌చాంద్ అనుకున్నాడు. ఏవో కొన్ని పనులు చెయ్యమని ఇతరులకు పురమాయించినంత మాత్రాన్న తన బాధ్యత తీరిపోయి నట్లేనా? చట్టాన్ని, న్యాయాన్ని సక్రమంగా నిర్వహించ వలసిన బాధ్యత తనలాంటి మెజిస్ట్రేటులది: కాని తమచే ఈ బాధ్యతలను నిర్వహింపజేస్తున్న శక్తి వేరే వున్నది. అది ఢిల్లీలో వున్నది: ఢిల్లీలోవున్న ప్రజా నాయకులేంచేస్తున్నారు? సభలలో అంచక్కా ఉపన్యసిస్తున్నారు: దూరశ్రవణ యంత్రాలు వాళ్ళగొప్పతనాన్ని ఎలుగెత్తి చాటుతున్నాయి: విజిటర్సు గేలరీలో ఆసీనులైవున్న విదేశీయ స్త్రీలు బాగా మెచ్చుకొనేనట్లు:

లేనిపోని ఆలోచనలతో హుకుమ్‌చాంద్ బుఱ్ఱ బాగా వేడెక్కిపోయింది. మరచిపోదామనుకున్నా ఎన్నో విషయాలు అతని స్మృతిపథంలోకి రాసాగాయి!

అతని ఆర్డర్లీ కూతురు సుందరి అతని స్మృతి పథంలోకొచ్చింది! పెళ్ళయి అవ్వాటికి నాల్గురోజులయింది! ఆమె మోచేతులు లక్కరంగు గాజులతో నిండుగా వున్నాయి! ఆమె అరచేతులు గోరింటాకు పెట్టుకోడం వల్ల సింధూర వర్ణాన్ని దాల్చివున్నాయి. ఆమె తన భర్త మన్సారామ్‌తో ఇంకా ఒక్క నిద్రకూడా పోలేదు. నిజానికి అతని ముఖాన్నికూడా ఆమె ఇంకా సరిగ్గా చూడలేదు. ఏదోఒకటి రెండుసార్లు తన మేలి ముసుగులోంచి చూసీ చూడనట్లు చూసింది. సిగ్గు మరి; ఇకపోతే వాళ్ళ బంధువులు వాళ్ళని ఒక్క నిముషమయినా ఏకాంతంగా వుండనివ్వలేదు! అవాళామె తన భర్తతో గుజ్రన్‌వాలా వెళ్ళుతోంది. అక్కడామెభర్త సెషన్సు కోర్టులో బంట్రోతుగా పని చేస్తున్నాడు. ఆ బస్సులో తోటి ప్రయాణీకులతో అదేపనిగా ఏవో విషయాలగురించి వాగుతున్నాడతను. మేలిముసుగులో తలదాచుకొనివున్న సుందరి తలెత్తి ఒక్కమాటకూడా అనలేదు. అసలామె, భర్త వాగుడు వింటున్నదో లేదో అనే అనుమానంకూడా కల్గింది కొందరికి! ఆమె ఏవేవో మధురస్మృతులు స్మరించుకుంటూ పగటి కలలు కంటోంది! పెళ్ళిలో ఓస్నేహితురాలంది: "ఈలక్కరంగుగాజుల్లో వేటినీ నీచేతులతో నువ్వు తియ్యకుమీ! అలాతీస్తే నువ్వు దురదృష్టవంతురాలి వయిపోతావు! నీ మొగుడి మోటు సరసంతో విరిగితే విరగనీ!" అని. ఒక్కొక్క చేతికి నాల్గుడజన్ల గాజులు మణికట్టునుంచి మోచేతి వరకూ వున్నాయి. ఒకసారి వాటిని క్రిందనుంచి మీదివరకూ తడివిందామె! అవి గట్టిగా పెళుసుగావున్నాయి! తనను గాఢంగా కౌగలించుకొనే సందర్భంలో తన భర్తచేతుల్లో అవి పలిగిపోవచ్చేమో? అయినా ఆ సమయంలో ఆ ఆనందంలో....

ఆమె పగటికల బస్సు అకస్మాత్తుగా ఆగిపోవడంతో చెదరిపోయింది: ఆమె వాస్తవిక జగత్తులోకొచ్చింది.

రోడ్డుపై అడ్డుగా పెద్ద పెద్ద బండరాళ్ళు వున్నాయి. వందలకొద్దీ సాయుధ ప్రజలు బస్సుని చుట్టుముట్టేరు. అందర్నీ క్రిందకు దిగమని ఆజ్ఞాపించేరు. సిక్కులందర్నీ ముక్కముక్కలుగా తెగనరికి చంపేశారు: ఇకపోతే శుభ్రంగా క్రాఫింగ్ చేయించుకొని, గెడ్డం గీయించుకొని వున్న వాళ్ళను దిగంబరుల్ని చేశారు. సుంతీ చేయించుకున్నవాళ్ళను వదిలేశారు. చేయించుకోని వాళ్ళకు వెంటనే వాళ్ళే సుంతీ చేశారు: పైచర్మముక్కే కాదు: పూర్తిగా కోసిపారేశారు: అంతకుముందు సుందరి తనభర్త మన్నారామ్‌ను సరిగ్గా చూడలేదు: కాని అప్పుడుమాత్రం వాళ్ళామెకు ఆమె భర్తని దిగంబరుణ్ణి చేసి చూపించారు: అంతటితో వాళ్ళు తృప్తిపడలేదు. కొందరు అతని కాళ్ళూచేతులు గట్టిగా పట్టుకోగా ఒకడు అతని శిశ్నాన్ని కోసి ఆమె చేతిలో పెట్టాడు: ఆ తరువాత ఆ మతోన్మాదులకు సుందరి పై ప్రేమ పుట్టుకొచ్చింది: ఆ రోడ్డుపైనే ఆమెను పడద్రోసి ఒకరి తరువాతొకడు బలవంతంగా అనుభవించారు: ఆమె చేతిగాజులన్నీ ఆ రాక్షసుల పైశాచిక ప్రవృత్తికి పగిలిపోయాయి. తనకు తానుగా ఆమె తనచేతిగాజుల్ని తియ్యకపోయినా ఆమెకు చేకూరిన అదృష్టం ఈతీరులో వుంది:

మరో సంఘటన హుకుమ్‌చాంద్ స్మృతిపథంలోకొచ్చింది: సుందర్‌సింగ్ కేసు ఇందుకు భిన్నమయిన దనుకున్నాడతను. సుందర్ సింగ్ ఓ మంచి సైనికుడిగా గొప్ప పేరు తెచ్చుకున్నాడు. బర్మా, ఇటలీ మొదలయిన దేశాలలో జరిగిన యుద్ధాలలో వీరోచితంగా పోరాడినందుకుగాను అతనికి ఎన్నో పతకాలివ్వబడ్డాయి. ప్రభుత్వం అతనికి సింధు రాష్ట్రంలో కొంత భూమినిచ్చింది. అతను తన భార్యా పిల్లలతోసహా, ప్రాణాలను ఆ మతోన్మాదుల బారినుండి కాపాడుకొనేటందుకై ట్రైనులో భారతదేశానికి ప్రయాణమయాడు. నలభై మంది కూర్చొనేదుకు కోసం,

పన్నెండుమంది నిద్రపోడం కోసం నిర్మించబడ్డ కంపార్టుమెంటులో అయిదువందల మందికిపైగా స్త్రీలు,పురుషులు, పిల్లలు కిక్కిరిసిఉన్నారు. ఓ చిన్న మరుగుదొడ్డి ఆ కంపార్టుమెంటులో ఓ మూలనుంది! దాంట్లో నీరులేదు! మామూలుగా నీడలో 115 ఫారన్‌హీటు ఉష్ణోగ్రత ఉంటుందవాళ. ఎక్కడా నీడలేదు! కనీసం తుప్పా, డొంకా అయినా ఎన్నోమైళ్ళ నుంచీ కనిపించలేదు! మీద నిప్పులు చెరుగుతున్న సూర్యుడు, క్రింద ఇసుక! ఎక్కడా నీరులేదు! ప్రతిస్టేషనులోను బల్లాలుపట్టుకొని ఉద్రిక్తులైయున్న ప్రజలు! ఇదీ పరిస్థితి! ఆ ట్రైను ఒక స్టేషనులో నాల్గురోజులుండిపోయింది! క్రిందకుదిగడానికి ఎవ్వరికీ అనుమతినివ్వలేదు. సుందర్ సింగ్ పిల్లలు నీళ్ళకోసం, ఆహారంకోసం తెగ ఏడుస్తున్నారు. అలాగే ఆ కంపార్టుమెంటులోగల అంతమంది పిల్లలూను! ఏం చెయ్యడానికి సుందర్‌సింగ్‌కు ఏమీతోచలేదు. దాహంతోవాళ్ళు గిలగిలకొట్టుకుంటూంటే చూడలేకపోయాడు. వాళ్ళ దాహం తీర్చడానికి తన మూత్రాన్ని వాళ్ళచే త్రాగించాడు! అదీ అయిపోయింది! తన భార్యాపిల్లలు దాహంతోను, ఆకలితోను గిలగిల కొట్టుకొని చావడం ఇష్టంలేక పోయిందతనికి! రివాల్వర్ బయటకుతీసాడు. పెద్దకొడుకు ఆరేళ్ళవాడు. రెండోవాడు నాలుగేళ్ళవాడు. మూడోది నాల్గునెలల పసిపాప! ఆ పాప చెంపలపై కన్నీటి చారికలున్నాయి. కళ్ళు లోతుకుపోయాయి. తల్లి రొమ్ముల్ని కరచుకొనివుంది. శుష్కించిన ఆమె రొమ్ములలోంచి పాలు రాలేదు. రక్తం వొస్తోంది! నరకయాతనలోంచి ముందు తన ముగ్గురు పిల్లల్నీ విముక్తినొందించాడు. ఆ తరువాత భార్యని షూట్‌చేశాడు! ఆ తరవాత తన కణతదగ్గర రివాల్వర్ పెట్టుకున్నాడు! అంతట్లో ట్రైను కదిలింది! తనను తాను చంపుకోడాని కతనికి చెయ్యిరాలేదు! ఏదో అవ్యక్తమయిన బలహీనత అతనిలో ప్రవేశించింది. తన భార్యా పిల్లలయొక్క శవాలను ఆ కంపార్టుమెంటులోంచి బయటకు త్రోసేసి భారతదేశం చేరుకున్నాడు సుందర్‌సింగ్.

అతని కుటుంబానికి కష్టాలలోంచి విముక్తి లభించింది. కాని అతనికి మాత్రం ఇంకా లభించలేదు!

ఇలాంటి సంఘటనలెన్నో హుకుమ్‌చాంద్ స్మృతిపథంలో మెదలేయి! వాటినెలా మరచిపోడం? అదే అర్థం కాలేదు హుకుమ్‌చాంద్‌కి!

ఆ రెస్టుహౌస్‌లో తానొక దిక్కుమాలిన వాడిలా వున్నట్టు హుకుమ్‌చాంద్ ఫీలయాడు. చీకటిపడింది. కప్పలు బెకబెకలాడుతున్నాయి. వరండాదగ్గరున్న మల్లెమొక్కలపై మిణుగురు పురుగులు జిగ్‌జిగ్‌మని మెరుస్తున్నాయి.

బేరర్ విస్కీ తెచ్చాడు. కాని హుకుమ్‌చాంద్ అక్కర్లేదన్నిత్రిప్పి పంపేశాడు.

ఆ తరువాత బేరర్ భోజనం వడ్డించాడు. కాని అతను భోంచెయ్యలేదు! దీపం ఆర్పేసి శూన్యంలోకి అదోలాగ చూస్తూ కూర్చున్నాడు.

తను హసీనాబేగమ్‌ను చుందున్నుగ్గర్ పంపివేసినందుకుతననుతాను నిందించుకున్నాడు హుకుమ్‌చాంద్. ఆసమయంలో ఆమె తనతో ఆ రెస్టుహౌస్‌లో వుండి వున్నట్లయితే మిగతా ప్రపంచంలోని వాళ్ళంతా నరకానికి పోయినా తనకేఁవీ బాధలేకపోయుండేది!

హసీనాబేగమ్ తనదగ్గరలేదు. చుందున్నుగ్గర్‌లో కూడా లేదు! ట్రైనులోవుంది! ట్రైను వస్తోన్న చప్పుడతనికి వినిపించింది.

హుకుమ్‌చాంద్ కుర్చీలోంచిలేచి చేతులతో ముఖం కప్పుకొని రోదించసాగాడు. ఆకాశంకేసి చూస్తూ భగవంతుణ్ణి ప్రార్థించసాగాడు. అవాంఛనీయమైన సంఘటనలేవీ జరక్కుండా కాపాడమని!

20

ఆనాటిరాత్రి పదకొండు గంటల తరువాత చంద్రోదయంఅయింది. తెలిమబ్బు వుండడంచేత చంద్రకాంతి ఉండవలసినంత అధికంగాలేదు. ఆ గ్రుడ్డి వెన్నెలలో ఏదో రీలగా వస్తువులు కనిపిస్తున్నాయి. స్పష్టంగా ఏదీ కనిపించటంలేదు. ఎత్తుగావున్న రైలుమార్గపు నీడలోగల వస్తువులేవీ అసలగుపించనేలేదు.

సిగ్నెల్‌దగ్గర రైలుమార్గానికి ఓ ప్రక్క ఇసుకబస్తాలు, రెండో ప్రక్క మిషన్‌గన్నువున్నాయి. ఆ దృశ్యమంతటినీ కనిపెట్టి చూస్తూన్న ఓ పెద్ద సెంట్రీలా సిగ్నెల్ స్తంభం నిలబడుంది. దానిపైన అండాకృతిలో వున్న నేత్రాలలాగ దీపాలు ఎర్రగా ప్రకాశిస్తున్నాయి. నదిలోని నీరు చంద్రకాంతిలో తళతళలాడలేదు. ఓనల్లటి రేకుపలకలాగ అగుపిస్తోందది. అయితే చిన్నచిన్న అలలశబ్దం ఉండుండి వినిపిస్తోంది.

నది గట్టుకి కొంతదూరంలో తెల్లదుబ్బుల కావల ఒకజీపు ఆగివుంది. అందులో ఎవ్వరూ లేరు.

రైలుమార్గాని కిరుప్రక్కలా నిర్ణీత పథకం ప్రకారం వాళ్ళు సర్దుకున్నారు. రైఫిల్సు, బల్లేలు పట్టుకొని మోకాళ్ళమీద కూర్చున్నారు, ట్రైనుకోసం నిరీక్షిస్తూ.

బ్రిడ్జీ మొట్టమొదటి ఉక్కుస్పాన్‌కి దృఢమైన త్రాడును రైల్వే లైను కడ్డంగా, లైనుకి సుమారు ఇరవై అడుగులపైన ఉండేటట్లు కట్టారు.

ఒకర్నొకరు గుర్తించుకోడానికి వీల్లేనంత మసక చీకటిగావుంది. అంచేత వాళ్ళు కాస్త గట్టిగా మాట్లాడుకోసాగారు.

అంతట్లో ఒకడు "ఉష్! మాట్లాడకండి. ఏదో శబ్దం వినిపిస్తోంది! అని హెచ్చరించాడు.

రెల్లు దుబ్బుల మీదుగా వీస్తున్న గాలి చప్పుడు వినా వాళ్ళకింకేవీ వినిపించలేదు!

"అంతా నిశ్శబ్దంగా ఉండండి. మీరిలా కబుర్లలో పడిదే ట్రైను చప్పుడు మీకు వినిపించదు. అంచేత ఎవ్వరూ మాట్లాడకండి" అని ఆజ్ఞా పించాడు లీడరు.

అంతా కొంతసేపు నోరు మూసుకొని కూర్చున్నారు. కాని అలా ఎంతోసేపు మౌనంగా కూర్చోలేక పోయారు. మెల్లగా గుసగుసలాడు కోడం మొదలెట్టారు!

కొంతసేపయేక ఇనుపతీగెలు గలగలలాడిన శబ్దం వినిపించింది వాళ్ళకి!

సిగ్నెల్ స్తంభంపైగల ఓ రెక్క క్రిందకు వాలింది. ఎర్రగా అండాకృతిలోనున్న నేత్రంలాగున్న ఆ దీపకాంతి ఆకుపచ్చగా మారి పోయింది. గుసగుసలాడుకోడం మానేశారంతా! ట్రాక్‌కి సుమారు పది గజాల దూరంలో మొదట నిర్ణయించుకున్న ప్రకారం ఎవరి స్థలాల్లో వాళ్ళు ఆయుధాలు పట్టుకొని సిద్ధంగా ఉన్నారు.

"గుఫ్ గుఫ్"మనే శబ్దం దూరంగా వినిపిస్తోంది! "ఛక్ ఛక్ ఛక్!" అని ట్రైను స్టార్టయిన శబ్దం వినిపించింది.

ఒకవ్యక్తి రైలు కమ్ములదగ్గరకు పరుగెట్టుకొనివెళ్ళి, ఓ కమ్మి పై చెవిపెట్టి వినసాగాడు.

"ఒరేయ్ ఫూల్! చప్పున వెనక్కు తిరిగిరా. ట్రైనొస్తోంది!" అని ఆజ్ఞాపించాడు వాళ్ళ లీడరు.

అంతా ట్రైను వస్తోన్న వేపు చూడసాగారు.

ట్రైను స్పీడుగా పోయినట్లయితే బ్రిడ్జీ మొట్టమొదటి స్పేన్‌కు వాము కట్టినత్రాడు, ట్రైను పైకప్పులపైగల వాళ్ళందరినీ ఊడ్చిపారేస్తుం దనుకున్నారు వాళ్ళు!

వాళ్ళంతా స్టేషనుకేసి చూస్తున్నారు. చాలా దూరంలో మెరవు లాంటి కాంతి వాళ్ళకళ్ళకగుపించింది. అది తమ మొదటిసిగ్నల్ అయుం టుందనుకున్నారు వాళ్ళు! ఆ తరువాత మరి కొంచెం ముందున వాళ్ళ కలాంటి కాంతే కనిపించింది. ట్రైను ముందుకొస్తున్నకొద్దీ మెరపులాంటి ఆ కాంతి మరింత ముందున అగుపిస్తోంది. అంతా ఊపిరి బిగబట్టి మరీ అటుకేసి చూస్తున్నారు. ఎవ్వరూ బ్రిడ్జీకేసి చూడలేదు!

ఆ సమయంలో ఒక ఆజానుబాహుడు నెమ్మదిగా బ్రిడ్జీ స్టీలుస్పేను మీదికెక్కాడు. ఆ త్రాడు కట్టివున్నచోటుకు అతనెక్కేటంతవరకూ ఎవ్వరూ అతన్ని గమనించలేదు. ముడి దృఢంగా ఉందో లేదో అతను చూస్తున్నాడు కాబోలనుకున్నారు వాళ్ళు! మళ్ళీ వాళ్ళు ట్రైను వస్తున్న వేపు దృష్టి మళ్ళించారు.

అతను ఆ త్రాడును గట్టిగా లాగిచూశాడు. అది చాలా దృఢంగా ముడి వెయ్యబడున్నట్లు గుర్తించేడతను. ఒకవేళ ఇంజను పొగగొట్టం దానికి అడ్డుతగిలినట్లయితే ఈ త్రాడు తెగుతుందేమోగాని ముడిమాత్రం విడదు!

దృఢకాయుడు, ఆజానుబాహుడు అయిన ఆ వ్యక్తి ఆ త్రాడుపై బోరగిల పడుకొని ముందుకు ప్రాకేడు. అతని పాదాలు స్పేన్‌కి కట్ట బడున్న ముడిదగ్గరున్నాయి. అతని చేతులు ఇంచుమించు ఆ త్రాడు మధ్యనున్నాయి.

ట్రైను అంతకంతకు దగ్గరకొస్తోంది. పొగగొట్టంలోంచి నిప్పురవ్వలు మీదికెగురుతున్నాయి. ఒక దెయ్యం నిప్పురవ్వలు పైకి విరజిమ్ముతూ ముందుకు వస్తున్నట్లుంది. ఆ గ్రుడ్డివెన్నెల కాంతిలో ట్రైను కొద్దిగా కనిపిస్తోంది. ఇంజను వెనకాలగల నేలబొగ్గు బోగీ దగ్గరనుంచి చివరవరకూ ట్రైను పైకప్పంతా మనుష్యులచే కిక్కిరిసివుంది! ఆ వ్యక్తి ఇంకా త్రాడుమీదే వున్నాడు!

లీడరు ఆ త్రాడుకేసి చూసేడు. దానిపై ఓ వ్యక్తి ఉన్నట్లు గమనించి, "ఒరేయి గాడిదా! వేగం దిగిరారా! లేకపోతే చస్తావు. ట్రైనొచ్చేస్తుంది! ఊఁ! వేగం దిగు!" అని బిగ్గరగా ఓ పిచ్చివాడిలా కేకేశాడు.

ఆ వ్యక్తి ఆ కేక వినిపించిన వేపొకసారి చూసి నడికట్టులోంచి ఓ చిన్న కత్తినితీసి, ఆ త్రాడును కొయ్యసాగాడు.

"ఎవడువాడు? వాడేం చేస్తున్నాడు?" తెల్సుకొనేటందుకు మరి వ్యవధి లేదు.

వాళ్ళు బ్రిడ్జీనుంచి ట్రైనుకేసి, ట్రైనునుంచి బ్రిడ్జీకేసి ఊపిరి బిగబట్టి ఆత్రంగా చూస్తున్నారు! ఆ వ్యక్తి ఆ త్రాడును తనశక్తినంతా వినియోగించి కోస్తున్నాడు! లీడర్ రైఫిల్ఎత్తి గురిచూసి 'ఢన్'మనిపేల్చేడు! కొంచెం గురి తప్పడంవల్ల ఆ వ్యక్తి కాలికి గుండుదెబ్బ తగిలింది. అది పట్టుతప్పి క్రిందకు వ్రేలాడసాగింది!

రెండోకాలిని త్రాడుకి పెనవేసి పరపరమని కొయ్యసాగేడు! ఇహ ఇంజను కొద్దిగజాల దూరంలోనేవుంది. అది నిప్పురవ్వల్ని మీదికి విరజిమ్ముతోంది! మరెవడో మరోగుండు పేల్చేడు. ఆదెబ్బతో అతనిశరీరం త్రాడుపైనుంచి జారిపోయింది!

అయినాసరే అధైర్యం చెందక అతను తన రెండుచేతులతోను త్రాడుని గట్టిగా పట్టుకొని, గెడ్డాన్ని త్రాడుపై ఆనించి, కుడిచేత్తో మళ్ళీ

ఆ త్రాడును కొయ్యసాగాడు. ఆ త్రాడులో చాలా పోగులు తెగిపోయాయి. ఇహ ఒక్కపోగు మాత్రమే వుంది. పళ్ళతో త్రాడుని కరచిపట్టుకొని, శక్తినంతా కూడగట్టుకొని కత్తితో ఆ పోగును కొయ్యసాగాడు.

గుళ్ళవర్షం కురిసింది. అతను కంపించిపోయాడు. స్మృతి కోల్పోయాడు!

త్రాడు మధ్యకు టపీమని తెగింది. క్రిందకు పడిపోయాడావ్యక్తి. ట్రైను అతనిమీదనుంచి స్పీడుగా వెళ్ళిపోయింది.

అది పాకిస్తాన్ వెళ్ళిపోయింది!!



TRAIN TO PAKISTHAN

By

Akundi Narayana Murty

బృందావన్ పబ్లిషింగ్ హౌస్
తెనాలి-2

TITLE BY :

SRI SARADA PRESS, TENALI - 2